# ఆత్మీయ సందేశాలు

## రెండవ భాగం

నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును.
కీర్తన 119:130



సహో॥ డా॥ బి. విమలా రెడ్డి

# ఆత్మీయ సందేశాలు

## రెండవ భాగం

నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును.
కీర్తన 119:130



సహో॥ డా॥ బి. విమలా రెడ్డి

# దేవునికి నా స్తుతులు

తప్పిపోయిన గొఱ్ఱెలాంటి నన్ను తన దొడ్డిలోనికి తిరిగి తీసుకొని, ఎవరికీ పనికిరానిదానిగా ఉన్న నన్ను ప్రయోజనకారిగా మార్చి, ప్రపంచములోని ఉద్యోగాలన్నింటి కంటే శ్రేష్టమైన సువార్తీకరణ అనే ఉద్యోగము నాకు ఇచ్చిన మన ప్రభువైన యేసు క్రీస్తునకు వందనములు. దేవుడిచ్చిన తలాంతులన్నిటినీ పూడ్చిపెట్టిన నన్ను క్షమించి, వాటినన్నింటిని వెలికితీసి ఆయన రాజ్యస్థాపనలో ఉపయోగించుచున్న ఆ దేవదేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

యెహెజ్కేలు 37వ అధ్యాయములోని ఎండిపోయిన ఎముకలాంటి జీవితము కలిగి ఉన్న నాకు జీవమిచ్చి తన సేవలో కొనసాగుటకు కృపచూపిన ఆ కరుణామయునికి స్తోత్రములు. 2009వ సంవత్సరము నుండి సువార్త పరిచర్య, బోధనా పరిచర్య మొదలు పెట్టిన నేను ప్రతినెల కొన్ని క్రైస్తవ పత్రికలలో ముద్రించుట కొరకై వ్రాసిన దైవ సందేశములన్నింటిని కూర్చి ఒక పుస్తకముగా ముద్రించుటకు ప్రేరేపణ మా వదిన విజయమ్మ. ఆమె వ్రాసిన చాలా పుస్తకములు కూడా ముద్రించ బడ్డాయి. నేను కూడా వ్రాస్తే, కొంతమందికైనా ప్రయోజనకరముగా ఉంటుందనే ఆలోచనతో ఈ కార్యము చేపట్టాను. వ్రాయుట ద్వారా కూడా పరిచర్య చేయవచ్చునే నా తలంపుకు చేయూతనిచ్చి సహకరించిన వారినందరిని దేవుడు ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను. అడగగానే ముందు మాటలు వ్రాసిన మా విజయ వదినకు కృతజ్ఞతలు.

ఈ పుస్తకము ద్వారా పాఠకులకు ఆత్మీయాహారము సమృద్ధిగా దయచేయుమని ప్రభువును ప్రార్థిస్తూ, స్తుతిస్తున్నాను.

ఇట్లు

మీ ఆత్మీయ సహోదరి

**బి. విమలారెడ్డి**




మాకు క్రమశిక్షణ, దాతృత్వం నేర్పించిన నా తండ్రి

**వై.యస్.రాజారెడ్డి** గారికి,

మా కుటుంబము కొరకు నిత్యము ప్రార్థించి

మేమందరము రక్షణ మార్గములోనికి రావాలని

ఆశించిన నా మాతృమూర్తి

**వై.యస్.జయమ్మ** గారికి అంకితం

# ముందుమాట



విమలమ్మ దేవుని నమ్మిన బిడ్డ. ఒక విశ్వాస యోధురాలికి జన్మించిన బిడ్డ. ఆమె తల్లి, అంటే మా అత్తమ్మ మంచి ప్రార్థనా పరురాలు. ఆమె ప్రార్థనలో తన కుటుంబ సభ్యులందరు ప్రభువును రక్షకునిగా విశ్వసించి రక్షణ మార్గములో నడవాలనేది ఆమె కోరిక. విమలమ్మ తన వివాహము అయిన తరువాత దేవునితో కొంత ఎడబాటు పొందినప్పటికీ, తన విశ్వాసాన్ని కాపాడుకుంది. అంటే యేసయ్యలోనే ఉంది. ఆ సమయంలో మా ఇంట్లో ప్రార్థనలు ప్రతి దినం ఉండేవి. వాటికి అప్పుడప్పుడు వస్తూ వుండేది. అత్తమ్మ దేవుని దగ్గరకు వెళ్ళాక ఆమె ప్రార్థనలు విమలమ్మ పట్ల పనిచేసాయి అనిపిస్తుంది. ఎందుకంటే అప్పటి నుండి తను రోజూ ప్రార్థన కార్యక్రమాల కొరకు మా ఇంటికి వచ్చేది. అప్పటి నుండి పరిశుద్ధాత్ముడు క్రమక్రమముగా తనలో పనిచేసాడు. ఆమె విన్న ప్రతి వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు బలపరుస్తూ వచ్చాడు. హెబ్రీ 13:5లో "నిన్ను ఏ మాత్రము విడువను, నిన్ను ఎన్నడు ఎడబాయను" అని చెప్పిన నమ్మదగిన దేవుడు అప్పుడప్పుడు వెనుకబడిపోయినా లేపుతాడనేది నిజము అని విమలమ్మ అంటూ వుంటుంది.

ఇప్పుడు తనను చూస్తే ఒక మాట గుర్తుకు వస్తూ వుంటుంది. లూకా 10:41-42 'మరియ ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు'. దేవుని గురించి కూలంకషంగా తెలుసుకోవలెననె తన తపనను చూసినప్పుడు నాకు ఆశ్చర్యమనిపిస్తుంది. తను దేవునిని చాలా అడుగుతుంది కూడా. చాలా కోర్స్‌లు చేసింది. తను నేర్చుకొన్నది పదిమందికి చెప్పాలనే కోరికను చూసినప్పుడు మత్తయి 13:12, మార్కు 4:24 మాటలు గుర్తుకు వస్తాయి. కలిగిన వానికి ఇయ్యబడును. వానికి సమృద్ధి కలుగును. దేవుడు తనలో ఉన్న ఆశను చిగురింప చేస్తున్నాడు.

విమలమ్మ, దేవుడు చెప్పిన మొదటి ఆజ్ఞ మత్తయి 22:37 "నీ పూర్ణ హృదయముతో, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును

సేవింపవలయును" అనే దానిని తు.చ. తప్పక పాటిస్తుంది. అందుకే దేవుడు తనను వాక్యముతో నింపుచున్నాడు. తను చెప్పే తీరు, తనలో ఉన్న తపనను దేవుడు చూస్తున్నాడు. బలపరుస్తున్నాడు, తనను వాడుకుంటున్నాడు. అందుకే లూకా 6:48లో చెప్పినట్లుగా తన పునాది యేసు అనే స్థిరమైన బండమీద బలముగా కట్టుకొంది.

తను దేవుని బిడ్డగా దేవుని పట్ల కృతజ్ఞత చూపిస్తుంది. లూకా 17:17లో 'పదిమంది శుద్ధులైనారు కదా మరి తొమ్మండుగురు ఎక్కడ' అని యేసయ్య అడుగుతాడనే విషయం ఎరిగిన వ్యక్తిగా విమలమ్మ కన్పిస్తుంది. రోమా 10:15లో 'సువార్త ప్రకటించు వారి పాదములు ఎంతో సుందరమైనవి' అని పౌలు అంటున్నాడు. సర్వలోకమునకు వెళ్ళి సువార్తను ప్రకటించుడి (మత్తయి 28:20). ఈ వాక్యాల ప్రకారము దేవుని రాజ్యము గురించి బోధించే పని ఎన్నుకొన్నది.

అంతే కాకుండా లూకా10:2లో ప్రభువే చెప్పుచున్నాడు: కోత విస్తారముగా ఉంది గాని పనివారు కొద్దిమందియే, కాబట్టి కోత యజమానుని తన కోతకు పనివారిని పంపవేడుకొనుడి అను వాక్యప్రకారము కోతకు పోయే వారికి తను సహాయము చేయుటలో కూడ తన పాత్ర ఉంటుంది. దానిని విమలమ్మ ఎన్నుకుంది.

ఆవగింజ చూడడానికి చాలా చిన్న విత్తనము. దానిని విత్తితే అది మహా వృక్షమవుతుంది. ఆకాశపక్షులు దాని కొమ్మల యందు నివసించును (లూకా 13:19). విమలమ్మ అనేక రకములైన విత్తనాలను విత్తుతూ ఉంది. నేటికి 60 వసంతాలు పూర్తిఅవుతున్నాయి. తను వేసిన విత్తనాలు పెరిగి, చెట్లయ్యి ఫలములిస్తాయి. వ్యక్తిగతముగా తను ఎదిగి, తను విత్తిన విత్తనములు ఎదిగి, 1000 అంతలు ఫలములతో ఫలించాలని దేవుని కోరుకుంటూ, ప్రార్థన చేస్తూ వదినగా దీవిస్తున్నాను.

ఇట్లు

ప్రేమతో

**వై. యస్. విజయమ్మ**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | క్రైస్తవుడు | 1 |
| 2. | అద్భుతమైన ఆహ్వానము | 5 |
| 3. | నూతన నడక | 9 |
| 4. | యేసుక్రీస్తు యొక్క ముద్రలు | 14 |
| 5. | నీతిమంతులుగా స్థాపించబడుట | 18 |
| 6. | దేవుని దృష్టికి హేయమైనవి వదిలేద్దాము | 22 |
| 7. | క్షమాపణ ద్వారా వచ్చు ఆశీర్వాదములు | 27 |
| 8. | బైబిల్‌లో దేవుని ప్రణాళిక | 31 |
| 9. | పౌలు బోధించిన మానవశాస్త్రం | 37 |
| 10. | ప్రభువును కనుగొనుట | 41 |
| 11. | దేవుడు దయచేసిన వనరులు | 45 |
| 12. | సత్‌క్రియలు | 49 |
| 13. | వ్యతిరేక లక్షణాల ద్వారా సత్యము తెలుసుకొనుట | 53 |
| 14. | విమోచకుడు క్రమబద్ధంగా ప్రత్యక్షపరచబడుట | 57 |
| 15. | దేవుని సంపూర్ణతయందు పూర్ణులగుట | 62 |
| 16. | మన స్నేహితుడైన యేసయ్య | 66 |
| 17. | దైవిక ఉపకారములు | 71 |
| 18. | ఆశ్రయ పురములు | 76 |
| 19. | హోషేయ ప్రవక్త వివరించిన దేవుని ప్రేమ | 81 |
| 20. | సిలువ ఇచ్చే పునాది సత్యాలు | 85 |

| | | |
|---|---|---|
| 21. | పాపుల రక్షకుడు | 89 |
| 22. | లేవీయకాండము లోని బలులు | 94 |
| 23. | విమోచన రక్తము | 99 |
| 24. | విమోచకుని చేరుటకు నయోమి ప్రణాళిక | 104 |
| 25. | ప్రస్తుతపు దుష్టకాలము నుండి విమోచన | 109 |
| 26. | అభిషేకించబడిన నాయకుడు చేసిన వాగ్దానములు | 113 |
| 27. | పౌలు యొక్క మాదిరి నడక | 117 |
| 28. | జ్ఞానవంతురాలి ఆభరణములు | 121 |
| 29. | గిద్యోను విజయరహస్యము | 125 |
| 30. | నీతిమంతుడైన లోతు పోగొట్టుకొనిన దీవెనలు | 130 |
| 31. | గారడీ సీమోను | 135 |
| 32. | తప్పిపోని తండ్రి | 139 |
| 33. | ఆనందము వెనుక ఉన్న రహస్యము | 143 |
| 34. | వాక్యములోని మూడు కోణాలు | 147 |
| 35. | అభిషేకము కంటే గొప్పదైన ప్రార్థనా శక్తి | 150 |
| 36. | దేవుని అద్వితీయ ప్రణాళిక - మానవుని పోరాటము | 154 |
| 37. | క్రిస్మస్ నక్షత్రములు | 158 |
| 38. | దేవుడు మానవుడైన రోజు | 163 |
| 39. | క్రిస్మస్‌లోని విధేయత | 167 |
| 40. | వాగ్దానము నెరవేర్చిన దేవుడు | 172 |

# 1. క్రైస్తవుడు

ప్రియ క్రైస్తవులారా, "క్రైస్తవులు" అని పిలువబడుచున్న మనము ఆ పేరులోని విశేషతను తెలుసుకొందాము. "క్రైస్తవుడు" అన్న పదానికి అర్థము క్రీస్తుకు చెందినవాడు. మొదటి శతాబ్దంలో ఈ పేరు విశ్వాసులు తమంతట తామే పెట్టుకొన్నారో లేక శత్రువులు హేయభావంతో పెట్టారో గాని ఈ పేరు స్థిరపడిపోయింది. కొన్ని దినాల్లోనే ఈ పదము గౌరవసూచకంగా మారిపోయింది.

ఈ పదము బైబిలులో ఎన్నిసార్లు ఉందో మీకు తెలుసా? కేవలము మూడుసార్లు. ఏ సందర్భంగా, ఏ అర్థముతో, భావముతో ఈ నామ ప్రయోగము జరిగిందో గమనిద్దాము.

1. అపొ.కా. 11:26 – మార్పు పొందినవాడు
2. అపొ.కా. 26:28 – నేర్పుగా సువార్త బోధించెడివాడు
3. 1పేతురు 4:16 – ఓర్పుతో శ్రమలు సహించెడివాడు

'మార్పు పొందిన జీవితంలో నేర్పుగా సువార్త బోధిస్తూ, క్రీస్తు పేర వచ్చు శ్రమలను ఓర్పుగా సహించెడివాడు నిజమైన క్రైస్తవుడు' అని మనము చెప్పవచ్చు. బైబిలు ప్రకారము ఈ నిర్వచనము గల ఈ పదాన్ని మన జీవితాల్లో అన్వయించుకొని జీవించినప్పుడు నిజమైన క్రైస్తవులుగా గుర్తింపబడతాము. పై పేర్కొనబడిన మూడు లక్షణాలను ధ్యానించుకొందాము.

**1. మార్పునొందినవాడు :–**అపొ.కా. 11:26లో "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" అని వ్రాయబడి ఉంది. అంతియొకయ అంతకు మునుపు విగ్రహారాధనతో నిండి ఉన్నను యేసుప్రభువు మార్గములోనికి వచ్చిన తర్వాత అంతియొకయ వాసులు మార్పు చెందిన వారైనారు. పౌలు, బర్నబాలు ఒక

సంవత్సరము పాటు వారితో ఉండి వారిని బలపరచారు. అక్కడి సంఘము వారే మొట్టమొదటి సారిగా క్రైస్తవులని పిలువబడ్డారు. వీరు యూదులు, అన్యులవలె గాకుండా వేరుగా ఉన్నారు. క్రీస్తులాగా, క్రీస్తు కొరకు జీవించేవారిగా ఉన్నందున వీరికి ఈ పేరు పెట్టబడింది. ఈ క్రైస్తవులు వేరుపరచబడిన వారిగా ఉండి ఈ పేరు ధరించడము గొప్ప భాగ్యంగా తలంచారు. అపొ.కా. 11:21లో క్రైస్తవులను గురించి వ్రాయబడిన మాటలు : “ప్రభువు హస్తము వారికి తోడై యుండెను గనుక నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి”. వారిలో వచ్చిన మార్పును గురించి విని యెరూషలేము సంఘములో ఉన్నవారు బర్నబాను వారి దగ్గరకు పంపినట్లు చూస్తున్నాము. పెద్దలు బర్నబాను పంపినట్లుగా అతడు వారి మారుమనసు చూసి సంతోషించి పౌలును వారి మధ్యకు తోడుకొని వెళ్లి, వారి మధ్య ఉండి వారికి వాక్య బోధన చేశారు. పౌలు, బర్నబాలిద్దరూ నిజదేవుని తెలుసుకొని మార్పు నొందిన జీవితాలలో మాదిరిగా వారి మధ్య నివసించినందున ఆ ప్రజల్లో కూడా మార్పు వచ్చింది. అంతియొకయ సంఘము వారు కష్టాల్లో ఉండే వారిని ఆదుకొనే వారిగా, వారి విశ్వాసము క్రియా రూపకంగా చూపించినట్లుగా చూస్తున్నాము. అపొ.కా. 11:27-30 వచనాల్లో చదివితే గొప్ప కరువు రాబోతుందని తెలిసి యూదయలో కాపురమున్న సహోదరులకు ధనము పంపినట్లు చూస్తున్నాము. పౌలు మూడు సువార్త యాత్రల్లో కూడా వారు ఆర్థిక సహాయము చేసినట్లుగా చెప్పబడి ఉంది.

మార్పు చెందిన క్రైస్తవుడు యేసుతో వ్యక్తిగత సంబంధము కలిగి యుండి మారుమనసు కలిగి యుంటాడు. మారుమనసు అంటే దేవుని దగ్గరకు పాపక్షమాపణ పొందుటకు పశ్చాత్తాప హృదయముతో రావడము. పౌలు 2కొరింథీ 5:17తో “కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి” అంటున్నాడు. చీకటిలో ఉన్న వ్యక్తి వెలుగులోకి ప్రవేశించి యేసుప్రభువును తన స్వంత రక్షకుడిగా అంగీకరించుట  నూతన జీవితము, నూతన భద్రత, నూతన సహవాసము కలిగి యుండుట.

**2. నేర్పుగా సువార్త బోధించెడివాడు :-**అపొ.కా. 26:28 - ఈ సందర్భముగా పౌలు తనకు యేసుప్రభువుతో కలిగిన అనుభవము, తాను తెలిసికొన్న ఆత్మీయ

సత్యాల గురించి చెప్తూ ఉంటే అగ్రిప్పరాజు "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ చూచుచున్నావే" అంటున్నాడు. తాను పొందిన అనుభవము సాక్ష్యముగా చెప్పుట ద్వారా అగ్రిప్పరాజు మనసులో విత్తనము వేయగలిగాడు గాని ఒప్పుకొనుటకు అతను సిద్ధంగా లేడు. తన పూర్వ చరిత్రంతా చెప్పి తాను మారిన విధానము అంతా చెప్పాడు. ఎంతో నేర్పుగా అగ్రిప్పరాజు మనసులో సత్యము ప్రతిష్టించాడు. తనలాగా వారు కూడా రక్షకుని తెలుసుకోవాలనే తపన అతనిలో కనపడుతోంది. సువార్త అందరికీ బోధించుట ద్వారా, అందరితో పంచుకొనుట వలన సంపాదించబోయే ఆత్మల గురించిన భారంతో పౌలు మాట్లాడుతున్నాడు, ఇహలోక సంపద అందరికీ పంచుట వలన తరుగుంతుందేమో కాని పరలోక జ్ఞానమనే సంపదను పంచుట ద్వారా మన పరలోక సంపద పెరుగుతుంది. ఈ జ్ఞానము ఉన్న ప్రతి క్రైస్తవుడు నేర్పుతో సువార్త ప్రకటించగలడు.

**3. ఓర్పుతో శ్రమలు సహించెడివాడు :-** 1పేతురు 4:16 ప్రకారం "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను". పేతురు శ్రమల గురించి చాలా చక్కగా వివరిస్తున్నాడు. ఆది సంఘములో 'క్రైస్తవుడు' అను పేరు కలిగిన వారు చాలా శ్రమల పాలు అయ్యేవారు. ప్రతి క్రైస్తవునికి శ్రమపడవలసిన అవసరముందని చెప్తున్నాడు. ఎందుకంటే యేసుప్రభువు పేరును బట్టి శ్రమపడినపుడు క్రీస్తు శ్రమల్లో పాలివార మైనట్లుగా భావించవచ్చును. శ్రమ ఓర్పును కలిగిస్తుంది శ్రమ దేవునికి దగ్గర పరుస్తుంది. శ్రమ మనలను శుద్ధీకరిస్తుంది. ఆయన కొరకు శ్రమ పడువారు సంతోషంగా ఉంటారు. ఎందుకంటే ఆయన మన ప్రక్కనే ఉండి, మనలను తన మహిమలోకి తీసుకొని వెళతాడు. ఈ శ్రమ అను అగ్ని తాత్కాలికంగా బాధ కలిగిస్తుంది కాని చెడును నాశనము చేసి, శుద్ధీకరించి మంచిని స్థిరపరుస్తుంది.

"నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" అని యేసుప్రభువే స్వయంగా చెప్పాడు. ఈ సత్యము తెలిసినవారు తప్పక శ్రమలందు ఓర్పు కలిగి ఉంటారు. స్తెఫను గురించి మనము ధ్యానించినపుడు శ్రమల ద్వారా వచ్చే ఘనత గుర్తించవచ్చును. ఆయన ఆది సంఘములో మొదటి హతసాక్షి. ఆయనను యేసునామము కొరకై రాళ్లతో కొట్టి చంపుతున్న సమయంలో ఆయనకు దేవుని

మహిమ కనపరచబడింది. "ఆకాశము తెరవబడుటయు, మనుష్య కుమారుడు దేవుని కుడిపార్శ్వమందు నిలిచి యుండుటయు చూచుచున్నానని చెప్పెను." పౌలు కూడా తాను శ్రమలలో ఎందుకు సంతోషిస్తున్నాడో మనకు తెలియపరుస్తున్నాడు. 2 కొరింథీ. 12:10 – "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను గనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, హింసలలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నాను". పౌలుకు దేవుడిచ్చిన జ్ఞానమును బట్టి మంచి క్రైస్తవునిగా తీర్చిదిద్దబడ్డాడు. అందుకే ధైర్యంగా నిశ్చయతతో "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అనగలుగుతున్నాడు.

ప్రియ పాఠకులారా, పైన చెప్పబడిన సంగతులన్నీ జ్ఞాపకము తెచ్చుకొన్న మీరందరూ ఆది సంఘములో ఏ ఉద్దేశముతో "క్రైస్తవులు" అనుపేరు పెట్టబడిందో, ఆ పేరు సార్థకము చేసేవారిగా ఉంటారని నమ్ముతూ, నిజక్రైస్తవులుగా ఉండుటకు దేవుడు మనందరికీ శక్తిని దయచేసి దీవించాలని ప్రార్థిస్తున్నాను. ఆమేన్.

❖ ❖ ❖

# 2. అద్భుతమైన ఆహ్వానము

మనందరికీ వివాహ మహోత్సవ ఆహ్వానాలు గాని, జన్మదినోత్సవ ఆహ్వానాలు గాని, ఏదైనా వేడుక ఆహ్వానాలు గాని వచ్చినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. అన్నింటికంటె అద్భుతమైనదియు, నిత్య విశ్రాంతి కొరకైన ఆహ్వానము మన యేసుప్రభువు మనకు ఇచ్చియున్నాడు. నెమ్మదిలేని జీవితాలకు ఒక గొప్ప ఆహ్వానము ఇది. ఈ ఆహ్వానము ఆదరణకు, ప్రోత్సాహానికి ఒక నిధి కాబట్టి అందరూ స్పందించాలి. మనం దైవ లేఖనాల నుండి ఈ ఆహ్వానము అందుకొందామా!

మత్తయి 11:28-30 వరకు ఉన్న వాక్యభాగము చదువుకొందాము - "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి, అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి".

పై మూడు వాక్యములు కలిపి ధ్యానించినప్పుడు దేవుడు మనకు విశ్రాంతి నిచ్చే విధానము అర్థమవుతుంది. 28వ వచనములో అవసరమున్న వారందరికీ ఆయనిచ్చిన షరతులు లేని వాగ్దానములతో కూడిన ఆహ్వానము చూస్తున్నాము. 29వ వచనములో తన బోధలకు విధేయత చూపించమనే ఆజ్ఞ , ఆ ఆజ్ఞ పాటించేవారికి విశ్రాంతి దొరుకుతుందనే వాగ్దానము చూస్తున్నాము. 30వ వచనములో తన కాడి తేలికగా ఉంటుందనే ఆదరణ వాక్యము కనబడుతుంది. ఆయన సేవచేసే వారికి సంపూర్ణ స్వాతంత్ర్యము కలుగుతుందనే సత్యము తెలియపరచబడినది.

ఈ వాక్యము యొక్క సందర్భము మనము గమనిస్తే, విధేయులైన వారికి ఈ వాగ్దానము ఇస్తున్నాడు. తామెంతో కాలము నుండి వేచి చూస్తున్న రారాజే యేసుప్రభువు

అని అందరికీ తెలుసు. లూకా 1:30–34 లో దూత ప్రభువు ఆగమనము గురించి చెప్పినప్పుడు, ఆయన దావీదు సింహాసనాసీనుడగు రాజనియు, ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని చెప్పాడు. ధర్మశాస్త్రము క్షుణ్ణంగా తెలిసిన యూదులు యెషయా ప్రవక్త ప్రవచించిన "కన్యక గర్భవతియగును" అనే సూచన ద్వారా తెలిసికొని ఉంటారు. మత్తయి 2:2లో తూర్పు దేశపు జ్ఞానులు బాల యేసును వెదకుటకు వచ్చినప్పుడు రాజైన హేరోదు యొద్దకే వెళ్లి యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడున్నాడని విచారించడము ద్వారా అందరికీ తెలిసింది. బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా యేసు బాప్తిస్మము తీసికొంటుండగా యేసు తన కుమారుడని తండ్రియైన దేవుడు స్వయంగా సాక్ష్యమిచ్చాడు. ఇంత విశదీకరించినా ప్రజలు ఆయనను రారాజుగా అంగీకరించలేదు. ఆ సందర్భంగా యేసుప్రభువు పరిసయ్యులను, ఇశ్రాయేలీయుల మత పెద్దలను గద్దిస్తూ, తనను సకల మానవులకు రక్షకునిగా తండ్రియైన దేవుడు పంపాడని చెప్పాడు. మనలను రక్షించే రారాజు నుండి వచ్చిన ఆశీర్వాదకరమైన ఆహ్వానమిది. ప్రకటన 22:17లో చెప్పబడిన ప్రకారము ఆయన ఆహ్వానము అంగీకరించి, స్పందించిన వారికి జీవజలము ఉచితంగా ఇస్తానంటున్నాడు.

ప్రయాసపడి భారము మోసికొనుచు పశ్చాత్తాపముతో ఆయన యొద్దకు వచ్చువారందరికి పాపభారము తొలగించి విశ్రాంతి నిస్తానని ఆయన పిలుస్తున్నాడు. యేసులేకుండా విశ్రాంతిని, శాంతిని వెదకుతారు, కాని అవి వారికి దొరకవు. నిజమైన శాంతి, విశ్రాంతి కావాలంటే నిజమైన శాంతి దాతయైన యేసు దగ్గరకు రావాలి. ప్రభువైన యేసు ఈ ఆహ్వానాన్ని ఐహిక విచారాలు, అనారోగ్యాలు, బాధలు, పాప భారముతో నిండిన మనసులతో నిస్సారమైన బ్రతుకు కొనసాగించే వారందరికీ ఇస్తున్నాడు. ఆత్మీయంగా అలసిపోయి, గమ్యంలేని నులివెచ్చని జీవితాలు జీవిస్తూ ఉన్నవారిని తన దగ్గరకు రమ్మని ప్రోత్సహిస్తున్నాడు. తమ నీతి దేవుని ముందు మురికి గుడ్డల లాంటిది (యెషయా 64:6). అది తమ రక్షణకు పనికి రాదు అనే సత్యము తెలుసుకోలేక స్వనీతి, సత్క్రియల మీద ఆధారపడిన వారిని తన కృపచేత రక్షిస్తానని పిలుస్తున్నాడు. తాము వెలుపల ఉండి ధర్మశాస్త్రమనే కాడిని ఇతరుల మీద ఉంచేవారిని (లూకా 11:46) యేసు పిలుస్తున్నాడు. పాప బంధకాలలో ఉన్న వారిని పిలుస్తున్నాడు. యేసయ్య దగ్గరకు వచ్చినప్పుడు పాపపు బానిసత్యము నుండి

విడుదల వస్తుందనే (రోమా 6:6-14) సత్యము తెలుపుతున్నాడు. ఆయన ఆహ్వానము నంగీకరించిన వారికి సమాధానము కలుగుతుందని (రోమా 5:1) లేఖనాలు చెప్తున్నాయి. రక్షణ నిశ్చయత లేని వారికందరికీ ఈ ఆహ్వానము దేవుడిస్తున్నాడు. ఆయన ఆహ్వానానికి స్పందించి, అంగీకరించి, ఆయన సన్నిధికి వచ్చిన వారికి నెమ్మది, చింతలేని జీవితము వస్తుందని, తన యొద్దకు వచ్చిన వారిని ఎంత మాత్రమును బయటకు త్రోసివేయను (యోహాను 6:37) అని వాగ్దానము చేస్తున్నాడు.

ఆయన ఆహ్వానాన్ని అంగీకరించినవారు నశించరనియు (యోహాను 10:28); ఆయన ఆహ్వానాన్ని అందుకొన్నవారు నూతన బలము పొందెదరనియు (యెషయా 40:31) చెప్పబడి ఉంది. యేసుప్రభువు ఇచ్చే ఈ ఆహ్వానాన్ని అందుకొనుటకు కావలసిన యోగ్యతలు - సమర్పణ, విధేయత. నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి అంటున్నాడు. దానితోపాటు ఒక ఆదరణ మాట కూడ చెప్తున్నాడు. తాను సాత్వికుడను, దీనమనస్సు కలవాడనని. ఆయన ఒక ఉపాధ్యాయుడిలా మనకు నేర్పిస్తాడు గాని బెత్తము పట్టుకొనే మాస్టరు కాదు. మన లోపాలన్నీ ఆయనకు తెలుసు. ఆయన దీర్ఘశాంతము కలవాడు కనుక ఓర్పుగా ప్రేమతో మనకు నేర్పించి తన కాడి ఎత్తుకొనుటకు సిద్ధపరుస్తాడు. ఆయన కాడి సుళువుగాను, తేలికగాను ఉంటుంది అంటున్నాడు. ఒక కాడి, దానిని మోసే రెండు ఎద్దులు ఊహించు కొన్నప్పుడు ఒక ఎద్దు చిన్నదిగానూ, రెండవ ఎద్దు పెద్దదిగానూ ఉన్నప్పుడు కాడి భారమంతా పెద్ద ఎద్దు మోస్తుంది. అదే విధంగా ఆయన మనతో పాటు కాడి మోస్తున్నప్పుడు భారమంతా ఆయనపైనే ఉంటుంది, మనకాడి చాలా సుళువుగాను, తేలికగానూ ఉంటుంది. మనం ఆయన జతపనివారముగానూ, భాగస్థులుగాను ఉండవలసిన అవసరము ఉంది. గలతీ 2:20లో “ఇకను జీవించు వాడను నేను కాదు, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు” అని పౌలు అంటున్నాడు. ఆయనకు లోబడి, సమ్మతించి, ఆయన కాడి మోయడానికి సిద్ధపడిన వారంతా ఆ విధంగానే అంటారు.

యేసుప్రభువు మనలను సంపూర్ణముగా సమర్పించుకోవాలని ఆజ్ఞాపిస్తున్నాడు. మనము ఆయన సొత్తు కాబట్టి ఆజ్ఞాపించే అధికారము ఆయనకు ఉంది. 1 కొరింథీ. 6:19,20 లో “మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న

పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి” అని పౌలు ఖచ్చితంగా చెప్తున్నాడు. యేసుప్రభువే స్వయంగా “తన సిలువను ఎత్తుకొని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు” (మత్తయి 10:38) అని చెప్తున్నాడు.

మనము ధ్యానించిన ఈ వాక్యభాగములో మనము ఆయన పని చేస్తే, ఆయన విశ్రాంతి ఇస్తాడు అని తెలుసుకున్నాము. ఆయన సువార్త ప్రకటించుటకును, సాక్షులుగా ఉండుటకును ఆయన మనలను రక్షించి ఏర్పరచుకొన్నాడు. నశించిపోయే ప్రతి ఆత్మ యెడల భారము కలిగి యుండి, ఆయన సన్నిధికి తీసికొని రావలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. మన కాడిని తేలిక చేసిన దేవుడు, పాప భారముతో క్రుంగిపోతున్న ప్రతి ఒక్కరి కాడి తేలిక చేస్తాడనే శుభవార్త సకల మానవాళికి తెలియజేయాల్సిన అవసరత ఎంతైనా ఉంది, కాబట్టి అందరము సన్నద్ధులై ఉండాలి.

ఆయన అద్భుతమైన, ప్రేమతో నిండిన ఆహ్వానాన్ని మన్నించి, ఆయన కాడిని మోసుకొని, ఆయన విశ్రాంతిలోనికి ప్రవేశించాలని మిమ్మలనందరినీ హృదయ పూర్వకంగా కోరుతూ ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 3. నూతన నడక

రక్షింపబడిన మనమందరము పాత జీవితములోని చెడును వదలి, నూతనమైన మనుష్యులముగా నూతనంగా నడుచుకోవాలి. మనము ప్రభువులో స్థిరంగా నడవాలంటే పరిశుద్ధాత్మ శక్తి కావాలి. పౌలు ఎఫెసీ సంఘమునకు బోధించిన 7 రకములైన నడకలను మనము ధ్యానించుకొని ఆ ప్రకారము మనము కూడా నడచుకొనుటకు ప్రయత్నిద్దాము.

యేసుక్రీస్తును మన స్వంత రక్షకునిగా అంగీకరించక మునుపు మనము ఏ విధముగా ఉండేవారమో పౌలు ఎఫెసీ పత్రిక 2:1-3 వరకు ఉన్న వాక్య భాగములో వివరించాడు - "మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడా బ్రతికించెను. మీరు వాటిని చేయుచు, వాయు మండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, ఈ ప్రపంచ ధర్మము చొప్పున మునుపు నడుచుకొంటిరి. వారితో కలిసి మనమందరమును శరీరము యొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమ వారివలెనే స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి". అయితే ఇప్పుడు దేవుని కృపచేత చచ్చిన స్థితిలో ఉన్న "మనలను" క్రీస్తుతో కూడా బ్రతికించెను" (2:5).

రక్షింపబడిన మనము సంపూర్ణముగా మారిపోయి జీవించాలంటే, మన నూతన నడక ఏ విధంగా ఉండాలో పౌలు చెప్తున్నాడు.

## 1. సత్క్రియల యందు నడవాలి :

"దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తుయేసు నందు సృష్టించబడిన వారమై ఆయన చేసిన పనియై యున్నాము" (ఎఫెసీ 2:10). సత్క్రియలు లేకుండా మనము సమాజములో క్రీస్తు విశ్వాసులుగా జీవించలేము. మీకా 6:8లో ప్రవక్త ద్వారా దేవుడు చెప్పిన మాటలు చూద్దాము : "న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు గలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు".

సత్క్రియలు చేయుట అనునది దేవుని చిత్తము. అయితే ఈ సందర్భముగా మనము గుర్తుచేసుకోవలసిన విషయము ఒకటున్నది – సత్క్రియల ద్వారా మనకు రక్షణ, నిత్యజీవము రాదు గాని రక్షణ పొందిన ప్రతి విశ్వాసి సత్క్రియలు చేయాలి. ఇందు విషయమై పౌలు తీతుకు వ్రాసిన పత్రికలో ఈ విధంగా అంటున్నాడు : "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్క్రియల యందాసక్తి గల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" (తీతు. 2:14).

సత్క్రియలను గురించి బైబిలులో ఉన్న ఒక మంచి ఉదాహరణ అపొ.కా. 9:36-41లో చెప్పబడిన తబితాలో చూడగలము. "ఆమె సత్క్రియలను, ధర్మకార్యములను బహుగా చేసియుండెను". తనకు దేవుడిచ్చిన తలాంతును ఉపయోగించి విధవరాండ్రకు అంగీలు కుట్టేది.

మదర్థెరిస్సా దేవుని మహిమను వెల్లడి చేయుటకు చర్చి వేదికను ఎన్నుకోలేదు గాని రోడ్డు ప్రక్కల ఫుట్పాత్లను వేదికగా ఎన్నుకొన్నది. కలకత్తా మహా పట్టణములో రోడ్ల ప్రక్కన పడి ఉన్న కుష్ఠురోగులను, అనాధలను ఎన్నుకొని వారిపై దేవుని ప్రేమను కుమ్మరించింది. మనము దేవునిచే ఆశీర్వదింపబడినప్పుడు మన జీవనశైలి అభివృద్ధి పొందించుట కాకుండా, మనము ఇతరులకు ఇచ్చుటలో అభివృద్ధి పొంది ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండాలి.

## 2. వ్యక్తిగత నడక :

ఈ నడక కూడా పౌలు నేర్పిస్తున్నాడు. సమాజంలో సంఘములో మన నూతన నడక ఉండాల్సిన విధానము బోధిస్తున్నాడు. ఎఫెసీ 4:1-3 వచనాలలో ఈ విధంగా చెప్తున్నాడు. "కాబట్టి మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని, ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను" ఈ వాక్య భాగములో 7 లక్షణాలు చూడగలము : (ఎ) సమాధానము, (బి) ఐక్యత, (సి) ప్రేమ, (డి) సహనము, (ఇ) దీర్ఘశాంతము, (ఎఫ్) వినయము, (జి) సాత్వికము. ఈ లక్షణాలు కలిగి యుండుట ప్రతి విశ్వాసి గమ్యమై యుండాలి.

## 3. ఆత్మీయ నడక :

అంధకార సంబంధులుగా ఉండక నూతన నడక నేర్చుకొనవలెనని పౌలు బోధిస్తున్నాడు. ఎఫెసీ 4:22-24లో "కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశ వలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని, మీ చిత్తవృత్తి యందు నూతనపరచడిన వారై, నీతియు, యథార్థమైన భక్తియు గలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" అని చెప్పాడు. మనమిక మీదట పాపమనే చీకటి నుండి బయటకు వచ్చి వెలుగులో ఉన్నాము కాబట్టి మనము ప్రాచీన స్వభావమును విడిచిపెట్టి నూతన నడక మొదలుపెట్టాలి. మనము ప్రత్యేకించబడిన వారము అనే ఆలోచన ఎల్లవేళలా కలిగియుండాలి. ఇహలోకంలో ఉంటూనే ఇహలోక మాలిన్యాలు అంటకుండా చూసుకోవాలి. కుందేళ్లను పట్టుకునే వేటగాడు వాటి కలుగులలో బురద పెడతాడు. ఆ కుందేళ్లు వేటగాడికి దొరకకుండా తమ కలుగులలోకి వెళ్ళాలనుకున్నప్పుడు ఆ బురదలోకి వెళ్లుటకు ఇష్టపడక తమ ప్రాణాలను కోల్పోతాయి. ఇటువంటి స్వభావము మనం అలవరచుకోవాలి.

## 4. దేవుని పోలిన నడక :

ఎఫెసీ. 5:1లో పౌలు "మీరు ప్రియులైన పిల్లల వలె దేవుని పోలి నడుచు కొనుడి" అంటున్నాడు. ఈ అధ్యాయములో 3-5 వరకు పరిశుద్ధులకు తగిన లక్షణాలేవి, తగనివి ఏవి అని వివరించి చెడు పనులు చేయరాదని చెప్పాడు. యేసయ్య మనలను ప్రేమించి, మనము సువాసనగా ఉండుటకు మన కొరకు తన్నుతాను దేవునికి అర్పణము గాను, బలిగాను అప్పగించుకున్నాడు. ఆయన చేసిన గొప్ప త్యాగానికి ప్రతిఫలముగా మనమేమి ఆయనకు తిరిగి ఇవ్వలేము గాని, ఆ త్యాగాన్ని గుర్తించి ఆయనకు ఇష్టులుగా, ఆయన మహిమార్థము జీవించాలి. "ప్రేమ కలిగి నడుచుకొనుడి" అని పౌలు అంటున్నాడు. దేవుడేవిధముగా మనలను ప్రేమించి తన ప్రాణమును మన కొరకు అర్పించాడో మనమెరుగుదము. యేసయ్య స్వయంగా తన శిష్యులతో చెప్పిన మాటలు - "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకనినొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ" (యోహాను 15:12). మనము ఈ లోకంలో ఉన్నంత కాలము ప్రేమ కలిగి దేవుని పోలి నడుచుకోవాలి.

## 5. వెలుగు సంబంధులుగా నడచుట :

ఎఫెసీ. 5:8-10 వచనాలలో వెలుగు సంబంధులుగా నడుచుకొమ్మని పౌలు చెప్తున్నాడు. "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువునందు వెలుగునై యున్నారు. వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనపడుచున్నది. గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి". మనము వెలుగులో ఉన్నప్పుడు మనలో చెడు ఉంటే అందరికీ కనబడుతుంది. చెడు తీసివేసుకొని మంచితనము, నీతి, సత్యముతో జీవించాలి, నడచుకోవాలి.

## 6. జ్ఞానులవలె నడుచుకొనుట :

ఎఫెసీ 5:15-16 వచనాలలో "దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" అని పౌలు చెప్తున్నాడు. జ్ఞానులవలె

నడుచుకొనుట అంటే దేవుని చిత్తము తెలుసుకొని దాని ప్రకారము నడుచుకొనుట. రక్షణ పొందిన మనము పరిశుద్ధాత్మతో నింపబడి ఉంటాము, కాబట్టి ఆయన చెప్పినట్లు నడవాలి. దేవుని స్తుతిస్తూ, ఇతర విశ్వాసులను హెచ్చరిస్తూ, ఆరిపోయే స్థితిలో ఉన్న వారిని ఉత్తేజపరుస్తూ, భయభక్తులతో నడుచుకోవాలి. జ్ఞానము కొదువగా ఉంటే దేవుడిస్తాడు.

ఇంతవరకు మనము చూసిన విషయాలన్నీ ఎఫెసీ పత్రికలో ఉన్నాయి. కాని నేను మీకు చూపించాలనుకున్న చివరి నడక అపొస్తలుల కార్యముల గ్రంథములో ఎఫెసీ సంఘస్తులతో పౌలు మాట్లాడిన మాటలలో చూడగలము.

## 7. పరిచర్యలో మాదిరి నడక :

అపొ.కా. 20:18-35 వరకు ఉన్న వాక్య భాగంలో ఎఫెసీ సంఘములోని వారితో మాట్లాడుతూ తాను వారి మధ్య పరిచర్య చేస్తున్నప్పుడు ఏ విధంగా నడిచాడో, ఎలా జీవించాడో చెప్తూ మీరును అలాగ ఉండమని వారికి చెప్తున్నాడు. సువార్త కొరకు తాను పడిన కష్టమును గుర్తుచేసి, తానెంత నమ్మకత్వముతో పనిచేశాడో వారికి జ్ఞాపకము చేశాడు. 1కొరింథీ 11:1లో "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అంటూ ప్రతి విశ్వాసికి ఒక సవాలును విసిరాడు.

పైన మనము ధ్యానించుకున్న 7 రకాల నడకలను మనము ఈ నూతన నడకగా భావించి ఆ విధముగా నడుచుకుందామను నిర్ణయానికి వస్తే దేవునికి మహిమ కలుగుతుందని మీకు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

❖ ❖ ❖

# 4. యేసుక్రీస్తు యొక్క ముద్రలు

"నేను క్రీస్తు యేసు యొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను" (గలతీ 6:17) అని చెప్పిన పౌలు మాటలు ధ్యానించతగినవి. "వీరు నా స్వంతము" అంటూ యేసుప్రభువు వేసిన ముద్రలని కొందరు వ్యాఖ్యానిస్తారు. అయితే పౌలు దమస్కు మార్గంలో యేసుప్రభువు సంధించినప్పటి నుండి, ఒకప్పుడు హింసకుడుగా ఉన్నవాడు, హింసింపబడినవాడిగా మారినప్పటి నుండి తాను యేసయ్య కొరకు ఎన్ని శ్రమలు పడ్డాడో తానే చెప్పాడు. 2కొరింథీ11:23-27లో "మరి విశేషముగా ప్రయాసపడితిని, అనేక పర్యాయములు చెరసాలలో ఉంటిని, అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేక మారులు ప్రాణాపాయములలో ఉంటిని, యూదుల చేత అయిదు మారులు ఒకటి తక్కువ నలువది దెబ్బలు తింటిని, ముమ్మారు బెత్తములతో కొట్టబడితిని, ఒకసారి రాళ్లతో కొట్టబడితిని, ముమ్మారు ఓడపగిలి శ్రమపడితిని, ఒక రాత్రింబగళ్లు సముద్రములో గడిపితిని. అనేక పర్యాయములు ప్రయాణముల లోను, నదుల వలననైన ఆపదలలోను, దొంగలవలనైన ఆపదలలోను, నా స్వజనుల వలననైన ఆపదలలోను, అన్యజనుల వలననైన ఆపదలలోను, పట్టణములో, అరణ్యములో, సముద్రములో, కపట సహోదరుల వలన ఆపదలలో ఉంటిని. ప్రయాసతోను, కష్టములతోను, జాగరణముల తోను, ఆకలి దప్పులు, ఉపవాసములు, చలి, దిగంబరత్వముతోను ఉంటిని" అని చెప్తున్నాడు.

ఈ దెబ్బల వలన వచ్చిన మచ్చలు పౌలు జీవించినంత కాలము అతని శరీరము మీద కనపడి ఉండవచ్చును. ఆ గాయాల మచ్చలను కేవలము మచ్చలుగా కాకుండా తాను "యేసయ్య సొత్తు" అను సంగతిని గుర్తుచేసేందుకు వేయబడిన ముద్రలని పౌలు భావిస్తున్నాడు. ఈ ముద్రలు కేవలము చర్మము వరకే కాకుండా తన భావోద్రేకాలపైన, తన ఆత్మీయ జీవితంపైన పడ్డాయి.

ఈనాడు ఇలాంటి ముద్రలు మనము నివసించు ప్రాంతాన్ని బట్టి ఉంటాయి. దేవుని కృప వలన ప్రస్తుతము మనకు అలాంటి పరిస్థితులు లేవు. కానీ, మనమందరము ఆలోచించాల్సిన విషయమేమంటే, ఈ ముద్రలు మన ఆత్మీయ, నైతిక, మానసిక వైఖరిపైనను, మన వ్యక్తిత్వము పైనను పడినాయా లేదా అని మనము క్రీస్తును నమ్ముకొనిన తర్వాత పాపము విషయమై మరణించి క్రీస్తు కొరకు జీవించాలి. మన అవయవములు ఆయన ఆధీనములో ఉంచి, వాటిపైన ఆయన ముద్ర వేసుకోవాలి. పౌలు లాగా మన శరీరాలపైన బాహ్య గుర్తులు లేకపోయినను, హృదయంలో ముద్రించుకోవాలి. ఆయనకు మనము కట్టు బానిసలమై పోవాలి.

నిర్గమ. 21:1–6లో ధర్మశాస్త్రము ప్రకారము వెలకట్టి కొనబడిన బానిసకు 7వ సంవత్సరములో విడుదల ఇవ్వాలి. ఆ గడువు పూర్తయ్యాక తనకు విడుదల అవసరము లేదనియు, తాను జీవితాంతము తన యజమాని యొద్దనే ఉంటానని నిర్ణయము తీసుకొన్న బానిస చెవిని కుదురుతో గుచ్చవలెను. తరువాత వాడు నిరంతరము వానికి దాసుడై ఉంటాడు. చెవికున్న రంధ్రము ద్వారా వాడు కట్టుబానిస అని ప్రపంచానికి తెలుస్తుంది. పౌలు అలాంటి బానిసత్వము కోరుకున్నాడు. రోమా 1:1లో "యేసుక్రీస్తు దాసుడను" అని పరిచయం చేసుకున్నాడు. ఆయన ముద్ర వేయించుకొని, ఆయనకు చెందిన వారమని చెప్పుకొనుటలో గొప్ప ఆధిక్యత వున్నది. ఈ సమాజంలో ఒకవేళ మనము ఒక గొప్ప కుటుంబానికి చెందిన వారమైతే అందును బట్టి అతిశయిస్తామేమో గాని, సర్వాధిపతియైన యేసయ్య సంబంధిగా గుర్తింపు తెచ్చుకోవడము చాలా గొప్ప ఘనత అని మనము అర్థము చేసుకోవాలి.

మనము క్రీస్తు కొరకు శ్రమపడితే, మన జీవితాల నుండి క్రీస్తు ప్రత్యక్షపరచ బడుతాడు. మహిమపరచబడుతాడు, పరిచర్యలో శ్రమలేనిదే ఏమీ సాధించలేము. ముద్రలు కలవారు మంచి నేలను పడిన విత్తనము లాంటివారు. అట్టివారు నూరంతలుగాను, అరువదంతలుగాను, ముప్పదంతలుగాను ఫలిస్తారు (మత్తయి 13:8). పౌలు యేసయ్య మార్గంలోకి రాకముందు తన శరీరంలోని సున్నతి గుర్తును బట్టి అతిశయించాడు గాని ఇప్పుడు క్రీస్తు కొరకు శ్రమపడుట వలన వచ్చిన గుర్తులను బట్టి అతిశయిస్తున్నాడు. ఫిలిప్పీ 3:5–6 ఉన్న వాక్య భాగములో ఈ విధంగా అంటున్నాడు. "ఎనిమిదవ దినమున సున్నతి పొందితిని, ఇశ్రాయేలు వంశపువాడనై, బెన్యామీను గోత్రములో పుట్టి హెబ్రీయుల సంతానమైన హెబ్రీయుడనై, ధర్మశాస్త్ర విషయము పరిసయ్యుడనై, ఆసక్తి విషయము సంఘమును హింసించువాడనై,

ధర్మశాస్త్రము వలని నీతి విషయము అనింద్యుడనై యుంటిని. అయినను ఏవేవి నాకు లాభకరముగా యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని". కేవలము క్రీస్తును గురించిన జ్ఞానము, క్రీస్తు సిలువ యందు మాత్రమే అతిశయించు వాడిగా మారిపోయాడు. ఇంకొక సందర్భములో ఈ లోకములోని ప్రాముఖ్యమైన వాటన్నింటిని పెంటతో సమానంగా చూస్తున్నానంటున్నాడు.

'క్రీస్తు ముద్రలు మన శరీరములో కలిగియుండుట' అనునది మనం అన్వయించుకోవాలంటే క్రీస్తు సారూప్యములోనికి మారుతూ, ఆయన లక్షణాలు, స్వభావాలు కలిగియుండుట. మనము కొన్ని దినాలుగా సిలువ ధ్యానాలను చేసి ఉన్నాము. కాబట్టి యేసుప్రభువు సిలువలో పలికిన ఏడు మాటల నుండి ఏ లక్షణాలు అలవరచుకోవాలో చూద్దాము.

**1.** "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" – (మత్తయి 5:44)లో శత్రువులను ప్రేమించమని తాను చెప్పిన మాటలు చేసి చూపిస్తున్నారు. యేసయ్య ముద్ర మనలో ఉన్నట్లు ఇతరులకు కనపడాలంటే శత్రువులను ప్రేమించుట, క్షమించుట, వారి కొరకు ప్రార్థించుట మనలో కనపడాలి.

ఆది50:15–21లో యోసేపు తనను చంపచూసిన, ఆ తర్వాత బానిసగా అమ్మివేసిన తన అన్నల పట్ల క్రీస్తులాంటి క్షమాపణ చూపాడు.

అపొ.కా. 7:54–60లో ఉన్న వాక్య భాగములో స్తెఫను తనను చంపేవారిని క్షమించమని దేవునిని వేడుకొనుటలో యేసయ్య ముద్రలు బాహ్యంగాను, అంతరంగము లోను చూపించాడు.

**2.** "నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువు" అని ప్రభువు తనతో పాటు సిలువవేయబడిన దొంగతో చెప్పిన మాటల నుండి మనము నేర్చుకోవలసినది, మనము చేయాల్సినది ఏమంటే, మన తోటి వారు మనతో పాటు పరలోకంలో ఉండాలని తపన కలిగి ఉండాలి. ఉదాహరణకు పాత నిబంధనలో మోషే, క్రొత్త నిబంధనలో పౌలు ఇలాంటి కోరికను వ్యక్తపరచారు.

**3.** "అమ్మా, ఇదిగో నీ కుమారుడు" అని తన తల్లిని తనకు అత్యంత ప్రియమైన శిష్యునికి అప్పజెప్పుటలో తాను ధర్మశాస్త్రము నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు రాలేదని రుజువు చేసుకుంటున్నాడు. మనము కూడా మన పెద్దలను, తల్లిదండ్రులను ప్రేమించినపుడు మన జీవితము ద్వారా దేవుడు మహిమపరచబడుతాడు. తిమోతి

తన తల్లి యునీకే, అవ్వ లోయిలను గౌరవించి, ప్రేమించి, వారు బోధించిన విషయాల ప్రకారము జీవించుట ద్వారా తాను క్రీస్తు ముద్రలు కలిగి యున్నాడని రుజువు పరచుకొన్నాడు.

**4.** "నా దేవా, నా దేవా, నన్నెందుకు చేయి విడిచితివి" అను మాటలో పాపముగా చేయబడిన యేసయ్య చేయి తండ్రియైన దేవుడు విడిచినట్లుగా మనకు అర్థమవుతుంది. పాపము చేసినప్పుడు పవిత్రుడైన దేవుడు మన చేయి వదిలేస్తాడను విషయము తెలుసుకొని జాగ్రత్తగా ఉంటూ, ఎప్పుడైనా పాపములో పడితే, పశ్చాత్తాప హృదయముతో దేవుని సన్నిధికి వెళ్లినపుడు మనకు క్రీస్తు ముద్రలు ఉన్నాయని తెలుసుకోగలము. 51వ కీర్తనలో దావీదు పశ్చాత్తాప హృదయము తెలుసుకోగలము. అందుకే ఆయన దేవుని హృదయానుసారుడైనాడు.

**5.** "నేను దప్పిగొనుచున్నాను" అనే మాటలో తండ్రితో తిరిగి ఏకము కావాలనే తృష్ణ, ఆత్మల భారము యేసయ్య కనుపరుస్తున్నాడు. మనము కూడా అలాంటి కోరికలు కలిగి ఉన్నప్పుడు క్రీస్తు ముద్రలు మనలో కనపడుతాయి.

**6.** "సమాప్తమైనది" – తండ్రి తనకప్పగించిన పని పూర్తి చేశానని చెప్తున్నాడు. 2తిమోతి 4:7లో "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని" అని పౌలు చెప్పినట్లు మనము కూడా చెప్పగలిగితే క్రీస్తు ముద్రలు మనలో ఉన్నట్లే.

**7.** "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను" అనుమాటలో యేసుప్రభువు తిరిగి తండ్రితో ఏకమగుట చూస్తున్నాము. మనలను సృష్టించిన దేవుడు తన ఆత్మను మనలో ఉంచాడు. దానిని జాగ్రత్తగా ఆయనకు తిరిగి అప్పగించగలగాలి. రోమా 12:1లో సజీవ యాగముగా మనలను మనము దేవునికి అప్పగించుకోవాలని పౌలు అంటున్నాడు.

పైన చెప్పబడిన విషయాలన్నీ జాగ్రత్తగా ధ్యానించి, మనము కూడా పౌలు లాగా క్రీస్తు ముద్రలు ధరించి యున్నామని చెప్పినప్పుడు దేవుడిని సంతోషపెట్టిన వారమవుతాము. ఆ విధంగా ఉండుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక. ఆమేన్!

❖ ❖ ❖

# 5. నీతిమంతులుగా స్థాపించబడుట

దేవుని మార్గములో నడుస్తున్న వారందరినీ తన వధువుగా స్వీకరించి, తాను వారికి చేయబోవు మేళ్లను వాగ్దానరూపకంగా చెప్పిన వాటిలో నుండి ఒక వాగ్దానమును ధ్యానించుకుందాము.

పాత, క్రొత్త నిబంధనలలో సంఘమునకు దేవునితో ఉన్న సంబంధమును ఒక భార్య, భర్తల మధ్య ఉన్న సంబంధముతో అనేక చోట్ల పోల్చబడి యున్నది. భార్య భర్తల సంబంధమనగానే శారీరక సంబంధాలను గురించిన ఆలోచన రావడము సహజము. కానీ ఆత్మయైన దేవునితో ఉన్న సంబంధము ఆత్మీయంగానే పరిగణించాలి. ఆదికాండములో దేవుడు నరునికి సహకారిగా నారిని సృష్టించినప్పుడు చెప్పబడిన మాటలు – "పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును, వారు ఏకశరీరమై యుందురు". భార్య భర్తలిద్దరూ కలిసి ఒకటిగా చెప్పబడతారు. భార్య తన ఇంటి పేరును విడిచి పెట్టి భర్త ఇంటిపేరును పొందుకొంటుంది. వివాహమైనప్పటి నుండి తన కుంటుంబము అంటే తన భర్త, పిల్లలను గురించిన ఆలోచనలే కలిగి ఉంటుంది. అదే విధంగా మనమందరము పాత రోత జీవితాలను వదలిపెట్టి క్రీస్తుకు వధువులుగా, ఆయన పేరు పెట్టుకొని జీవించాలన్నదే ప్రభువు అభిప్రాయము. తన వధువుగా చేసికొన్న మనలను అన్ని రంగాలలో అభివృద్ధి పొందించి, తన నామమహిమార్థము వాడుకొనవలెనని ఆశిస్తున్నాడు.

యెషయా 54:14లో తన వధువుకు ఆయన చేసిన ఒక వాగ్దానము జ్ఞాపకము చేసికొని ధ్యానించుకొందాము. "నీవు నీతిగలదానవై స్థాపించబడుదువు. నీవు భయపడనక్కర లేదు. బాధించువారు నీకు దూరముగా నుందురు. భీతి నీకు దూరంగా ఉండును. అది నీ దగ్గరకు రానేరాదు". నీతి అనునది తన వధువుకు వరుడిచ్చే మొదటి వస్త్రము. ఈ నీతి వస్త్రము లేనిదే మనకు పరలోకములోనికి ప్రవేశములేదు.

దేవుడు మనలను ఒక ఉన్నత స్థానములో ఉంచాలని ఆశపడుచున్నాడు. ద్వితీయో 26:19లోని మొదటి భాగము చూస్తే ఆయన కోరిక మనకు కొద్దిగా అర్థమవుతుంది. "తాను సృజించిన సమస్త జనముల కంటె నీకు కీర్తి, ఘనత పేరు కలుగునట్లు నిన్ను హెచ్చించుదును". తన పేరు పెట్టుకొనిన తన జనులు ఈ లోకములో కూడా పై అంతస్థులో ఉండాలని వరుడైన దేవుడు కోరుకొంటున్నాడు. మిమ్ములనెప్పుడూ తలగానే ఉంచుతాను గాని తోకగా ఉండనివ్వనని ఇంకొక సందర్భంలో అంటున్నాడు.

ఒక భర్త తన భార్యపట్ల ఎంత బాధ్యతగా ఉంటాడో, అంతకంటె ఎక్కువగా దేవుడు సంఘము పట్ల బాధ్యత వహించాడు. ఎఫెసీ 5:27లో క్రీస్తు "సంఘమును ప్రేమించి, అది కళంకమైనను, ముడతయైనను, అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనది గాను, నిర్దోషమైనదిగాను, మహిమ గల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధ పరచుటకై దాని కొరకు తనను తాను అప్పగించుకొనెను". తన వధువుగా ఇతరులకు చూపకమునుపు ఆయన మనలను వాక్యమనే ఉదకముతో పరిశుద్ధపరచి పవిత్రంగా నిర్దోషంగా మహిమగలవారిగా చేస్తాడు. నీతి వస్త్రము ధరింపచేయుట, నీతిమంతులుగా స్థాపించబడుట అను మాటలకు అర్థమదే.

మనము పైన చదువుకొనిన వాక్యభాగములో దేవుడు తన ప్రజలతో మాట్లాడుచున్నప్పుడు వారిని 'నీతిగలదానివై' అని ఒక స్త్రీలాగా సంబోధిస్తున్నాడు. ఇంతకు ముందు మనము ధ్యానించినట్లుగా ఆ సంబోధనకు కారణము తన ప్రజలను ఆయన తన భార్యగా స్వీకరించాడు. కాబట్టి ఆయనను భర్తగా ప్రజలే స్వీకరించిన రోజున, మనలను నీతిమంతులుగా స్థిరపరుస్తాడు. రోమా 3:10లో పౌలు చెప్పినట్లు "నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు". కాని ప్రవక్త ద్వారా దేవుడు మనలను నీతిమంతులుగా స్థాపిస్తానని చెప్తున్నాడు. వాగ్దానము చేసిన దేవుడు నమ్మదగినవాడు.

ప్రతి వాగ్దానము వెనుక ఒక షరతు ఉన్నదని గుర్తుచేస్తూ ఈ వాగ్దానము మన పక్షమున నెరవేరాలంటే మనము ఆయనను భర్తగా స్వీకరించాలి. ఆయన మాత్రమే నీతిమంతుడు. ఆయనతో సహవాసము చేసినప్పుడు ఆయన సారూప్యము లోనికి మారిన మనము నీతిమంతులమవుతాము. యేసుక్రీస్తు ఒక్కడే పరిశుద్ధుడు, ఆయన ఒక్కడే నీతిమంతుడని చెప్పుటకు ఆధారముగా అనేక బైబిలు వాక్యాలున్నవి.

రోమా అధిపతియైన పిలాతు భార్య తన భర్తవలన యేసు ప్రభువుకు కీడు జరుగుతుందేమోననే భయముతో అన్యాయపు తీర్పు జరుగుతున్న సమయములో "ఆ నీతిమంతుని జోలికి పోవద్దు" అని భర్తకు చెప్పి పంపుతుంది. శత్రువులు కూడా ఆయన నీతిమంతుడని సాక్ష్యం చెప్పటం చూసాము. 1పేతురు 1:19లో "నిర్దోషమును, నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము" అని చెప్పబడిఉంది. 1తిమోతి 3:16లో "ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను" అని వ్రాయబడి ఉంది.

దుర్నీతి పరులమైన మనము ఈ నీతిమంతునితో సహవాసము చేయాలి. ఆయనతో మనకు వివాహము జరగాలి. భార్య భర్తల మధ్య ఉన్న అన్యోన్య సహవాసము ఏ ఇతరుల మధ్య ఉండదు. ఆరునెలలు కలిసి ఉంటే వారు వీరవుతారనే లోకోక్తి ఉంది. కాని దైవోక్తి ఏమంటే దేవునితో అన్యోన్య సహవాసము చేస్తున్నప్పుడు మనము దేవుని సారూప్యములోనికి మారెదము. యెషయా 61:10 లో "నీతి అను పై బట్టను నాకు ధరింపచేసియున్నాడు" అని చెప్పబడి ఉంది. మనంతట మనము నీతిమంతులుగా చేయబడలేదు. ఆయనతో సహవాసము కలిగి ఉంటేనే ఈ కార్యము జరుగుతుంది. ఈ సహవాసము గురించి ఇంకా లోతుగా తెలిసికొనుటకు కొన్ని వాక్యభాగములు చూద్దాము.

అపొ.కార్యములు 4:32 ప్రకారము "విశ్వసించిన వారందరును ఏక హృదయమును, ఏకాత్మయు గలవారై యుండిరి", అనగా విశ్వసించిన తర్వాత మనము దేవునితో ఏకహృదయులై ఉండుట, మత్తయి 18:19లో చెప్పబడిన "ఏకీభవించుట" కూడా ఇలాంటిదే. దేవుని హృదయాన్ని కలిగి ఉండాలి. దేవుడు "తన కుమారునితో సారూప్యము గల వారగుటకు" మనలను ఎన్నుకొన్నాడు. ఆయన సారూప్యములోకి రావాలంటే మనము అనునిత్యము శరీరముతో పోరాడాలి. విజయము పొందినప్పుడే మనము నీతిమంతులముగా స్థాపించబడుతాము.

యోహాను 15:4లో యేసు ప్రభువు చెప్పినట్లుగా మనము ఆయన యందు నిలిచి యుంటే, ఆయన మనయందు నిలిచి ఉంటాడు. యోహాను 6:27 లో ప్రభువు మనకు ఆజ్ఞాపించినట్లుగా అక్షయమైన ఆహారము కొరకు కష్టపడితే మనము మహిమ పరచబడుతాము.

1కొరింథీ 9:27లో పౌలు "నేను భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలుగగొట్టి దానిని లోపరచుకొనుచున్నాను" అంటున్నాడు. మన శరీరమును దేవునికి ప్రతిష్టించబడవలసిన అవసరముంది కాబట్టి శరీరాలను నలుగగొట్టుకొని, లోబరచు కోవాలి.

దేవునితో సహవాసము చేయుటకు ముందు ఆయన స్నేహితులుగా మారాలి. "నేను మీ కాజ్ఞాపించు వాటిని చేసిన యెడల, మీరు నా స్నేహితులై యుందురు" అని యేసయ్య స్వయంగా చెప్తున్నాడు. ఆయన ఆజ్ఞలను పాటిస్తూ, వాక్య ప్రకారము జీవించినప్పుడు ఆయనకు సన్నిహితులమవుతాము. విశ్వాసము వలనను (రోమా 5:1), ఆయన రక్తము వలనను (రోమా5:9) నీతిమంతులముగా తీర్చబడుతామనే వాక్యములను విశ్వసించాలి. రోమా 4:3లో అబ్రాహాము నమ్మెను గనుక నీతిమంతునిగా చేయబడెనని ఒక సోదాహరణముతో వివరించబడినది. ఆయనే మన నీతి అయి ఉన్నాడనియు, దేవుని నీతి క్రీస్తు మరణ, పునరుత్థానము వలన దొరుకుతుందనియు పౌలు చెప్తున్నాడు. 1కొరింథీ 1:31లో 'దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనము నాయెను". వరుడైన యేసు వధువైన సంఘము కొరకు అన్నీ తానై ఉన్నాడు. తిరిగి మన మూల వాక్యము చూస్తే అక్కడ మనకు అదరణ వాక్యములు అగుపడుతాయి. ఒకసారి నీతిమంతులముగా స్థాపించబడిన తరువాత మనకు కలుగు మేలులు అనేకము. మనలను బాధించువారు దూరమగుదురు, ఏ భయమూ మన దగ్గరకు కూడా రాదు. అయినా దేవుడు మన భర్తగా ఉండగా, ఏ శత్రువు కూడా మనలను సమీపించుటకు కూడా ధైర్యము చేయడు. మనలను ముడితే ఆయన కనుగుడ్లను ముట్టినట్లేనని వాక్యము చెపుతుంది. కావున మనము నిశ్చింతగా జీవించవచ్చును. లేఖనాలలో పదేపదే వ్రాయబడిన "భయపడకుము" అను మాట మనకు వర్తిస్తుంది. ఈ అధ్యాయములో ఇంకా అనేక ఆశీర్వాదములు చెప్పబడియున్నవి.

దేవునితో సమీప సాంగత్యము, సహవాసము కలిగియుండి నీతిగల వారిగా స్థాపించబడుటకు మనకందరికి దేవుడు సామర్థ్యము కలుగజేయవలెనని ప్రార్థిస్తున్నాను.

❖ ❖ ❖

# 6. దేవుని దృష్టికి హేయమైనవి వదిలేద్దాము

రక్షింపబడిన మనము మన ఆత్మీయ జీవితయాత్రలో అనేకసార్లు దేవుని మహిమార్థము జీవించాలనే నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాము. అయితే ఆ నిర్ణయాలు ఒక వారమో, పక్షమో అవగానే మరచిపోతుంటారు. ఏది ఏమైనా మీ అందరి ఆత్మీయ ఎదుగుదల కోరే ఒక సోదరిగా, సామెతలు 6:17-19 లో వ్రాయబడిన దేవుని దృష్టికి హేయములైన ఏడు గుణాలు విసర్జించ కోరుచున్నాను. ఒకసారి ఆ వాక్యభాగము చదువుకుందాము. "అవేవనగా, అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును"- ఈ ఏడును ఆయనకు హేయములు.

ఈ ఏడు హేయమైన గుణాలను గురించి విపులంగా ధ్యానించుకుందాము.

## 1. అహంకార దృష్టి :

అన్నీ వారికే తెలుసునన్న అహంకారము. ఇహలోకపరంగా ప్రజలు తమ ధనమును బట్టి, తెలివిని బట్టి, హోదా, ఆరోగ్యమును బట్టి అతిశయిస్తారు. ఈ అహంకారము వలననే అపవాది పరలోకము నుండి క్రిందకు త్రోసివేయబడ్డాడని లేఖనాలు తెలుపుతున్నాయి.

యెషయా 14:12-15 లో ఈ విషయము చెప్పబడి ఉన్నది "తేజో నక్షత్రమా, వేకువచుక్కా, నీ వెట్లు ఆకాశమునుండి పడితివి? జనములను పడగొట్టిన నీవు నేలమట్టము వరకు ఎట్లు నరకబడితివి? - నేను ఆకాశమున కెక్కి పోయెదను; దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును; ఉత్తర దిక్కున నున్న

సభాపర్వతము మీద కూర్చుందును, మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి గదా? నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే".

"అహంకారియైన గర్విష్టునికి అపహాసకుడని పేరు, అట్టివాడు అమిత గర్వముతో ప్రవర్తించును" (సామె 21:24), గర్వానికి తర్వాత నాశనము నడుచును అను సంగతి హిజ్కియా రాజు విషయంలో కూడా చూడగలము. 2రాజులు 20వ అధ్యాయంలో హిజ్కియా రాజుకు మరణకరమైన రోగము కలుగగా, ప్రార్థించి పదిహేను సంవత్సరముల ఆయుష్షు పొడిగింపు వరముగా పొందిన తర్వాత, శత్రురాజు దూతల ఎదుట దేవుని మహిమ పరచుటకు బదులుగా, తన సమస్త వైభవమును ప్రదర్శించి నందున, అతని ఆస్తినంతటిని శత్రువులు కొల్లగొట్టుకుపోయారు. అహంకార దృషి గల వారిని దేవుడు ఇష్టపడడు కాబట్టి మనము పౌలువలె సిలువయందు అతిశయించుట నేర్చుకొందామా! పౌలు ఇహలోకపరంగా చాలా ఉన్నత స్థానంలో ఉన్నను, క్రీస్తు కొరకు వాటినన్నింటిని పెంటగా భావించినట్లు ఫిలిప్పీ 3:5-11లో చూడగలము. ఈ లోకములో మనకున్నవేవీ మన స్వంతం కానప్పుడు, వాటియందు అతిశయించక, వాటిని ఇచ్చిన వానియందు అతిశయించుట శ్రేయస్కరము.

## 2. కల్లలాడు నాలుక:

దేవుడు సత్యవంతుడు కాబట్టి దేవునికి అబద్ధాలంటే అసహ్యము. సామెతలు 12:22లో "అబద్ధములాడు పెదవులు యెహోవాకు హేయములు, సత్యవర్తనులు ఆయన కిష్టులు" అని ఖచ్చితంగా చెప్పబడి ఉన్నది. కీర్తన 58:3లో "పుట్టిన తోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు" అని దావీదు రాజు అంటున్నాడు. యోహాను 8:44 లో సాతాను "అబద్ధమునకు జనకుడై యున్నాడని" యేసయ్య స్వయంగా చెప్పాడు. కల్లలాడు నాలుక కలవారంతా సాతాను శిష్యులే కాబట్టి ప్రకటన 22:15లో ఇవ్వబడిన అగ్నిగుండములో వేయబడువారి జాబితాలో వారున్నారు. ప్రకటన 21:8 లో అబద్ధికులు పరలోక రాజ్యంలోకి ప్రవేశింపరని ప్రస్తావించాడు. అదే సత్యాన్ని తన పత్రికలో అబద్ధికులను గూర్చి యాకోబు భక్తుడు చెప్పాడు. మనకైతే అసాధ్యము కాని దేవునికి సమస్తము సాధ్యమే, కాబట్టి మనలో సంచకరువుగా ముద్రించబడి ఉన్న పరిశుద్ధాత్మ దేవుని సాయంతో మన నాలుక కల్లలాడకుండా ఉంచుకోగలము.

## 3. నిరపరాధులను చంపుట :

యాకోబు 3వ అధ్యాయంలో నాలుకను అగ్నితోను, విషముతోను పోల్చారు. సామె 12:18లో "కత్తిపోటు వంటి మాటలు పలుకు వారు కలరు" అని చెప్పబడి ఉంది. ఇటువంటి నాలుకతో మాట్లాడు వారు ఎదుటి వాని ఆత్మ విశ్వాసము కోల్పోయేటట్లు చేసి వారిని మరణమునకు అప్పగించే అవకాశమున్నది. 1యోహాను 3:15లో "సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు" అని వ్రాయబడి ఉన్నది. ప్రేమరాహిత్యము చంపుటతో సమానము. ఆదాము పాపము చేసిన వెంటనే నిరపరాధులను చంపుట మొదలైనట్లుగా ఆది 4:10లో కయీను హేబెలును చంపుటలో చూడగలము. నిరపరాధి అయిన బాప్తిస్మమిచ్చు యోహానును హేరోదు రాజు చంపుటను యేసుప్రభువు క్షమించలేదు. యేసుప్రభువు అన్యాయపు తీర్పుకై హేరోదు యొద్దకు కొనిపోబడినప్పుడు తన 'స్వరము' గా వచ్చిన యోహానును చంపిన హేరోదుకు యేసయ్య తన స్వరమును వినిపించలేదు. భక్తుని చంపినందువల్లనే దమస్కు యుద్ధములో ఓడిపోయాడని చరిత్రకారుడు వ్రాశాడు.

## 4. దుర్యోచనలు యోచించు హృదయము:

ఎవరిని ఎలా నాశనము చేయలా అనే ఆలోచనలు కలిగినవారు దేవునికి హేయులు, అపవాదికి దాసులుగా ఉన్న వారిలో ఇలాంటి ఆలోచనలు వుంటాయి. ప్రస్తుత కాల సమాజములో చాలామందిలో ఇటువంటి చెడు ఆలోచనలే ఉన్నాయి. ప్రత్యేకించబడిన మన హృదయాలలో ఇలాంటి ఆలోచనలు ఉంటే మన దేవుడు సహించలేడు. ఆది 6:5లో "నరుల హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను" అను బాధాకరమైన మాటలు వ్రాయబడిఉన్నాయి. మనలో ఏవైనా చెడు ఆలోచనలు, ప్రణాళికలు, చేదువేర్లు ఉంటే వెంటనే తీసేసుకుందామా!

కీర్తన 37:32లో "భక్తిహీనులు నీతిమంతుల కొరకు పొంచియుండి వారిని చంపజూతురు" అని ఉన్నది. సౌలు రాజు తనపై నుండి దేవుని అభిషేకము తొలగింపబడి, దావీదు పైకి వచ్చిందని తెలుసుకొని దావీదును ద్వేషించుట మొదలు

పెట్టి, దావీదును అంత మొందించుటకు దుర్యోచనలు చేయుట మొదలెట్టాడు. అయితే నిర్ధోషుల పట్ల దుర్యోచనలు చేయువారిని దేవుడు నశింపచేస్తాడు. ఎస్తేరు 7:10లో హామాను నిర్ధోషి అయిన మొర్దెకైని అంత మొందించాలని ప్రణాళిక ఏర్పరచి తానే ఎలా నాశనమైనాడో చూడగలము. కీర్తన 7:15లో చెప్పబడినట్లుగా "తాను త్రవ్విన గుంటలో తానే పడిపోయెను" అందుకే మనము కీర్తనాకారుడు చెప్పినట్లుగా "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" (కీర్తన 119:11) అని చెప్పగలగాలి.

## 5. కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములు :

సామెతలు 1:16లో జ్ఞానము లేని వారిని గురించి చెప్తూ "కీడు చేయుటకై వారి పాదములు పరుగులెత్తును" అని సొలొమోను మహారాజు అంటున్నాడు. కీడు చేయువారు నిర్మూలమగుదురు, "యెహోవాకొరకు కనిపెట్టుకొనువారు దేశమును స్వతంత్రించు కొందురు" (కీర్తన 37:9) అని దావీదు రాజు అంటున్నాడు. పాపము ఎప్పుడూ ఒంటరిగా రాదు, కీడు చేయుటకు పరుగులెత్తు పాదములు ఇంకా కొన్ని పాపాలు చేసి వస్తాయి. యాకోబు 1:15లో చెప్పబడినట్లుగా "దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును". అందుకై దేవుని బిడ్డలమైన మనలను మన కాలు చిక్కుబడకుండా దేవుడు కాపాడుతాడు (సామె 3:26). కీడు చేయుటకు పరుగెత్తకుండా, మన పాదాలను సువార్త ప్రకటించుటకు పరుగెత్తునట్లుగా అలవర్చుకుందామా!

## 6. అబద్ధ సాక్షి:

దేవునికి హేయమైనవాటిలో అబద్ధమను మాట రెండవసారి వచ్చింది. నిర్గమ 20వ అధ్యాయంలో దేవుడు మోషేకిచ్చిన పది ఆజ్ఞలలో తొమ్మిదవది. "వ్యర్థుడైన సాక్షి న్యాయము నపహసించును" (సామె 19:28). న్యాయవంతుడైన మన దేవుడు అబద్ధ సాక్షులను అసహ్యించుకొంటాడు. యేసుప్రభువును సిలువకు అప్పగించక ముందు యూదా పెద్దలు ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చుటకు అబద్ధసాక్షులను ఏర్పరచుకొన్నారు (మార్కు 14:56-59).

## 7. అన్నదమ్ములలో జగడములు పుట్టించుట :

"సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము" (కీర్తన133:1). దేవునికి ఐక్యత ఇష్టము, కొండెములు చెప్పువాని మీద ఆయన తీర్పు తీర్చును. కొండ మీద ప్రసంగములో "సమాధాన పరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురు" అని యేసయ్య చెప్పాడు.

2సమూ13లో దావీదు కుమారుడైన అబ్షాలోము సహోదరి అయిన తామారును, దావీదు ఇంకొక భార్య కుమారుడైన అమ్నోను మోహించగా, అది తప్పని సర్ది చెప్పాల్సిన యెహోనాదాబు (అమ్నోను స్నేహితుడు) అతనికి తప్పుడు సలహాలిచ్చి అబ్షాలోము అమ్నోను మధ్య భయంకరమైన శత్రుత్వము పుట్టేట్లు చేయగా, చివరికి అబ్షాలోము అమ్నోనును చంపుటకు దారితీసింది. అన్నదమ్ముల మధ్య జగడములు పుట్టించు వారిని ఈ కాలంలో మన చుట్టూ చూస్తున్నాము. ఈ అలవాటు దేవుని బిడ్డల మధ్యకు కూడా రావడము శోచనీయము. ఇటువంటి పరిస్థితి దేవునికి హేయమైనది.

పైన ధ్యానించుకున్న అంశములన్నింటిని మరొకసారి జ్ఞాపకము చేసికొని, దేవునికి హేయములైనవి మన జీవితంలో ఉండకూడదను గట్టి నిర్ణయము తీసికొని, ఆ నిర్ణయములో స్థిరంగా ఉందామా! దేవునికి హేయమైనవి వదిలేయాలంటే మనకు పరిశుద్ధాత్ముని సాయం కావాలి, కాబట్టి ప్రార్థిద్దాము. దేవుడు మనకు తోడై ఉండును గాక, ఆమేన్!

❖ ❖ ❖

# 7. క్షమాపణ ద్వారా వచ్చు ఆశీర్వాదములు

మానవాళి జీవితాలలో రక్షణ కార్యము జరిగిన విధానము మనము ధ్యానిస్తే, అందులో క్షమాపణ చాలా ప్రాముఖ్యమైన అంశముగా కనపడుతుంది. దేవుడు ఆదామును క్షమించి, అతని ద్వారా ఈ లోకవాసులందరికి సంక్రమించిన పాపముల నుండి విమోచనార్థము తన ఏకైక కుమారుని పంపాడు. దేవునితో సమాధానము కోల్పోయిన మానవాళిని తిరిగి సమాధాన పరచుకొనుటకు యేసుప్రభువును పంపాడు. దేవుడు మనలను క్షమించి మన పాపములను మనకు దూరపరచిన ప్రకారము మనము కూడా ఇతరులను క్షమించి, వారు మనపట్ల చేసిన తప్పును మరచిపోవాలి.

యెషయా 43:25లో దేవుడు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకుందాము :

“నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమములను తుడిచివేయుచున్నాను. నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను” అని వాగ్దానము చేస్తున్నాడు. మనము యేసుప్రభువు శిష్యులుగా ఉన్నప్పుడు ఆయనవలె ఉండుటకు ప్రయత్నము చేయాలి. ఆయన మన పాపములను తుడిచివేసి, ఇకపై జ్ఞాపకము చేసికొనను అని చెప్పి ఉండకపోతే, మన పరిస్థితి ఏమై ఉండేదో ఆలోచించాలి. మనలను క్షమించిన దేవుడు, మనము కూడా ఇతరుల తప్పులను క్షమించాలని ఖచ్చితంగా చెప్తున్నాడు : “మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు” (మత్తయి 6:14,15).

ఆయన క్షమించకపోతే మనము నిత్యనాశనానికి వెళతాము. క్షమాపణ లేకుంటే దేవునితో సహవాసము చేయలేమని ప్రభువు హెచ్చరిస్తున్నాడు. మనకు ఇతరులతో సమాధానము లేకుంటే దేవునితో సమాధానము కోల్పోతాము. దేవుడు చేసిన త్యాగము వ్యర్థమవుతుంది. క్షమాపణ ద్వారా ఒక విశ్వాసి దేవునితో సమాధానంగా ఉంటూ అత్యధిక ఆశీర్వాదాలు పొందుకొనుటకు అవకాశము కలుగుతుంది. లేఖనాలలో క్షమాపణ యొక్క ప్రాముఖ్యత పదే పదే చెప్పబడింది. క్షమాపణ గురించి చెప్పబడిన కొన్ని నిర్వచనములు :

- ❖ క్షమాపణ అంటే ఒక బాణాన్ని ఇంకెప్పుడూ తిరిగి రాలేనంత ఎత్తుకు, దూరానికి ఎక్కుపెట్టి వేయుట.
- ❖ క్షమాపణ అంటే మన ఇంటిలోని దుమ్ము, చెత్తను మూటగట్టి బయటపడవేసి ఇంటిని శుభ్రపరచుకొనుట.
- ❖ క్షమించుట అంటే మట్టి పాత్రను వెయ్యి ముక్కలుగా చేసి మళ్ళీ అతికించుటకు వీలుగాకుండా చేయడము.

రోమా 5:8లో 'మనము పాపులముగా ఉన్నప్పుడే ఆయన మన కొరకు చనిపోయాడని' వ్రాయబడింది. అది దేవుని కృప. అందుకే మన పట్ల ఎవరైనా తప్పుచేసి ఉంటే, వారు మనలను బాధించిన విషయము గుర్తుచేసుకొనే బదులు, దేవుని కృపయు, దయను, ప్రేమను గుర్తుచేసుకోవాలి. అప్పుడు మనము మరచిపోయి ముందుకు వెళ్లగలము. ఈ లోక ప్రకారము క్షమించినవాడు చేతగానివాడు, పగతీర్చుకొనేవాడే హీరో. దేవుని న్యాయము దానికి విరుద్ధంగా ఉంటుంది.

క్షమించుట ద్వారా వచ్చు ఆశీర్వాదములు జ్ఞాపకము చేసుకుందాము. ఇప్పటి వరకు ధ్యానించుకున్న భాగములో ఆశీర్వాదాలు చూసుకొని, మన ఆశీర్వాదాల జాబితా తయారు చేసుకుందాము.

**1. క్షమాపణ ద్వారా దేవునితో సమాధానము కలిగి ఉంటాము :** ఆదాము ద్వారా కోల్పోయిన సమాధానము తిరిగి పొందాలంటే మనుష్యులు మనపట్ల చేసిన అపరాధములను క్షమించాలి. దేవునితో సమాధానం లేకుంటే మనము పరలోకానికి పోలేము. ఈ లోకము శాశ్వతము కాదు కాబట్టి నిత్యజీవములో ప్రభువుతో కలిసి ఉండుటకు సిద్ధపడాలి. అందుకు ఒకే మార్గము దేవునితో సమాధానపడుట. ఉదాహరణకు దావీదు రాజు జీవితమును మనము జ్ఞాపకము చేసుకోవచ్చును. బెత్షెబతో పాపము చేశాక, తప్పు ఒప్పుకొని దేవునితో సమాధానపడినందున దేవుని హృదయానుసారుడైనాడు.

**2. క్షమాపణ ద్వారా మన మనసులోని చెత్తను బయట పడవేస్తాము :** క్షమించుట ద్వారా మన మనసు శుభ్రపరచబడుతుంది. పరిశుభ్రత, పరిశుద్ధత లేకుంటే మనము దేవుని చూడలేము (హెబ్రీ 12:14). అయితే పరిశుభ్రము చేయబడిన మన హృదయాలలో వాక్యము నింపుకోవాలి. నింపుకోకపోతే ఏమవుతుందో తెల్పుటకు యేసుప్రభువు ఒక ఉపమానము చెప్తున్నాడు. మత్తయి 12:43-45లో అపవిత్రాత్మ ఒక మనుష్యుని వదిలిపోయిన తరువాత, ఆ మనుష్యుడు తన హృదయము ఖాళీగా

ఉంచితే, ఆ అపవిత్రాత్మ తనకంటే చెడ్డవైన మరి ఏడు దయ్యములను వెంట బెట్టుకొని వస్తుంది. ఆ తర్వాత ఆ మనుష్యుని కడపటి స్థితి మొదటి స్థితి కంటె చెడ్డదగును అని చెప్పాడు. క్షమాపణ ద్వారా మనకు శుభ్రమైన మనసు అనే బహుమానము దొరుకుతుంది. దానిని వాక్యమనే యేసయ్యతో నింపుకోవాలి. "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మీ మనసాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును" (హెబ్రీ. 9:14).

**3. క్షమాపణ ద్వారా గతంలోని చేదు విషయాల నుండి విడుదల :** హెబ్రీ 12:15,16లో వ్రాయబడిన హెచ్చరిక ధ్యానిద్దాము. "మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలిచి కలవరపరచుట వలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు, ఒక పూట కూటి కొరకు తన జేష్టత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండునేమో అనియు, జాగ్రత్తగా చూచుకొనుడి". చేదు వేరు తనలో ఉంచుకున్నందున కయీను తన స్వంత తమ్ముడైన హేబెలును చంపుటకు వెనుదీయలేదు. క్షమాపణ లేని తనము వలన శాపము కొనితెచ్చుకున్నాడు. "దేశదిమ్మరిగా" ఉండమని దేవుడు శపించాడు.

**4. క్షమాపణ ద్వారా అపవాదిని ఎదిరించవచ్చును :** మన శత్రువులను, మనకు హాని కలిగించిన వారిని క్షమించి "పగ తీర్చుట నా పని" అని చెప్పిన దేవునికి అప్పగించాలి. చేదువేరు మన మనస్సులో ఉంచుకుంటే అపవాదికి తలుపు తెరచినట్లు అవుతుంది. క్షమించని గుణము అపవాది లక్షణము, కాబట్టి తనకు సంబంధించిన గుణాలు మనలో ఉంటే అపవాది మనలోకి వస్తాడు. క్షమాపణ లేని తనము మనకు రావలసిన ఆశీర్వాదాలను ఆపివేస్తుంది. కొలస్సీ 2:15లో పౌలు వ్రాసిన మాటలలో క్రీస్తు మన అపరాధములు క్షమించుట చేత, అపవాది నిరాయుధుడైనాడు. మన పట్ల కీడు చేసిన ప్రతి ఒక్కరిని మనము క్షమిస్తే, సాతాను భయపడడమే గాకుండా అతని శక్తి తగ్గిపోతుంది.

**5. క్షమాపణ వలన మనకు మనశ్శాంతి కలుగుతుంది :** క్షమాపణ అంటే మన మనసులో ఉన్న కోపము, బాధ తుడిచివేసి మరిచిపోవుట. ఒక వేళ జ్ఞాపకము వచ్చినను, దానితో పాటు అది కలిగించిన బాధ జ్ఞాపకము రాకుండుట. క్షమాపణ ఆత్మీయ ఎదుగుదలకు గుర్తు. బైబిలు నుండి ఒక వ్యక్తి జీవితము మీకు జ్ఞాపకము చేస్తాను. 2వ సమూయేలు గ్రంథములో అహీతోపెలు అను వ్యక్తిని చూడగలము.

అతను ఊరియా భార్యయైన బత్షెబ తండ్రియైన ఏలీయాముకు తండ్రి. తన మనుమరాలి పట్ల పాపము చేసి, ఆమె భర్తను చంపించి, ఆమెను వివాహమాడిన దావీదును అతను క్షమించలేక ఆ చేదు వేరు తన మనసులో పెట్టుకొని సమయము వచ్చినప్పుడు దావీదును నాశనము చేయాలనుకున్నాడు. 2సమూ 16:23 లో చూస్తే అతను ఆ దేశములో మంచి సలహాదారునిగా పేరు గడించి అతని ఆలోచనలు దేవుని ఆలోచనలై ఉన్నాయను భ్రమ ప్రజలలో కలిగించాడు. దావీదు, అతని కుమారుడు అబ్షాలోము కూడా అలాగే ఎంచుచుండిరి. దావీదుపై కక్షతో అబ్షాలోము చేత చేయరాని పాపములు చేయించి, తండ్రి కొడుకుల మధ్య యుద్ధము కలుగ జేస్తాడు. ఆ యుద్ధములో అబ్షాలోము చనిపోయిపనప్పుడు తన పన్నాగము బెడిసికొట్టిందని తెలుసుకొనిన అహీతోపెలు ఉరిపోసికొని చనిపోయాడు (2సమూ17:23). దావీదును క్షమించి ఉంటే తాను సంతోషంగా ఉండి, తన ముదిమనుమడైన సొలొమోను రాజగుట చూచి ఉండవచ్చును. క్షమాపణ ద్వారా సంతోషము పొందుకోగలరు.

**6. క్షమాపణ వలన ఆరోగ్యము పొందుకుంటారు :** మన మనసులో ఉన్న ద్వేషము, కోపము ఆరోగ్యాన్ని క్షీణింప చేసి మనలను నెమ్మదిగా మరణానికి తీసికెళ్తాయి. కొన్ని వాక్యభాగాలు చూద్దాము.

సామెతలు 12:25 – "ఒకని హృదయములోని విచారము దాని క్రుంగ జేయును".

కీర్తనలు 31:9,10 – "విచారము వలన నా కన్ను క్షీణించుచున్నది. నా ప్రాణము నా దేహము క్షీణించుచున్నవి. ...నా యెముకలు క్షీణించుచున్నవి".

కీర్తన 37:8 లో ఉన్న ఒక సలహా : "కోపము మానుము, ఆగ్రహము విడిచి పెట్టుము, వ్యసనపడకుము అది కీడుకే కారణము, కీడు చేయువారు నిర్మూల మగుదురు".

**7. క్షమాపణ వలన దేవుని పూర్ణ హృదయముతో స్తుతించగలము :** సామెతలు 15:13 లో "మనోదుఃఖము వలన ఆత్మ నలిగిపోవును" అని వ్రాయబడి ఉంది. ఆత్మ నలిగినప్పుడు దేవుని సంతోషముగా ఆరాధించలేము.

క్షమాపణ ద్వారా వచ్చు అశీర్వాదములు జ్ఞాపకము చేసుకున్న మనము అన్ని ఆశీర్వాదములు పొందుకొనుటకు సిద్ధపడుదామా! దేవుడు మనకు తోడైఉండును గాక ! ఆమేన్ !

❖ ❖ ❖

# 8. బైబిల్‌లో దేవుని ప్రణాళిక

బైబిలు దేవుడు మానవునికిచ్చిన వరం. దుఃఖంలో ఉన్నవారిని ఓదారుస్తుంది, ఇందులో సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ధైర్యాన్నిస్తుంది. మనమంతా పాపమనే చీకటి నుండి బయటపడి దేవుని పిల్లలుగా జీవించడానికి సహాయపడు తుంది.

బైబిలు ఒక పెద్ద గ్రంథముగా కనబడుతుంది. కాబట్టి దానిని చదవాలంటే చాలా కష్టం అనుకుంటాము. కాని దానిలో ఉన్న దేవుని ప్రణాళిక తెలుసుకుంటే ఇష్టముగా చదువుతాము. ముందుగా తెలుసుకొనవలసినదేమంటే బైబిలు - సృష్టికర్తయైన ఏకైక పరిశుద్ధ దేవుని గురించి వ్రాయబడిన ఒక పరిశుద్ధ గ్రంథము. మానవుని అవసరత, దేవుని సమకూర్పును గురించి వ్రాయబడిన గ్రంథము.

**ముందుగా బైబిలు నిర్మాణము తెలుసుకుందాం!**

ఇందులో 66 పుస్తకాలున్నాయి. 40 మంది వివిధ రంగాలలో నుండిన వారు 1600 సంవత్సరముల కాలపరిధిలో దైవావేశము వలన వ్రాసిన గ్రంథము. ఇది రెండుగా విభజింపబడినది. పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన.

పాత నిబంధనలో 39 పుస్తకములు, క్రొత్త నిబంధనలో 27 పుస్తకములున్నాయి.

**పాత నిబంధన విభజన విధానము :** (5-12-5-5-12) పంచకాండాలు-5, చరిత్ర గ్రంథాలు -12, కావ్యగ్రంథాలు-5, పెద్ద ప్రవక్తలు - 5, చిన్న ప్రవక్తలు- 12.

**క్రొత్త నిబంధన విధానము :** (4-1-21-1) సువార్తలు-4, చరిత్ర గ్రంథము- 1, పత్రికలు- 21, ప్రవచన గ్రంథము - 1. ఈ పుస్తకములలో ఏమున్నదో క్లుప్తంగా తెలుసుకుంటే సులభంగా అర్థమవుతుంది.

**ఆదికాండము :**

ప్రతిదాని యొక్క ఆరంభం ఇందులో ఉన్నది. ఆరంభముల గ్రంథము. 1,2 అధ్యాయాలలో పరిపూర్ణత, సమాధానము కనపడుతుంది. ఎందుకంటే అప్పటి వరకు ఆది మానవులైన ఆదాము, హవ్వలు అపవాది శోధనలో పడిపోలేదు. 3వ అధ్యాయములో అపవాది ద్వారా పాపము ప్రవేశించుట వలన మానవుడు దేవునితో సమాధానము, సహవాసము కోల్పోయి ఆత్మీయంగా చనిపోయాడు. ఆ సమస్యకు ఆదికా. 3:15లో దేవుడే పరిష్కారము చూపిస్తాడు. దేవుడు అపవాదితో అంటున్నాడు: "నీకును స్త్రీకిని, నీ సంతానమునకు ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదవని చెప్పెను". ఈ వాగ్దానము నెరవేర్పు బైబిలంతా కనబడుతుంది. ఆదికా. 12వ అధ్యాయంలో అబ్రాహాము అను ఒక మనిషిని ఏర్పాటు చేసుకొని, అతనితో నిబంధన చేసి, అతని ద్వారా తన వాగ్దానము నెరవేర్చుకోవాలనే ప్రణాళిక తయారు చేశాడు. అబ్రాహాముతో చేసిన నిబంధన –షరతులులేని నిబంధనలో నిన్నొక గొప్ప జనాంగముగా చేసెదనని ఒక గొప్ప దేశము నిస్తాననియు, నీ ద్వారా సకల ప్రపంచము ఆశీర్వదింప బడుతారనియు 3 వాగ్దానాలను దేవుడిచ్చాడు. ఈ వాగ్దానములు ఏవిధంగా నెరవేర్పు జరుగుతాయి అనే విషయాలలో బైబిలు నిండి ఉన్నది. ఆది కాండము చివరికొచ్చేసరికి అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపులు ఐగుప్తు దేశములో కనబడుతారు.

**నిర్గమకాండము :**

ఈ పుస్తకములో ఇశ్రాయేలీయులు 70 మంది మాత్రమే ఉన్నారు. గొప్ప జనాంగముగా చేస్తానన్న దేవుని వాగ్దానమింకా నెరవేరలేదు. మొదటి అధ్యాయములోనే వారిని దేవుడు గొప్ప జనాంగముగా వర్థిల్లుచేయుట చూడగలము. తర్వాత వారు ఐగుప్తు బానిసత్వము క్రిందకు వెళ్లి చాలా శ్రమలను భరిస్తారు. దేవుడు వారి మొఱ్ఱనాలకించి మోషే అను ఒక నాయకుని లేపి అతని ద్వారా వారిని బానిసత్వము నుండి విడుదల చేయించి వాగ్దాన దేశము వైపు నడిపిస్తాడు. తన పేరు పెట్టబడిన తన జనులు వాగ్దాన దేశములో ప్రవేశించక ముందు దేవుడు వారికి ధర్మశాస్త్రము ననుగ్రహించి, వారితో షరతులతో కూడిన నిబంధన చేసుకున్నాడు. ధర్మశాస్త్రములోని ఆజ్ఞలన్నింటిని పాటిస్తేనే ఆశీర్వా దాలు వస్తాయని చెప్పాడు. ఐగుప్తు నుండి నిర్గమము జరుగుట నిర్గమకాండములో చూస్తాము.

**లేవీయకాండము:** పాపులైన ప్రజలు పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వెళ్ళాలంటే పశ్చాత్తాప హృదయముతో బలి పశువుల రక్తముతో వారి పాపములు కప్పుకొని పోవుటకు దేవుడు అవకాశము కల్పించాడు. ఇది తాత్కాలిక పరిష్కారము. శాశ్వత పరిష్కారము యేసు ప్రభువు రక్తము ద్వారా మాత్రమే వస్తుంది. లేవీ గోత్రపు వారు యాజకులుగా చేయబడి వారి ద్వారా ఈ బలులు అర్పించుట మొదలుపెట్టారు. లేవీయులు బలులు ఏ విధంగా అర్పించాలి అనే ఆజ్ఞలతో ఈ గ్రంథము నిండి యున్నది.

## సంఖ్యాకాండము :

ఇందులో రెండు జన సంఖ్యలున్నాయి. 13,14 అధ్యాయాలలో మోషే వాగ్దాన దేశమును వేగు చూచుటకు 12మందిని పంపినప్పుడు కాలేబు, యెహోషువా తప్ప మిగిలిన 10 మంది వ్యతిరేక సమాచారము తెచ్చినందున ప్రజలందరు తిరుగుబాటు చేసి దేవునికి విరోధముగా సణిగినందుకు, దేవుడు వారినందరినీ దారిలోనే రాలిపోచేసినాడు. రెండవతరము వారు మాత్రమే వాగ్దాన దేశములోనికి వెళ్లారు. ఐగుప్తు దేశమునుండి బయటకు వచ్చిన వారికి ఒక జనసంఖ్య, వాగ్దాన దేశములోనికి వెళ్లిన వారిది రెండవ జనసంఖ్య.

## ద్వితీయోపదేశ కాండము :

రెండవ తరము వారికి రెండవసారి ధర్మశాస్త్రమును మోషే బోధించుట, ఇంతటితో పంచకాండాలు ముగిశాయి.

## 12 చరిత్ర గ్రంథాలు:

**యెహోషువ:** వాగ్దాన దేశమును స్వాధీన పరుచుకొనుటకు విజయాల గ్రంథము.

**న్యాయాధిపతులు:** అపజయాల గ్రంథము. మోషే తదనంతరము ఇశ్రాయేలు ప్రజలకు నాయకుడు లేని కారణాన, వారంతా దేవునికి విరుద్ధంగా జీవించుట మొదలుపెట్టినప్పుడు దేవుడు కోపగించుకొని వారిని శత్రురాజులకు అప్పగించేశాడు. ప్రేమగల దేవునికి వారు మొరపెట్టుకోగానే వారి కొరకు ఒక న్యాయాధిపతిని లేపి వారిని రక్షించాడు. ఈ పుస్తకములో 13 మంది న్యాయాధిపతులను మనము చూడగలము.

**రూతు:** ఇప్పటి వరకు దేవుడు 2 వాగ్దానాలు నెరవేర్చాడు. మూడవది అబ్రాహాము ద్వారా సకల లోకము ఆశీర్వదించబడుట. ఇందులో భాగంగా మోయాబీయురాలైన రూతును ఎన్నుకొని ఆమెను యేసుప్రభువు వంశావళిలోనికి కూడా చేర్చాడు. అన్యురాలైన ఈమెను దేవుని నిబంధన రాజైన దావీదు పితరుల జాబితాలోనికి తెచ్చాడు.

**1,2 సమూయేలు గ్రంథములు:** ఇశ్రాయేలీయుల అభీష్టము మేరకు దేవుడు వారికి రాజును ఏర్పాటు చేశాడు. మొదటి రాజు సౌలు, అతను దేవునికి వ్యతిరేకముగా జీవించుటచేత, దేవుడు దావీదును రాజుగా అభిషేకించాడు.

అతనితో దేవుడు చేసిన షరతులు లేని నిబంధన 2సమూ 7:14లో చూడవచ్చు. దావీదు కుమారుడైన సొలొమోను పాలన వరకు వాగ్దాన దేశము ఒకే రాజ్యముగా ఉండేది. కాని అతని కుమారులైన రెహబాము కాలంలో వారు చేసిన విస్తార పాపముల వలన రాజ్యము విభజింపబడుతుంది.

**యోబు:** ఇందులో దేవుని సార్వభౌమత్వము విశదీకరించ బడియున్నది.

**కీర్తనలు :** దావీదు మహారాజు రచించినది ఎక్కువ స్తుతి – ఆరాధన, కృతజ్ఞత, ప్రార్థన, ధైర్యము, విశ్వాసము ఈ కీర్తనలలో కనబడతాయి.

**సామెతలు:** జ్ఞానమును గురించి, నిర్మొహమాటంగా ప్రజల తప్పులు చూపించుట.

**ప్రసంగి :** జీవితానికి అర్థము వెదుకుట దేవునిలోనే కనపడుతుంది.

**పరమగీతము:** వివాహము, ప్రేమ గురించిన అనుభవజ్ఞానము.

**1,2 రాజుల గ్రంథములు:** రాజ్య విభజన – ఇశ్రాయేలు అను తూర్పు రాజ్యములో 10 గోత్రములవారు, యూదా అను పడమటి రాజ్యంలో 2గోత్రములు వారు ఉన్నారు. వీరందరూ దేవునికి విరోధముగా జీవించుట చేత వారిని శిక్షించుటకు దేవుడు వారిని శత్రురాజులకు అప్పగించాడు. క్రీ.పూ. 722 సం॥ అష్షూరీయులు ఇశ్రాయేలీయులను చెరలోనికి తీసుకొని వెళ్ళగా, 586 క్రీ.పూ.లో బబులోనీయులు యూదాదేశపు వారిని బందీలుగా చెరగొని పోయిరి.

**ప్రవక్తల గ్రంథములు:** రాజులు కాలంలో ప్రవక్తలు కనబడతారు. ఇశ్రాయేలీయులు చేస్తున్న నీతిమాలిన పనులను ఆక్షేపిస్తూ, దేవుని ఉగ్రత గురించి హెచ్చరిస్తూ దేవుడు చేసిన మేలులను గుర్తు చేస్తూ మారుమనసు పొంది దేవుని యొద్దకు రమ్మని

ప్రతిమాలుతూ దేవుని ప్రవచనాలను జనుల మధ్యకు తీసుకొచ్చారు. వారికి రాబోయే శిక్షలను గురించి చెప్పినను వారు మారకపోవుటచేత వారిని దేవుడు శత్రురాజులకు అప్పగించాడు. వారు తిరిగి మొఱ్ఱపెట్టి నప్పుడు, శత్రురాజుల మనసు కరిగించి, వారి ద్వారానే విడుదల వచ్చేటట్లుగా దేవుడు ఏర్పాటు చేశాడు.

**1,2 దినవృత్తాంతములు:** ఈ గ్రంథములలో ఇవన్ని రెండవసారి వ్రాయబడ్డాయి.

**ఎజ్రా:** ఎజ్రా ఆధ్వర్యంలో బబులోను చెరనుండి కొందరు యూదులను యెరూషలేముకు తోడుకొని వెళ్ళి వారికి ధర్మశాస్త్రము బోధించుట.

**నెహెమ్యా:** అర్తహషస్త రాజు అంగీకారముతో బబులోను నుండి వెళ్ళి యెరూషలేము ప్రాకారములు 52 దినాలలో పునర్నిర్మించుట చూడగలము.

**ఎస్తేరు:** బబులోను రాజ్యములో మిగిలిపోయిన కొందరు యూదులను హామాను సంహరించాలనుకున్నప్పుడు దేవుడు మొర్దెకై మరియు ఎస్తేరు రాణి ద్వారా రక్షించాడు.

ఈ విధముగా పాత నిబంధన ముగించబడినది.

పాత నిబంధనకు, క్రొత్త నిబంధనకు మధ్యలో దాదాపు 400 సం॥ నిశ్శబ్ద సమయం. ఈ సమయంలో దేవుడు తన వాగ్దానము మరువక వారి కొరకు విమోచకుని పంపుటకు మార్గము ఏర్పాటు చేశాడు. క్రీ.పూ. 334లో అలెగ్జాండరు చక్రవర్తి గ్రీకు సంస్కృతితో బాటు గ్రీకు భాషను వ్యవహారిక భాషగా చేశాడు. క్రీ.పూ. 65లో రోమా ప్రభుత్వము వచ్చాక ప్రయాణ, రవాణా సౌకర్యములు ఏర్పాటు చేయుట వలన యేసు ప్రభువు వచ్చాక సువార్త సకల లోకాలకు ప్రకటించబడుటకు సులభమైంది.

క్రొత్త నిబంధనకు వస్తే 4 సువార్తలలో యేసు ప్రభువును గురించిన వివరాలున్నాయి. ప్రతి సువార్తికుడు ఆయనను వేరు వేరుగా చిత్రీకరించుటచేత అన్ని కలిపి చదివినప్పుడు పూర్తి చిత్రము కనపడుతుంది.

**మత్తయి:** రారాజుగాను,

**మార్కు:** సేవకునిగా

**లూకా :** మనుష్యకుమారునిగాను

**యోహాను:** దైవకుమారునిగాను యేసుక్రీస్తు ప్రభువువారిని చిత్రీకరించారు.

**అపొస్తలుల కార్యములు:** ఇశ్రాయేలీయులు ద్వారా సకల జనులు ఆశీర్వదింప బడాలని దేవుని ప్రణాళిక ఉండగా, యూదులు యేసు ప్రభువును విసర్జించి, సిలువ వేయుట చేత, వారిని ప్రక్కన ఉంచి, దేవుడు తన ప్రణాళిక నెరవేర్పు కొరకు సంఘమును లేపుట చూస్తున్నాము. అపొ.కా. 2వ అధ్యాయంలో పెంతెకొస్తు దినమందు పరిశుద్ధాత్మ శిష్యుల మీదికి వచ్చినప్పుడు సంఘము ప్రారంభించ బడింది. అపొ.కా.లో 38 సం॥ల సంఘ చరిత్ర గ్రంథస్థము చేయబడి ఉంది. ప్రపంచవ్యాప్తంగా శిష్యుల ద్వారా సువార్త ప్రకటించబడినది. దేవుడు పౌలును అన్యుల మధ్య సువార్త ప్రకటించుటకు ఏర్పరచుకొని ఆయన ద్వారా ఎన్నో సంఘములు స్థాపించాడు.

**21 పత్రికలు:** పత్రికలలో ఎక్కువ భాగము పౌలు వ్రాసినవి, మిగిలినవి పేతురు, యోహాను, యాకోబు, యూదా వ్రాశారు. ఈ పత్రికలలో వారు స్థాపించిన సంఘ సభ్యులు వారి వారి విశ్వాసము నుండి జారిపడకుండ స్థిరంగా ఉండుటకుగాను వారికి యేసుప్రభువు నేర్పించిన సిద్ధాంతాలు, వారి అనుదిన జీవితాలలో పాటించ వలసిన విషయాలు వ్రాశారు. పౌలు పత్రికలలో విశ్వాసము గురించి, పేతురు పత్రికలలో నిరీక్షణ, యోహాను పత్రికలలో ప్రేమ, యాకోబు పత్రికలో నడివడిక, యూదా పత్రికలో పరిశుద్ధత గురించి వ్రాశారు.

**ప్రకటన గ్రంథము:** ఈ చివరి పుస్తకములో యోహాను భక్తునికి దేవుడు చూపించిన పరలోక దర్శనము గ్రంథస్థము చేయబడి ఉంది. ఇందులో ప్రభువు రెండవ రాకడ గురించి, వెయ్యేండ్ల పాలన గురించి విశదంగా వ్రాయబడి ఉన్నది. ఆదికాండము మొదటి రెండు అధ్యాయాలలో ఉన్న సంపూర్ణత, సమాధానము తిరిగి ఇవ్వబడుతుంది. పోగొట్టుకొనిన వాటినన్నింటిని దేవుడు తిరిగి మనకు అనుగ్రహించుట చూడగలము. దేవుడు తన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చి పడిపోయిన మానవాళిని తన కుమారుని ద్వారా తనతో సమాధానపరుచుకొని, పాపములకు అధిపతి అయిన అపవాదిని సమూలంగా నాశనముచేసి, ఏదెను వనములోని అనుభవములోనికి తీసుకొని వచ్చుటతో మనము నిత్య జీవితములోనికి చేర్చబడెదము.

బైబిలు అంతటిలో ఉన్న దేవుని ప్రణాళికను సంపూర్ణముగా అర్థము చేసికోవాలనుకొంటే పరిశుద్ధ గ్రంథము చదవండి. ఇది దేవుడు మానవాళికి వ్రాసిన ప్రేమలేఖ. చదివి ధన్యులుకండి!

❖ ❖ ❖

# 9. పౌలు బోధించిన మానవశాస్త్రం

పౌలు తన పత్రికలలో మానవ స్వభావములను గురించి బోధించిన కొన్ని సంగతులు ధ్యానించుకుందాము. వేదాంత శాస్త్రములో "మానవ శాస్త్రము" అను విభాగమున్నది. దానిని గురించి మనము ధ్యానించుకొనడము లేదు, కాని పౌలు తన పత్రికలలో వివిధరకాల మనస్తత్వాలను గురించి ఏమి వ్రాశాడో చూద్దాము.

మానవులను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చును - మొదటి మానవుడైన ఆదాముకు చెందినవారు, రెండవ మానవుడైన (కడపటి ఆదాము అని చెప్పబడి ఉంది) యేసుప్రభువుకు చెందిన వారు. క్రైస్తవులకు మధ్యే మార్గము లేదు. ఏదో ఒక వర్గానికి చెందినవారై యుండాలి. ఆదాము పాపము చేసి అపవాది శిష్యుడైనాడు కాబట్టి ఆదాము గొడుగు క్రింద ఉన్న మొదటి రకము వారు అపవాదికి చెందినవారు. యేసును ప్రభువుగా స్వీకరించి, నోటితో ఒప్పుకొని రక్షణ పొంది యేసయ్య గొడుగు క్రిందకు వచ్చిన రెండవ రకము వారు యేసయ్యకు చెందినవారు. ఈ రెండురకాల మనుష్యులను గురించి పౌలు 1 కొరింథీ15:45లో ఈ విధంగా చెప్పాడు - "ఆదాము మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడి యున్నది.  కడపటి ఆదాము జీవింపజేయు ఆత్మ ఆయెను". వీరిని గురించి ఇంకా కొన్ని విషయాలు కూడా మనం ఇక్కడ గమనించవచ్చును. 47-49 వచనాలలో ఈ రెండు రకాల మనుష్యులను గురించిన కొన్ని లక్షణాలు పౌలు ఇచ్చాడు. మొదటి మనిషి భూ సంబంధి - మంటినుండి వచ్చాడు, కాని రెండవ మనుష్యుడు పరలోకం నుండి వచ్చాడు. మొదటి మనిషిని అనుసరించువారు భూసంబంధులు, ఆదాము పోలికలో ఉంటారు. రెండవ ఆదామును (క్రీస్తును) అనుసరించువారు పరలోక సంబంధులుగా ఉండి ఆయన పోలికను కలిగియుంటారని, నిత్యజీవములోనికి వెళ్తారనియు చెప్తున్నారు.

మొదటి మానవుడైన ఆదాము, కడపటి ఆదామైన యేసుప్రభువును గురించి ఈ మాటలు చెప్పిన పౌలు ఇంకా 5 రకల మనస్తత్వాలను గురించి చెప్పి వాటిలో

3 లక్షణాలు మొదటి గుంపు వారిలో ఉంటాయనియు, మిగిలిన 2 లక్షణాలు యేసుప్రభువును వెంబడించేవారికి ఉంటాయనియు చెప్తున్నాడు. వీటిని గురించి మనము ధ్యానించుకొని, మనము ఏ కోవకు చెందినవారమో, మనలో ఏ మనస్తత్వమున్నదో నిర్ణయించుకొని మనలను మనము సరిదిద్దుకొందాము.

**1. ప్రాచీన పురుషుడు :** ఎఫెసీ 4:22లో ప్రాచీన స్వభావము కలవాడు మోసకరమైన దురాశవలన చెడిపోయిన వాడని పౌలు చెప్తున్నాడు. హవ్వను అపవాది మోసగించినప్పుడు, మోసకరమైన మాటలు చెప్పి ఆమెలో దురాశపుట్టించి పాపకూపములోకి లాగాడు. దేవుడు వద్దన్న ఫలము తింటే, వారి కన్నులు తెరవబడి, మంచి చెడ్డలు తెలుసుకొని, దేవదూతల వలె అవుతారని చెప్పినప్పుడు ఆ దుర్బోధ విని, దురాశకు లోనై మానవాళినంతటిని శాపానికి గురి చేసింది. ఆదాము హవ్వలు చేసిన పాపము సకల మానవులకు సంక్రమించినందున ప్రాచీన స్వభావము పుట్టుకతోనే కలిగియుంటారు.

**2. నవీన పురుషుడు :** ఎఫెసీ 4:24లో పౌలు నవీన స్వభావము ధరించుకొనిన వారు ఏ విధంగా ఉంటారో వివరిస్తున్నారు. ఎప్పుడైతే యేసుక్రీస్తును ప్రభువుగా అంగీకరించి ఆయన నామములో రక్షణ ఉందని నోటితో ఒప్పుకుంటారో వారు నూతనపరచబడి నవీన స్వభావము కలిగియుంటారు. 2కొరింథీ 5:17లో చెప్పబడిన ప్రకారము "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి". ఈ విధంగా మారినవారు "చిత్తవృత్తి యందు నూతనపరచబడినవారై, నీతియు, యథార్థమైన భక్తియు గలవారై" ఉందురు. ఆదియందు మానవుని దేవుడు తన పోలికలో సృష్టించాడు. మారిపోయిన నవీన పురుషుడు తిరిగి దేవుడు ఆదిలో ఇచ్చిన స్వభామును ధరించుకొంటాడని పౌలు అంటున్నాడు. బట్టలు ధరించుకున్నట్లుగా ఒక స్వభావము ధరించుకోవడమంటే సంపూర్ణముగా అందులో ఇమిడిపోయి ఉండుట. ఈ నవీన పురుషుడు క్రీస్తు సారూప్యములోనికి మారుట వలన తన పాత స్వభావము నుండి పూర్తిగా తొలగిపోయి దేవునికి సమీపంగా జీవిస్తాడు. "నేను క్రీస్తును పోలి నడుచుచున్న ప్రకారము నన్ను పోలి మీరు నడుచుకొండని" పౌలు చెప్పినట్లు చెప్పగలడు.

రక్షణ పొందిన ఒక విశ్వాసి జీవితంలో ప్రాచీన స్వభామునకు, నవీన స్వభావమునకు నిరంతర పోరాటము జరుగుతూ ఉంటుంది. దీనిని గురించి అర్థము చేసికొనుటకు ఒక చిన్న దృష్టాంతము చూద్దాము. ఒక వ్యక్తి రచ్చబండపైన కూర్చుని తనతో పాటు తెచ్చుకున్న ఒక తెల్లపిల్లికి, ఒక నల్లపిల్లికి పోటీలు పెట్టి ప్రజలకు

వినోదం కల్పించేవాడు. ఏ పిల్లి గెలుస్తుందో చెప్పమనేవాడు. తాను తెల్లపిల్లిని గెలిపించానుకున్నప్పుడు నల్లపిల్లిని పస్తుపెట్టేవాడు, నల్లపిల్లిని గెలిపించాలంటే తెల్లపిల్లిని పస్తు పెట్టేవాడు. మనము కూడా మనలో ఉన్న నవీన స్వభావమును లయపరచుట కొరకు ప్రాచీన స్వభావమును పస్తు పెట్టాలి. అది నీరసించిపోయేటట్లు చేసుకోలేకపోతే క్రీస్తు సారూప్యములోనికి రావడము అసాధ్యము.

**3. ప్రకృతి సంబంధి :** ఇతడిని గురించి 1 కొరింథీ. 2:14లో పౌలు వివరించాడు. ఇతడు దేవుని విషయాలు అంగీకరింపడు, ఆత్మానుభవము ఉండదు కాబట్టి దేవుని విషయాలు గ్రహించలేడు. ఉదాహరణకు ఆదికాండము 19లో వివరించబడిన సొదొమ గొమొఱ్ఱా పట్టణస్థులు. వారు దేవునికి విరోధముగా అనేక పాపములు చేయుట వలన దేవుడు వారిని నాశనము చేయుటకు నిశ్చయించుకున్నాడు.

**4. ఆత్మ సంబంధి :** ఈ స్వభావము గల మనిషిని గురించి 1 కొరింథీ. 2:15లో పౌలు చెప్పాడు. ఇతడు తనలోని నవీన స్వభావమును బాగా అభివృద్ధి పరచుకొని దేవుని హత్తుకొని జీవించెడివాడు. ఆత్మానుభవము కలిగియుండుట చేత అన్నిటిని అర్థము చేసుకోగలడు. ఎవరూ తప్పుపట్టుటకు వీలులేని జీవితము జీవిస్తాడు. ఉదాహరణకు అబ్రాహామును తీసుకొనవచ్చును. విశ్వాసులకు తండ్రిగా పేరు పొందిన అబ్రాహాము విధేయత చూపించి, దేవుని చిత్తప్రకారము నడిచాడు. దేవునితో స్నేహము చేసి ఆశీర్వాదములు పొందాడు. ఆయన ద్వారా దేవుడు సకల మానవాళిని దీవించాడు.

**5. శరీర సంబంధి :** ఇతనిని గురించి 1 కొరింథీ 3:1లో పౌలు వివరించాడు వీరు దేవుని గురించి తెలిసికొని కూడా ఆత్మీయంగా ఎదగలేదు. వీరిని పౌలు "క్రీస్తు నందు పసిబిడ్డలు" అంటున్నాడు. క్రీస్తును ఎరిగారు కాని ప్రాచీన స్వభావము వదలలేక ఉన్నవారు. ఇటువంటి వారికి ఉదాహరణగా లోతును తీసుకోవచ్చు. ఇహలోక సంబంధమైన వాటియందు ఎక్కువ ఆశపెట్టుకొని, చాలా సంపాదించుకొన్నాడు. కాని ఏమీ మిగుల్చుకోలేక పోయాడు. వ్యక్తిగా తాను రక్షింపబడ్డాడు కాని అన్నీ పోగొట్టుకున్నాడు.

మనము గమనించిన 5 వ్యక్తిత్వాలలో నవీన పురుషుడు, ఆత్మ సంబంధి మాత్రమే రెండవ ఆదాము గొడుగు క్రిందకు చేరినవారు. మిగిలిన వారంతా మొదటి ఆదాము సంబంధులే. మనము రూపాంతరము చెంది రెండవ ఆదాము గొడుగు క్రిందకు పోకుంటే ప్రయోజనమేమీ ఉండదు. మనమంతా జన్మత: పాపులమే అను

విషయము అర్థము చేసుకోవాలి. ఈ సత్యము సరిగ్గా గ్రహించిన దావీదు "నేను పాపములో పుట్టినవాడను, పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను" (కీర్తన 51:5) అన్నాడు.

మనమంతా స్వతహాగా స్వార్థపరులముగా ఉన్నాము. కాని క్రీస్తు గొడుగు క్రిందకు వస్తే "స్వ"అనేది మన మనసులో నుండి తీసివేసి "క్రీస్తు"ను మన మనసులో ప్రతిష్టించుకుంటాము.. అప్పుడు ఒకరియందు ఒకరు దయచూపుచు నిజమైన భక్తిగల వారిగా ఉండగలము. "భక్తిహీనతలను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ" (తీతు 2:12) కలిగి ఉంటాము. ఎందుకంటే "దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమును గల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనము గల ఆత్మనియ్యలేదు" (2తిమోతి 1:7). మనము ఆదాము గొడుగు క్రిందనే ఉండాలని దేవుడు ఆశించడములేదు.

ఆదాము గొడుగు క్రింద ఉన్నవారు అపవాది ఆధీనంలో ఉండి "స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, ధూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞతలేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటే సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు" అని 2తిమోతి 3:2,3లో పౌలు చెప్తున్నాడు. శరీర సంబంధి చేస్తున్న పాపముల జాబితా చదివితే ఒకటి, రెండైనా ఎంత మంచి వారిలోనైనా కనబడుతాయేమో అని నాకు అనిపిస్తుంది. అందుకే యేసుక్రీస్తును ధరించుకొనడము సులభము కాదు. ఇరుకుమార్గములో వెళుతూ పైన చెప్పబడిన భారాలన్నీ వదిలించుకోవాలి. అప్పుడే మనము ఆత్మ సంబంధులముగా యేసయ్య గొడుగు క్రిందకు రాగలము.

ప్రకృతి సంబంధులుగాను, శరీర సంబంధులుగాను, ప్రాచీన స్వభావముతోనే ఉంటే యేసుప్రభువు ద్వారా నిత్యజీవమునకు వెళ్లుట అసాధ్యము కాబట్టి ఈ సంగతులు తెలుసుకున్న వారంతా జాగ్రత్తగా ఉండాలని మనవి చేసుకుంటూ ముగిస్తున్నాను. దేవునికి మహిమ కలుగును గాక. ఆమేన్!

❖ ❖ ❖

# 10. ప్రభువును కనుగొనుట

మన విశ్వాస జీవితములో ప్రభువును కనుగొనే కార్యక్రమము చేపడుదాము. ఆయనను కనుగొన లేకపోతే మనము పూర్ణహృదయముతో పూర్ణ మనస్సుతో, పూర్ణ బలముతో ఆరాధించలేము, యేసు ప్రభువు మనకిచ్చిన రెండు ముఖ్యమైన ఆజ్ఞలలో మొదటిది పాటించలేము. మనము ఆయనను కనుగొంటే ఆయనను ప్రేమిస్తాము. ఆయనను సేవించాలనే ఆశను కలిగి ఉంటాము.

యిర్మీయా 29:13-14లో దేవుడు చెప్పిన మాటలు: "మీరు నన్ను వెదికిన యెడల, పూర్ణ మనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు. నన్ను నేను మీకు కనుపరచుకొందును". వెదికితే దొరుకుతాడు; దొరికితే కనుగొంటాము; కనుగొంటే ప్రేమిస్తాము. ప్రేమిస్తే సేవిస్తాము. అందుకే వెదకి కనుగొనే పని మొదలెడుదాము.

కొలస్సీ 1:15,16వచనాలలో పౌలు దేవుని గొప్పతనము వివరిస్తూ ఇలా వ్రాస్తున్నాడు: "ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవి గాని, అదృశ్యమైనవి గాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయన యందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను". ఆయన గొప్పతనము తెలుసుకుంటేనే ఆయనను ప్రేమించగలము. దేవునితో సాన్నిహిత్యము పెంచుకునే కొలది ఆయనను సేవించాలనే ఆశ మనలో కలుగుతుంది. కోరహు కుమారులు చెప్పినట్లుగా "దుప్పి నీటి వాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది. నా ప్రాణము దేవుని కొరకు తృష్ణగొనుచున్నది" (కీర్తన 42:1) అని చెప్పగలము.

యేసు ప్రభువు తన మూడున్నర సంవత్సరాల పరిచర్యలో తాను ఏర్పరచుకొని, తనతో నిత్యము ఉంటున్న తన శిష్యులు తనను గురించి తెలుసుకోవాలని ఆశించాడు. రాబోవు సంవత్సరములలో వారు సువార్త బోధించవలసి యుండగా, వారు తనను

పూర్తిగా తెలుసుకోలేక పోతే, తన ప్రణాళిక వారు నెరవేర్చలేరని యేసయ్యకు తెలుసు. అందుకే ప్రతి బోధ, ప్రతి ఉపమానము అర్థమయ్యే రీతిగా వారికి చెప్పాడు. తర్వాత వారిని ఒక ప్రశ్న అడుగుతున్నాడు. "మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారు?" (మత్తయి 16:15). ఈ ప్రశ్న విశ్వాసులందరినీ దేవుడు అడిగే ప్రశ్న. మనము సంపూర్ణముగా ప్రభువును తెలుసుకుంటే గాని ఈ ప్రశ్నకు సమాధానము ఇవ్వలేము. యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతానికి వచ్చి ఈ ప్రశ్న అడుగుతున్నాడు. ఈ కైసరయ యెరూషలేముకు 120 మైళ్ల దూరంతో పాలస్తీనాకు ఉత్తర దిక్కున ఉంది. ఈ ప్రాంతము చాలా రకాల మతాలకు ప్రసిద్ధి గాంచింది. విగ్రహారాధన చాలా ఎక్కువగా ఉన్న పరిస్థితి. అన్యుల ఆచారాలతో నిండి ఉన్న ప్రాంతంలో నిలిచి యేసయ్య తన శిష్యులను ఈ ప్రశ్న అడుగుతున్నాడు. మన చుట్టూ ఉన్న సమాజం కూడా ఇప్పుడు ఈ విధంగానే ఉన్నది. యేసుప్రభువును దేవుళ్లలో ఒక దేవుడు అని భావించే తరములో మనమున్నాము. ఇటువంటి పరిస్థితిలో ప్రభువు మనలను అడుగుచున్నాడు. "నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు చెప్పగలిగినట్లు మనము కూడా చెప్పాలి. పేతురు యేసయ్యను కనుగొన్నాడు. అయితే యేసుప్రభువు పేతురుతో "పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే కాని నరులు నీకు బయలు పరచలేదు" (మత్తయి 16:17) అంటున్నాడు.

మనము ఆయనను వెదకినప్పుడు తనంతట తానే ప్రత్యక్షపరచుకొంటాడు. మన ఆత్మీయ కన్నులు తెరవబడకపోతే మనము క్రీస్తు నిజ స్వరూపము, స్వభావము తెలుసుకోలేము. ఆత్మీయ ఎదుగుదల ఉన్న వారికి ఆయన ప్రత్యక్ష పరచబడుతాడు. ఇంకెవరైనా ఈ ప్రశ్న మనలను అడిగితే వారికి పిచ్చి పట్టిందనో లేక గర్విస్తున్నారనో అనుకుంటాము. కాని యేసు ప్రభువు అడిగిన ప్రశ్నలో ఒక ఉద్దేశముంది. ఆయనెవరో సరిగ్గా అర్థము చేసుకొని ఒప్పుకొనుటలోనే రక్షణ ఉందని రోమా 10:9లో పౌలు చెప్తున్నాడు. "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు". యోహాను భక్తుడు ఈ విషయము ప్రస్తావించాడు: "యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో, అది దేవుని సంబంధమైనది" (1యోహాను 4:2). ఆయన వ్యక్తిత్వము, ఆయన కార్యాలు ఒకదానితో ఒకటి సమన్వయ పరచబడి ఉన్నాయి. కాని ప్రజలు ఆయనను అర్థము చేసుకోలేకపోయారు. ఆయన మృతులలో నుండి లేచిన బాప్తీస్మమిచ్చు యోహాననియు, ఏలీయా అనియు అనుకున్నారు. యేసు ప్రభువును కనుగొనుటకు మనము ఇతరుల అభిప్రాయాలు సేకరించి ఒక అంగీకరానికి రాలేము. కాని మనము వ్యక్తిగతంగా తెలుసుకోవాలి. పేతురు సరైన, ఖచ్చితమైన

సమాధానము కలిగి ఉన్నాడు. తండ్రియైన దేవుడు అతనికిచ్చిన ప్రత్యక్షత వలన ఈ సత్యమును పేతురు తెలుసుకున్నాడు.

మత్తయి 11:25-27లో యేసు ప్రభువు ఈ సంగతి ప్రస్తావిస్తూ, దేవుడు ఈ సంగతులు తాము జ్ఞానులము, వివేకులము అని భావిస్తున్న పరిసయ్యులకు, సద్దూకయ్యులకు మరుగు చేసి పసిబాలుర వంటి తన శిష్యులకు బయలుపరచాడని దేవుని స్తుతించాడు.

పేతురు తన ప్రత్యక్షతను గురించి తెలియపరచక ముందే ఇంకా కొంతమంది తాము యేసయ్యను గురించి తెలుసుకున్న సత్యాలు ప్రకటించారు. యోహాను 1:49లో 'నతనయేలు-బోధకుడా, నీవు దేవుని కుమారుడవు' అనియు, యేసుప్రభువు సముద్రములో గాలిని అణచినప్పుడు శిష్యులు 'నీవు నిజముగా దేవుని కుమారుడవు' అని మత్తయి 14:33లో అన్నట్లుగా చూడగలము. యోహాను 6:69లో "నీవు దేవుని పరిశుద్ధుడవు" అని పేతురు చెప్పడము, దేవుడు వాగ్దానము చేసిన మెస్సీయ యేసు ప్రభువే అను విశ్వాసముతో అంద్రెయ తన సహోదరుడైన పేతురును యేసయ్య యొద్దకు తీసుకొని రావడము (యోహాను 1:41) చూడగలము. మరి యేసుప్రభువు "నేనెవరని మీరనుకొనుచున్నారు?" అని శిష్యులను మరలా ఎందుకు అడిగాడు? అని ఆలోచిస్తే, యేసుప్రభువు తన శిష్యుల ఆత్మీయ స్థితి తెలుసుకొనుటకు అయి ఉండవచ్చు. పేతురు శిష్యులందరి పక్షాన చెప్పిన సమాధానము వినిన తర్వాత వారు ఆత్మీయంగా లోతైన సత్యములోనికి నడిపించబడుటకు సిద్ధముగా ఉన్నారని ప్రభువు నిర్ణయించుకున్నాడు. ఈ లోకములో తాను ఉండే సమయము సమాప్తమవుతున్నదని ప్రభువుకు తెలుసు. అందుకే తన శిష్యులను సిద్ధపరచాలనే ఉద్దేశముతో పన్నెండు మందిని వేరుగా తీసుకెళ్లి వారిని పరీక్షిస్తున్నాడు.

పేతురు తన జవాబు ఏ మాత్రము అనుమానం లేకుండా స్థిరముగా చెప్పాడు. ప్రారంభములో అతను కూడా మిగిలిన యూదుల లాగా యేసయ్య రారాజుగా వచ్చి దావీదు సింహాసనము పైన కూర్చుని రాజ్యాన్ని ఏలుతాడాని తలంచాడు. కాని యేసుప్రభువే తండ్రి వాగ్దానము చేసిన మెస్సయ్య అను సత్యము మాత్రమే ఖచ్చితంగా నమ్మాడు. ఆయన దేవుడు ఏర్పరచుకొన్న మెస్సయ్య మాత్రమే కాక, సజీవుడైన దేవుని కుమారుడనే సత్యము తెలుసుకున్నాడు. ఆ మాటలు శక్తితో కూడినవి. మనము కృపచేత దేవుని దత్తపుత్రులము అగుచున్నాము. కాని క్రీస్తు 'సజీవమైన దేవుని కుమారుడు'. "తండ్రి యేలాగు తనంతట తానే జీవము గలవాడై యున్నాడో, అలాగే

కుమారుడును తనంట తానే జీవము గలవాడై యుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను" (యోహాను 5:26). దేవుని అద్వితీయ కుమారుడు వెలుగునకు వెలుగై ఉన్నట్లు జీవమునకు జీవము, దేవాది దేవుడై ఉన్నాడు. పేతురుకు ఈ సత్యము అంతకుమునుపు సంపూర్ణముగా అర్థమైందో లేదో గాని ఇప్పుడు దేవుడు ప్రత్యక్షపరచాడు. పరిశుద్ధాత్మ దేవుడు అ సత్యములోనికి నెమ్మదిగా నడిపించాడు.

మనమందరము ఈ ప్రశ్నకు సమాధానము చెప్పగలిగి ఉండాలి. సువార్త యొక్క గొప్పతనము, యోగ్యత ఈ జవాబు మీద ఆధారపడి ఉంది. యేసయ్య వ్యక్తిత్వము పైన నరుల విమోచన ఆధారపడి ఉంది. ఆయనను కనుగొనడమంటే సువార్తను తెలుసుకోవడమే. ఆయన ఏమైయున్నాడో అది కనుగొంటే, ఇక మిగిలిన వేవీ ప్రాధాన్యత సంతరించుకోవు.

మనలను మనము ఉపేక్షించుకొని, దేవుని వెంబడించినప్పుడు దేవుడు తానే ప్రత్యక్షపరచుకుంటాడు. ఈ లోకంలో రెండు రకాల ప్రత్యక్షతలున్నాయి. అపవాది కూడా తప్పుడు బోధల ద్వారా యేసయ్యను ప్రత్యక్షపరుస్తున్నట్లుగా అభిప్రాయము కలుగజేస్తున్నాడు. ఈనాడు అపవాది ప్రత్యక్షతలు ఎక్కువైనాయి. అవి తప్పుడు బోధలని తెలుసుకొనే వివేచన మనకు కావాలి. మనము దేవుని స్వభావము కనుగొన్నప్పుడు అపవాది ప్రత్యక్షతలో సత్యము లేదని తెలుసుకోగలము. యేసు ప్రభువు త్రిత్వములో ఒకడైనందున దేవుని లక్షణాలన్నీ ఆయనలోను ఉన్నాయి. ఆయన గొప్పతనము మొదట్లో ధ్యానించు కున్నాము. ఆయన ప్రేమా స్వరూపి, న్యాయవంతుడు, స్వాతికుడు, దీనమనస్సు కలవాడు, జ్ఞానవంతుడు. అపవాది ప్రత్యక్షత దేవుని చిత్తానికి విరుద్ధంగా ఉంటుంది. అపవాది ప్రత్యక్షతలలో సిలువకు స్థానములేదు. సిలువలేని ప్రత్యక్షతలవి. అపవాది యేసుప్రభువును తప్ప మిగిలిన వారినందరినీ ఘనపరుస్తాడు. అయితే తండ్రియైన దేవుడు కేవలము క్రీస్తును మాత్రమే మహిమ పరుస్తాడు. యేసయ్య స్వయంగా యూదులతో ఈ విధంగా అంటున్నాడు : "మా దేవుడని మీరెవరినిగూర్చి చెప్పుదురో ఆ నా తండ్రియే నన్ను మహిమ పరచుచున్నాడు" (యోహాను 8:54). దేవుని ప్రత్యక్షత వలన వచ్చు వెలుగులో నిలబడితే సాతాను మన యొద్దకు రాడు.

తండ్రి తానే స్వయంగా ప్రత్యక్షపరచే యేసుక్రీస్తును కనుగొని ఆయనను పూర్ణమనసుతో సేవిద్దాము. హోషేయ ప్రవక్త చెప్పినట్లుగా "యెహోవాను వెదకుటకు ఇదే సమయము" (హోషేయా 10:12). సమయము తక్కువగా ఉంది కాబట్టి త్వరపడి మనము ఆయనను వెదకి కనుగొందాము.

దేవుడు మిమ్మును దీవించును గాక!

❖ ❖ ❖

# 11. దేవుడు దయచేసిన వనరులు

"తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు, జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున, దేవుని గూర్చి నట్టియు, మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవజ్ఞానము వలన మీకు కృపయు, సమాధానమును విస్తరించునుగాక" (2పేతురు 1:2,3).

మనము జీవించుటకును, భక్తిగా ఉండుటకును అవసరమైన వనరులన్నీ దయచేసిన దేవుడు, మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానము కలిగి ఉంటే, మనకు కృప, సమాధానము ఎక్కువవుతుందని పేతురు భక్తుడు చెప్తున్న దానిని బట్టి మనము ఈ వనరుల గురించి తెలుసుకుందాము.

ముందుగా యెహోవా దేవుడు తాను ఏర్పరచుకున్న ఇశ్రాయేలు ప్రజలకు వారి 40 ఏళ్ల అరణ్య ప్రయాణములో వారికి అవసరమైన వనరులేమి ఇచ్చాడో తెలుసుకొని, అవి ఈనాడు మన జీవితాలలో కూడా ఇచ్చాడని తెలుసుకొని వాటిని మనము ఎలా గుర్తించాలో ధ్యానించుకుందాము. కేవలము అరణ్య ప్రయాణంలోని 40 సంవత్సరాలు మాత్రమే ఇశ్రాయేలు ప్రజలకు దేవుడిచ్చిన వనరులు మనము గుర్తుతెచ్చుకుందాము. ఎందుకంటే ఇశ్రాయేలీయుల అరణ్యప్రయాణము రక్షణ పొందాక మన జీవితాలలోని ఆత్మీయ ప్రయాణముతో పోల్చవచ్చును. ఇశ్రాయేలీయులు తమకు దేవుడు వాగ్దానము చేసిన కనానులో ప్రవేశించిన తర్వాత ఈ వనరులు లేవు. వాగ్దాన దేశములో ఉన్న సహజ వనరులతోవారు జీవించునట్లు ఏర్పాటు చేశాడు. మన గమ్యమైన పరలోకమును కానానుతో పోల్చవచ్చును. వారు ఆ ప్రయాణములో అవిధేయత చూపించినా ఆ దేవాది దేవుడు తానిచ్చే వనరులు ఆపలేదు. అది మనకు కూడా అన్వయించుకోవచ్చును. రక్షణలోని మొదటి మెట్టు పాప శిక్షనుండి విడుదల. ఈ మొదటి క్షణంలోనే మనము దేవుని బిడ్డలుగా చేయబడుతాము. కాబట్టి తప్పు ఏమైనా చేసినను, అడిగితే మనకు క్షమాపణ దొరుకుతుంది. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి బయటకు తెచ్చాడు. మనలను పాపపు దాస్యము నుండి విడిపించాడు.

ఈ ఆత్మీయ ప్రయాణములో, ఇశ్రాయేలీయులకు అరణ్య ప్రయాణములో ఇచ్చిన వనరులు మనకు ఎలా ఇవ్వబడ్డాయో చూద్దాము. మన జీవితములో అవి అన్వయించుకొనే విధానాన్ని పరిశీలిద్దాము. రక్షణ పొందిన క్షణము నుండి మనకు ఈ వనరులన్నీ ఇవ్వబడుతాయని మనము గుర్తించాలి.

**1. మేఘస్తంభము** – (నిర్గమ కాండము 13:21) :

"యెహోవా త్రోవలో వారిని నడిపించుటకై పగటివేళ మేఘ స్తంభములో" ఉండి నడిపించాడని వ్రాయబడి ఉన్నది. హెబ్రీపత్రిక 12:1,2లో "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించి యున్నందున, మనము కూడ ప్రతి భారమును, సుళువుగా చిక్కులు బెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు వాడునైన యేసువైపుచూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికగా పరుగెత్తుదము" అని వ్రాయబడి ఉన్నది. హెబ్రీ పత్రిక రచయిత 11వ అధ్యాయములో లేఖనాలలోని గొప్ప విశ్వాసుల గురించి తెలిపి, అటువంటి వారు మీకు మార్గదర్శకులై ఉండాలి అన్నట్లు చెప్పాడు. ఆనాడు ఇశ్రాయేలీయులను నడిపించుటకు మేఘస్తంభమును పెట్టినట్లు, ఈనాడు తోటి విశ్వాసుల యొక్కయు, బైబిలులోని విశ్వాస వీరుల యొక్కయు సాక్ష్యమును బట్టి మనము నడవాలని ఏర్పరచాడు.

**2. అగ్నిస్తంభము –** (నిర్గమకాండము 13:21) :

"వారికి వెలుగిచ్చుటకు రాత్రివేళ అగ్ని స్తంభములోను ఉండి వారికి ముందుగా నడచుచు వచ్చెను" అని వ్రాయబడి ఉంది. ఈ అగ్ని స్తంభమును మనలో ఉన్న పరిశుద్ధాత్మ దేవునితో పోల్చవచ్చును. "పరిశుద్ధాత్మ మీ మీదకు వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు" (అ.కా. 1:8) అని ప్రభువు చెప్పాడు. ఆ శక్తితోనే మన ఆత్మీయ నడక కొనసాగించగలము. అపొ.కా. 2:3లో ప్రభువు చెప్పినట్లుగా శిష్యుల మీదకు అగ్ని జ్వాలల వంటి నాలుకలు వ్రాలగా "అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై, ఆ ఆత్మ వారికి వాక్శక్తిని అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాట్లాడసాగిరి". ఆయన మనలో, మనముందు ఉండి నడిపిస్తాడు.

**3. నీరు –** (నిర్గమకాండము 15:27)

నీటిబుగ్గలున్న చోట ఇశ్రాయేలీయులు విడిది చేసిరని చెప్పబడి ఉంది. మనకు దేవుడనుగ్రహించిన లేఖనాలను నీటితో పోల్చవచ్చును. "నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు" (యోహాను 4:14). ఆ "జీవజలము నేను" అని

ప్రభువు చెప్తున్నాడు. వాక్యమనే నీటితో మనలను మనము పరీక్షించుకొని, పవిత్రపరచుకోవాలి. "నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారై" యుండుడని హెబ్రీ పత్రిక రచయిత 10:22 లో అంటున్నాడు. ఇశ్రాయేలీయులు అరణ్య పయనములో చేదు నీటిని దేవుడు మధురముగా మార్చాడు. వాక్యముతో నింపుకున్న మన జీవితములలోని చేదు మధురముగా మార్చబడుతుంది.

**4. మన్నా -** (నిర్గమకాండము 16:35) :

"ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తాము ప్రయాణించిన నలువది యేండ్లు మన్నానే తినుచుండిరి. వారు కనాను దేశపు పొలిమేరలు చేరు వరకు మన్నాను తినిరి" అని వ్రాయబడి ఉంది. "జీవాహారము నేను, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు" (యోహాను 6:35) అని యేసయ్య అంటున్నాడు. ఇశ్రాయేలీయులకిచ్చిన మన్నా కంటే శ్రేష్ఠమైన యేసయ్యను ఇప్పుడు దేవుడు మనకిచ్చియున్నాడు. యోహాను 6:56-58లో "నా శరీరము తిని, నా రక్తము త్రాగువాడు నాయందును, నేను వానియందును నిలిచి యుందుము. జీవముగల తండ్రి నన్ను పంపెను గనుక నేను తండ్రి మూలముగా జీవించుచున్నట్లే నన్ను తినువాడును నా మూలముగా జీవించును. ఇదే పరలోకము నుండి దిగివచ్చిన ఆహారము, పితరులు మన్నాను తినియు చనిపోయినట్లు గాదు. ఈ ఆహారము తినువాడు ఎల్లప్పుడును జీవించునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" అని వ్రాయబడి ఉన్నది. ఆయనను తినుట అంటే వాక్యము రోజూ ధ్యానించుట, మన్నాను ఇశ్రాయేలీయులు ఏ రోజుకారోజు పోగుచేసుకోవాలి, మరుసటి రోజుకు అది పాడవుతుంది, పనికిరాదు. అదే విధంగా నిన్నటి ధ్యానము ఈ రోజుకు సరిపోదు, ఏ రాజుకారోజు వాక్యము ద్వారా బలపడాలి.

**5. వస్త్రాలు పాతగిలలేదు -** (ద్వితీయోపదేశకాండము 8:4)

"ఈ నలువది సంవత్సరములు నీవు వేసికొనిన బట్టలు పాతగిలలేదు" అంటున్నాడు దేవుడు. ఈనాడు ప్రభువు మనకిచ్చు నీతివస్త్రములు పాతగిలవు, చిరిగిపోవు. ఎందుకంటే నీతివస్త్రము ధరించిన మనము నిత్యజీవమునకు వారసులమవుతాము. 'అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దానిని తినివేయదు' (మత్తయి 6:20). పౌలు తన పత్రికలో పలు చోట్ల "క్రీస్తును ధరించుకొనుడి"

అంటున్నాడు. ఆయన సారూప్యములోనికి మనము మారాలి. మనకు ఈ నీతివస్త్రములు కావాలంటే మన పరమతండ్రిని అడగాలి. "అడుగుడి, ఇవ్వబడును" అని దేవుడు మనకు ఎప్పుడూ తెరచి ఉంచిన ఆహ్వానము అందజేస్తున్నాడు.

**6. సంపూర్ణ ఆరోగ్యము –** (నిర్గమకాండము 15:26)

"నేను ఐగుప్తీయులకు కలుగజేసిన రోగములలో ఏదియు మీకు రానియ్యను, నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" అన్నాడు. ద్వితీ. 8:4లో "నీ కాలు వాయలేదు" అంటున్నాడు. 40 సంవత్సరములు ప్రయాణము చేసినను వారికి ఏ రోగము రాలేదు, కనీసము కాళ్లవాపు కూడా రాలేదు. వాగ్దానము చేసినవాడు నమ్మదగిన దేవుడు.

ఇశ్రాయేలీయుల దీర్ఘకాల ప్రయాణములో పరిసరాలు, వాతావరణ, భౌగోళిక మార్పులు ఉన్నను, మామూలుగా వాటి వలన వచ్చు ఏ అనారోగ్యము రాలేదు. ఈనాడు మనము కూడా ఆరోగ్యముగా ఉండాలని దేవుని చిత్తమై ఉన్నది. 2తిమోతి 4:3లోను, తీతుకు 2:1–3లోను ఆరోగ్యకరమైన బోధ చేయాలి, వినాలి అని పౌలు తన శిష్యులతోను, మనతోను చెప్తున్నాడు. "అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా 53:5) అను వాక్య ప్రకారము విశ్వాసముతో ప్రార్థించినప్పుడు స్వస్థత కలుగుచున్నది.

**7. చెప్పులు –** (ద్వితీ. 29:5)

"మీ చెప్పులు మీ కాళ్లను పాతగిలిపోలేదు" అని దేవుడు ఇశ్రాయేలీయులతో అంటున్నాడు. అపొ.కా. 12:8లో "చెప్పులు తొడుగుకొనుమని" దూత పేతురుతో చెప్తున్నాడు. ఈ 'చెప్పులు' అనేవి సువార్తను బోధించువారు పాదములకు సాదృశ్యముగా ఉన్నవి. దూత పేతురుకు తానే స్వయంగా చెప్పులు తొడిగించి ఉండవచ్చు, కాని మనమే తొడుక్కోవాలన్నది దేవుని ప్రణాళిక. సువార్త ప్రకటించుట మొదలుపెడితే దేవుడు చేసే అద్భుతాలు మన జీవితంలో చూడవచ్చును.

ఇంతవరకు మనము ధ్యానించుకున్న విషయాలు అద్భుతంగా ఉన్నాయి కదండీ! దాదాపు 4000 సం॥ క్రిందట జరిగినవే ఈనాడు జరుగుతున్నాయి. నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా ఉన్న దేవుని కలిగియున్న మనము ధన్యులము. ఈ గొప్ప దేవుని ఎల్లవేళలా హత్తుకొని ఉండాలని ప్రభువు పేరట కోరుతూ ముగిస్తాను. ఆమేన్.

❖ ❖ ❖

# 13. సత్క్రియలు

సత్క్రియలు యందాసక్తి గల ప్రజలను తన కొరకు పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే అర్పించుకొన్న దేవాది దేవుని నామమున శుభములు.

ఈ రోజున మనము సత్క్రియలను గురించిన కొన్ని విషయాలు ధ్యానించు కుందాము. పౌలు తీతుకు వ్రాసిన పత్రిక 3:6-8 వరకు ఉన్న వాక్యభాగమును పరిశీలిద్దాము :- "మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసులగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను. ఈ మాట నమ్మదగినది గనుక దేవుని యందు విశ్వాసముంచిన వారు సత్క్రియలను శ్రద్ధగా చేయుట యందు మనస్సుంచునట్లు నీవీ సంగతులను గూర్చి దృఢముగా చెప్పుచుండ వలెనని కోరుచున్నాను." ఈ పత్రికలో పౌలు ద్వారా రక్షణ పొందిన ప్రతి విశ్వాసి ఈ సిద్ధాంతాన్ని భక్తితోను, సత్క్రియలోను ధరించాలని బోధిస్తున్నాడు.

తీతుకువ్రాసిన పత్రిక చిన్నదైనా అందులో విశ్వాసికి అవసరమైన అత్యంత ప్రాముఖ్యమైన సిద్ధాంతమున్నది. చాలామంది కృపా సిద్ధాంతము విశ్వసించినా, వారి భక్తిద్వారా గాని, సత్క్రియల ద్వారా గాని వారి జీవితాలలో అనుసరించి చూపడము లేదు. నిజమైన కృపను అనుభవించు వారికి ఇటువంటి వైఖరి ఉండకూడదని తెలుసుకోవాలి. క్రియారూపకమైన భక్తి అవసరమని పౌలు తీతుకు నేర్పిస్తున్నాడు. యాకోబు 2:17లో క్రియారూపక విశ్వాసము లేకపోతే విశ్వాసము వ్యర్థమని యాకోబు చెప్తున్నాడు. యాకోబు భక్తుడు ఇంకొక మాట కూడా చెప్తున్నాడు - "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా - దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి ఇబ్బందులలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తనకంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" (1:27).

యేసయ్య తన ప్రశస్తమైన రక్తమును విమోచన క్రయధనముగా చెల్లించి మనలను తన సొత్తుగా చేసిన ఆ విమోచకుని కృపద్వారా రక్షణ పొందిన మనము

అత్యాసక్తితో సత్క్రియలు చేయాలి. మనకు అవకాశము ఉన్నప్పుడు చేద్దాములే అనుకోకుండా మన అనుదిన జీవితంలో స్వతహాగా చేయాలి. ప్రతి విశ్వాసి కృప వలన నీతిమంతులుగా తీర్చబడి, నిత్యజీవమును గురించిన నిరీక్షణ కలిగియున్నాడు. ఆ నిరీక్షణ ఏమిటి అను ప్రశ్నకు పౌలు తీతుకు 2:13లో సమాధానమిస్తున్నాడు – "మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత". ఈ ప్రత్యక్షత మనకు లభించుట కొరకై దేవుడు యేసుక్రీస్తు ద్వారా మనపై పరిశుద్ధాత్మను సమృద్ధిగా కుమ్మరించాడు. ఈ సత్యము నమ్మదగినది గనుక విశ్వాసులందరు పరిశుద్ధాత్మ శక్తితో సత్క్రియలు శ్రద్ధగా చేయమని తన సంఘస్థులకు చెప్పమని పౌలు తీతుకు బోధిస్తున్నాడు. సత్క్రియలు చేయడమనునది ప్రతి విశ్వాసికి తప్పనిసరి. ఇంతకూ సత్క్రియ అంటే ఏమిటి అనే విషయము కూడా మనము సరిగా అర్థము చేసుకోవాలి. సత్+క్రియ= మంచి పని అని అర్థము. ఈ పదము బైబిల్‌లో మొట్టమొదటిగా దేవుని నోటి నుండి వచ్చింది. ఆది 4:7లో దేవుడు కయీనుతో అన్నమాట ఇది – "నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచి యుండును, నీ యెడల దానికి వాంఛ కలుగును. నీవు దానిని ఏలుదువనెను" మొట్టమొదటి సత్క్రియ చేసినవాడు హేబెలు.

సత్క్రియ అంటే 3గుణాలు కలిగి యుండాలి.

1. దేవుని చిత్తానుసారమైనది.
2. దేవునికి మహిమ తెచ్చేది – మన విశ్వాసము తెలియపరచేదిగా ఉండాలి.
3. దానివల్ల తోటి మానవులకు మేలు కలగాలి.

ఈ మూడు లక్షణాలు ఉంటేనే అది సత్క్రియ అవుతుంది.

సత్క్రియలను గురించి ఇంకా కొన్ని విషయాలు :

**ఎ.** సరైన ఉద్దేశ్యంతో చేసిన క్రియలు : సంఘము, సమాజము మంచి కార్యాలని భావించేవి దేవుని ప్రేమ లేకుండా చేస్తే వ్యర్థము. 1కొరింథీ 13:3లో 'బీదల పోషణ కొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరము అప్పగించినను, ప్రేమలేనివాడనైతే ప్రయోజనము లేదు"

**బి.** సరైన పరిమాణాలు కలిగిన క్రియలు : "పౌలు సౌలుగా ఉన్నప్పుడు క్రీస్తు మార్గములో ఉన్నవారిని హింసించుట సరైనదని అనుకున్నాడు గాని అది దేవుని దృష్టిలో సరైనది కాదు. ఏ పని చేసినా దేవుని మహిమార్థము ఉండాలి.

తిమోతికి వ్రాసిన రెండు పత్రికలలో, తీతుకు వ్రాసిన పత్రికలో సత్క్రియలను గురించి చాలా వాక్యాలు వ్రాయబడి ఉన్నాయి. 1తిమోతి 6:18లో పౌలు తిమోతితో

చెప్పిన మాటలు : "వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము, రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు, మేలుచేయువారును, సత్‌క్రియలు అను ధనము గలవారును, ఔదార్యము గలవారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము". తన సంఘములోని వారితో సత్‌క్రియల యొక్క ప్రాధాన్యత చెప్పి అందరూ చేయాలని ఆజ్ఞాపించమని కూడా చెప్తున్నాడు. ఖచ్చితంగా చేయాలని చెప్పమంటున్నాడు. యౌవనస్థుడైన కాపరిగా ఉన్న తిమోతి తన సంఘస్థులకు మోహమాటం లేకుండా చెప్పమని బోధిస్తున్నాడు. నిత్యజీవము సంపాదించుకొనుటకు, దాని కొరకు మంచి పునాది వేసికొనుటకు సత్‌క్రియల ఆవశ్యకత ఉందని చెప్తున్నాడు. "సత్‌క్రియలు అను ధనము" అని ధనముతో పోలుస్తూ, ఈ ధనాన్ని అందరితో పంచు కోవాలంటున్నాడు.

తీతుకు 2:14లో "ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్‌క్రియలయందాసక్తి గల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తనను తానే మనకొరకు అర్పించుకొనెను" అని వ్రాయబడిఉంది. "సత్‌క్రియల యందాసక్తి గలవారి కొరకు తన్నుతాను అర్పించుకొన్నాడు" అనుమాట మనలను ఆలోచనలోకి తీసుకొని వెళ్తుంది. దేవుడు లోకమంతటి రక్షణార్ధము ఈ లోకానికి వచ్చాడని మనము నమ్ముచున్నాము గదా, మరి ఈ వచనము వేరుగా ఉందే అని అనుకుంటున్నారేమో. యేసుప్రభువు అందరి కొరకు వచ్చాడు గాని ఆ సత్యము నమ్మి, నోటితో ఒప్పుకున్న వారికే రక్షణ అన్నట్లుగా, రక్షణ పొందినవారు అత్యుత్సాహముతో సత్‌క్రియలు చేసిన దేవుని మహిమార్థము జీవిస్తారన్నది కూడా సత్యము. దేవుడు తన కుమారుని మన కొరకు పంపినది కేవలము ఆత్మల రక్షణ కొరకే గాక, మన జీవితాలలోని అపవాది క్రియల నుండి విడుదల దయచేయుటకు కూడా అను విషయము మనము అర్థము చేసుకోవాలి. తీతు 3:14లో "నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరమును బట్టి సమయోచితముగా సత్‌క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను" అని పౌలు భక్తుడు చెప్తున్నాడు. ఫలించని వారిని తీర్పు సమయంలో దేవుడు అగ్ని గుండంలోకి విసిరేస్తాడు కాబట్టి ఫలించాలంటే సత్‌క్రియలు శ్రద్ధగా చేయుట నేర్చుకొనవలెను. నిత్యజీవానికి వెళ్లుటకు సత్‌క్రియలు తప్పనిసరి కాబట్టి వాటిని ఆసక్తితో, శ్రద్ధతో, ఓపికతో, ఉత్సాహముతో, అనుదిన జీవితంలో భాగమైనట్లు చేయవలెను.

రోమా 2:6,7,10 వచనాలలో పౌలు చెప్పిన మాటలు పరిశీలిద్దాము : "ఆయన ప్రతి వానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్‌క్రియను ఓపికగా చేయుచు మహిమను, ఘనతను, అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును...

సత్క్రియ చేయు ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ మహిమయు, ఘనతయు, సమాధానమును కలుగును".

సత్క్రియను ఆరంభించినవాడు దేవుడే. తన ఏకైక కుమారుని మన కొరకు బలిపశువుగా పంపుట ద్వారా సకల లోకస్థుల విమోచనార్థము ఆయన సత్క్రియ చేశాడు. సత్క్రియల వలన మనకు విమోచన రాదు గాని రక్షింపబడినాము కాబట్టి మనము సత్క్రియలు చేయాలి. బైబిల్‌లో సత్క్రియలు చేసినవారు అనేకులు ఉన్నారు గాని పాత నిబంధన నుండి ఒక ఉదాహరణ చూసుకొందాము.

పాత నిబంధనలో దేవుని హృదయానుసారుడైన దావీదు చేసిన ఒక సత్క్రియ చూద్దాము. 2సమూయేలు 9:1-14 వరకు ఉన్న వాక్య భాగములో దావీదు "యెహోవా నాకు దయచూపినట్లుగా నేను ఉపకారము చేయుటకు సౌలు కుటుంబములో ఎవడైన నొకడు శేషించి యున్నాడా"అని అడిగాడు. మేలు చేయాలనే ఆలోచన కేవలము మంచివారికి కలుగుతుంది. కాని శత్రువులకు మేలు చేసే బుద్ధి రక్షణ పొందిన వారికి మాత్రమే కలుగుతుంది. శత్రుశేషము ఉండకూడదని తనను కూడా చంపుటకు పిలువ నంపాడేమో అని భయపడుతూ వచ్చిన యోనాతాను కుమారుడైన కుంటి కాళ్లు గల మెఫీబోషెతును ఆదరించి, అతని ఆస్తిని అతనికి తిరిగి ఇప్పించి, సదాకాలము రాజు బల్ల యొద్ద భోజనము చేయునట్లుగా ఏర్పరచాడు. తనపట్ల అపకారము చేసిన వారికి ఉపకారము చేయుట అనునది యేసుప్రభువు నేర్పించిన మార్గము.

నూతన నిబంధనలో దొర్కా అను ఒక శిష్యురాలిని గురించి అపొ.కా. 9:36-41 లో చూడగలము. ఆమె సత్క్రియలు, ధర్మకార్యములు బహుగా చేసిందని లూకా వ్రాస్తున్నాడు. ఆనాటి సమాజములో అతిహీన స్థితిలో జీవిస్తున్న విధవరాండ్రను చేరదీసి ఆమెకున్న తలాంతును వాడి అంగీలు కుట్టించి ఇచ్చేది. విధవరాండ్రను, అనాథలను ఆదరించుటే నిజమైన భక్తి అని ఇంతకుముందు చూశాము.

మన జీవితాలలో ఏ విధమైన సత్క్రియలు చేస్తున్నాము అని ఆలోచించి, వాటిని బట్టి దేవుడు మహిమ పరచబడుచున్నాడా? లేదా అని కూడా బేరీజు వేసుకోవాలి. తమ స్వంత ఘనత కొరకు చేయు పనులు దేవున్ని మహిమపరచలేవు. ఎదుటివారికి ప్రయోజనకరంగా ఉంటూ దేవుని మహిమార్థము, దేవుని చిత్త ప్రకారము చేసే పనులే సత్క్రియలని మరోమారు గుర్తు చేస్తూ, రక్షణ పొందిన వారమంతా తప్పక సత్క్రియలు చేయాలని కోరుతూ, "సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచి యుండును" అని దేవుడు చెప్పిన మాట కూడా జ్ఞాపకము చేస్తూ ముగిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 13. వ్యతిరేక లక్షణాల ద్వారా సత్యము తెలుసుకొనుట

బైబిలు గ్రంథ సత్యాలు సరిగ్గా అర్థము చేసుకొనుటకు వ్యతిరేక లక్షణాలు ధ్యానించుట ఒక విధానము. యేసుప్రభువు కూడా కొన్ని ఉపమానములలో ఈ పద్ధతి అవలంబించాడు. ఉదాహరణకు లూకా 16:19-31లో ధనవంతుడు, లాజరు అను దరిద్రుడిని గురించిన ఉపమానములో మారుమనసు ఉన్నవారికి పరలోకము, లేనివారికి నరకము అను సత్యము బోధించాడు. లూకా 18:9-14లో తామే నీతిమంతులమని తలుస్తూ ఇతరులను తృణీకరించు కొందరికి నీతిమంతులెవరు అను సత్యము బోధించుటకు పరిసయ్యుడు, సుంకరిని గురించిన ఉపమానము చెప్పాడు.

పాత నిబంధనలోని ఆదికాండములో వ్యతిరేక వ్యక్తిత్వాలు గల ఏడు జతల వ్యక్తుల ద్వారా కొన్ని సత్యాలు తెలుసుకుందాము.

**1.** కయీను, హేబెలు ద్వారా ప్రభువును ఆరాధించుటలో సరైన విధానము ఏమిటి, తప్పు విధానము ఏమిటి అని తెలుసుకొనవచ్చును. వీరిని గురించి, వీరి అర్పణలను గురించి ఆదికాండము 4:3-5 వచనములలో గ్రంథస్తము చేయబడి ఉంది. మొదటిగా కయీనే దేవునికి అర్పణ అర్పించాడు గాని హేబేలు అర్పణ గురించే మొదటిగా చెప్పబడింది. ఎందుకంటే హేబెలు అర్పణ దేవుని చిత్తప్రకారము రక్తముతో కూడినది. కయీను తన పంటలో కొంత ఇచ్చాడు. అందులో రక్తము లేదు. “సిలువ లేని సువార్త వ్యర్థము” అని ఈ సందర్భముగా గుర్తు చేసుకోవాలి. కయీను వైఖరి కూడా సమస్యాత్మకంగా ఉంది. నిర్లక్ష్య వైఖరితో అర్పించినందున దేవుడు అంగీకరించలేదు.

ఆదాము పాపము చేశాక, తన స్వంత తెలివితో ఆకులతో కచ్చడములు చేసుకున్నాడు, కానీ దేవుడు రక్తముతో కూడిన అంగీలు ఇచ్చాడు. తానే ధరింపజేశాడు. ఏ ఆరాధన గాని, అర్పణ గాని రక్తము లేకుంటే దేవుడు అంగీకరించడు. మన బోధకులలో, సువార్త ప్రకటించుటలో రక్తము, సిలువ తప్పనిసరి. హేబెలు ఏమీ

మాట్లాడలేదు కాని అతని 'రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొరపెట్టు చున్నది" అని దేవుడు చెప్తున్నాడు. హెబ్రీ పత్రిక 11వ అధ్యాయములోని విశ్వాసవీరులు జాబితాలో అతని పేరు ఉంది. శ్రేష్ఠమైన ఆరాధన హేబెలుది.

**2.** ఆదికాండము 4,5 అధ్యాయాలలో ఇద్దరు హనోకులను చూడగలము. దేవునితో సరైన నడక, సరైనది కాని నడక వీరి జీవితాల ద్వారా నేర్చుకోవచ్చును. నాలుగవ అధ్యాయములో కయీను కుమారుడైన హనోకు, 5వ అధ్యాయములో 7వ వాడైన హనోకును చూడగలము.

మొదటి హనోకు ఆదాముతో 58 సంవత్సరములు జీవించి దేవుని విధానాలు చూసినను, వాటిని తన పిల్లలకు నేర్పించలేదు. తాను నడువలేదు. అతని వంశావళి నుండి వచ్చిన లెమెకు ఇరువురు భార్యలను చేసుకొని దేవుని చిత్తమునకు విరుద్ధంగా నడచుకున్నాడు. అతని సంతానము వ్యాపారాలు, నిర్మాణాలు చాలా చేశారు కాని వారి జీవితాలలో దేవునికి స్థానం లేకుండా పోయింది. లెమెకు హంతకుడైనాడు (ఆది 4:23), దేవునిచే విడువబడ్డాడు.

అయితే 7వ వాడైన హనోకు (యెరెదు కుమారుడు) ను గురించి 5:21-24 వరకు వ్రాయబడిన మాటలలో హానోకు దేవునితో నడచిన నడక గురించి వివరింపబడింది. "హానోకు దేవునితో నడిచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేకపోయెను" అని వ్రాయబడి ఉంది. అతడు దేవునితో నడుస్తూ, నడుస్తూ ఇంటికి వెళ్లడము మరచిపోయి దేవునితో వెళ్లిపోయాడు. తన 65వ ఏట దేవుని తెలుసుకొని, తర్వాత 300 సం॥లు దేవునితో నడిచాడు. యూదా పత్రిక 14, 15 వచనాలలో హానోకు దేవుని వాక్యము ప్రకటించినట్లుగా చూడగలము. దేవుని మాటలు విని అర్థము చేసికొని ఇతరులకు చెప్పాడు. దేవునితో నడక సాగించాడు.

మన నడక మాట్లాడుతుంది. మన మాటలు మాట్లాడుతాయి. కానీ మన మన నడక, మాటల కంటే బాగా మాట్లాడుతుంది.

**3.** ఆదికాండము 6వ అధ్యాయములో నోవహు అను నీతిమంతుడు. ఆయన తరానికి చెందిన అవినీతిపరులను చూడగలము. వీరిని గురించిన విషయాలు తెలుసుకుంటే ప్రస్తుత తరములో కూడా అటువంటి పరిస్థితి ఉందని తెలుసుకోవచ్చును. నీతిమంతుడైన నోవహు గురించిన ధ్యానము మనలను మనము పరీక్షించుకొనుటకు ప్రేరేపిస్తుంది. నోవహును గురించి దేవుడిచ్చిన సాక్ష్యము : "నోవహు నీతిపరుడును, తన తరములో నిందా రహితుడునై యుండెను. నోవహు దేవునితో కూడ నడిచినవాడు"

(ఆది. 6:9) దేవుడు అతనితో మాట్లాడుతూ "ఈ తరము వారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని" అంటున్నాడు. దేవునిచే ఆ విధంగా మెప్పు పొందుట ఎంత ధన్యత కదండీ! ఆయన తరములో "భూలోకము బలాత్కారముతో నిండి యుండెను".

రెండవ రాకడ ఎప్పుడు వస్తుందని అడిగిన శిష్యులతో యేసయ్య ఈ విధంగా అంటున్నాడు : "నోవహు దినములలో జరిగినట్లు మనుష్య కుమారుని దినములలోను జరుగును. నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు జనులు తినుచు, త్రాగుచు, పెండ్లాడుచునుండిరి". ఆ దినములలోని విచ్చలవిడితనము ఇప్పుడు చూస్తున్నాము. కాబట్టి రాకడ సమీపంగా ఉందను సత్యము తెలుసుకోవచ్చును. ప్రపంచమంతా నాశనమవుతుంటే మనమూ వారితోపాటే ఉందాములే అనుకోకుండా నోవహు నీతిమంతునిగా ఉండి, తనను, తన కుటుంబమును భద్రము చేసుకొన్నట్లు మనలను మనము భద్రము చేసుకోవాలి.

**4.** అబ్రాహాము మరియు లోతులలో ఒకరు ఆత్మ సంబంధి అయితే ఇంకొకరు శరీర సంబంధి. వీరిరువురును దేవుని ఆజ్ఞకు విధేయత చూపుటతో తమ జీవితాలను ప్రారంభించారు, గాని వారి మార్గాలు వేరైపోయాయి. అబ్రాహాము పునాదులు గల పరలోక పట్టణము కొరకు ఎదురు చూశాడు గాని శరీర సంబంధిగా ఉండిపోయిన లోతు తాత్కాలిక ఆకర్షణకు లోనైనాడు. అబ్రాహాముపైకి చూశాడు గాని లోతు ఇహలోకము వైపు చూశాడు. ఆది. 13:1-11లో లోతు తనంతట తాను తన దిశ నిర్ణయించుకున్నాడని చెప్పబడింది. కాని ఆత్మ సంబంధియైన అబ్రాహాము దేవుడు చెప్పేంతవరకు కన్నులెత్తి చూడలేదు (ఆది. 13:14), ఆది. 18, 19 అధ్యాయాలలో ఇరువురిలోని తేడాలు చాలా చూడవచ్చును. ఆత్మ సంబంధులు అద్భుతంగా ఆశీర్వదించబడి ఇతరులకు ఆశీర్వాదకరముగా ఉంటారు. కానీ శరీర సంబంధులు ఏమి మిగుల్చుకోలేరనే పాఠము మనము నేర్చుకోవాలి.

**5.** అడవి గాడిద లాంటి ఇష్మాయేలు, గొర్రెపిల్ల లాంటి ఇస్సాకు జీవితాలలో ఉన్న తేడాలు చూసి మనమేమై ఉండాలో నిర్ణయించుకోవచ్చును. ఆది. 16:12లో ఇష్మాయేలు "అడవి గాడిదలాంటి మనుష్యుడు" అని చెప్పబడి ఉంది. గలతీ 4:28, 29వచనములలో విశ్వాసులను ఇస్సాకు వలె వాగ్దాన పుత్రులని చెప్తూ "అప్పుడు శరీరమును బట్టి పుట్టినవాడు (ఇష్మాయేలు), ఆత్మను బట్టి పుట్టిన వానిని ఏలాగు హింసపెట్టెనో ఇప్పుడు ఆలాగే జరుగుచున్నది"అని పౌలు అంటున్నాడు. ఒకరు హింసకుడైతే ఇంకొకడు సాధుస్వభావము కలవాడు. ఇష్మాయేలీయులే ఈనాడు ప్రపంచాన్ని కలవరపెడుతున్నారు. ఉగ్రవాదులుగా మారి హింసకు మూలమై

ఉన్నారు. ఇశ్రాయేలు దేశపు రాజు ఈ విధంగా అన్నాడు : “ముస్లింలు ఆయుధాలు క్రింద పెడితే ప్రపంచంలో శాంతి నెలకొంటుంది. మేము తుపాకులు దించితే, మా దేశము ఉండదు”. ఇస్సాకు గొర్రెపిల్లలాగా సాత్వికుడు. అతని స్వభావము ఆది. 26:16-22లో కనబడుతుంది. గొడవలు పెట్టుకోకుండా గొడవలకు దూరంగా వెళతాడు. ఇష్మాయేలు అపహాసము, ఎగతాళి చేసేవాడు గాని, ఇస్సాకు నవ్వు పుట్టించేవాడు.

**6.** యాకోబు, ఏశావులలో ఒకరు భక్తుడు, ఇంకొకడు భ్రష్టుడు. హెబ్రీ 12:16లో ఏశావును గురించి కఠినమైన మాటలు చూడవచ్చును. “ఒకపూట కూటి కొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను, వ్యభిచారియైనను” అని వ్రాయబడి ఉంది. ఈ అన్నదమ్ముల మధ్య ఉన్న తేడాలు గమనించి యాకోబులో ఉన్న మంచితనము అలవరచుకుందాము. యాకోబు శాశ్వతమైన జ్యేష్ఠత్వము కోరుకున్నాడు. ఏశావు తాత్కాలికమైన చిక్కుడు కూర కోరుకున్నాడు. యాకోబు భక్తిపరుడు, ఏశావు వ్యభిచారి. ఆది. 33:5-11లో యాకోబు ప్రతిదీ దేవుడిచ్చాడంటున్నాడు, ఆది. 33:9లో “నాకు కావలసినంత ఉన్నది” అని ఏశావు అంటున్నాడు. యాకోబు సాధువుగా, ఏశావు వేటగాడుగా ఉన్నాడు. ఫలితంగా యాకోబు పేరు విశ్వాసుల జాబితాలోను, ఏశావు భ్రష్టుడుగాను హెబ్రీ పత్రికలో గ్రంథస్తము చేయబడి ఉన్నది.

**7.** యూదా, యోసేపులలో పవిత్రత, అపవిత్రత చూడగలము. ఆది 38లో యూదాను గురించియు, ఆది. 39లో యోసేపును గురించియు పరిశుద్ధాత్మ దేవుడు మోషేతో వ్రాయించాడు. వీరిరువురిలోని తేడాలు చూద్దాము. ఇరువురూ యాకోబు సంతానమే. అయినా వారిలో చాలా తేడాలున్నాయి. ఈ రెండు అధ్యాయాలలో ఉన్న విషయాల ద్వారా వారి స్వభావము గమనిద్దాము. యూదా ఒంటరిగా ఉన్నాడు. యోసేపు కూడా ఒంటరిగానే ఉన్నాడు, యూదా శోధింపబడినప్పుడు అపజయము పొందాడు. యోసేపు విజయుడయ్యాడు. ఒక స్త్రీ యూదా తప్పును ఎత్తి చూపించింది (యూదా కోడలు తామారు), ఒక స్త్రీ చేయని తప్పుకు యోసేపును జైలు పాలు చేసింది (పోతీఫరు భార్య). యూదా నైతికంగా దిగిజారిపోయాడు. యోసేపు పవిత్రత కాపాడు కొనుటకు ఉద్యోగము పోగొట్టుకొని జైలుకెళ్లాడు.

యోసేపు ఎదుట యూదా తలవంచాడు కాని దేవుని ఎదుట మాత్రమే తలవంచిన యోసేపు ఎవరి ఎదుటను తలవంచాల్సిన అవసరము రాలేదు. దైవగుణాలు కలిగిన వారిని అందరూ గౌరవిస్తారు.

మనమందరము మంచేదో, చెడేదో తెలుసుకొని మంచివైపు నడుస్తూ దేవుని మహిమార్థము జీవించుటకు దేవుడు సహాయము చేయును గాక. ఆమేన్!

❖ ❖ ❖

# 14. విమోచకుడు క్రమబద్ధంగా ప్రత్యక్షపరచబడుట

యేసుక్రీస్తు మనందరి కొరకు చేసిన గొప్ప త్యాగమును ధ్యానించుకొనుటకును, ఆ త్యాగానికి తగినట్లుగా మనము ప్రవర్తిస్తూ మనలను మనము పరీక్షించుకొనుటకును, దేవుడు మనకిచ్చిన తరుణమును బట్టి దేవునికి వందనస్తులముగా ఉండాలి.

విమోచనకు అవసరమైన బలి కార్యక్రమము ఆదికాండములోనే దేవుడే ప్రారంభించాడు. ఏదెను వనములో ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు, దేవుడు వారి దిగంబరత్వము కప్పుటకు జంతువులను చంపాడు (ఆది 3:21). పాపమునకు శిక్ష మరణము (రోమా 6:23) అను సత్యము వారికి అర్థమైనది. పాపపరిహారార్థ బలి అను సిద్ధాంతము లోని మొదటి పాఠము వారు నేర్చుకున్నారు. దేవుడు వారిని జంతు చర్మముతో కప్పినప్పుడు, ఆయనను నమ్మువారికి నీతిని ఆపాదిస్తాడని తెలుసుకున్నారు. వారి విషయములో ఒక మనిషికి ఒక జంతువు అను ప్రత్యక్షత దేవుడు మొదటిగా చూపించాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి బయటకు వచ్చు సమయంలో దేవుడు వారిని పస్కా ఆచరించమని చెప్పాడు. అక్కడ దేవుడు చూపించిన రెండవ ప్రత్యక్షత ఒక కుటుంబానికి ఒక గొఱ్ఱెపిల్ల సరిపోతుందని. తర్వాత సీనాయి పర్వతముపైన మోషేకు ధర్మశాస్త్రము బోధించినప్పుడు సంవత్సరమునకు ఒక మారు ఇశ్రాయేలు జనాంగమంతటికి పాప పరిహారార్థ బలిగా ఒక గొఱ్ఱెపిల్లను బలిగా ఇవ్వవలెనన్న మూడవ ప్రత్యక్షతను దేవుడిచ్చాడు. ప్రత్యక్షత చివరికి వచ్చినప్పుడు లోక పాపమంతటిని తనపై వేసుకొని, ఒక్కమారే తనను తాను బలిగా అర్పించుకొనుటకు యేసుప్రభువు దేవుని గొఱ్ఱెపిల్లగా వచ్చాడను ప్రత్యక్షత దేవుడు తెలియపరచాడు.

ఈ క్రమబద్ధమైన నాలుగు ప్రత్యక్షతలు మనము ధ్యానించుకుందాము.

**1. ఒక మనిషికి ఒక గొర్రెపిల్ల :** (ఆదికాండము 3:21)

"దేవుడైన యెహోవా ఆదామునకును, అతని భార్యకును చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించెను". ఆయనే స్వయంగా ధరింపచేశాడు. చంపిన గొర్రె రక్తము ఇంకా ఆ చర్మానికి అంటుకొని ఉండవచ్చు. వారి అవిధేయులై పాపము చేశారు. కావున పాపమునకు శిక్ష మరణము వారిపైకి రావాలి కాబట్టి, వారి శిక్ష ఏ పాపములేని ఆ గొర్రెపిల్లపై వేసి దానిని చంపుట ద్వారా వారికి అర్థమయ్యేట్లుగా దేవుడు చేశాడు. అ పాపపు శిక్ష పూర్తిగావించబడిన తర్వాత నీతి వస్త్రమును సూచించు చర్మపు చొక్కాయి వారికి దేవుడు ధరింపచేశాడు. ప్రేమామయుడు, న్యాయమూర్తి అయిన దేవుడు తన స్వభావాన్ని ప్రత్యక్షపరచుకున్న మొదటి విధానమిది. ఈ బలి అర్పణ యేసు ప్రభువు రాబోయే దినాలలో చేసే బలి అర్పణకు సాదృశ్యంగా ఉంది. 2కొరింథీ 5:21లో "మనమయాన యందు దేవుని నీతి అగునట్లు పాప మెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను". అని వ్రాయబడి ఉంది.

**2. ఒక కుటుంబానికి ఒక గొర్రెపిల్ల :**

ఈ ప్రత్యక్షత పస్కా అచరించమని చెప్పుట ద్వారా జరిగింది. నిర్గమకాండము 11 నుండి 15 అధ్యాయాల వరకు ఉన్న వాక్య భాగములో ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు దాస్యము నుండి బయటకు వచ్చే విషయములు గ్రంథస్తము చేయబడి ఉన్నాయి. ఈ 5 అధ్యాయములు నిర్గమకాండమునకే గాక పాతనిబంధనకంతటికిని మూలము. పాత నిబంధనలోని పస్కా మరియు నిర్గమము క్రొత్త నిబంధనలోని యేసుక్రీస్తు మరణము, పునరుత్థానము లంత ప్రాముఖ్యత కలిగి యున్నవి. పస్కా ఆచరించు విధానము దేవుడు మోషేకు వివరించినప్పుడు మూడు ప్రాముఖ్యమైన విషయములు పాటించమని చెప్పాడు....

1. ప్రతి కుటుంబము తన మందలో నుండి దోషములేని ఒక గొర్రెపిల్లను ఎన్నుకొని తన కుటుంబమంతా కలిసి దాని మాంసము తినునట్లు ఏర్పరచుకోవాలి. అది ఒక ఏడాది వయస్సు కలిగి, ఏ దోషమైనను, మచ్చ అయినను లేక పరిపూర్ణంగా ఉండాలి. ఆ నెలలో 10వ తేదీన దానిని ఇంటిలోనికి తీసుకొని, 14వ తేదీ సాయంకాలమున దానిని వధించాలి.

2. గొర్రెపిల్ల రక్తము తీసుకొని ఇంటి గడపలకు అడ్డంగా, నిలువుగా హిస్సోపుతో పూయాలి. ఆ రక్తము ఉన్న ఇండ్లను సంహారదూత దాటిపోతాడు.

3. గొర్రెపిల్లను మొత్తంగా కాల్చాలి. ఆ మాంసము త్వరత్వరగా తినాలి. నడుములు కట్టుకొని, ప్రయాణానికి సిద్ధపడి, పాదరక్షలు ధరించి కర్ర చేతబట్టుకొని తినాలి. ఏదైనా మిగిలితే కాల్చేయాలి. ఏదీ వదిలి పెట్టకూడదు.

ఆ పస్కాను తరతరాలుగా ఆచరిస్తూ ఉండమని దేవుడు వారికి ఆజ్ఞాపించాడు. ఎందుకీవిధంగా ఆజ్ఞాపించాడని ఆలోచిస్తే, ఇందులో రక్షణ గురించిన అద్భుతమైన సత్యాలున్నాయని గ్రహించగలము అవేవనగా :

**ఎ.** దేవుని ఎదుట మనము తప్పు చేసిన వారముగా ఉన్నాము రోమా 3:23లో పౌలు ఈ విధంగా అంటున్నాడు: "ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు". ఇశ్రాయేలు ప్రజలు కూడా దేవుని ఎదుట నిలుచుటకు యోగ్యత లేనివారే. కాని వారు చూపించిన విధేయత ద్వారా రక్షింపబడ్డారు. తమ ఇంటి గడపలపైన హిస్సోపుతో పస్కా గొర్రెపిల్ల రక్తము పూయకుంటే, సంహారదూత వారి ఇండ్లలోని ప్రథమ సంతానమును కూడా వధించేవాడే. ఐగుప్తీయుల లాగా వారు కూడా శోకములో మునిగి ఉండేవారు. వారు తమ దీనస్థితిని తెలుసుకొని, దేవుని మాటవిని, ఆయన మీద ఆధారపడి రక్షింపబడ్డారు.

**బి.** పస్కా మానవుని విశ్వాసమును చూపించుటకు ఒక సాధనముగా ఉన్నది. క్రొత్తనిబంధన పస్కా అర్థము చేసుకోవడానికి దోహదపడుతుంది. హెబ్రీ 11:28 – "తొలిచూలు పిల్లలను నాశనము చేయువాడు ఇశ్రాయేలీయులను ముట్టకుండు నిమిత్తము అతడు విశ్వాసమును బట్టి పస్కాను, రక్తప్రోక్షణ ఆచారమును ఆచరించెను". దేవుడు చెప్పిన మాటలు నమ్మి దాని ప్రకారము నడిచినందున రక్షింపబడ్డారు. నమ్మినవాడు ఆయనను వెంబడిస్తాడు. నమ్మనివాడు నాశనమవుతాడు.

**సి.** రక్తప్రోక్షణ అవసరతను పస్కా తెలియజేస్తుంది. రక్షణ కొరకు రక్తప్రోక్షణ జరగాలి. పస్కాలో ఇది చాలా ప్రాముఖ్యమైనది. గొర్రెపిల్ల చావాలి. లేవీ 17:11లో ఇది ఖచ్చితంగా చెప్పబడి ఉన్నది : "రక్తము దేహమునకు ప్రాణము మీ నిమిత్తము

ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలో నున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును.

క్రొత్త నిబంధనలో కూడా ఈ విషయము చెప్పబడి ఉన్నది: హెబ్రీ 9:22 ప్రకారం "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును". ఈనాడు ప్రజలకు రక్తప్రోక్షణ వలననే రక్షణ వస్తుందను సత్యము ఒప్పుకొనుటకు ఇష్టపడుటలేదు. ఇశ్రాయేలీయులకు కూడా ఇష్టముండి ఉండదు. ఏ ఇశ్రాయేలీయుడైనా తన మందలో నుండి ఒక మంచి గొఱ్ఱెపిల్లను ఇంటిలోకి తీసుకెళ్లి 4 రోజుల తర్వాత దానిని చంపుటకు ఒప్పుకోకపోయి ఉంటే వారి ఇంటిలోని ప్రథమ సంతానము చనిపోయి ఉండేది. వారు ఇశ్రాయేలీయులు కదా అని వారిని వదిలిపెట్టి ఉండేవాడు కాదు దేవుడు. దేవునికి పక్షపాతం లేదు, అందరూ సమానమే.

**డి.** పస్కా యేసయ్య మరణాన్ని సూచిస్తుంది. యేసే పస్కా గొఱ్ఱెపిల్ల. ఈ సత్యము తెలిపే వాక్యభాగాలు చూద్దాము. హెబ్రీ 10:4 "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు, రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము". 1కొరింథీ 5:7 "క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను". 1పేతురు 1:18-19 "వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తము చేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా!"

క్రీస్తు రక్తము పరిపూర్ణమైనదనియు, చాలినదై ఉన్నదనియు ప్రత్యక్ష పరచబడినది.

### 3. జనాంగానికి మొత్తం ఒక గొఱ్ఱెపిల్ల అను ప్రత్యక్షత :

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కిచ్చిన బలియాగ విధానాలలో ఒకటి పాప పరిహారార్ధ బలి. ఈ బలి అచరించు విధానము లేవీయులకు వివరించాడు. సంవత్సరానికి ఒకమారు ప్రధాన యాజకుడు ప్రత్యక్ష గుడారములోని అతిపరిశుద్ధ స్థలములో తన కొరకు, ఇశ్రాయేలు జనాంగము కొరకు ఒక గొఱ్ఱెపిల్లను వధించి, రక్తాన్ని వారిపై ప్రోక్షించవలెనని ఆజ్ఞాపించాడు. బలిపీఠముపై ఈ రక్తాన్ని పోయాలి. ఈ బలి విధానము ఆద్యంతము యేసుప్రభువు సిలువపై చేసిన బలియాగాన్ని సూచిస్తుంది (లేవి 14:14-20).

**4. చివరి ప్రత్యక్షత యేసుప్రభువును గురించినది - లోకమంతటి కొరకు ఒక గొఱ్ఱెపిల్ల :**

యేసుప్రభువు చాలినవాడు. "ప్రధాన యాజకుడు ప్రతి సంవత్సరము తనది కాని రక్తము తీసుకొని పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించినట్లు, ఆయన అనేక పర్యాయములు తన్ను తాను అర్పించుకొనుటకు ప్రవేశింపలేదు" (హెబ్రీ 9:25), "ఒక్క అర్పణ చేత ఈయన పరిశుద్ధపరచబడువారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు" (హెబ్రీ 10:14).

బాప్తీస్మమిచ్చు యోహాను యేసుప్రభువును గురించి చెప్తూ ఆయనను 'లోకపాపము మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల' (యోహాను 1:29)గా వర్ణించాడు. విశ్వాసి యేసు రక్తమును ఆశ్రయించి పరిశుద్ధమైన జీవితమును మరియు పాపముల నుండి విడుదల పొందగలడని 1యోహాను 1:7; 2:3 వరకు ఉన్న వాక్య భాగములో వివరించబడి ఉన్నది.

యేసుప్రభువు మనకందరికి మారుగా అపరాధపరిహారార్థ బలిగా అర్పించ బడినాడనే సత్యమును ఇంకోసారి గుర్తు చేసుకొని, మనలను మనము ఆయనకు సమర్పించుకుంటే, ఆయన చేసిన త్యాగానికి ఫలితముంటుదని అర్థము చేసుకొని ఆయనకు దగ్గరవుదాము. ఆమేన్!

❖ ❖ ❖

# 15. దేవుని సంపూర్ణతయందు పూర్ణులగుట

మన రక్షకుడైన దేవుని సంపూర్ణత యందు పూర్ణులగుటకు ప్రయత్నించే ప్రతి విశ్వాసికి యేసుక్రీస్తు నామమున విజయము కలుగును గాక. యేసు ప్రభువు నందున్న గొప్పతనము అర్థము చేసుకోగలిగితే, ఆయన సారూప్యము లోనికి మారాలన్న ఆశ కలుగుతుంది. కాబట్టి ప్రభువును అర్థము చేసుకొని ఆయన సంపూర్ణతలోనికి ఎదుగుట ఎలా జరుగుతుందో తెలుసుకుందాము.

దేవుని సంపూర్ణతను అర్థం చేసుకొన్న పౌలు ఎఫెసీ పత్రిక 3:14-19లో ఒకే కుటుంబమైన క్రైస్తవ సంఘము కొరకు చేసిన ఒక అద్భుతమైన ప్రార్థనను ధ్యానించుకుందాము. "ఈ హేతువు చేత పరలోమునందును, భూమిమీద ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్లూని, మీరు అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయ చేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణత యందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరు పారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడా దాని వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించు కొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తి గలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను" అని పౌలు మోకాళ్లూని మనందరి కొరకు ప్రార్థిస్తున్నాడు.

ఈ వాక్యభాగమంతా ఒకే వాక్యముగా వ్రాయబడి ఉంది. పౌలు ఉద్దేశము విశదపరుస్తున్నాడు. దేవుని సంపూర్ణత యందు పూర్ణులగుటకును, దేవుని ప్రేమను పొందుకొని, అందులో స్థిరపడి దాని గురించిన అనుభవ జ్ఞానము కలిగి యుండుటకును, దేవుని ప్రేమను అర్థము చేసుకొను నిమిత్తము విశ్వాసులందరూ తమ అంతరంగ పురుషుని బలపరచుకొనుటకు శక్తి నిమ్మని ప్రార్థిస్తున్నాడు. అంతరంగ

పురుషుడు బలపడాలంటే విశ్వాసము ద్వారా క్రీస్తు మనలో నివసించాలి. క్రీస్తు మనలో నివసించాలంటే, తన మహిమైశ్వర్యము చొప్పున ఆయనే తన కృపతో ఆ ధన్యత దయచేయాలని అని చెప్తున్నాడు. ఎన్ని విషయాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయో గమనించండి. ఇంతకూ మనము అర్థము చేసుకోవలసినది ఏమంటే దేవుని ప్రేమను అర్థము చేసుకోవాలన్నా, ఆయన ప్రేమను పొందుకొని అందులో స్థిరపడవలెనన్నా, ఆయన సంపూర్ణతలో పూర్ణులమవ్వవలెనన్నా మనకు కావలసినది దేవుని శక్తి. ఆ శక్తి మనకు దయచేయమని మనందరి కొరకు పౌలు ప్రార్థిస్తున్నాడు. సంపద, స్వస్థత కొరకు కాదు గాని, ఆత్మ సంబంధమైన వాటి కొరకు, సంఘము యొక్క ఆధ్యాత్మిక పరిపక్వత కొరకు ప్రార్థిస్తున్నాడు. అంతరంగ పురుషునిలో ఆత్మ సంబంధమైన శక్తి దేవుని ఆత్మమూలముగా మాత్రమే వస్తుంది. ఈ శక్తి పౌలు ఎఫెసీ 1:18లో చెప్పిన “అపరిమితమైన శక్తి”. ఈ శక్తిని అనుభవ పూర్వకముగా పౌలు పొందుచున్నందున ఖచ్చితంగా చెప్పగలుగుచున్నాడు. “నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను”.

పౌలు తన ప్రార్థనలోని రెండవ భాగములో మన హృదయాలలో క్రీస్తు (ఆయన పరిశుద్ధాత్మ) నివసించాలని ప్రార్థిస్తున్నాడు. ఈ భాగములో పౌలు త్రిత్వమై ఉన్న దేవుని గురించి మాట్లాడుతున్నాడు. 14వ వచనములో ‘తండ్రి’, 16లో ‘పరిశుద్ధాత్మ’, 17లో కుమారుడైన ‘క్రీస్తు’ను గురించి చెప్పడములో త్రిత్వదేవుని కలిగి ఉండుటలోని అద్భుతమైన అనుభవమును వివరిస్తున్నాడు. ఈ వివరణ యొక్క ఉద్దేశమేమనగా మనము క్రీస్తును గురించి ఎక్కువగా తెలిసికొన్న కొలది, మనపట్ల క్రీస్తుకు ఉన్న అపారమైన ప్రేమను బట్టి ఆశ్చర్యపోతాము.

దేవుని సంపూర్ణత క్రీస్తు నందు మాత్రమే ఉన్నది. కాబట్టి ఆయన మనలో నివసిస్తేనే మనము ఆయన సారూప్యములోనికి మారి, ఆయన పూర్ణతలోనికి రాగలము. మనలో ఉన్న క్రీస్తు ఆత్మ ద్వారా మన హృదయాలలో ఆయన ప్రేమ నిండుతుంది. “మనకు అనుగ్రహింపబడి పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడి యున్నది” అని రోమా 5:5లో వ్రాయబడి ఉన్నది. మనలో క్రీస్తు నివసిస్తే మనము “ప్రేమ యందు వేరు పారి స్థిరపడగలము”. ప్రేమలో వేరు పారిన వృక్షములా ఉంటాము. లేక ప్రేమ పునాదిపై నిర్మించిన గృహములా ఉంటాము. క్రీస్తు ప్రేమ యొక్క గొప్పతనము తెలుసుకొంటే గాని మనము పూర్ణులము కాలేమని తెలిసిన పౌలు, మనమందరము పరిశుద్ధులందరి లాగా దాని వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించాలని కోరుకొంటున్నాడు. లేఖనాలలోని పరిశుద్ధులు ఆయన ప్రేమను గురించి గొప్పగా చెప్పుకున్నారు.

ఆదికాండము 22:2-16లో "దేవుడు అబ్రాహాముకు పెట్టిన పరీక్ష, అందులో ఆయన తన ఏకైక కుమారుని బలిగా ఇచ్చుటకు వెనుదీయని తరుణంలో అతనికి బలి పశువును సమకూర్చుటలో దేవుడు తన ప్రేమను చూపెట్టాడు". ద్వితీయోపదేశ కాండము 32లో మోషే ఆలపించిన స్తుతిగీతంలో ఇశ్రాయేలీయులకు అనుగ్రహించిన దాస్య విముక్తిని బట్టి యెహోవా దేవుని స్తుతించుటలో దేవుని ప్రేమను మనకు తెలియజేస్తున్నాడు. దావీదు 18వ కీర్తనలో అతని శత్రువులందరి చేతిలో నుండి తనను కాపాడిన దేవుని స్తుతిస్తూ ఆయన తన పట్ల చూపించిన ప్రేమను వెల్లడిపరుస్తున్నాడు

క్రీస్తు ప్రేమ అందరిని హత్తుకో గలిగినంత 'వెడల్పైనది', అది నిత్యము నిలిచేటంత 'పొడవైనది'; అట్టగునున్న పాపిని కూడా చేరేంత లోతైనది పాపిని పరలోకానికి ఎత్తగలిగినంత 'ఎత్తైనది'. బైబిలు ప్రకారము 'వెడల్పు' అంటే 'భూమి వైశాల్యత' (యోబు 38:18) అనియు; 'పొడవు' అంటే 'సదాకాలము' (కీర్తన 21:4)అనియు; 'లోతు' అంటే పాపమునే పాతాళములో నున్న పాపి దగ్గరకి చేరేంతదనియు; 'ఎత్తు' అంటే క్రీస్తు తనతో కూడా మనలను కూర్చోబెట్టుకోబోయే పరలోకమంత ఎత్తనియు (ఎఫెసీ 1:21) తెలుసుకొనవలెను. క్రీస్తు ప్రేమకు అతి గొప్ప చిహ్నము ఆయన సిలువ. దాని అడ్డకర్ర తూర్పు నుండి పడమర వరకు చేరగలదు. దాని నిలువు కర్ర భూమి నుండి ఆకాశమునకు చేరగలదు. ఆ ప్రేమను అర్థము చేసుకొనుటయే ఆత్మీయ పరిపక్వత, అదే దేవుని సంపూర్ణతలో పూర్ణులగుట.

దేవుని సంపూర్ణతతో నింపబడమంటే అర్థమేమిటి? ఎఫెసీ 1:3 ప్రకారము దేవుని సంపూర్ణతలో 'పరలోక విషయాలలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము' ఇమిడి ఉన్నది. అందులో 'ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమున్నది' (ఎఫెసీ 1:18); ఆయన 'శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమున్నది' (ఎఫెసీ 1:19). చివరిగా ఆయన తన పరిశుద్ధాత్మ ద్వారా మన హృదయాలలో క్రీస్తును నివసింప చేసుకొంటే దేవుని సంపూర్ణత అంతా మనలోకి వచ్చి మనము పూర్ణులము గావించబడతాము.

మనము ప్రభువును తెలిసికొనక ముందు మనయందున్న అంతరంగ పురుషుడు మృతుడై ఉన్నాడు. ఎఫెసీ 2:1-5 ప్రకారము 'మనము మన అపరాధముల చేత చచ్చిన వారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహాప్రేమ

చేత మనలను క్రీస్తుతో కూడా బ్రతికించెను'. ఆయన మనలో పోసిన జీవము ద్వారా మన ఆత్మీయ కన్నులు, చెవులు తెరువబడి, పరిశుద్ధాత్మ ద్వారా మనకివ్వబడిన శక్తిని పొందుతున్నాము. యేసుప్రభువు కూడా ఈ లోకానికి రాకముందు, పరిచర్యలో ప్రవేశించక మునుపు పరిశుద్ధాత్మ ద్వారా శక్తి పొందినట్లుగా మనము చూడగలము. మత్తయి 3:16లో బాప్తీస్మమిచ్చు యోహాను ద్వారా బాప్తీస్మము పొందినప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు పావుర రూపములో ఆయన మీద వ్రాలినట్లుగా చూస్తున్నాము. ఈ విషయము ప్రవచనాత్మకంగా యెషయా 42:1లో చెప్పబడి ఉన్నది.

తన సేవకుని (యేసుక్రీస్తుని) బలపరచుటకు 'అతని యందు నా ఆత్మను ఉంచి యున్నాను' అని దేవుడు చెప్పుట చూస్తున్నాము. అపొ.కా. 10:37,38లో పేతురు యేసు ప్రభువును గురించి చెప్తూ గలిలయలోని తన పరిచర్య మొదలు పెట్టక ముందు ఆత్మాభిషేకము పొందాడనియు, ఆ శక్తి చేతనే అందరికి మేలు చేయుచు, స్వస్థపరుస్తూ సంచరించాడనియు చెప్పాడు. అపొ.కార్యములు 1:8లో క్రీస్తు తన శిష్యులతో పరిశుద్ధాత్మ శక్తి పొందిన తరువాత సువార్త ప్రకటించుటకు వెళ్లమని చెప్పాడు. మనము కూడా పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మనలోని అంతరంగ మనిషిని బలోపేతము చేసుకొని దేవుని పరిపూర్ణతలోకి వెళ్లాలని కోరుతున్నాడు. యేసుప్రభువే స్వయంగా మత్తయి 5:48లో 'మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు' అంటున్నాడు.

దేవుని సంపూర్ణత యందు పూర్ణులగుట కొరకు పరిశుద్ధాత్మ శక్తి అవసరమని చెప్పి, దాని నిమిత్తము ప్రార్థించిన పౌలు ఆ శక్తి ద్వారా మనకు లభించు ఆశీర్వాదములను కూడా తెలుపుతున్నాడు. మనము పరిశుద్ధాత్మ శక్తి పొందినపుడు సమస్త ఆనందము, సమాధానము కలుగుతుందనియు (రోమా 15:13); నీతి ఫలములతో నింపబడుతామనియు (ఫిలిప్పీ 1:9-11); సంపూర్ణ జ్ఞానము, ఆత్మ సంబంధమైన వివేకము కలిగి ప్రతి సత్కార్యములో సఫలులగుదమనియు; అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టు వారమగుదుమనియు (కొలొస్స 1:12) పౌలు వివరిస్తున్నాడు.

మన ఆత్మీయ జీవిత గమ్యము ప్రభువును సంతోషపెట్టుటయే గనుక ప్రభువు నందు పరిపూర్ణులగుటయే ముఖ్య తీర్మానముగా తీసుకొనవలెనని కోరుతూ, తీర్మానాన్ని దృఢపరుచుటకు దేవుని సహాయము కొరకు ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 16. మన స్నేహితుడైన యేసయ్య

యేసయ్యను స్నేహితునిగాగల ధన్యులందరికీ వందనములు. తనకు స్నేహితులుగా జీవించే గొప్ప భాగ్యము ప్రభువు మనకనుగ్రహించాడు. సత్యము యొక్క అనుభవ జ్ఞానము మనము పొందుకొనుటకు గాను యేసయ్య తన శిష్యులతో చెప్పిన కొన్ని విషయాలు ధ్యానించుకొందాము.

యోహాను 15:12-15 వచనాలలో ఈ విధముగా వ్రాయబడియున్నది. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటే ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులై యుందురు. దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని". తన స్నేహితులుగా ఉండాలనుకొనువారు తాను ఆజ్ఞాపించిన వాటిని చేయవలసి ఉంటుందనే షరతును పెడుతున్నాడు. తాను మనలను ప్రేమించిన ప్రకారము మనము ఇతరులను ప్రేమిస్తే ఆయన మన స్నేహితునిగా ఉండడమే గాకుండా తన తండ్రి వలన వినిన సంగతులన్నిటిని వాటి మర్మములను తెలియజేస్తానంటున్నాడు. ఆయన ప్రేమ ప్రాణము పెట్టు ప్రేమ, కాబట్టి మనము కూడా మన స్నేహితుల కొరకు ప్రాణము పెట్టబద్ధులమై ఉన్నామని 1యోహాను 3:16లో వ్రాయబడి ఉన్నది. మనము దాసులముగా ఉండక తన స్నేహితులుగా ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు.

"స్నేహితుడు" అను మాటకు 'ఒకనికి ప్రతినిధిగా పాల్గొనే వ్యక్తి', 'బాధ్యత వహించేవాడు', 'సానుభూతి చూపేవాడు', 'సహాయము చేసేవాడు', 'పోషకుడు', 'తన పక్షాన ఉన్నవాడు' అనే అర్థాలను నిఘంటువులో చూడవచ్చు. పై లక్షణాలన్ని

మన ప్రభువులో మనము చూడగలము. మనకు బదులుగా మన పాపశిక్ష అనుభవించిన వాడిగా చూశాము. మన కొరకు తన్నుతాను సిలువలో అప్పగించుకొని, పాపము వలన మనము పొందవలసిన మరణ శిక్ష ఆయనే పొందాడు. ఏ పాపము లేని ఆయన మన పాపములన్నీ తనపై వేసుకొని పాపముగా చేయబడ్డాడు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28) అని చెప్పిన యేసయ్యలో మన పట్ల ఆయనకున్న బాధ్యత, సానుభూతి, సహాయమును చేసేవాడిగా కనబడుతున్నాడు. యెహోవా యీరే, యెహోవా రాఫా అను మన దేవుడు మనలను పోషిస్తూ, స్వస్థత నిస్తూ, మన పక్షాన తండ్రికి విజ్ఞాపనలు చేయువాడిగా కనబడుతున్నాడు.

సర్వసృష్టికర్త, సర్వాధికారి, సార్వభౌముడైన మన దేవునిని స్నేహితునిగా కలిగి ఉండుటకు మనము ఎంతైనా ప్రయత్నించాలి.

ఇహలోక స్నేహితులు ఎంతమంది ఉన్నను, క్లిష్టపరిస్థితులలో మనలను ఎలా విడిచిపోతారో తెలిసికొనుటకు బైబిలు నుండి దానియేలు జీవితములో నుండి ఒక ఉదాహరణను మీకు చూపించాలని ఆశపడుతున్నాను. దానియేలును సింహముల గుహలో పడద్రోసే సన్నివేశాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాము. యూదుడైన దానియేలు ఇశ్రాయేలు దేశములో ఉండవలసి ఉండగా, పదునాలుగేండ్ల వయసులోనే ఒక బందీగా బబులోను రాజ్యమునకు తేబడ్డాడు. ఇది 2రాజులు20:16-18 వచనములో యెషయా ప్రవక్త హిజ్కియా రాజునకు చెప్పిన ప్రవచన ప్రకారము జరిగింది. ఈ ప్రవచనము ఇలా ఉన్నది. "అంతట యెషయా హిజ్కియాతో ఇట్లనెను - యెహోవా సెలవిచ్చిన మాట వినుము. వచ్చు దినములలో ఏమియు మిగులుకుండ నీ నగరునందున్న సమస్తమును, నేటివరకు నీ పితరులు సమకూర్చి దాచిపెట్టిన దంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొనిపోబడునని యెహోవా సెలవిచ్చు చున్నాడు. మరియు నీ గర్భమందు పుట్టిన నీ పుత్రసంతును బబులోను రాజు నగరు నందు నపుంసకులుగా చేయుటకై వారు తీసుకొని పోవుదురు". ఈ ప్రవచన ప్రకారము రాజవంశములో పుట్టిన దానియేలు బబులోనులో నెబుకద్నెజరు రాజు ఆస్థానంలో ప్రముఖుడిగా జీవించాడు. నెబుకద్నెజరు 70 సంవత్సరములు ఏలిన తర్వాత అతని కుమారుడైన బెల్షష్షరు చేసిన తప్పు వలన అతను రాజ్యము కోల్పోయి పారశీక

రాజైన దర్యావేషునకు రాజ్యము ఇవ్వబడిన పిదప దానియేలు ప్రధానిగా నియమింపబడ్డాడు. దానియేలు ఎప్పుడూ తను చేసిన ప్రతి పనిలో దేవుని మహిమ పరచినందున దేవుడు అతనిని శత్రువుల ద్వారా ఘనపరచాడు.

దానియేలు 6:3లో దానియేలు 'అతిశ్రేష్టమైన బుద్ధిగలవాడు' అని వ్రాయబడింది. దర్యావేషు దానియేలును ఇష్టపడుటకు కొన్ని కారణములు మనకు కనబడుతున్నవి. అతిశ్రేష్టమైన బుద్ధిగలవాడు, రాజుకు నష్టము కలుగకుండా అధిపతుల యొద్ద నిజాయితీగా లెక్కలు ఒప్పజెప్పించుకొనగల సామర్థ్యము గలవాడు. ప్రధానులలోను, అధిపతులలోను మంచి పేరు గడించినవాడు. బబులోను రాజుల కాలంలో కూడా శ్రేష్టుడు. అన్నిటికీ మించి దైవానుగ్రహము గలవాడు 85 సంవత్సరాల అనుభవజ్ఞానము గల వృద్ధుడు, స్వార్థ చింతన లేనివాడు. కావున తనకు చాలా ప్రయోజకరముగా ఉంటాడని తెలుసుకొన్న రాజు దానియేలును ఇష్టపడుతున్నాడు. ఈ కారణాల వలననే స్నేహము చేసినట్లుగా అనుకొనువచ్చును. ఇందుకు పూర్తి విరుద్ధంగా మన స్నేహితుడైన యేసయ్య మనలో ఏ యోగ్యత లేకున్నను, పాప స్థితిలో కడు దీనస్థితిలో, సాతాను దాస్యములో మగ్గుతున్న మనలను తన స్నేహితుల నుగా చేయనాశిస్తున్నాడు. మనమాస్థితిలో ఉండగానే  మన కొరకు తన ప్రాణము పెట్టాడు. రోమా 5:8లో "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచు చున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" అని వ్రాయబడి ఉంది. ఇహలోక సంబంధులు మన నుంచి ఏదో ఆశించి స్నేహము చేస్తారు అనే విషయము మనము గమనించి జాగ్రత్తగా ఉండాలి. "ఈ లోక స్నేహము దేవునితో వైరము" అను సంగతి కూడా మనము గుర్తుంచుకోవాలి.

దర్యావేషు రాజు దానియేలును ప్రధానమంత్రిగా చేయాలనుకొన్నప్పుడు మిగిలిన అధికారులకు అసూయ కలిగింది. దేవుని బిడ్డలు ఎదుగుతూ ఉంటే అన్యులు సహించలేరు. సంఖ్యాకాండము 12వ అధ్యాయములో మోషే పట్ల తన స్వంత అన్నకు, అక్కకు అసూయ కలిగినట్లు చూస్తున్నాము. దానియేలు పట్ల అసూయ కలిగి వారు అతనిలో తప్పులు కనిపెట్టుటకు ప్రయత్నించారు గాని అతను నమ్మకమైన వాడు కాబట్టి ఏ తప్పూ కనపడలేదు. పనిలో ఏ తప్పు కనపడలేదు కాబట్టి ఆయన

విశ్వాసము మీద గురి పెట్టారు. దేవుని ఆజ్ఞలకు, లోకాజ్ఞలకు మధ్య గొడవ పెట్టుటకు ప్రయత్నిస్తున్నారు. విశ్వాసములో స్థిరంగా లేకపోతే పడిపోయే అవకాశాలుంటాయి. రాజుకు సరైన సలహాదారులు లేకుండుట చేత, రాజు వారు పన్నిన కుట్రలో తనకు ఇష్టము లేకున్నను పాలివాడయ్యాడు. రాజు నొద్ద దేవుని యందు భయభక్తులు లేని వారు చేరితే, దేవుని బిడ్డలు శ్రమలపాలవుతారు. కాబట్టి 1తిమోతి 2:1,2లో చెప్పబడినట్లు మనము రాజుల కొరకును, అధికారుల కొరకును ప్రార్థించవలెను.

దానియేలు 6:5-10 వరకు ఉన్న వాక్య భాగములో దానియేలుకు వచ్చిన శ్రమ, పరీక్ష గురించి వ్రాయబడి ఉంది. శత్రువులు కుట్ర పన్ని ముప్పది దినములు రాజునకు తప్ప ఏ దేవునికిని, మానవునికి విన్నపము చేసికోకూడదనే శాసనము ఒకటి పుట్టించి, దానిని మీరిన వారిని సింహముల గుహలో వేయునట్లు శిక్ష కూడా ఏర్పరచి రాజు దగ్గర సంతకము చేయించారు. ఒకసారి రాజు ముద్ర వేశాడంటే తాను కూడా తీయలేడు. అటువంటి పరిస్థితిలో దానియేలు తన అలవాటు ప్రకారము యెరూషలేము తట్టునకు తెరువబడిన తన గది కిటికీ యొద్ద ముమ్మారు దేవునికి ప్రార్థన చేశాడు. తాను నమ్మిన దేవుని సేవించుటకు వెళ్తూ ఉన్నప్పుడే దానియేలుకు తెలుసు తాను సింహాల గుహలోకి వెళ్తున్నానని. ఆ పరిస్థితిలో ఎవరున్నా పరిస్థితులకు రాజీపడి ఉండేవారు. కాని దానియేలు ఎట్టి పరిస్థితులలోను తాను నమ్మిన దేవుని వీడదలచుకోలేదు. తర్వాత శత్రువులు రాజు యొద్దకు వెళ్లి దానియేలు చేసిన ఆజ్ఞాతిక్రమము వివరించి, సింహముల గుహలో పడద్రోయ నాజ్ఞాపించమని చెప్పినప్పుడు "రాజు ఈ మాట విని బహుగా వ్యాకులపడి, దానియేలును రక్షింప వలెనని తన మనస్సు దృఢము చేసికొని, సూర్యదస్తమించు వరకు అతని విడిపించుటకు ప్రయత్నము చేసెను". దానియేలును మంచి స్నేహితునిగా స్వీకరించిన రాజు అతనిని రక్షింప శక్తి గలవాడైనప్పటికినీ, తన పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయనే భయంతో ఏమీ చేయకుండా మరణానికి అప్పగించి రాత్రంతా చింతిస్తూ గడిపాడు. పైపెచ్చు దేవుని మీద భారము వేయమని, "నీవు అనుదినము తప్పక సేవించుచున్న నీ దేవుడే నిన్ను రక్షించునని" దానియేలుతో చెప్పెను.

మన స్నేహితుడైన యేసయ్యకు, ఇహలోక స్నేహితుడైన రాజుకు ఉన్న తేడాలు గమనించవచ్చును. దేవుడు ఏ పరిస్థితిలోనూ మన చేయి విడువడు. ద్వితీ 4:31లో

చెప్పినట్లుగా మన స్నేహితుడు "కనికరము గల దేవుడు గనుక నిన్ను చేయ్యి విడువడు. నిన్ను నాశనము చేయడు".

**ఇంత గొప్ప స్నేహితుని కలిగి ఉండాలంటే మనకు 5 లక్షణాలుండాలి.**

1. ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగి ఉండి దేవుని ఆజ్ఞలు పాటించాలి. క్రీస్తులో నిలిచి ఉంటేనే ఇతరులను ప్రేమించగలము.

2. స్నేహితులమైన మనకు దాసులకు తెలియని అంతరంగ విషయాలన్ని తెలిసి ఉండాలి. వాక్యమైన దేవునిని మనసులో నింపుకొని, ధ్యానించి, అర్థము చేసుకొని, జీవితములో అన్వయించుకోవాలి.

3. ఆయన పక్షముగా వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేసి, ఆయన కొరకు మానవ జాతిని సిద్ధపచరగలగాలి.

4. మన జీవితాలలో ఫలము కనబడాలి. కొబ్బరి చెట్టుకు మొవ్వలు వచ్చినప్పుడు చాలా పిందెలుంటాయి. గాని చాలా పిందెలు రాలిపోతాయి. నిలిచినవే కాయలవుతాయి. ఎంతోమంది వస్తారు కాని నిజమైన స్నేహితులే నిలుస్తారు.

5. స్నేహితులు యేసు నామమున ఏమడిగినా తండ్రి ఇస్తాడు కాబట్టి ఇతరుల కొరకు అడిగే వారిగా ఉండాలి.

"నీ స్నేహితుడు ఏవరో చెప్పు, దానిని బట్టి నీవెలాంటి వాడివో నేను చెప్తాను" అనే లోకోక్తి ఉంది. అందుకే మన స్నేహితుడు యేసయ్య అని చెప్పగలిగే స్థితిలోకి రావాలని మిమ్ములను కోరుతూ ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 17. దైవిక ఉపకారములు

దావీదు రాజులాగా మనము కూడా దేవుడు చేసిన మేలులు మరువక ఆయనను పూర్ణ మనస్సుతో, పూర్ణ ఆత్మతో సన్నుతించాలంటే ముందుగా ఆయన మనకు చేసిన ఉపకారములు గుర్తుచేసుకోవాలి. విశ్వాసులమైన మనమందరము ఇహలోక పరంగా, మన అనుదిన జీవితాలలో ఆయన చేస్తున్న మేలులను బట్టి స్తుతించుట సర్వసాధారణంగా జరుగుతూ ఉంటుంది. కాని ఆయన చేసిన శ్రేష్ఠమైన, ఆత్మీయపరమైన, పరలోక సంబంధమైన దైవిక ఉపకారములను గుర్తుచేసుకోవడము లేదు.

దావీదు కీర్తన 103లో 1-6 వచనములలో దావీదు దేవుడు చేసిన ఉపకారములను గుర్తుచేసుకుంటూ ఆయనను స్తుతిస్తున్నాడు. 3-6 వచనములలో చెప్పబడిన 7 ఉపకారములు ధ్యానించుకుందాము :

“ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు, నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు. సమాధిలో నుండి నీ ప్రాణమును విమోచించుచున్నాడు. కరుణా కటాక్షములను నీకు కిరీటముగా ఉంచుచున్నాడు. పక్షిరాజు యౌవనము వలే నీ యౌవనము క్రొత్తదగుచుండునట్లు మేలుతో నీ హృదయమును తృప్తిపరచుచున్నాడు, యెహోవా నీతిక్రియలను జరిగించుచు బాధింపబడు వారికందరికి న్యాయము తీర్చును”.

103వ సంకీర్తనలో దేవుడు మానవాళికంతటికీ చేసిన ఉపకారములను దావీదు చెప్తున్నాడు. ఇక్కడ విన్నపములు ఏమీ కనపడవు. కేవలము ప్రభువును స్తుతించుట మాత్రమే కనపడుతుంది. ఈ కీర్తన ధ్యానించు చున్నప్పుడు దేవుడు తన నిబంధన యందు విధేయత చూపినప్పుడే ఇశ్రాయేలీయులను ఆశీర్వదించేవాడని గుర్తు చేసుకోవాలి. అదే విధంగా ఈనాడు కూడా విశ్వాసులు ఆయన చిత్తప్రకారము జీవిస్తేనే దేవుని మంచితనాన్ని అనుభవించగలరు. దేవుడిచ్చిన ఆశీర్వాదాలను పొంది, అనుభవించిన తర్వాత దేవుని మరచిపోరాదని దావీదు హెచ్చరిస్తున్నాడు.

"యెహోవాను సన్నుతించుట" అంటే దేవుడు ఏమై ఉన్నాడో, ఏమేమి చేయగలడో, అందును బట్టి మన ప్రేమ, కృతజ్ఞతలు తెలుపుట ద్వారా ఆయన మనసును ఆనందపరచుట. ఇహలోకములో కూడా పిల్లలు తల్లిదండ్రుల నుండి ఏమీ ఆశించకుండా కేవలము ప్రేమించి, కృతజ్ఞతలు చెప్తే, వారు చాలా సంతోషిస్తారు. కృతజ్ఞత నిండిన మనసులో నుండి నిజమైన స్తుతి, ఆరాధనలు వస్తాయి. వారి స్తుతుల ద్వారా దేవుడు మహిమ పరచబడుతాడు.

"నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము" అనుటలో, "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:24) అను వాక్యానుసారము దావీదు తన ఆత్మతో చెప్పుకుంటున్నాడు. "అంతరంగమున నున్న సమస్తమా" అనుటలో సంపూర్ణ సమర్పణ కనపడుతుంది. శరీరము, మనసు, ఆత్మ సంపూర్ణముగా దేవునికి సమర్పించుకొని ఆరాధించమని ఆయన భావము. స్తుతించిన తర్వాత మనము ఆయన చిత్తానుసారముగా కనబడుటకు సిద్ధపడుతాము.

"ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము" అనుటలో ఆయనొక్కడే పరిశుద్ధుడు పరలోకంలో ఎల్లవేళలా కెరూబులు, సెరాపులు "పరిశుద్ధుడు, పరిశుద్ధుడు" అని కొనియాడే గొప్ప దేవుని మనము స్తుతించాలని దావీదు చెప్తున్నాడు. "నేను పరిశుద్ధడను కాబట్టి మీరును పరిశుద్ధులుగా ఉండుడి" అని మనకు చెప్పడమే కాకుండా మనలను పరిశుద్ధులనుగా చేయుటకు మార్గము ఏర్పరచిన మన ప్రభువును స్తుతించాలని గుర్తుచేస్తున్నాడు. దేవుడు మనకు చేసిన ప్రాముఖ్యమైన ఉపకారములను దావీదు చూపిస్తున్నాడు. అవేమనగా క్షమాపణ, స్వస్థత, విమోచన, కరుణా కటాక్షములు, నూతన పరచబడుట, తృప్తిపరచబడుట మరియు న్యాయము పొందుట. ఈ విషయాలను ధ్యానించుకుందాము.

## 1. మన దోషములన్నీ క్షమించాడు :

మార్కు 2:10 లో ప్రభువే స్వయంగా ఈ సత్యాన్ని ధృవీకరిస్తున్నాడు : "పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలుసుకొనవలెను". యేసుక్రీస్తును నమ్మినవారికి దేవుని క్షమాపణ కలిగియున్నది"అని పౌలు అంటున్నాడు. "కలిగియున్నది" అనే మాట వాడుటలో

మనకు క్షమాపణ అనే కార్యము జరిగిపోయిందని విశ్వసించాలని చెప్తున్నాడు. కొలొస్స 1:14లో కూడా "కుమారుని యందు మనకు పాపక్షమాపణ కలుగుచున్నది" అని చెప్తున్నాడు. దేవుని కృపతో నిండిన క్షమాపణ దావీదు అనుభవించాడు. మన దోషములన్నింటిని క్షమించినందున మనము దేవుని సన్నుతించాలి. రక్తమువలె ఎఱ్ఱనివైనా మన పాపములను హిమము కంటే తెల్లగా చేయడమనునది మాటల కందనంత గొప్ప అద్భుతము. ఇది కేవలము దైవ కృపవలన మాత్రమే సాధ్యము. ఒకాయన తన సమాధిపైన "క్షమించబడ్డాను" అనే ఒకే మాట వ్రాయించుకున్నాడు. మనము కూడా అదే కోరుకోవాలి. మన పాపములన్నీ క్షమించబడ్డాయనియు, ఇకపై వాటిని దేవుడు గుర్తు చేసుకోబోడనియు తెలిస్తే మనకు అంతకు మించి కోరదగినది ఏమీ ఉండదు. క్రీస్తు ప్రశస్త రక్తము ద్వారా మన పాపములన్నీ క్షమించబడ్డాయి. ఎంత గొప్ప ఉపకారము గదా!

## 2. మన సంకటములన్నిటిని కుదుర్చువాడు :

మన రోగాలన్నీ స్వస్థపరుస్తాడు. ఈ స్వస్థతలను గురించి మనందరికీ చాలా అనుమానాలుండి ఉంటాయి. వాటిలోకి పోకముందు మనం గమనించాల్సిన విషయము స్వస్థత క్షమాపణ తర్వాతనే వస్తుంది. శారీరకస్థితి, మానసిక పరిస్థితికి బాగా దగ్గర సంబంధమున్నది. రోగాలన్నీ పాపముతో సంబంధము కలిగి ఉండవు కాని కొన్నింటికి ఉంటాయి. కాబట్టి స్వస్థతకు ముందు క్షమాపణ రావాలి.

"సంకటములన్నిటిని" అని వ్రాయబడి ఉంది కదా, మరి కొన్ని రోగాలకు స్వస్థత రావడము లేదే అనే అనుమానమున్న వారికి కొన్ని సత్యాలు తెలియాలి. నిజమైన స్వస్థత దేవుని యొద్ద నుండే వస్తుంది. ఆయన అన్ని రోగాలు స్వస్థపరచగలడు. ఆయన శక్తికి పరిమితి లేదు. కాబట్టి ఆయన ఈ లోకంలో ఉన్నప్పుడు ఆయన దగ్గరికి వచ్చిన వారందరినీ స్వస్థపరచాడు (మత్త 8:17). వెయ్యేండ్ల పాలనలో రోగాలన్నీ స్వస్థపరుస్తాడని ప్రవచనాత్మకంగా యెషయా 33:24లోను, యిర్మీయా 30:17లోను చెప్పబడి ఉంది. విశ్వాసులెవరికీ సంపూర్ణ స్వస్థత ఇప్పుడు కలుగదు. ఏదైనా ఆయన చిత్తమైతేనే కలుగుతుందని తెలుసుకోవాలి. మనందరికీ మరణము తథ్యము. కాబట్టి స్వస్థతలు ఆయన ప్రణాళిక ప్రకారమే జరుగుతాయి.

**3. ఆయన విమోచించువాడు :**

ఆయన మనలను స్వస్థపరచుటయే గాకుండా పాతాళమనే ఊబి నుండి విమోచించాడు. అంతేగాక అనుదిన ప్రమాదాలు, బాధ కలిగించే పరిస్థితుల నుండి కాపాడుతాడు. మనము పరలోకానికి వెళ్ళినపుడు ఎన్నిసార్లు, ఎన్ని ఆపదల నుండి దేవుడు మనలను విమోచించాడో మనకు తెలుస్తుంది. కీర్తన 91:4లో "ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును" అనియు, కీర్తన 91:7లో "నీ ప్రక్కన వేయిమంది పడినను, నీ కుడి ప్రక్కకు పదివేల మంది కూలినను అపాయము నీ యొద్దకు రాదు" అని చెప్తున్నాడు. అందుకే మనము ఆయనను సన్నుతించాలి. విమోచన అనగానే ఇశ్రాయేలీయులకు ఐగుప్తు దాస్యము నుండి విడుదల గుర్తుకు వస్తుంది. నరకమనే గోతినుండి ప్రభువు మనలను రక్షించుట వివరిస్తుంది. దావీదు చాలామార్లు మరణపుటంచుల యొద్దకు వెళ్లాడు. కాబట్టి అనుభవజ్ఞానముతో రాస్తున్నాడు.

**4. కరుణాకటాక్షములు కిరీటముగా ఉంచుచున్నాడు :**

ప్రభువును తెలుసుకొనక ముందు ప్రేమలేని, అపరాధ పరిస్థితులలో జీవిస్తున్న మనకు ఈ కిరీటము ఎంత అద్భుతంగా ఉంటుందో ఊహించుకోండి. నిత్యమైన ప్రేమతో ప్రేమించబడి, ఆయన కృప ప్రతిరోజు మనపై కుమ్మరించబడుతున్నది. ఇహలోక కిరీటముల గురించి తెలుసుకున్న దావీదు రాజు ఆ కిరీటములు దేవుడిచ్చిన ప్రేమ, కరుణకు సాటిరావు అంటున్నాడు. విశ్వాసులు క్రీస్తు ద్వారా రాజ్యమేలుతారని ప్రకటన గ్రంథములో ఉన్నది.

**5. పక్షిరాజు యవ్వనము వలె నీ యవ్వనము క్రొత్తది చేయబడుతుంది :**

రోగాలు, మన చుట్టూ ఉన్న ప్రతికూల పరిస్థితులు మన శరీరాన్ని ప్రభావితము చేస్తాయేమో కాని మన ఆత్మను ముట్టలేవు. 2కొరింథీ. 4:16లో పౌలు "మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడు చున్నాడు" అంటున్నాడు. పక్షిరాజు దీర్ఘాయుష్షు, ఉన్నతమైన బలము కలిగి ఉంటుంది. కీర్తనాకారుడు చెప్తున్నదేమంటే దేవునిలో నివసించువాడు నిరంతరము ఉత్తేజింప బడుతుంటాడు. పక్షిరాజు లాగా శక్తినుండి అధికశక్తికి, ఒక స్థానము నుండి అధిక స్థానానికి వెళతాడు.

### 6. మేలుతో తృప్తిపరుస్తాడు :

యెహోవా యందు భయభక్తులు గలవారికి ఏ మేలు చేయక మానడని లేఖనాలు చెప్తున్నాయి. మనము జీవించినంత కాలము మన జీవితాన్ని మేలులతో నింపుతాడు. ఆశపడు హృదయాన్ని తృప్తిపరచేవాడు మన దేవుడు. ఈ లోకంలో తృప్తిలేదు కాని జీవాహారమైన ఆయన మనకు తృప్తినిస్తాడు (యోహాను 6:33-40). పచ్చిక బయళ్ళలో నడిపించే మంచి కాపరి కాబట్టి ఆయనను స్తుతించాలి.

### 7. బాధింపబడు వారికందరికీ న్యాయము తీర్చును :

ఇందును బట్టి సన్నుతించాలి. హెబ్రీ జనాంగాన్ని తాను ఏర్పరచుకున్న తన ప్రజలపైన కుమ్మరించిన కృపను, కరుణను మనము గుర్తుచేసుకుంటే ఆయన న్యాయము తీర్చే దేవుడని తెలుస్తుంది. మన అనుదిన జీవితాలలో కూడా ఇది గమనించవచ్చును.

ఇన్ని ఉపకారములు చేసిన ఆ దేవదేవుని సన్నుతించమని మన మనసులకు మనము గుర్తుచేస్తూ ఉండాలని క్రీస్తు నామములో మిమ్మును కోరుకుంటున్నాను. అందరమూ అలాగు చేయుటకు దేవుడు అవకాశమిచ్చును గాక, ఆమేన్!

❖ ❖ ❖

# 18. ఆశ్రయ పురములు

ఐగుప్తు బానిసత్వము నుండి విడుదల పొందిన దేవుని జనాంగమును వాగ్దాన దేశమునకు మోషే, యెహోషువ నాయకత్వములో నడిపించిన దేవుడు వారికి ఆశ్రయ పురములు ఏర్పాటు చేశాడు. ఏ యూదుడైనను, అన్యుడైనను మనసులో ఏ కల్మషము లేకుండా పొరపాటున పొరుగువాడిని చంపినపుడు ఆశ్రయపురములోనికి పారిపోయి, తన నిర్దోషత్వమును నిరూపించుకొనుటకు వీలు కల్పించాడు. ఈ పురములు లేవీయులకు స్వాస్థ్యముగా ఇచ్చు పురములలో ఉండవలెనని దేవుడు నిర్దేశించాడు. (సంఖ్యా 35:6) ప్రకారం "నరహంతకుడు వాటిలోనికి పారిపోవునట్లుగా వాటిని నియమింపవలెను" అని చెప్పాడు. "పొరబాటున ఒకని చంపినవాడు వాటిలోనికి పారిపోవచ్చును. తీర్పు పొందుటకై నరహంతకుడు సమాజము నెదుట నిలుచువరకు వాడు మరణ శిక్ష నొందకూడదు. గనుక ప్రతిహత్య చేయువాడు రాకుండ అవి మీకు ఆశ్రయపురములుగా ఉండును" (సంఖ్యా 35:12). ఈ ఆశ్రయ పురములు యొర్దాను ఇవతల మూడు, కనాను దేశములో మూడు ఇయ్యవలెనని ఖచ్చితంగా చెప్పాడు.

ఈ ఆరు పురములు దూరమెక్కువలేకుండ వాగ్దాన దేశములో ఆరు స్థలములలో ఏర్పరచబడి యున్నవి. ఏ ప్రాంతములో ఉన్నవారు ఆ ప్రాంతమునకు దగ్గరలో ఉన్న పురమునకు సులభంగా అతి తక్కువ సమయములో చేరవచ్చును. 'ఆశ్రయము' అంటే సంరక్షణ ఇచ్చేది. శరనార్థులు ఆశ్రయము కోరుతూ వస్తారు, దేవుడే మన ఆశ్రయ దుర్గము.

ఆ ఆశ్రయ పురములనేవి ప్రజల జీవితాలలో దేవుడు చేయు కార్యములకు సాదృశ్యముగా ఉన్నాయి. యేసుక్రీస్తులో ఉన్న జీవములోకి ప్రవేశించుట అనునది అర్థము చేసుకొనుటకు దేవుడు ఏర్పాటు చేశాడు. హృదయాంతరంగములు చూసే

పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి పాపియైన మానవుడు పరుగెత్తిపోయి ఆశ్రయము పొందవచ్చని దేవుడు చూపిస్తున్నాడు. మనందరి పాపముల కొరకు మరణించిన యేసుప్రభువే మన ఆశ్రయ పురము. తీర్పు నుండి తప్పించబడి, నరకశిక్ష నుండి విడుదల పొందుటకు ఆయన యొద్దకు పారిపోయి ఆశ్రయము పొందవచ్చుననే అవకాశము దేవుడిచ్చాడు.

పాత నిబంధనలో దేవుడు మోషే, యెహోషువల ద్వారా ఏర్పరచిన ఆరు ఆశ్రయ దుర్గములను గురించి కొన్ని ఆసక్తికరమైన విషయములను నేర్చుకొని వాటిని ఆశ్రయ దుర్గమైన యేసుప్రభువుకు అన్వయించుకొనుట ఎలాగో ధ్యానించుకుందాము.

ఈ ఆశ్రయపురములను గురించిన ఆదేశాలు లేఖనాలలో మూడు సందర్భాలలో వ్రాయబడి ఉన్నవి. సంఖ్యా 35:6-34, ద్వితీ19:1-13, యెహోషువ 20:1-9. సంఖ్యాకాండములోని వచనాలు చూశాము. ఆశ్రయపురములోనికి వచ్చిన ఆ హంతకుడిని అక్కడి లేవీయులు తీర్పు తీర్చి అతను చెప్పినది నిజమైతే ఆశ్రయపురములో ఉండుటకు అనుమతి ఇవ్వాలి. ప్రధాన యాజకుడు చనిపోయే వరకు అక్కడే ఉండవచ్చును ఇప్పుడు మన ప్రధాన యాజకుడైన యేసుప్రభువు మృతి నొందాడు కాని మృతులలో నుండి లేచి, నిత్యము సజీవునిగా ఉన్నాడు కాబట్టి క్రీస్తనే ఆశ్రయ పురములోనికి వెళ్ళినవాడు ఎప్పటికీ అక్కడే ఉండిపోవచ్చు.

రాబోయే దేవుని ఉగ్రత నుండి తప్పించుకొనుటకు ఆశ్రయ దుర్గము యేసుప్రభువు మాత్రమే. యోహాను 3:16లో "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" అని వ్రాయబడి వుంది. ఆయనను ఆశ్రయించని వాడు నశించును అని గ్రహించాలి. దేవుడు ఎంత ప్రేమామయుడు అయినప్పటికీ, ఆయన న్యాయవంతుడనే విషయము కూడా గుర్తుపెట్టుకోవాలి.

పాపుల పట్ల దేవుని తీర్పు అంటే, దేవుడు తన నుండి పాపులను పూర్తిగా దూరపరచుట, వారు అగ్ని గుండములో పడద్రోయబడుదురు. 'ఈ అగ్ని గుండము రెండవ మరణము' (ప్రకటన 20:14), "కుమారునికి విధేయుడు కాని వాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును". అవిశ్వాసి మరణ

సమయమందు దేవుని ఉగ్రత స్పష్టంగా కనబడుతుంది. లూకా 16:19-31లో కనపడే ధనవంతుని వలె ఉగ్రత అనుభవిస్తాడు. అందుకే పౌలు రోమా 8:1లో ఈ విధంగా రాస్తున్నాడు. "కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" యేసుప్రభువు మన రక్షణాశ్రయ దుర్గము. పాపియైన ప్రతి మానవుడు క్రీస్తనే ఆశ్రయ పురములోని ప్రవేశించినప్పుడు నిత్య రక్షణ కలుగుతుంది. క్రీస్తులో రక్షణ మరియు నూతన జీవము ఉన్నవి.. పాత నిబంధనలోని ఇశ్రాయేలీయులు ఆశ్రయ పురములకు పరుగెత్తినట్లు ఈనాటి మానవుడు రక్షణ కొరకై క్రీస్తు అను ఆశ్రయపురమును ఆశ్రయించాలి.

పాత నిబంధనలో దేవుడు ఏర్పరచిన ఆరు ఆశ్రయ పురములు పేర్లను పరిశీలిద్దాము. చాలా సందర్భాలలో పేరు వారి లక్షణాలు, గుణ గణాలు వివరిస్తాయి. ఈ ఆశ్రయపురాల పేర్లు, వాటి అర్థాలు చూస్తే అవి మన ఆశ్రయ దుర్గమైన యేసుప్రభువు లక్షణాలు, ఆయన గొప్పతనము సూచిస్తాయి.

మనమందరము పాపము చేసినవారమై మరణ పాత్రులమైనాము. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23) కాని "దేవుడు మనకు ఆశ్రయమును, దుర్గమునై యున్నాడు" (కీర్తన 46:1). మనకు రావలసిన తీర్పు నుండి రక్షణ, భద్రతను కల్పించేవాడు ఆయనే. "తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులను బట్టి, మన యెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానము దృఢపరచెను" (హెబ్రీ 6:18).

ఈ ఆశ్రయ పురములకు, యేసుప్రభువుకు చాలా పోలికలున్నవి. అందరికీ ఈ పురములు అందుబాటులోను, త్వరగా అందులో ప్రవేశించుటకు వీలుగా ఉన్నట్లు యేసుప్రభువు కూడా ఉన్నాడు. "నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను" (యోహాను 6:37) అనే వాగ్దానము కూడా ప్రభువు చేస్తున్నాడు.

ఈ ఆశ్రయ పురముల పేర్లు ఒకటి తర్వాత ఒకటి చూసి, ప్రభువుకు ఏ విధంగా అన్వయించుకోవాలో చూద్దాము. యెహోషువ 20:7,8 వచనాలలో ఈ పేర్లు ఇవ్వబడి ఉన్నాయి.

**1. "కెదెషు"** అనగా "పరిశుద్ధమైనది", యేసుప్రభువు పరిశుద్ధుడు, ఆయనలో ఏ పాపము లేకుండెను. అందుకే ఆయన మనకొరకు మచ్చలేని గొఱ్ఱెపిల్లగా బలి అర్పించబడుటకు ఈ లోకమునకు వచ్చాడు. "పవిత్రుడు, నిర్దోషియు, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును, ఆకాశమండలము కంటే మిక్కిలి హెచ్చయినవాడునైన యిట్టి ప్రధానయాజకుడు మనకు సరిపోయినవాడు" (హెబ్రీ 7:26)

**2. "షెకెము"** అనగా 'భుజము' లేఖనాలలో చెప్పబడిన చాలా ప్రాచీన పురమిది. అబ్రహాము మొదటిసారిగా కనానీయుల దేశమునకు వెళ్లినప్పుడు షెకెము నందలి ఒక సింధూర వృక్షము క్రింద సేద దీర్చుకున్నాడు (ఆది. 12:6). అది ప్రశాంతమైన విశ్రాంతి తీసుకునే స్థలము కాబట్టి యేసుప్రభువు గుర్తుకు వస్తాడు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28).

భుజము బలమును సూచిస్తుంది కాబట్టి తప్పిపోయిన గొర్రెల లాంటి మనలను తన భుజముల మీద మోసుకొని సమాధానము, విశ్రాంతి దొరకు స్థలానికి తీసికొని పోతాడు. ఆయన మన పాప భారము తన మీద వేసుకొని మనకు విశ్రాంతి నిస్తున్నాడు.

**3. "హెబ్రోను"** అనగా 'సహవాసము', యేసుప్రభువులో ఉన్నవారు ప్రేమగల దేవునితో సహవాసములోనికి తీసికొని రాబడుతారు. 'మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది" (1యోహాను 1:3). పాపము ద్వారా దేవునితో కోల్పోయిన సహవాసము, క్రీస్తు ద్వారా తిరిగి పొందు కున్నాము. ఆయన సన్నిధిలో ఉండు గొప్ప భాగ్యము పొందుకున్నాము.

**4. "బేసెరు"** అనగా "దుర్గము" యేసుప్రభువు మన భద్రతా దుర్గముగా ఉండి, ఆయనపై మన జీవితాలు కట్టుకొనుటకు అవకాశము ఇచ్చాడు. (కీర్తన 18:2)లో 'యెహోవా నా శైలము, నా కోట, నన్ను రక్షించువాడు.... నా దుర్గము" అని దావీదు అంటున్నాడు. యేసుప్రభువు అను బండమీద ఇల్లు కట్టుకున్నవాడు స్థిరంగా ఉంటాడని ప్రభువే స్వయంగా చెప్పాడు (మత్తయి 7:24). పునాది స్థిరంగా ఉంటే జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా మన ఆశ్రయ దుర్గములో ఉన్నాము కాబట్టి అపవాది మనలను ఏమి చేయలేదు.

**5. "రామోతు"** అనగా "ఉన్నతమైనది" అత్యున్నత సింహాసనముపైన ఆసీనుడైన మన ప్రభువు దగ్గర మనము భద్రంగా ఉండగలము. ఫిలిప్పీ 2:9-11 ప్రకారము దేవుడు క్రీస్తును అత్యున్నతుడిగా హెచ్చించాడు. మన ఆశ్రయ దుర్గము, మన బలమైన క్రీస్తును గురించి తెలుసుకొనే కొద్దీ మనము ఆయనను ఎక్కువగా ఆరాధిస్తాము.

**6. "గోలాను"** అంటే "ఆనందము" యేసుప్రభువు గురించి దేవదూతలు గొల్లలకు ప్రకటించినప్పుడు "మహా సంతోషకరమైన సువార్తమానము" అన్నారు. ఆయనను కలిగియున్నప్పుడు మనకు చాలా ఆనందము ఉంటుంది.

**7.** పాత నిబంధనలోని ఆరు ఆశ్రయపురములలోని లక్షణాలన్నిటిని కలిగియున్న యేసుప్రభువు మన ఏడవ ఆశ్రయపురము. క్లుప్తంగా మనము ఈ లక్షణాలు అన్నింటిని కలిపి చెప్పగలిగితే ఈ విధంగా చెప్పవచ్చును. యేసుప్రభువు అను ఆశ్రయపురమునకు చేరిన మనకు తన "పవిత్రత" ఇస్తాడు కాబట్టి తీర్పులోనికి రాము, ఆయన మనలను తన "భుజముల" మీద మోసుకొని, తన తండ్రి సహవాసములోనికి తీసుకెళతాడు. ఆయనే మన దుర్గము కావున మనకు భద్రత ఉంటుంది. ఆయన మనలను "ఉన్నతమైన" స్థలములోనికి తీసుకెళ్లి "ఆనందము" నిస్తాడు.

అందుకే క్రీస్తనే ఆశ్రయ పురానికి పరుగెడదాము. ఆయన తప్ప మనలను రక్షించే వారెవరూ లేరు కాబట్టి అపవాది కోరలలో పడకుండా ఆయన భద్రతలోనికి వెళదాము. ఆయనే మనకోట, దుర్గము, ఆశ్రయపురమై ఉన్నాడు. ఆయనను దేవునిగా గల మనము ధన్యులము!

❖ ❖ ❖

# 19. హోషేయ ప్రవక్త వివరించిన దేవుని ప్రేమ

దేవుడు ఆత్మ స్వరూపి అయిఉన్నను శరీరముతో ఉన్న మనతో ఎల్లవేళల సంబంధము కలిగి ఉన్నాడు. ఆయన ప్రేమా స్వరూపి అయిఉండి, మనలను ఎంతో ఎక్కువగా ప్రేమిస్తున్నాడు. తన ఏకైక కుమారుని మన కొరకు బలి పశువుగా ఇచ్చుటలో ఆయన ప్రేమ కనబడుతుంది. తన రక్తముతో మనలను కొనిన ఆయన మనలను బానిసలుగా కాక స్వతంత్రులనుగా చేశాడు. ఆయన అనంతమైన ప్రేమ కారణంగా మనకు ప్రత్యామ్నాయంగా ఉండి మన పాప శిక్ష అనుభవించాడు.

దేవుడు ప్రతి వ్యక్తిని వ్యక్తిగతంగా ప్రేమిస్తున్నాడు. దేవుని ప్రేమకు బైబిలులో వాడిన పదము అగాపే ప్రేమ - నిస్వార్థమైన ప్రేమ. బైబిలులో అన్నిటికంటే ప్రాముఖ్యమైన వచనము యోహాను 3:16లో కనపడుతుంది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". ప్రేమ గురించిన ఇంకొక వాక్యము 1యోహాను 3:16లో "ఆయన మన నిమిత్తము తన ప్రాణమును పెట్టెను, దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొను చున్నాము" అని వ్రాయబడి ఉంది.

దేవుని ప్రేమను హోషేయ ప్రవక్త వివరించిన విధానము హోషేయ 11:1-4లో చూద్దాము - "ఇశ్రాయేలు బాలుడై యుండగా నేను అతని యెడల ప్రేమ గలిగి నా కుమారుని ఐగుప్తు దేశములో నుండి పిలిచితిని. ప్రవక్తలు వారిని పిలిచినను బయలు దేవతలకు వారు బలులనర్పించిరి, విగ్రహములకు ధూపము వేసిరి. ఎఫ్రాయిమును చెయ్యి పట్టుకొని వానికి నడక నేర్పిన వాడను నేనే; వారిని కౌగిలించుకొనిన వాడను నేనే? నేను వారిని స్వస్థపరచిన వాడనైనను ఆ సంగతి వారికి మనస్సున పట్టలేదు. ఒకడు మనుష్యులను తోడుకొని పోవునట్లుగా స్నేహబంధములతో నేను వారిని

బంధించి ఆకర్షించితిని; ఒకడు పశువుల మీదికి కాడిని తీసినట్లు నేను వారి కాడిని తీసి వారి యెదుట భోజనము పెట్టితిని". ప్రవక్త ఈ భాగములో దేవుని ప్రేమలోని ఏడు లక్షణములు ప్రస్తావిస్తున్నాడు. వాటిని ధ్యానిద్దాము.

### 1. దేవుని ప్రేమ యోగ్యతలు చూడదు – హోషేయ 11:1 :

మనమెటువంటి వారమైనా దేవుడు మనలను ప్రేమిస్తున్నాడు. రోమా 5:8 లో "దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను".

హోషేయ ప్రవక్త ఇశ్రాయేలు ప్రజల పట్ల దేవుడు చూపించిన ప్రేమను వివరిస్తున్నాడు. "బాలుడై యుండగా" అను మాటలో తెలివిలేని, శక్తిలేని, యోగ్యతలేని స్థితిలో ఉండగా అను అర్థము వస్తుంది. అటువంటి స్థితిలో ఉన్న వారిని తన కుమారులనుగా చేసుకొని ఐగుప్తు దాస్యము నుండి బయటకు తెచ్చాడు. కుమారులు స్వాస్థ్యమునకు వారసులు. దేవుని ప్రేమకు పరిధులు లేవు. ఏ యోగ్యతలేని వారిని తన కుమారులనుగా చేసుకోవడములో ఆయన ప్రేమ కనబడుతుంది.

### 2. దేవుని ప్రేమ కరుణతో నిండినది, మేలు చేయునది :

ఐగుప్తు బానిసత్వములో మగ్గుచున్న వారిని కరుణించి, బయటకు నడిపించి తాను వాగ్దానము చేసిన దేశములోనికి నడిపించాడు. నిర్గమకాండము 1:13లో "ఇశ్రాయేలీయుల చేత ఐగుప్తీయులు కఠినముగా సేవ చేయించుకొనిరి" అని వ్రాయబడి ఉంది. వారి పరిస్థితిని బట్టి దేవుడు వారిపై కనికరము చూపించి, దాస్యము నుండి విడిపించి, మోషే ద్వారా బయటకు నడిపించాడు. ఎన్నో మేలులు చేశాడు. నిర్గమ 12:36లో " యెహోవా ప్రజల యెడల ఐగుప్తీయులకు కటాక్షము కలుగజేసెను. గనుక వారు వారికి కావలసిన వాటిని ఇచ్చిరి. అట్లు వారి ఐగుప్తీయులను దోచుకొనిరి" అని వ్రాయబడి ఉంది. వారి కష్టార్జితమంతా దేవుడు వారికి ఇప్పించి మేలు చేశాడు. వారు అరణ్యములో నడిచిన 40 సంవత్సరములు అనుదినము అద్భుతాలు చేశాడు. ఇదంతా ఆయనకు వారి పట్ల ఉన్న ప్రేమను వ్యక్తపరుస్తుంది.

### 3. దేవుని ప్రేమ దీర్ఘశాంతముతో కూడినది – (హోషేయ 11:2) :

ఇన్ని మేలులు చేసిన దేవుని వారు తిరస్కరించారు. ప్రవక్తల ద్వారా ఎన్నిసార్లు హెచ్చరించినను పెడచెవిన పెట్టి బయలు దేవతలకు బలులనర్పించి, విగ్రహములకు

ధూపము వేశారు. వారి హేయక్రియలు భరించరానంత ఎక్కువైనప్పుడు దేవుడు వారిని శిక్షించి శత్రువుల చేతికి అప్పగించేవాడు. కాని ఆయన దీర్ఘశాంతమును బట్టి వారు మొఱపెట్టగానే ఆయన తిరిగి వారిని విడిపించేవాడు. ఇశ్రాయేలు ప్రజల చరిత్రలో ఇలాంటి సంఘటనలు లెక్కకు మించినవిగా ఉన్నాయి. దేవుని ప్రేమ వారిపై విస్తారంగా ఉన్నందున తిరిగి తన యొద్దకు రమ్మని పదే పదే పిలిచాడు. యెషయా 1:18, 19లో ఉన్న ఒక ఆహ్వానాన్ని గుర్తుచేసుకుందాము. "యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు. – రండి మన వివాదము తీర్చుకొందము, మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లనివగును. కెంపువలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱెబొచ్చువలె తెల్లనివగును. మీరు సమ్మతించి నా మాట వినిన యెడల మీరు భూమి యొక్క మంచి పదార్థములను అనుభవింతురు". "భయపడకుము" అనే ఆదరణ మాటలు బైబిలులో చాలాసార్లు ఉన్నవి. యెషయా 54:9,10వచనాలలో "నీ మీద కోపముగా నుండననియు, నిన్ను గద్దింపననియు నేను ఒట్టు పెట్టుకొని యున్నాను. పర్వతములు తొలగిపోయినను, మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు" అని ఆ దేవదేవుడు వాగ్దానము చేయుచున్నాడు. ఇంత గొప్ప ప్రేమా మూర్తిని కలిగియున్న మనము ధన్యులము. ఆయన ప్రేమ దీర్ఘశాంతముతో కూడినది.

### 4. ఆయన ప్రేమ సున్నితమైనది, స్వస్థపరచునదియునై యున్నది :

'ఎఫ్రాయిము' అంటే 10 గోత్రాలకు చెందిన ఇశ్రాయేలీయులు. వీరందరినీ ఆయన ప్రేమతో చెయ్యి పట్టుకొని నడిపించాడు, కష్టాలలో కౌగలించుకొన్నాడు. స్వస్థపరచాడు. అయినా వారు తనను మరచిపోయారని బాధపడుతున్నాడు.

యిర్మీయా 31:20లో "ఎఫ్రాయిము నాకిష్టమైన కుమారుడా? నాకు ముద్దుబిడ్డా? నేనతనికి విరోధముగా మాటలాడునప్పుడెల్ల అతని జ్ఞాపకము నన్ను విడువకున్నది. అతని గూర్చి నా కడుపులో చాలా వేదనగా నున్నది. తప్పక నేనతని కరుణింతును; ఇదే యెహోవా వాక్కు" అని వ్రాయబడి ఉన్నది. ఈ మాటలలో దేవుని ప్రేమ అపారమైనదని తెలుస్తున్నది. యిర్మీయా 31:3లో "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను" అన్నాడు. "తల్లి అయినా మరుచునేమో కాని నేను నిన్ను మరువను" అను మాటలో సున్నితమైన ప్రేమ వ్యక్తమగుచున్నది. "నేను నీకు ఆరోగ్యము కలుగజేసెదను, నీ గాయములు మాన్పెదను" (యిర్మీయా 30:17) అనుటలో ఆయన ప్రేమ స్వస్థపరచే ప్రేమగా ఉందని తెలుసుకోనవచ్చును. "ఆయన పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత

కలుగుచున్నది'' (యెషయా 53:5) ''నా యరచేతిలో చెక్కియున్నాను'' (యెషయా 49:16) అనే మాటలలో ఆయన సున్నితమైన ప్రేమ వ్యక్తమగుచున్నది.

**5. దేవుని ప్రేమ నైతిక విలువల వైపు బలవంతంగా నడిపిస్తుంది–**(హోషేయ 11:4) **:**

స్నేహ బంధముతో నేను బంధించి అకర్షించితిని అంటున్నాడు. ఏ యోగ్యతలేని వారిని తన స్నేహితులుగా చేసుకున్నాడు. అబ్రహాము దేవునికి అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు. "నేను చేయబోవు కార్యము అబ్రహామునకు దాచెదనా?" (ఆది. 18:17) అని దేవుడు అంటున్నాడు. తన జనులను ప్రేమతో ఆకర్షించుకొని తన స్నేహితులుగా చేసుకుంటున్నాడు.

**6. దేవుని ప్రేమ భారము తగ్గించేదిగా ఉంది :**

తన జనాంగము ఐగుప్తు దాస్యపుకాడి క్రింద ఉన్నప్పుడు ఆయన భరించలేక, వారిని బయటకు తీసుకొచ్చాడు. తర్వాత ఆయా శత్రువుల కాడి క్రింద ఉన్నప్పుడు బయటకు తెచ్చాడు. ఇప్పుడు మనము సైతాను కాడిక్రింద ఉంటే భరించలేక, రక్షించుటకు తన ఏకైక కుమారుని పంపించాడు. ఆయన పిలుపు ప్రతి ఒక్కరికి వర్తిస్తుంది. మత్తయి 11:28లో ఉన్న ఆయన ఆహ్వానములో ఆయన ప్రేమ కనబడుతుంది. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతిని కలుగజేతును". యెహెజ్కేలు 34:27లో "నేను వారి కాడికట్లను తెంపి వారిని దాసులుగా చేసిన వారి చేతిలో నుండి వారిని విడిపించగా నేను యెహోవానై యున్నానని వారు తెలుసుకొందురు" అనుటలో ఆయన ప్రేమ భారము తీసేసేదిగా ఉందని తెలిసికొనవచ్చును.

**7. ఆయన ప్రేమ తృప్తిపరచేదిగా ఉన్నది :**

"వారి యెదుట భోజము పెట్టితిని". వారికి లేమి లేకుండా చూసుకుంటున్నాడు. యెహెజ్కేలు 36:29 – "మీకు కరువు రానియ్యక ధాన్యమునకు అజ్ఞ ఇచ్చి అభివృద్ధి పరతును" అన్నాడు.

అందుకే "యెహోవా తమకు దేవునిగా గల జనులు ధన్యులు" (కీర్తన 33:12) అని వాక్యము చెప్తున్నది. ఇంతటి ప్రేమను ఈ లోకంలోని వారు ఎవ్వరూ ఇవ్వలేరు. ఈ ప్రేమను గుర్తించి, అనుభవ పూర్వకంగా తెలుసుకొని, ఈ ప్రేమామయుడిని గురించి సకల లోకమునకు ప్రచురించమని యేసుప్రభువు నామమున కోరుతున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 20. సిలువ ఇచ్చే పునాది సత్యాలు

మన ప్రియ ప్రభువు సిలువ యజ్ఞ సమయంలో సిలువలో ఉన్న పునాది సత్యాలు కొన్నిటిని గుర్తు చేసుకొందాము. మన పునాది క్రీస్తును గురించిన సత్యాలపై కట్టబడి ఉంటేనే ఎటువంటి తుఫానులు వచ్చినా కదలక స్థిరంగా ఉండును. కీర్తన 112:7లో "వాని హృదయము యెహోవాను ఆశ్రయించి స్థిరంగా ఉండును. వాడు దుర్వార్తకు జడియడు" అని వ్రాయబడిఉంది.

యేసుప్రభువు సిలువను ఆశ్రయించిన వారికి శాంతి, సమాధానాలు దొరుకుతాయని అనుకొంటున్నాము. గాని, ఇంకొంచెము లోతుగా ఆలోచిస్తే మనలను నరకకూపము నుండి బయటకు లాగి, నిత్యజీవములోనికి తీసుకొని వెళ్లడానికి యేసయ్య సిలువ శ్రమలను భరించాడని గ్రహించగలము. ఈ సందేశము చదివేవారు, అనేకుల జీవితంలో తుఫానులాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతూ, తుఫానులో చిక్కుకున్న తన జీవిత నావలకు లంగరు వేసే ప్రయత్నంలో ఉన్నవారున్నారు. అటువంటి వారు తప్పనిసరిగా వారి జీవితాలను క్రీస్తు సిలువ, పునరుత్థానాల సత్యాలకు లంగరు వేసుకోవాలి. తుఫానులు వచ్చినప్పుడు నదీగర్భంలో ఉండే ఆధార శిలకు ఓడలు లంగరు వేసినట్లుగా, ప్రతికూల పరిస్థితులు అనే తుఫానులు వచ్చినప్పుడు మనము సిలువ, పునరుత్థానములనే ఆధారశిలకు లంగరు వేసి ప్రతికూల పరిస్థితులు తొలగిపోయేంత వరకు నిరీక్షణతో దేవునివైపు చూస్తూ ఉండవచ్చును. హెబ్రీ 6:19లో దేవుడు మనకిచ్చిన నిరీక్షణ "మన ఆత్మకు లంగరు" వలె ఉన్నదని చెప్పబడి ఉన్నది. కొందరు సిలువ, పునరుత్థానములు చరిత్రలో జరిగిన సంఘటనలు కాబట్టి ఈనాటి ప్రపంచానికి సంబంధము లేనివి అనుకుంటారు. కానీ సత్యమేమంటే ఈ ప్రపంచంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ అవసరమైన పునాది సత్యమిది. ఈ సంఘటనలో మానవ రూపధారిగా ఈ లోకములోకి వచ్చిన యేసయ్య మన మీదికి రావలసిన దేవుని ఉగ్రతను అడ్డుకొని, తన పైకి రాజేసుకున్నాడు.

యేసు ప్రభువు సిలువ, పునరుత్థానాల వెనుక దాగి ఉన్న పునాది సత్యాలను కొన్నింటిని ధ్యానించుకుందాము.

## 1. దేవుని ప్రేమ

దీనికి ఆధార వాక్యమైన యోహాను 3:16 ఒకసారి చూద్దాము – "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". దేవుని ప్రేమను అనుమానించలేని ఒకే ఒక స్థలము సిలువ చెంతనే. ఒకసారి భక్తుడైన సిహెచ్.స్పర్జన్ గారు ఈ విధంగా అన్నారు– "మనకు బైబిలు బొత్తిగా అందుబాటులో లేకుండా కేవలం యోహాను 3:16 మాత్రమే ఉన్నను, ప్రపంచమంతటికీ సువార్త ప్రకటించుటకు కావలసినంత దైవప్రత్యక్షత అందులో ఉన్నది''. 1యోహాను3:16లో ''ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలుసుకొనుచున్నాము" అని వ్రాయబడిఉన్నది. రోమా5:8లో "మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను". ఈ వాక్యముల ద్వారా దేవుని ప్రేమను గురించిన నిశ్చయత మనలో వస్తే అది పునాదిగా ఏర్పడుతుంది. దేవుని ప్రేమను గురించిన అనుమానమే ఈ లోకంలోకి పాపము ప్రవేశింపచేసింది. సాతాను హవ్వతో మాట్లాడినప్పుడు దేవుని ప్రేమను గురించిన అనుమానము కలుగజేసింది. "దేవుడు నిజముగా మిమ్ములను ప్రేమించి ఉంటే తినవద్దని ఎందుకు చెబుతాడు? అంటున్నాడు. దేవుడు నిజముగా ప్రేమించి ఉంటే నీ జీవితంలో ఆ శ్రమ వచ్చి ఉండేది కాదు గదా" అనే అనుమానపు ప్రశ్న అనుక్షణం మన మనసులో కలిగించుటకు సాతాను ప్రయత్నిస్తున్నాడు. మన మనసులో అనుమానము ఒకవేళ వచ్చినా, దానిని మనలో తిష్టవేయకుండా చూచుకోవాలి. ఈసారి అపవాది ఇలాంటి ప్రశ్నలతో వచ్చినప్పుడు సిలువవైపు చూపిస్తే అపవాదికి సమాధానం దొరకక పారిపోతాడు.

## 2. దేవునికి మన గురించి సంపూర్ణంగా తెలుసునను సత్యము

రక్షణ పొందిన వారు కూడా కొన్ని సార్లు వ్యక్తిగతంగా దేవుడు మన గురించి ఆలోచించడేమో అను అనుమానము కలిగి ఉంటారు. మన గురించి మనకు తెలిసిన దాని కంటే ఎక్కువగా ఆయనకు మన గురించి తెలుసును. యెషయా 44:2లో "నిన్ను సృష్టించి, గర్భములో నిన్ను నిర్మించి నీకు సహాయము చేయువాడైన యెహోవా" ను నేను అని దేవుడు స్వయంగా చెప్తున్నాడు. యిర్మీయా 1:5లో "గర్భములో నేను

నిన్ను రూపించక మునుపే నిన్నెరిగితిని" అన్నాడు. ఇటువంటి వాక్యాలు బైబిలులో చాలా ఉన్నాయి. చిన్న చిన్న వాటి కొరకు దేవుని అడుగకూడదని కొందరు భావిస్తారు. కాని దేవుడు మన అనుదిన కార్యక్రమాలలో కూడా శ్రద్ధ వహిస్తున్నాడు. యెషయా 49:15,16లో "స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరుచునా? వారైన మరుచుదురు గాని నేను నిన్ను మరువను, చూడుము, నాయరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను. నీ ప్రాకారములు నిత్యము నా ఎదుట నున్నవి". మన నమ్మకాన్ని స్థిరపరచుటకు ఇంతకంటే గొప్ప మాటలు అవసరములేదు. హెబ్రీ 13:5-8 లో "నిన్ను ఏ మాత్రమును విడువను, నిను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా...యేసుక్రీస్తు నిన్న నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగముకును ఒక్కటే రీతిగా ఉన్నాడు".

### 3. క్షమాపణ

కీర్తన 130:4లో "జనులు నీ యందు భయభక్తులు నిలుపునట్లు నీ యొద్ద క్షమాపణ దొరుకును". సిలువ యొద్ద క్షమాపణ దొరుకుతున్నదనునది మూడవ పునాది సత్యము. మనమందరము ఏదో ఒక సమయములో పాపములో పడుతూ ఉంటాము. కొంతమంది తమ స్వనీతి, గర్వము వలన సత్యము ఒప్పుకోరు. యోహాను 8:1-11లో యేసయ్య ఎదుట వ్యభిచారములో పట్టబడిన స్త్రీని నిలబెట్టినప్పుడు, పాపము లేనివాడు మొట్ట మొదటి రాయి వేయమన్నప్పుడు, అక్కడ పాపము లేని వారెవరూ లేనందున అందరూ వెళ్లిపోయారు. 1యోహాను 1:8లో మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుమని వ్రాయబడి ఉన్నది. ఇంకా రోమా 3:23లో "అందరు పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు" అని వ్రాయబడిఉన్న పాపమును గురించిన అవగాహన లేనియెడల క్షమాపణ అడగడానికి, క్షమాపణ అనుభవములోనికి పూర్తిగా రావడానికి వీలుపడదు. దావీదు నాతాను ప్రవక్త ద్వారా తన పాపము తెలుసుకొని వెంటనే దేవుని క్షమాపణ కోరాడు. తప్పిపోయిన కుమారుని దృష్టాంతము ద్వారా క్షమాపణ కోరవచ్చిన వారికి దేవుని దగ్గర క్షమాపణ తప్పక దొరుకుతుందని యేసయ్య తెలియజేశాడు.

### 4. శ్రమలలో మనతో ఉండు దేవుడు

మత్తయి 28:20లో "ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని" మనతో చెప్పిన దేవుడు నమ్మదగినవాడు. బైబిలులో "భయపడవద్దు" అను మాట 365 సార్లు ఉందని బైబిలు పండితులు అంటారు. క్రైస్తవ్యము మన

జీవితాలలో శ్రమలు ఉండవని చెప్పడము లేదు గాని శ్రమలలో దేవుడు మనతో ఉంటాడని నమ్మకము కలిగిస్తుంది.

### 5. అపజయాలలో దేవుడు విజయమునిస్తాడను విశ్వాసము

ఇహలోక దృష్టిలో సిలువ శ్రమలు, అపజయానికి చిహ్నము. కాని సరైన దృక్పథముతో చూస్తే అదే ప్రపంచపు గొప్ప విజయానికి గుర్తు. అపజయము అనునది ప్రతి జీవితంలో ఉంటుంది. నడక నేర్చుకుంటున్న పసిబిడ్డ మొదటి అడుగు తర్వాత పడిపోతాడు, మాటలు నేర్చుకొంటున్న బిడ్డకు ఎన్నో అపజయాలు, మొదటిసారి గ్లాసుతో పాలు త్రాగు బిడ్డ పాలను మీద పోసుకొంటాడు. అలాగని మానివేయరు గదా? గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు ఎన్నో అపజయాల తర్వాత ఒక గొప్ప విజయమును పొందగలరు. చాలామంది జ్ఞానము లేక కాదు గాని, ఓర్పులేక అపజయాల పాలవుతుంటారు. అపజయము పాలైన వారికి న్యూనతాభావము వస్తుంది. కాని ఎన్ని అపజయాలు వచ్చినా దేవుని ప్రేమ మారదనే సత్యము గ్రహించినప్పుడు స్థిరంగా ఉండగలము. ప్రకటన 12:1–17 లో గొఱ్ఱెపిల్ల ద్వారా విజయం అని వ్రాయబడి ఉంది.

### 6. అపవాది తంత్రములను ఎదుర్కొనే శక్తి సిలువ ఇస్తుంది.

సిలువ అంటేనే అపవాది అపజయము. అపవాది ఓడించబడిన శత్రువు. 1యోహాను 3:8 "అపవాది క్రియలను లయపరచుటకే కుమారుడు ప్రత్యక్షమాయెను".

### 7. దేవుని వాక్యము

యేసయ్య కూడా వాక్యము ద్వారా సాతానును జయించాడు. వేల సంవత్సరాల నుండి తన మీద ఆధారపడిన వారందరినీ స్థిరంగా నిలబెడుతుంది బైబిలు. ఎన్నో తుఫానులు ఎదుర్కొని నిలదొక్కుకున్నది. చరిత్రలో చీకటి రోజులలో కొందరికే అందుబాటులో ఉండినది. దానిని పట్టుకోలేనివారు అనేకులు నశించిపోయారు. దాని లోతుల్లో లంగరును వేసిన వారు ఎన్నడూ "సిగ్గుపడరు" అని 1పేతురు 2:6లో చెప్పబడి ఉన్నది. వాక్యమై ఉన్న యేసయ్య అను బండపై కట్టబడిన జీవితాలు స్థిరంగా ఉంటాయి.

సిలువ ఇచ్చే పునాది సత్యాలను తెలుసుకున్న మన మందరము, ఆ సత్యాలను మన జీవితాలలో స్థిరపరచుకోవాలనే ఆశతో ముందుకు సాగుటకు దేవుడు సహాయము చేయునుగాక. ఆమేన్!

❖ ❖ ❖

# 21. పాపుల రక్షకుడు

"నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" (లూకా 19:10) స్వయంగా తన గురించి తానే చెప్పిన యేసయ్యకు రక్షకునికి ఉండాల్సిన లక్షణాలు, యోగ్యతలు ఉన్నాయను సంగతి మన మనసులో స్థిరపరచుకోవాల్సిన అవసరముంది. కాబట్టి మనము వాటిని గురించి ధ్యానించు కుందాము.

## 1. ఆయన పరిపూర్ణ రక్షకుడు :

ఒక ఊబిలో కూరుకుపోతున్న మనిషిని, ఇంకొక మనిషి రక్షించాలంటే, ముందు తాను నిలుచున్న స్థలము స్థిరంగా ఉందో లేదో చూసుకొని, తనను తాను భద్రపరచు కోవాలి. లేకుంటే ఇద్దరూ ఊబిలోకి వెళ్లిపోయే ప్రమాదముంది. నరకపు ఊబిలో వెళుతున్న మనలను పరలోకమునకు తీసుకెళ్లాలంటే, తీసికెళ్లే వారికి అందులోకి వెళ్ళే యోగ్యత ఉండాలి. మనకు దేవుడిచ్చిన గొప్పధన్యత ఏమంటే పరలోకవాసి స్వయంగా మానవరూపంలో మనలను తీసుకొని వెళ్ళడానికి వచ్చాడు.

**ఎ. ఆయన ఎన్నడూ ఏ పాపమూ చేయలేదు :** యేసయ్య ఈ లోకానికి బలిపశువుగా వచ్చాడు. ధర్మశాస్త్ర ప్రకారము బలి పశువులో ఏ లోపము, ఏ మచ్చ ఉండకూడదు. ఆయన ఈ లోకములో వసించిన ముప్పైమూడున్నర సంవత్సరాల కాలంలో ఆయన ఏ తప్పూ చేయలేదు. తనలో ఎవరైనా ఏ దోషమైనా కనుగొనగలరా అని సవాలు విసిరే స్థాయిలో జీవించాడు. ఆయనలో ఏ పాపమూ లేదని రుజువు చేయుటకు కొన్ని వాక్య భాగాలు చూద్దాము.

యోహాను 18:38, 19:4, 19:6 – ఈ మూడు వచనలలో రోమా అధిపతి అయిన పిలాతు "అతని యందు ఏ దోషమును నాకు కనబడలేదు" అన్నాడు.

మత్తయి 27:3-4 లో క్రీస్తును అప్పగించిన యూదా "నేను నిరపరాధి రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను"

లూకా 23:4, 14, 15, 22,41,47 – ఒకే అధ్యాయములో పరిశుద్ధాత్ముడు ఆరుసార్లు ఈ సత్యాన్ని వ్రాయించి ధృవీకరించాడు.

**బి. ఆయన బాహ్యంగా, అంతరంగంగా పరిశుద్ధుడు :** ఆయనలో ఎవరూ ఏ పాపము కనుగొనలేకపోయారు. తండ్రియైన దేవుడు కూడా ఆయనలోని పరిపూర్ణతతను బట్టి ఆనందిస్తున్నాడు. మత్తయి 17:5లో "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను" అని తండ్రి సాక్ష్యమిచ్చాడు.

1పేతురు 1:19లో "నిర్ధోషమును, నిష్కళంకమునగు" గొఱ్ఱెపిల్ల వంటి క్రీస్తు రక్తము ద్వారా మనకు రక్షణ.

**సి. హెబ్రీ 5:8-10లో** ఆయన శ్రమల గుండా వెళ్లి, తండ్రికి విధేయత చూపించి, తండ్రి చిత్తము నెరవేర్చి తద్వారా పరిపూర్ణత పొందాడు.

## 2.మనకు ప్రత్యామ్నాయంగా వచ్చిన రక్షకుడు :

**ఎ. మన పాపముల కొరకు సిలువ వేయబడ్డాడు :** యెష 53:6 – "యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను", ఇదే మాట 2కొరింథీ. 5:21లో పౌలు ఈ విధంగా అంటున్నాడు – "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను (క్రీస్తును) మన కోసము పాపముగా చేసెను".

1పేతురు 2:24లో "తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసుకొనెను. పాపమునకు శిక్ష మరణము. ప్రేమ, న్యాయాలకు మారుపేరైన దేవుడు మనకు రావలసిన శిక్షను తన ఏకైక కుమారునిపై మోపి ఆయనను మరణమునకు అప్పగించాడు. ఆయన హతసాక్షిగా చనిపోలేదు కాని ఒక రక్షకునిగా, పాపమునకు ప్రత్యామ్నాయంగా చనిపోయాడు. ఆ కాలంలో దోషులను యూదులు రాళ్లతో కొట్టి చంపేవారు. చాలాపెద్ద పాపము చేస్తే అవమానానికి పరాకాష్టగా భావించబడిన సిలువలో వ్రేలాడదీసి చంపేవారు.

గలతీ 3:13 ప్రకారము మన కోసము ఆయన శాపమై మనలను శాపము నుండి విమోచించెను. మ్రానుమీద వ్రేలాడబడిన వాడు శాపగ్రస్తుడని చెప్పబడి

ఉంది. సిలువపై జరిగిన వ్యతిరేక కార్యములు ఆశ్చర్యమైనవి. మన స్వస్థత కొరకు ఆయన గాయపరచబడెను; మనకు నిత్య జీవమిచ్చుట కొరకు ఆయన చనిపోయెను; మనలను ధనవంతులను చేయుటకు ఆయన ధనహీనుడైనాడు; మనలను నీతిమంతులనుగా చేయటకు ఆయన శాపమైనాడు; మనలను పాపము నుండి విమోచించుటకు ఆయన పాపమైనాడు; మనలను పవిత్రులనుగా చేయుట కొరకు ఆయన రక్తము కార్చాడు; మరణ భయము నుండి మనకు విడుదల కలుగజేయుటకై ఆయన మరణపు విజయము సాధించాడు; అపవాది దాస్యము నుండి విడుదల కలిగించుటకు, అపవాదిని సిలువలో జయించి బాహాటముగా వేడుకకు కనుపరచెను. ఈ విధంగా ఆయన మనకు ప్రత్యామ్నాయంగా బలైన దేవుని గొఱ్ఱెపిల్ల.

**బి. మన పాపముల నుండి రక్షించుటకు మనకు బదులుగా చనిపోయెను :** 1 పేతురు 3:18 అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు చనిపోయెను అని పేతురు వ్రాశాడు. మన అపరాధముల నిమిత్తము అప్పగించబడ్డాడని రోమా 4:25లో పౌలు అంటున్నాడు. ఆయన పేరులోనే 'రక్షకుడు' అని ఉంది. మన పాపములను మోసుకొనుటకు వచ్చిన 'దేవుని గొఱ్ఱెపిల్ల' ఆయన.

### 3. ఆయన న్యాయము చేసే రక్షకుడు :

**ఎ. యేసయ్య తన మహాకృపచేత తండ్రియైన దేవుని ఎదుట నీతిమంతులుగా మనలను నిలబెట్టుటకు వీలు కలిగించాడు :** (ఎఫెసీ 1:6) తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా దేవుడు తన కుమారులనుగా మనలను చేసుకున్నాడు.

రోమా 3:24లో "కృపచేత, క్రీస్తునందలి విమోచనము ద్వారా నీతిమంతులగు చున్నారు" అని పౌలు అంటున్నాడు.

**బి. ఆయన విమోచన కార్యముపై ఉన్న విశ్వాసము ద్వారా మనము కూడా విమోచింపబడుతాము :** 1కొరింథీ 1:31 "దేవుని మూలముగా ఆయన (క్రీస్తు) మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనమునాయెను".

### 4. రక్షణావకాశమే లేనివారిని రక్షించే రక్షకుడు :

నిరీక్షణలేని వారిని ఎన్నుకొని వారిని రక్షణలోకి నడిపించిన సంఘటనలను బైబిలులో చూడగలము. ఉదాహరణకు సుంకరి జక్కయ్య, ఏడు దయ్యములు పట్టిన మగ్దలేనే మరియ, గెరాసేనీయుల దేశములో సేన దయ్యము పట్టినవాడు, సమరయ స్త్రీ, వ్యభిచారములో పట్టబడిన స్త్రీలాంటి వారు, ఇహలోకపరంగా మనము ఆలోచిస్తే, వారికి పరలోక భాగ్యము దొరుకుట అసాధ్యమని అనుకుంటాము. కాని దేవుని ఆలోచనలకు, మన ఆలోచనలకు ఆకాశము, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. అటువంటి వారిని రక్షించుటలో ఆయన ఆనందిస్తాడు.

లూకా 19:1-10 వరకు ఉన్న వాక్య భాగంలో మనము సుంకరి జక్కయ్యను చూడగలము. అతను సమాజంలో అందరితో ద్వేషింపబడుచుండెడి వాడు. తోటి యూదులు అతనిని దగ్గరికి రానిచ్చేవారు కారు. అతనిని వెదకుచూ యేసయ్య యెరికో పట్టణమునకు వచ్చి, అతని ఇంటికి వెళ్లి, అతనిని, అతని ఇంటి వారిని రక్షించాడు.

### 5. తన అపార ప్రేమతో విధేయులనుగా చేయు రక్షకుడు :

జక్కయ్య విషయములోనే చూస్తే అతనిని పేరు పెట్టి పిలిచి, స్నేహితునిగా చేసుకున్నాడు. ఒక ఆత్మీయ స్నేహితునిగా “నేడు నేను నీ యింట నుండవలసియున్నది” అన్నాడు. “అతడు త్వరగా దిగి, సంతోషముగా ఆయనను చేర్చుకొనెను”, “పాపియైన మనుష్యుని యొద్ద బస చేయవెళ్ళెనని” ప్రజలు గొణిగినా ఆయన పట్టించుకోలేదు. ఆయన గమ్యం “నశించిన దానిని వెదకి రక్షించుట”. పాపులమైన మనలనందరినీ రక్షించుటలో ఆయన ప్రేమ కనబడుతుంది.

### 6. మంచి గొర్రెల కాపరియైన రక్షకుడు :

లూకా 15:4లో ఉపమాన రీతిగా చెప్పినట్లు తాను మంచి గొర్రెల కాపరివలె తప్పిపోయిన ఒక గొర్రె కొరకు తొంబది తొమ్మిది గొర్రెలను అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరికే వరకు వెదుకుతానని చెపుతున్నాడు. తప్పిపోయిన గొర్రెలాంటి జక్కయ్య కొరకు ఆయన యెరికో పట్టణానికి వచ్చాడు. అందుకే “నేను నీ యింట

ఉండవలసి ఉన్నది" అంటున్నాడు. "మారుమనస్సు పొందు ఒక్కపాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:7) అని యేసయ్య చెప్తున్నాడు.

**7. రక్షణ కార్యము సంపూర్ణముగా పూర్తిచేసే రక్షకుడు :**

రక్షింపబడిన పాపి పూర్తిగా మారిపోయి నూతన సృష్టిగా చేయగల సమర్థుడు మన యేసయ్య. సుంకపు గుత్తదారుడును, ధనవంతుడైన జక్కయ్యలో వచ్చిన మార్పు సంపూర్ణమైనది. తనలో వచ్చిన మార్పును అందరికీ చూపుట కొరకై అతను లేచి నిలబడి "ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదలకిచ్చుచున్నాను. నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను".

పాపుల రక్షకుడైన యేసుప్రభువుకు రక్షణ కార్యము నెరవేర్చుటకు కావలసిన సామర్థ్యత తండ్రియైన దేవుడు ఇచ్చి పంపినట్లుగా ప్రవచనాత్మకంగా యెషయా 11:1-3లోను, యెషయా 42:1-7లోను చెప్పబడి ఉంది. 11:2లో "జ్ఞాన వివేకములకు ఆధారమగు ఆత్మ, ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ, తెలివిని, యెహోవా యెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతని మీద నిలుచును" అని వ్రాయబడి ఉంది.

పాపులమైన మనలను రక్షించుటకు వచ్చిన దైవమానవుడైన యేసుక్రీస్తు కృప, సమాధానములు మనకు కలుగును గాక! ఆమేన్!

❖ ❖ ❖

# 22. లేవీయకాండము లోని బలులు

క్రీస్తు ప్రభువు సిలువ బలిని మనకు పరిచయం చేయుటకు ఏర్పాటు చేసిన పాతనిబంధన బలులను గుర్తు చేసుకుందాము.

యేసుప్రభువు జన్మించి మనకొరకు తనను తానే బలిగా అర్పించుకున్న 20 శతాబ్దాల తర్వాత ఇంకా ఈ పాతనిబంధన బలులను గురించి ఎందుకు చదవాలి? ధర్మశాస్త్రము పాటించనవసరములేని మనము ఆ పద్ధతుల వలన దేవుని తెలుసు కోగలమా అను ప్రశ్నలు మీ మదిలో తలెత్తి ఉంటాయి.

లేవీయకాండము ఆనాటి దేవుని ప్రజలకు ఒక వరముగా ఇవ్వబడినది. ఈనాటికీ మనకు కూడా అది దేవుని వరమే. నిర్గమకాండములో దేవుడు ప్రత్యక్ష గుడారము నిర్మించమని ఆదేశించి, ఆ గుడారములో ప్రజల మధ్య నివసించుటకు దిగివచ్చెను. లేవీయకాండములో ఒక పాపి దేవుని పరిశుద్ధతను గురించి ఎలా తెలుసుకోవాలో తెలుపబడి ఉన్నది. బలుల ద్వారా వారు పరిశుద్ధ దేవునితో సహవాసము చేశారు. లేవీయకాండములో బలుల ప్రాధాన్యత సంతరించుకున్నాయి. క్రైస్తవ్యములో నిజమైన విశ్వాసానికి కారణము ఈ బలులే. యేసుప్రభువు ఈ బలులు అన్నింటిని నెరవేర్చి, బలులకు ఒక అంతము ఏర్పరచాడు. యేసుక్రీస్తు తనంతట తానే చివరి ఘనమైన బలిగా అర్పించుకొని అందరికి చాలినవాడైనాడు. హెబ్రీ 9:1-10 లో ఈ విషయము విశదీకరించబడి ఉన్నది. హెబ్రీ 10:14 లో "ఒక్క అర్పణ చేత ఈయన పరిశుద్ధపరచబడువారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు" అని వ్రాయబడియున్నది.

దేవుని పరిశుద్ధత, ఆయన జనుల పరిశుద్ధత అనే రెండు అంశాలతో లేవీయకాండము నిండి ఉంది. ప్రతి క్రైస్తవుని గమ్యం అదే కావాలి. యేసయ్య, నూతన నిబంధన రచయితలు లేవీయకాండములోని "నిన్నువలె నీ పొరుగు వానిని

ప్రేమించు" అనే అంశము తరచుగా వాడారు. లేవీయకాండములోని బలులు యేసుప్రభువులో ఏ విధంగా నెరవేర్చబడ్డాయో హెబ్రీ 4:14 నుండి10:25 వరకు ఉన్న వాక్య భాగములో తెలుపుచున్నాడు. లేవీయకాండములోని దేవుడేర్పచిన అయిదు ప్రధాన బలులను ధ్యానిద్దాము: ఈ బలులన్నింటిలో మానవ జాతి పాపపు స్థితి గుర్తు చేయబడుతుంది; మానవులందరూ పాపాలు ఒప్పుకొని, పశ్చాత్తాపపడి దేవునితో సహవాసములో సంతోషించాలి అను విషయము చెప్తాయి; ప్రత్యామ్నాయ అర్పణ అనే పునాది సత్యము కూడా గుర్తు చేయబడుతుంది. పాపులమైన మనము మనంతట మనము మనలను రక్షించుకోలేము అను సంగతి గుర్తించాలి. ప్రతి ఒక్కరూ దేవుని సన్నిధిలో తన పాపము ఒప్పుకొని, పశ్చాత్తాప పడి, తిరిగి అదే పాపము చేయకుండా ఉండాలి. పరిశుద్ధుడైన మన దేవునికి పాపులతో సంబంధము ఉండదు. ఆయన కరుణామయుడు కాబట్టి పాపులపట్ల ఉన్న ప్రేమను బట్టి తన మహాకృపతో, పశ్చాత్తాపపడిన వారికి ప్రత్యాయమ్నాయంగా బలి ఏర్పాటు చేశాడు. రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు. (హెబ్రీ 9:22) కాబట్టి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన బలి ద్వారా రక్తము ప్రోక్షించబడుతుంది. లేవీ 17:11లో "రక్తము దేహమునకు ప్రాణము, మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలో నున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును" అని వ్రాయబడి ఉంది.

### లేవీయకాండములో 5 రకముల అర్పణలున్నాయి :

### 1. దహన బలి: (లేవీ 1:1-17, 6:8-13)

ఇది సర్వాంగ బలి. అన్నింటి కంటే శ్రేష్టమైనది కాబట్టి దేవుడు మోషేతో దీనిని మొదటిగా వ్రాయించాడేమో. మిగిలిన అర్పణలలో ఎక్కువ భాగం కాల్చుకొని తింటారు, కానీ ఈ బలిలో ప్రతి భాగము కాల్చివేయబడుతుంది. ఇది పాప ప్రాయశ్చిత్తము కొరకు లేవీ 1:4లో చెప్పారు. భక్తుడు తనను తాను దేవునికి సంపూర్ణముగా ప్రతిష్టించుకొనుట. అందుకే దీనిని "సర్వాంగహోమము" అని కూడా అంటారు. అర్పించువాని స్తోమతను బట్టి నిర్దోషమైన ఎద్దుగాని, పొట్టేలు గానీ, పావురము లేదా గువ్వపిల్లగాని ఉండవలెను.

**అర్పించే విధానము :** బలి పశువును ప్రత్యక్ష గుడార ద్వారమునకు తెచ్చి దానిపై చేతులుంచవలెను. దీని అర్థమేమంటే వారి పాపములు, దోషములు ఆ పశువు పైకి పంపించినట్లు అనుకోనేవారు. ఆ తర్వాత ఆ పాపి స్థానంలో ఆ పశువు వధింపబడుతుంది. దాని రక్తమును బలిపీఠము చుట్టు చల్లి, బలిపీఠముపై కట్టెలు పేర్చి పశువును దహించేవారు. పశువు చనిపోయినప్పుడు వారికి క్షమాపణ వచ్చినట్లుగా భావించేవారు.

యేసుక్రీస్తు అందరి కొరకు, అందరి పక్షాన దేవునికి సంపూర్ణముగా పూర్తి అంగీకారంతో సర్వాంగబలిగా తన్నుతాను అర్పించుకొనుట ద్వారా ఈ బలి నెరవేరింది.

విశ్వాసి తనను తాను స్వేచ్ఛగా నిర్బంధాలతో కాకుండా దేవునికి సజీవ యాగంగా సమర్పించుకోవాలి (రోమా 12:1,2). విరిగి నలిగిన హృదయము అనే బలి అర్పించాలని దావీదు కీర్తన 51:17లో చెప్తున్నాడు.

## 2. నైవేద్య అర్పణ : (లేవీ 2:1-16, 6:14-23)

ఇది అన్ని దహనబలులతో కలిపి అర్పించే ఉపబలి లేదా నైవేద్యము. దేవుని యొక్క నిబంధనా కనికరాన్ని జ్ఞాపకము చేసుకుంటూ ప్రతి దినము తనను తాను దేవునికి ప్రతిష్టించుకొనుట. దీనిని " జ్ఞాపకార్థబలి" అని కూడా అంటారు. ఇందులో పిండి, నూనె, ధూపద్రవ్యము (సాంబ్రాణి) ఉప్పు కలిపి దహిస్తారు.

పులుపు లేనటువంటి పిండి పాపరహితమైన అర్పణగా పరిశుద్ధ, నిర్దోషమైన వ్యక్తిత్వం గల యేసుక్రీస్తు అర్పించబడుటకు సూచనగా ఉంది. యేసుక్రీస్తు సిలువబలికి సూచనగా ఉంది. యేసుక్రీస్తు ద్వారా దేవుడు విశ్వాసులతో చేసిన నిబంధనకు ఉప్పు సూచనగా ఉంది (ప్రభువు బల్ల). సాంబ్రాణి యేసుక్రీస్తు విశ్వాసులందరి పక్షముగా సువాసనగా అర్పించబడుటకు సూచన. విశ్వాసి దేవునికి సువాసనగా తన్ను తాను అర్పించుకోవాలి.

## 3. సమాధాన బలి : (లేవీ 3:1-17, 7:11-21)

ఈ బలి భక్తునికి దేవునికి మధ్య గల సహవాసాన్ని సూచిస్తుంది. భక్తులు బలి పశువు యొక్క మాంసము తినునప్పుడు దేవుని యొక్క నిబంధనా విశ్వాస్యతను

గుర్తు చేసుకొని సహవాస భోజనము చేస్తారు. ఈ బలికి మంచి ఉదాహరణ 1రాజులు 8:63లో చూడగలము. మందిర ప్రతిష్ట సందర్భంగా సొలొమోను రాజు 22,000 ఎడ్లు, 1,20,000 గొఱ్ఱెలను అర్పించాడు. కృతజ్ఞతార్పణ, మ్రొక్కుబడులు, స్వేచ్ఛార్పణ అని మూడు రకాలుగా ఈ బలి ఉంటుంది.

పాపి దేవునితో సమాధానం కలిగి ఉండుటకు క్రీస్తే అధారం (ఎఫెసీ 2:11-18). విశ్వాసులందరూ దేవునితోను, మనుష్యులతోను సమాధాన బంధంతో జీవించాలి.

**4. పాప పరిహారార్ధబలి :** (లేవీ 4:1-35; 5:1-13; 6:24-30)

దీనిని గురించి ఎక్కువగా చెప్పబడి ఉంది. ఇది తెలియక చేసిన పొరపాట్లు నిమిత్తము అర్పించే ప్రాయశ్చిత్త బలి. ఇలాంటి పాపాలు ఏవంటే ఏవరైనా తప్పు చేయలేదని తెలిసి వారి పక్షాన మాట్లాడక పోవుట, పొరబాటున అపవిత్రతను ముట్టుకొనుట, తప్పు ఒట్టు పెట్టుకొనుట లాంటివి. యాజకుడు, జనులు, అధికారి, పేదవాడు, నిరుపేద ఇలా ప్రతి ఒక్కరూ వారి స్తోమతను బట్టి వేరువేరు అర్పణలు దేవుడు ఏర్పాటు చేశాడు.

యేసుక్రీస్తు మన కొరకు పాపముగా చేయబడి పాళెము వెలుపట శ్రమపడెను. ఈ సత్యము నమ్మిన వానికి పాపక్షమాపణ దొరుకుతుంది.

**5. అపరాధ పరిహారార్ధ బలి :** (లేవీ 5:14; 6:5; 7:1-10)

ఇది చివరిది. పొరబాటుకు పరిహారము చెల్లించుకొని తప్పుదిద్దుకొనుటకు అర్పించేబలి. దేవునికి విరోధంగా పాపం చేస్తే యాజకుడు ఏర్పాటు చేసిన వెలకు సమానమైన నిర్దోషమైన గొఱ్ఱెను తేవాలి. మనుష్యునికి విరోధంగా చేస్తే గొఱ్ఱెతో పాటు నష్టపరచిన సొమ్మంతటిని ఇస్తూ ఇంకో అయిదవ వంతు కలపాలి.

యేసుక్రీస్తు మన పాపముల నిమిత్తము మరణించి మనకు విరోధంగా ఉన్న రుణాలను తీసివేసెను (కొలస్సీ 2:13-15). విశ్వాసి యేసు రక్తమును ఆశ్రయించి, పరిశుద్ధంగా జీవిస్తే పాపముల నుండి విడుదల పొందగలడు (1యోహాను 1:7; 2:2).

మనము ధ్యానించుకున్న నాలుగు బలులు సిలువలో అర్పించబడినట్లుగా నలుగురు సువార్తికులు చూపిస్తున్నారు. మత్తయిలో రారాజుగా వచ్చి అందరి కొరకు అపరాధ పరిహారార్ధ బలిగా అర్పించుకున్నాడు. మార్కులో సేవకునిగా వచ్చి

పాపపరిహారార్థ బలైనాడు; లూకాలో మనుష్యకుమారుడై తండ్రితో మానవులను సమాధానపరచుటకై సమాధాన బలైనాడు; యోహానులో దైవ కుమారునిగా వచ్చి తనను తాను సంపూర్ణంగా అర్పించుకొని, విశ్వసించిన మానవులను సంపూర్ణులనుగా చేశాడు. సమాధాన బలిలోను, దహనబలిలోనూ పాపమును గురించి చెప్పబడలేదు, కాబట్టి లూకా, యోహాను సువార్తలలో సిలువలో ప్రభువు పలికిన నాల్గవ మాట “నా దేవా, నా దేవా, నన్నెందుకు చేయి విడిచితివి” అను మాట లేదు.

చివరిగా అర్పణలను గురించిన కొన్ని సూత్రాలు ధ్యానించుకుందాము : మనము క్రొత్త నిబంధన కాలంలో ఈ అర్పణలేవీ చేయకున్నా, ఈ సూత్రాలు విలువైనవి.

### 1. ఎవరైనా ఈ అర్పణలు ఇవ్వవచ్చును :

దేవుని కృప చాలా విశాలమైనది. అర్పణలు అర్పించే విధానాలలో చాలా కట్టడలున్నాయి కాని ఎవరైనా అర్పణ తేవచ్చు. యేసుక్రీస్తు ద్వారానే రక్షణ, ఈ రక్షణలోకి ఎవరైనా రావచ్చు. ఇది ఒక సార్వత్రిక ఆహ్వానముగా ప్రభువు ఇచ్చియున్నాడు (మత్తయి 11:28,29). తన యొద్దకు వచ్చు వానిని త్రోసివేయనని చెప్తున్నాడు (యోహాను 6:37).

### 2. ఆరాధించువాడు అర్పించు అర్పణ విలువైనదిగా ఉండాలి :

పాతనిబంధన కాలంలోని అర్పణలు కొని తేవలసి వచ్చేది. కాని యేసయ్య మనకు రక్షణ ఉచితంగా ఇచ్చి, మన బదులుగా తానే మన విమోచన క్రయధనము చెల్లించాడు. మన నుంచి ఆయన కోరుచున్నదేమంటే ఆయనను వెంబడించడమే.

### 3. శ్రేష్టమైనది మాత్రమే బలిగా అర్పించాలి :

యేసయ్య బలి శ్రేష్టమైనది, సత్యమైనది, మానవాళికంతటికీ చాలినదై ఉన్నది. అయితే దేవుడు మనలను మనము సంపూర్ణంగా సమర్పించుకోమంటున్నాడు.

కృప, కరుణ, ప్రేమ, ఉచిత రక్షణ, నిత్యజీవము పొందుకున్న మనము మనలను మనము ఆయనకు సమర్పించుకుందామా!

❖ ❖ ❖

# 23. విమోచన రక్తము

తన రక్తము మన కొరకు విమోచన క్రయధనముగా చెల్లించిన యేసయ్యకు స్తోత్రములు. ప్రతి క్రైస్తవ విశ్వాసికి రక్తము యొక్క విలువ, అవసరత తెలుసుకోవలసిన అవసరమున్నది కాబట్టి దానిని గురించి ధ్యానించుకొందాము.

కయీను కాలమునుండి ఇప్పటివరకు చాలామంది రక్తములేని అర్పణలు అర్పించాలని ప్రయత్నము చేస్తున్నారు. తమ చేతి పనులను, తమ పరిచర్యను, తమ సిద్ధాంతాలను, తమ తలాంతులను అర్పిస్తున్నారు. తమ ఆధ్యాత్మిక ఎదుగుదల, తమ ఆత్మీయ స్థితి, తమ నీతి ద్వారా విమోచన దొరుకుతుందని అనుకుంటున్నారు. నిత్యజీవము కొరకు తమ మీద తామే ఆధారపడుతున్నారు. కాని నిజమైన విమోచన కేవలము క్రీస్తు రక్తము ద్వారానే వస్తుందనే సంగతి తెలుసుకోలేకున్నారు.

ప్రతి మానవునికి రక్తము అవసరము. ఎందుకంటే హెబ్రీ 9:22లో – "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదని" చెప్పబడి ఉన్నది. పాత నిబంధన క్రైస్తవుల లాగా మనము పశువులను బలిగా అర్పించి, వాటి రక్తము బలిపీఠము మీదను బలి అర్పించిన వాడి మీదను ప్రోక్షించుకోవడము లాంటి కార్యముల అవసరము లేకుండా చేశాడు దేవుడు. ఎందుకంటే యేసయ్య "తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12).

బైబిలులోని అంశమంతా 'దేవుని గొఱ్ఱెపిల్ల' అని చెప్పవచ్చును. పాతనిబంధనలో ఇశ్రాయేలీయుల బలిలో కనబడ్డాడు. నూతన నిబంధలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు కనపడుతున్నాడు. మనము జీవించుట కొరకై ఆయన చనిపోయాడు. కల్వరి సిలువలో మన పాపములను మోసి, అవి పరిహారమగునట్లు చేశాడు. నూతన నిబంధనలో మనకివ్వబడిన వాగ్దానము. "యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను

పవిత్రులుగా చేయును" (1యోహాను 1:7). ఈనాటి స్వార్థపూరిత జనులు కల్వరివైపు చూడాలి. రక్తము యొక్క భద్రత, పాపశిక్ష నుండి, పాపశక్తి నుండి, పాప ఉనికి నుండి విడుదలను ఇచ్చేది యేసు రక్తము మాత్రమే అని తెలుసుకోవాలి. ఈనాటి బోధకుల ప్రసంగాలు మనలను మారుస్తాయేమో గాని, మన జీవితాలను మార్చలేవు. పాపిని, పరిశుద్ధునిగా మార్చాలంటే యేసురక్తము కావాలి.

ఈ బలి పద్ధతిని దేవుడే నిర్ణయించాడు. నిర్గమకాండము 12వ అధ్యాయములో ఈ పద్ధతిని మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు చెప్పాడు. 6,7 వచనాలలో ఈ విధముగా వ్రాయబడి ఉన్నది. "నిర్దోషమైన ఏడాది మగపిల్లను తీసికొనవలెను. గొఱ్ఱెలలో నుండియైనను మేకలలో నుండియైనను దాని తీసికొన వచ్చును. ఈ నెల పదునాలుగవ దినము వరకు మీరు దాని నుంచుకొనవలెను. తరువాత ఇశ్రాయేలీయుల సమాజపు వారందరు తమ తమ కూటములలో సాయంకాలమందు దాని చంపి దాని రక్తము కొంచెము తీసి, తాము దానిని తిని, ఇంటి ద్వారబంధము రెండు నిలువు కమ్ముల మీదను, పై కమ్మి మీదను చల్లి తర్వాత ఏమి చేయాలో చెప్పబడి ఉంది. దేవుడు ఆదేశించినట్లు చేస్తామని ఇశ్రాయేలీయులు నిశ్చయించు కొన్నారు. పస్కా పండుగ నాడు వారు చూపించిన విధేయత వలన వారికి మరణము నుండి విడుదల దొరికింది. ఐగుప్తు కుటుంబాలలో ప్రథమ సంతానము మరణించారు గాని ఇశ్రాయేలీయుల యొద్దకు మృత్యువు రాలేదు. వారికి సర్వసంపదలు దొరికాయి. నిర్గమ 12:35,36లో చెప్పబడినట్లు యెహోవా ప్రజల యెడల ఐగుప్తీయులకు కటాక్షము కలుగజేసెను గనుక వారు, ఇశ్రాయేలీయులకు కావలసిన వెండి నగలు, బంగారు నగలు, వస్త్రములు ఇచ్చారు.

ఇశ్రాయేలీయులు బలుల ద్వారా దేవుని స్తుతించుట నేర్చుకొన్నారు. లేవీయకాండము 1-7 అధ్యాయాలలో ప్రధానంగా ఉన్న నాలుగు రకాల బలులను గురించి చెప్పబడి ఉన్నవి.

### 1. దహన బలి :

దేవునితో సహవాసము కొరకు ఇవ్వబడు బలి. ఇందులో బలి పశువు పూర్తిగా దహించబడుతుంది. అది యెహోవాకు ఇంపైన సువాసన గలదని వ్రాయబడి ఉన్నది. దానివలన పాప ప్రాయశ్చిత్తము కలిగి పాపము కప్పబడుతుంది.

**2. నైవేద్యము :**

దేవునితో సహవాసము గలవారు తమను తాము అర్పించుకొనుటకు గుర్తుగా గోధుమ పిండితో చేసిన నైవేద్యము అర్పిస్తారు. ఇందులో రక్తము లేదు.

**3. సమాధాన బలి :**

కృతజ్ఞతార్పణగా ఇచ్చు బలి ఇది.

**4. పాప పరిహారార్థ బలి :**

దీనిని గురించి లేవీ 4:1-15 వరకు ఉన్న భాగములో వ్రాయబడి ఉంది. దీని వలన క్షమాపణ కలుగుతుందనే విశ్వాసము కలదు.

బలి ఎందుకు ఇవ్వాలి? అనే ప్రశ్నకు జవాబు మనకు తెలిసి ఉండాలి. దేవుడు పరిశుద్ధుడు కాబట్టి పాపాన్ని శిక్షిస్తాడు. బలి అర్పించినపుడు వారి పాపము క్షమార్హము; పాపము వలన వచ్చు శిక్ష మరణము, బలిపశువు మీద పాపము మోపబడుతుంది. మానవాళి పాపము కొరకు మెస్సయ్య వస్తాడనే వాగ్దానము జ్ఞప్తికి తెచ్చుకుంటారు. బలి రక్తము వలన ఇశ్రాయేలీయులు దేవుని సన్నిధికి వెళ్లడానికి అవకాశము పొందారు. కాని వారి పాపము తీసివేయబడలేదు. అయితే యేసయ్య రక్తము పాపములను కడిగి తొలగిస్తుంది. యేసు రక్తము ద్వారా జరిగినవి:

1. సిలువ రక్తము చేత దేవుడు తనతో సంధి చేసుకొన్నాడు (కొలస్సీ 1:20).
2. సంధి చేయబడిన తర్వాత మనము పవిత్రపరచ బడినాము –"యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:7).
3. పరశుద్ధపరచబడినాము – (హెబ్రీ 10:10).
4. పరిపూర్ణులనుగా చేశాడు (హెబ్రీ 10:14).

యేసు రక్తము యొక్క శక్తి ద్వారా పైన చెప్పబడిన నాలుగు కార్యాలు జరుగుట వలన మన కొరకు పరలోక ద్వారము తెరవబడింది.

పాత నిబంధనలో చెప్పబడిన విషయాలు క్రొత్త నిబంధనలో నెరవేరాయి. రక్తము ద్వారా శుద్ధీకరణ ఎలా జరుగుతుందనే వివరణ లేవీకాండము 14వ అధ్యాయములో వివరించబడి ఉన్నది. కాబట్టి దానిని ధ్యానించి తెలుసుకొందాము.

లేవీయకాండము 14లో కుష్ఠ రోగం పవిత్రపరచబడుటను గురించి వ్రాయబడి ఉంది. కుష్ఠరోగి రక్షణలేని పాపికి సాదృశ్యము. యాజకుడు తీసుకొనిరమ్మని చెప్పే రెండు పక్షులు సిలువ వేయబడిన క్రీస్తుకు, పునరుత్థానుడైన క్రీస్తుకు సాదృశ్యము. దేవదారు కర్ర సిలువకును, రక్తవర్ణము గల నూలు యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తమునకును, హిస్సోపు దేవుని వాక్యమునకు, మంటిపాత్ర మన శరీరమునకును, పారు నీరు పరిశుద్ధాత్మకును సాదృశ్యముగా ఉన్నవి. యాజకుడు పక్షులలో ఒక దానిని చంపి ఆ రక్తములో సజీవమైన పక్షిని ముంచి ఎగిరిపోవునట్లు దానిని వదిలేస్తాడు. అది ఎగిరిపోవునప్పుడు దాని రెక్కల మీద రక్తము అందరి మీద చిందింపబడుతుంది, పునరుత్థానుడైన యేసయ్యకు సాదృశ్యము ఆ పక్షి. హిస్సోపు రక్తములో ముంచి పవిత్రత పొందగోరు వాని మీద ఏడు మార్లు ప్రోక్షింపవలెనని వ్రాయబడి ఉంది. యేసుప్రభువు రక్తము కూడా ఏడు మార్లు చిందింప బడినట్లుగా మనము క్రొత్త నిబంధనలో చూడగలము.

1. లూకా 22:44 – గెత్సెమనె తోటలో చెమట రక్తముగా మారినపుడు.
2. యెషయా 50:6 – చెంపల మీద వెంట్రుకలు పెరికి వేసినపుడు.
3. మత్తయి 27:26 – కొరడాలతో కొట్టించినప్పుడు.
4. మత్తయి 27:29 – ముండ్ల కిరీటమును అల్లి ఆయన తలకు పెట్టినప్పుడు.
5. యెహాను 20:25 – మేకులతో ఆయన చేతులు సిలువకు కొట్టినప్పుడు
6. కీర్తన 22:16 – కాళ్ళను సిలువకు మేకులతో కొట్టినపుడు.
7. యోహాను 19:34 – బల్లెముతో ప్రక్కలో పొడిచినప్పుడు ఆయన రక్తము ఈ భూమి మీద ప్రోక్షించబడింది. 7 సార్లు ప్రోక్షించబడుట అనునది పాపమనే మానవాళి సమస్యకు సంపూర్ణ పరిష్కారము.

ఈ రక్త ప్రోక్షణ జరిగిన తర్వాత యాజకుడు “అపరాధ పరిహారార్థమైన దాని రక్తములో కొంచెము తీసి పవిత్రత పొందగోరువాని కుడి చెవి కొనమీదను, వాని కుడిచేతి బొటన వ్రేలిమీదను, వాని కుడికాలి బొటన వ్రేలి మీదను, దానిని చమరవలెను” (లేవీ 14:14). ఈ విధముగా ఎందుకు చేస్తారంటే చెవి కొనమీద చమిరినప్పుడు అపవాది స్వరము వినపడకుండా చెవులను రక్తము భద్రపరుస్తుంది.

చేతివేలి మీద చమిరినపుడు అపవాది నుండి చేతి పనులను భద్రపరుస్తుంది; కాలి బొటనవేలి మీద చమిరినపుడు నడకను భద్రపరుస్తుందనే విశ్వాసము వలన. ఈ భద్రత నిజముగా జరుగుతుందనే విషయము యోబు గ్రంథములో అపవాది స్వయంగా సాక్ష్యమిస్తున్నాడు. యోబు తన బిడ్డల కొరకు ప్రతి దినము దహనబలి అర్పించేవాడు (యోబు 1:5). ఈ విధంగా చేయుట వలన రక్తము వారి చుట్టూ కంచె వేసి వారిని భద్రపరుస్తుందని యోబు విశ్వాసము. ఈ విషయాన్ని గురించి అపవాది దేవునితో మాట్లాడుతూ యోబు చుట్టూ 5 విధములుగా కంచె వేశాడని చెప్తున్నాడు. యోబు 1:10లో చూస్తే ఈ కంచె 1. యోబు చుట్టూ, 2. అతని ఇంటి వారి చుట్టూ, 3. అతనికి కలిగిన సమస్తమునకు, 4. అతని చేతి పనికి, 5. అతని ఆస్తి అంతటి చుట్టూ వేయబడి ఉంది. ఈ అపవాది సాక్ష్యము ద్వారా సంఘానికి ఇవ్వబడిన సందేశమేమంటే యేసు రక్తము వలన మనకు భద్రత వస్తుందనియు, మనము యేసు రక్తము మీద విశ్వాసముంచి మన చుట్టూ, మన కుటుంబము చుట్టూ రాస్తే అది మన చుట్టూ వేసే కంచెను దాటి అపవాది మన జోలికి రాలేదని.

ప్రసంగి 10:8 ప్రకారము “కంచె కొట్టు వానిని పాము కరుచును” ఏ రోజైతే మనము యేసు రక్తము జ్ఞాపకము చేసుకోకుండా ఉంటామో, ఆనాడు మన చుట్టూ ఉన్న కంచెను మనమే కొట్టివేసినట్లు అవుతుంది. అప్పుడు అపవాది మనలను కాటేస్తాడు. ఈ కంచె బయట నుండి తెరవబడదు. మనమే కొంచెం సందిస్తే ప్రవేశిస్తాడు అపవాది. అందుకే మనము జాగ్రత్తగా ఉండాలి.

నిర్గమ 12:22లో మనము చూపిన వాక్యములో రక్తము ద్వారము మీద నిలువుగా, అడ్డుగా రాయమన్నాడు. నిలువు, అడ్డ గడపలు సిలువకు సాదృశ్యము. రక్తమును బట్టి తెగులు ఆ ఇంట్లోకి రాదు. ఆ ఇంట్లో ఉన్న వ్యక్తుల వ్యక్తిత్వాని బట్టి కాదు. ఇది దేవుని కృపకు సాదృశ్యము. ప్రతి విశ్వాసి యేసు ప్రభువు యొక్క సిలువ త్యాగమును జ్ఞాపకము చేసుకొని, ఆయన రక్తము యొక్క ప్రాధాన్యత గుర్తించాలి.

ఈ విమోచన రక్తాన్ని గురించి క్షుణంగా అర్థము చేసుకొని, రక్తము ద్వారా మనకు జరిగిన మేళ్లను తలచుకొని, మన జీవితాలలో రక్తము యొక్క శక్తిని అనుభవించాలని కోరుతూ ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 24. విమోచకుని చేరుటకు నయోమి ప్రణాళిక

"వెనకున్నవి మరచి ముందున్న వాటి కొరకై వేగిరపడుచు, క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని, గురి యొద్దకు పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ 3:13,14) అని చెప్పిన పౌలువలె మన గమ్యమైన విమోచకుని చేరాలంటే ఆయన ముంగుర్తు అయిన బోయజును చేరుటకు నయోమి తన కోడలు రూతు కిచ్చిన ప్రణాళికను పాటించాలి.

రూతు గ్రంథము 3:1–3 వచనములు ముందుగా ధ్యానించుకొందాము:

"ఆమె అత్తయైన నయోమి – నా కుమారీ, నీకు మేలు కలుగునట్లు నేను నీ కొరకు విశ్రాంతి విచారింపవలసిన దానను గదా? ఎవని పనికత్తెల యొద్ద నీవు ఉంటివో ఆ బోయజు మనకు బంధువుడు. ఇదిగో ఈ రాత్రి అతడు కళ్లమున యవల తూర్పార బట్టింప బోవుచున్నాడు. నీవు స్నానం చేసి తైలము రాసుకొని నీ బట్టలు కట్టుకొని ఆ కళ్లమునకు వెళ్లుము, అతడు అన్నపానములు పుచ్చుకొనుట చాలించు వరకు నీవు అతనికి మరుగైయుండుము".

రూతు గ్రంథములో ఈ సందర్భమును గురించి క్లుప్తంగా మనము జ్ఞాపకం చేసుకుందాము. నయోమి అను యూదురాలు బేత్లెహేములో కరువు వచ్చినపుడు తన భర్తయైన ఎలీమెలెకు, ఇద్దరు కుమారులతో కలిసి మోయాబు దేశమునకు వెళ్లి అక్కడ కాపురమున్న సమయములో తన కుమారులకు మోయాబు స్త్రీలతో వివాహము గావించి, పది సంవత్సరాల కాలంలో భర్త, కుమారులు చనిపోగా, ముగ్గురు విధవరాండ్రు మిగిలిపోయారు. తర్వాత కోడండ్రను తమ పుట్టింటికి పంపించి, తాను బేత్లెహేముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకొని బయలుదేరినపుడు ఓర్పా వెళ్లిపోయింది కాని మహ్లోను భార్య అయిన రూతు కష్టమైనా, నష్టమైనా అత్తతోనే వెళ్లాలని నిశ్చయించుకున్నది. ఇద్దరూ కలిసి యూదా దేశమునకు తిరిగివచ్చిన మొదటి రోజుల్లో తమను తాము పోషించుకొనుటకు యవల కోతలు జరుగుచున్న బోయజు పొలములోకి పనల మధ్య ఏరుకొనుటకు రూతు వెళ్లుచుండెను.

మొదట్లో నయోమి తన అభాగ్యస్థితిని తలచుకొని కుమిలిపోతూ ఉండేది. కాని తరువాత తన బాధ మరచిపోయి, తన కోడలి భవిష్యత్తు గురించి ఒక మంచి తల్లిలాగా ఆలోచించుట మొదలుపెట్టింది. అన్నీ వదలుకొని తనను వెంబడించిన రూతుకు మేలు కలగాలని, ఆమెకు విశ్రాంతి నియ్యాలని ఆలోచించి ఆమె భవిష్యత్తుకు ప్రణాళిక వేసి రూతుతో ప్రస్తావించింది. సమీపబంధువుగా, విడిపించువాడిగా ఉన్న బోయజు క్రీస్తుకు సాదృశ్యముగా ఉన్నాడు కాబట్టి ఈ విషయములు యథాతథంగా కాకుండా ఆత్మీయంగా అన్వయించుకుంటే మనము మన విమోచకుని సులభంగా చేరుకోగలము.

అందుకే నయోమి ఏర్పరచిన ఈ ప్రణాళికలోని ఏడు మెట్లు అర్థము చేసికొని ఆ ప్రకారము నడుచుకొనుట వలన మనము మేలు పొంది విశ్రాంతి పొందుతాము. రక్షణ అనుభవములోనికి వెళ్లాలంటే, దేవునితో లోతైన సంబంధము కలిగి ఉండాలంటే, ప్రణాళిక, పద్ధతి ప్రకారము ప్రతి ఒక్కటీ జరగాలి. రూతు బోయజు పొలము నుండి పనల మధ్య మిగిలిన ధాన్యము ఏరుకొనడము, కనికరముతో ఇచ్చిన అదనపు బహుమతులతో తృప్తి పొందుతూ ఉండేది. కాని నయోమి ఆమెకు బోయజుతో సంబంధము కలపాలని ఆశించింది. మనము కూడా మన బోయజు అయిన క్రీస్తు ఇచ్చే కానుకలతో తృప్తి చెందకుండా ఆయనే కావాలని కోరుకోవాలి. ఆయనను సొంతంగా కలిగి ఉంటే ఆయనకున్నదంతా మనదే అవుతుంది. రూతు ఎప్పుడైతే బోయజును పొందుకుందో, అప్పుడు ఆమెకు సమస్తము దొరికింది. పైపెచ్చు యేసుప్రభువు వంశావళిలోకి ప్రవేశించే భాగ్యము ఆమెకు కలిగింది. ఈ సమయంలో మనకు యేసయ్య స్వయంగా చెప్పిన మాటలు గుర్తుకు రావాలి : “ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును” (మత్తయి 6:33).

నయోమి తన కోడలు రూతుకు బోధించిన ఏడు మెట్లు మనము కూడా ఎక్కుటకు ప్రయత్నిద్దాము :

## 1. మనము ఎవరి దగ్గరకు వెళ్ళాలనుకుంటున్నామో వారి గురించి తెలుసుకోవాలి :

రూతు ఒక గమ్యంతో తనను విడిపించగల తన దగ్గరి బంధువు వద్దకే వెళు తూ ఉన్నది. “బోయజు మనకు బంధువుడు” అని చెప్తూ అతని గురించి రూతుకు

బోధించింది. మనకు అన్ని విషయములలోను చాలిన వాడైన యేసుప్రభువు నొద్దకు ఆయన వధువుగా వెళ్లుట మన గమ్యం కావాలి. ఆయన గొప్పతనము, ఆయన మనలను ప్రేమించిన విధానము, మన కొరకు తన ప్రాణము పెట్టిన విషయము, పునరుత్థానుడై తిరిగి లేచి, పరలోకమునకెక్కి తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండి మనకొరకు ఒక యాజకునిగా విజ్ఞాపనలు చేస్తున్న విషయములు తెలుసుకున్న రోజున ఆయనకు మాత్రమే మనలను విమోచించే శక్తి ఉన్నదని అర్థము చేసుకున్న తరుణంలో ఆయన దగ్గరకు వెళ్లుటకు సిద్ధపడుతాము. బోయజు తన కొరకు ఏర్పాటు చేయబడిన వ్యక్తి అని తెలుసుకొనిన రూతు ఆయన దగ్గరకు వెళ్లుటకు సిద్ధపడింది.

ఇక్కడ నయోమిని గురించి ఆలోచిస్తే, ఈమె రూతు జీవితంలో పరిశుద్ధాత్మ దేవుడు మన జీవితాలలో పోషించు పాత్రను పోషిస్తున్నదని చెప్పవచ్చు. యోహాను 16:8-15 వరకు ఉన్న వాక్యభాగములో పరిశుద్ధాత్మ దేవుని గురించి ప్రభువు వివరిస్తూ ఆయన వచ్చినప్పుడు నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఒప్పుకొన చేసి తండ్రి యొద్దకు నడిపించునను సంగతి తెలియజేస్తున్నాడు.

## 2. స్నానము చేయి:

నీ గతం నీ భవిష్యత్తును ప్రభావితం చేయకూడదు. వెనకున్నది మరచి ముందున్న వాటి కొరకు వేగిరపడి పరుగెత్తమని పౌలు చెప్పిన ప్రకారము గతంలోని అపజయాలన్నీ మరచి, ముందున్న ఉజ్వల భవిష్యత్తు కొరకు పరుగులు పెట్టాలి. రూతు తన వైధవ్యమును వదిలి, ఒక నూతన వధువులాగా సిద్ధపడుమని నయోమి బోధిస్తున్నది. దేవునితో సన్నిహిత సంబంధములోనికి మనము ప్రవేశించాలంటే "శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసుకోవాలని పౌలు 2కొరింథీ 7:1 లో చెప్తున్నాడు. మనము పాపము చేసినప్పుడంతా "నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము; హిమము కంటెను నేను తెల్లగా నుండునట్లు నన్ను కడుగుము" (కీర్తన 51:2, 7) అని దావీదులాగా ప్రార్థించాలి. కొన్నిసార్లు మనలను మనము కడుగుకొమ్మని ఆయన చెప్తాడు (యెషయ1:16). యాకోబు చెప్పినట్లు ఇహలోకములో ఉంటూ ఇహలోక మాలిన్యము అంటకుండా చూసుకోవాలి. యేసురక్తములో మనలను మనము కడుగుకోవాలి, ఎందుకంటే "యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

### 3. తైలము రాసుకొని :

ఆ కాలంలో ప్రజలు సువాసనగల నూనెతో తల అంటుకొని తమ శరీరములను భద్రపరచుకొనేవారు. నయోమి రూతును ఈ విధముగా పరిమళ తైలము రాసుకొని ముఖానికి వెలుగు తెచ్చుకొమ్మని బోధిస్తున్నది. వధువుగా వరుని దగ్గరికి వెళ్లునపుడు సుగంధ ద్రవ్యాలతో కూడిన పరిమళ తైలము రాసుకొనుట ఈనాటికీ జరుగుచున్నది. మన బోయజు దగ్గరికి వెళ్లునపుడు పాత స్వభావము వదిలిపెట్టి నూతన స్వభావముతో సమీపించాలి. దేవుడు మనలను ఎక్కలేనంత ఎత్తైన కొండల పైకి ఎక్కించాలను కొంటుండగా మనము ఆయనను సమీపించకపోవుట చేత ఆశీర్వాదములను పొందలేక పోతున్నాము. ఎన్ని ప్రతికూల పరిస్థితులలో నుండి వెళుచున్నను, ఆయన సన్నిధికి తైలము రాసుకొని ఆనందముతో వెళ్లినపుడు ఆయన ఆశీర్వదిస్తాడు. రూతు తన బాధాకరమైన గతాన్ని మరచి నూతన ఉత్సాహముతో బోయజును సమీపించినపుడు ఆయనకు ఆమెలో ఒక నూతన వధువు కనపడుతుంది.

### 4. బట్టలు కట్టుకొని :

వైధవ్యపు బట్టలు విడిచి, మంచి బట్టలు కట్టుకొని వధువుగా సిద్ధపడమని అత్త సలహా ఇస్తున్నది. యెషయా 61:3 లో ఉన్నట్లు ఉల్లాస వస్త్రములు ధరించికొమ్మని చెప్తున్నది.

మనము మన క్రీస్తును సమీపించినపుడు వేషధారణ, అసూయ, ద్వేషము అను పాతబట్టలు తొలగించి, ప్రేమ, దాతృత్వము, క్షమాపణ కలిగిన క్రీస్తును ధరించు కోవాలి (రోమా 13:14). మనము క్రీస్తును ధరించుకొన్నపుడు, ఆయన లాగా మారిపోతాము.

### 5. కళ్లమునకు వెళ్లుము :

కళ్లము అనునది పంట కూర్చు స్థలము. ఎత్తైనది, ఆశీర్వాదములు పొందుకొనే స్థలము, అటువంటి స్థలమునకు వెళ్లమని నయోమి రూతును ప్రోత్సహిస్తున్నది. అపవాది మనలను తప్పు స్థలాలకు తీసికెళ్లే ప్రయత్నము చేస్తాడు కాని మనము దేవుడుండు స్థలాలకు వెళ్లాలి. ఇరుకు మార్గములో వెళ్లినపుడు మన బోయజు ఉండు స్థలానికి వెళ్లగలము, కళ్లముకు వెళ్లు త్రోవ ఇరుకు మార్గమైనా సరే, అక్కడికి వెళ్లినపుడే మనకు బోయజు దొరుకుతాడు, మనవైఖరి మార్చుకుంటే, దేవుడు మనలను ఎత్తైన స్థలాలకు తీసుకొని వెళతాడు.

**6. అతడు అన్నపానములు పుచ్చుకొనుట చాలించు వరకు వేచియుండుము:**

యెషయ 40:31– "యెహోవా కొరకు ఎదురుచూచువారు నూతనబలము పొందుదురు". మనందరము కూడా దేవుని సమయము కొరకు వేచి ఉంటే, "తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి" అని పేతురు చెప్పినట్లు చేస్తే దేవుడు బహుగా ఆశీర్వదిస్తాడు. మోషే దేవుని మాట విని ఊరక నిలుచుండి చూచినందున ఎఱ్ఱసముద్రము పాయలుగా చేయబడి, ఆరిన నేలమీద నడచిపోవుట చూశాడు (నిర్గమ 14:21,22).

**7. మరుగైయుండుము :**

నిన్ను నీవు మహిమ పరచుకోకుండా, ఆయనే మనలను గొప్ప చేసేలాగున మరుగు పరచుకోవాలి. మన స్వంత ప్రకాశము కాకుండా ఆయన వెలుగు మననుండి ప్రసరించేటట్లు ఉండాలి. ఈ మాటకు మంచి ఉదాహరణ బాప్తీస్మమిచ్చు యోహాను. 'నేను ఆయన స్వరాన్ని మాత్రమే' అన్నాడు. మన స్వంత మహిమ కొరకు కాకుండా, ఆయన మహిమార్థము జీవించినపుడు మనము బోయజు దగ్గరికి చేరుకోగలము.

మన విమోచకుని చేరుటకు నయోమి ప్రణాళిక పాటించాలని కోరుతూ ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 25. ప్రస్తుతపు దుష్టకాలము నుండి విమోచన

మనము నమ్మి ఆరాధించుచున్న దేవుడు మనలను ప్రతి బంధకము నుండి, ప్రతి సమస్య నుండి, ప్రతి బాధ నుండి విమోచించు శక్తి గలవాడై యున్నాడు. సిలువ ధ్యానము ద్వారా అధికంగా లాభపడిన అందరూ ఆత్మీయంగా ఎదిగి ఉంటారని నమ్ముతూ దేవుని స్తుతిస్తున్నాను. ఆత్మీయంగా ఎదిగినవారు ఇహలోక ప్రస్తుత దుష్టకాలము నుండి, భవిష్యత్తు నిత్యజీవములోనికి వెళ్లుటకు సిద్ధపడుతూ, ఇతరులను సిద్ధపరచాలి. గలతి 1:4 ఒకసారి చదువుకుందాము – "మన తండ్రియైన దేవుని చిత్తప్రకారము క్రీస్తు మనలను ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచింప వలెనని, మన పాపముల నిమిత్తము తన్ను తాను అప్పగించుకొనెను". ఈ వాక్యములోని ప్రతి మాటను ధ్యానిస్తే అనేక అద్భుత సత్యాలు వెలికి వస్తాయి.

మొదటిగా, ప్రస్తుత దుష్టకాలము నుండి విమోచించుటకు" అనే వాక్యము చూస్తే ప్రస్తుతము మనము జీవించుచున్న కాలము దుష్టమైనది అని తెలుసు కుంటున్నాము. ఆదికాండము 3:17లో ఆదాము అవిధేయుడై దేవునికి విరుద్ధంగా పాపము చేసిన సందర్భంగా భూమి శపించబడింది. శపించబడిన ఈ భూమిపై జరిగే కార్యములన్నియు చెడ్డవిగాను, దేవునికి హేయమైనవి గాను ఉన్నవి. "ప్రస్తుతపు దుష్టకాలము" సమస్త మానవాళి యొక్క నైతిక, ఆత్మీయ దిగజారుడు స్థితిని సూచిస్తుంది. 2 కొరింథీ 4:4 ప్రకారము "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగ జేసెను". అపవాది అధికారము నుండి ప్రస్తుత దుష్టత్వము నుండి మనలను విమోచించుట కొరకు యేసుప్రభువు తనను తాను అప్పగించుకొనెను. ఇది తండ్రియైన దేవుని చిత్తప్రకారము జరిగిందని పౌలు చెప్తున్నాడు. ఇది తండ్రి మానవాళికి చేసిన వాగ్దాన ప్రకారము జరిగిందని గ్రహించాలి. ఆదికాండములో ఆదాము ద్వారా వచ్చిన పాపమనే సమస్య పరిష్కారము కొరకు దేవుడిచ్చిన వాగ్దాన నెరవేర్పే ఈ కార్యము.

అయితే ఈ శపించబడిన భూమి అంతమవ్వబోతోంది. తండ్రియైన దేవుడు తన కుమారుని విమోచకునిగా పంపించే కార్యము పూర్తిగావించ బడినది. ఆయన తన బిడ్డలను ఈ పాపలోకము నుండి తీసికొని వెళ్లడానికి స్వయంగా త్వరలో రాబోతున్నాడని కూడా దేవుడు ప్రవచనాల ద్వారా తెలియపరచాడు కాబట్టి నమ్మాలి. ఆయనను ఎదుర్కొనుటకు వెళ్లాలంటే మన నైతిక, ఆత్మీయ విలువలు పెరగాలి. రోమా 3:23 ప్రకారము "ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు". పాపము నుండి విడుదల పొందకపోతే పరిశుద్ధుడైన దేవుని యొద్దకు వెళ్లలేము కాని ఈ పాపముల నుండి మనంతట మనమే బయటపడే శక్తి మనకు లేదు. అందుకే తండ్రి తన కుమారుని పంపాడు. త్రిత్వములో ఒక్కడైన యేసుక్రీస్తు ద్వారానే మనకు రక్షణ, విమోచన. ఆయన మాత్రమే మనలను ప్రస్తుత దుష్టకాలము నుండి విడిపించగలడనే విశ్వాసము ఉంటేనే మనకు నీతి ఆపాదించబడి రక్షణ వస్తుంది.

యేసయ్య మరణము, త్యాగము ద్వారా మనలను పవిత్రపరచి తన లోకానికి తీసుకొని వెళ్తాడు. ఇప్పటికే మనలను క్రీస్తుతో కూడ "పరలోక మందు కూర్చుండ బెట్టెను" అని ఎఫెసి 2:7లో చెప్పబడి ఉంది. ప్రస్తుత దుష్టకాలములో ప్రపంచమంతా శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములతో నిండి ఉన్నది (1యోహాను 2:16). దైవభక్తి లేకుండుట చేత శపింపబడి, నాశనమునకు సిద్ధంగా ఉన్నది ఈ దుష్టయుగము నశించుటకు సిద్ధముగా ఉన్నదని లేఖనములలో స్పష్టంగా చెప్పబడి ఉన్నది. మత్తయి 13లో యేసయ్య పరలోకరాజ్యమును గూర్చి, యుగసమాప్తిని గూర్చి చెబుతూ కోత అనునది యుగసమాప్తి అని చెప్పాడు. 49,50 వచనాలలో కూడా యుగసమాప్తి యందు "దేవదూతలు వచ్చి నీతిమంతులలో నుండి దుష్టులను వేరుపరచి, వీరిని అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయును ఉండును" అన్నాడు. 1యోహాను2:17లో కూడా "లోకమును, దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును" అని వ్రాయబడి ఉన్నది. దీనిని బట్టి మనము తెలుసు కోవలసినదేమనగా ప్రస్తుత దుష్టకాలము శాశ్వతము కాదు, కాబట్టి యుగ సమాప్తి నిజమనే సంగతి స్థిరపరచుకోవాలి. యుగసమాప్తి నాడు మనము అపవాదితో పాటు నరకానికి పోకుండా నిత్య జీవానికి వెళ్లాలంటే, నరక కూపము నుండి విమోచించుటకు వచ్చిన యేసు ప్రభువు నందు విశ్వాసము ఉంచాలి. అదొక్కటే మార్గము.

హెబ్రీ 6:4-6లో ఉన్న మాటలు ధ్యానించుకుందాము: "ఒకసారి వెలిగింపబడి, పరలోక సంబంధమైన వరమును రుచిచూచి, పరిశుద్ధాత్మలో పాలివారై, దేవుని

దివ్య వాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు, తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువ వేయుచు, బాహాటముగా ఆయనను అవమాన పరచుచున్నారు”. ‘పరలోక సంబంధమైన వరములు రుచిచూచి’ అంటున్నాడు. నీతిమంతులముగా తీర్చబడుట ద్వారా మనకు వచ్చే 7 వరములను గూర్చి పౌలు రోమా 5:1-11లో తెలిపాడు.

అవేమనగా: 1. దేవునితో సమాధానము, 2. దేవుని సన్నిధికి ప్రవేశము, 3. దేవుని మహిమను గూర్చిన నిరీక్షణ, 4. క్రైస్తవ స్వభావము, 5. దేవుని ప్రేమ, 6. భవిష్యత్తు ఉగ్రత నుండి విడుదల, 7. సమాధాన స్థితి కలిగి యుండుట. ఈ వరములు కేవలము యేసుక్రీస్తు యొక్క సిలువ మరణము ద్వారా అనుగ్రహింప బడినవి. కాబట్టి, ఎవరైనా తప్పిపోతే, క్రీస్తును తిరిగి సిలువ వేసి అవమానించినట్లే అని ఇక్కడ చెప్పబడి ఉన్నది.

మనమందరము రక్షణానుభవము గలవారమై రాబోవు యుగము యొక్క బహుమానములు అనుభవిస్తున్నాము. మనము రక్షణ పొందినప్పటి నుండి ఈ యుగానికి చెందినవారము కాము. 2కొరింథీ 5:17లో పౌలు చెప్పినట్లు మనము నూతన సృష్టిగావించబడి, క్రీస్తుకు రాయబారులవుతాము. మనము పరలోక పౌరులము. నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా ఉన్న దేవుడు భూత, వర్తమాన, భవిష్యత్తు యుగాలకు ప్రభువైనవాడు మనలనందరినీ ప్రస్తుత దుష్టయుగము నుండి తీసి రాబోవు యుగములో సభ్యులుగా సిలువ ద్వారా చేశాడు. రోమా 3:23లో చెప్పబడినట్లు ప్రస్తుత యుగంలోని ప్రతివాడు నశించాడు. పరిశుద్ధుడైన యేసయ్య ఈ పాప యుగములో అడుగుపెట్టి మనలను ఈ దుష్ట యుగదేవత అయిన అపవాది బంధకము నుండి విమోచించాడు. సిలువ కార్యము పరిపూర్ణమైనది. హెబ్రీ 10:14లో “ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడు వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు” అని వ్రాయబడి ఉంది. ఒక్క బలి ద్వారా మనలను పవిత్రపరచి, సంపూర్ణంగా వెల చెల్లించాడు. ఈ అర్పణలో జరిగిన దైవిక బదిలీలు కొన్ని జ్ఞాపకము చేసుకొందాము.

1. యెషయా 53:6లో చెప్పబడినట్లు యెహోవా మన అందరి దోషములను క్రీస్తు మీద మోపి మనకు పాపక్షమాపణ వచ్చేట్లుగా చేశాడు.

2. యెషయా 53:3లో చెప్పబడినట్లు క్రీస్తు తృణీకరింపబడుట ద్వారా మనము దేవునిచే స్వీకరించబడినాము.

3. 1పేతురు 2:24 యేసుప్రభువు పొందిన గాయముల చేత మనకు ఆత్మీయ, శారీరక స్వస్థతలు లభించాయి.

4. 2కొరింథీ 5:21 మనలను నీతిమంతులుగా తీర్చి దిద్దుటకై క్రీస్తును మన కొరకు పాపముగా చేసెను. ఏ పాపము లేని ఆయన నీతిని మనకు ఆపాదించి, మన పాపమంతా ఆయన మీద మోపబడింది.

5. రోమా 6:23 పాపము వలన వచ్చు జీతము మరణము. ఆయన మన పక్షముగా మరణమనే శిక్షను అనుభవించి మనకు జీవము నిచ్చాడు.

6. ద్వితీ 21:23 "వ్రేలాడ దీయబడినవాడు, శాపగ్రస్తుడు", నిత్యజీవమనే వరము మనకిచ్చుటకు యేసయ్య సిలువలో వ్రేలాడదీయబడి శాపగ్రస్తుడైనాడు.

7. 2కొరింథీ 8:9 "ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను".

8. ద్వితీ 28:47, 48 "నీకు సర్వసమృద్ధి కలిగి యుండియు నీవు సంతోషముతోను, హృదయానందముతోను నీ దేవుడైన యెహోవాకు నీవు దాసుడవు కాలేదు గనుక అకలి దప్పులతోను, వస్త్రహీనతతోను, అన్ని లోపములతోను యెహోవా నీ మీదికి రప్పించు నీ శత్రువులకు దాసుడవగుదువు".

దేవుడు న్యాయవంతుడు, ప్రేమమూర్తి కాబట్టి తాను న్యాయంగా మన మీద మోపాల్సిన శిక్షలన్ని తన ప్రేమచేత మన మీద మోపక తన అద్వితీయ కుమారుని మీద మోపాడు. ఇక్కడ పేర్కొనబడిన అకలి, దప్పిక, వస్త్రహీనత అను లోపములు యేసుక్రీస్తు సిలువలో భరించినట్లుగా మనము చూడగలము.

పైన పేర్కొనబడిన బదిలీలన్నీ సిలువ కార్యము ద్వారా జరిపించి, తండ్రి చిత్త ప్రకారము మనలను ఈ ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచించిన యేసుక్రీస్తుకు మనమేమి ఇచ్చినా ఋణ విముక్తులము కాలేము. కాబట్టి పౌలు రోమా12:1లో చెప్పినట్లు సజీవ యాగముగా మన శరీరములను ఆయనకు సమర్పించుకుందాము. మన కొరకు ఇంతగొప్ప త్యాగము చేసిన యేసయ్యకు మనము ఈ మాత్రము చేయుటకు శక్తి నివ్వమని పరిశుద్ధాత్మ దేవుని ప్రార్థిస్తూ ముగిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 26. అభిషేకించబడిన నాయకుడు చేసిన వాగ్దానములు

రక్షణ మార్గములో నడుస్తూ ఇతరులను రక్షణ మార్గములో నడిపిస్తున్న నాయకులందరూ దేవుని ఎదుట చేయవలసిన వాగ్దానములను గురించి ధ్యానించు కొందాము.

దేవునిచే ప్రత్యేకించబడిన ప్రజలైన ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశములోనికి ప్రవేశించిన తరువాత, తమకు న్యాయము తీర్చుటకు రాజును నియమింపుమని సమూయేలు ప్రవక్తను కోరగా, ప్రవక్త దేవునితో సంప్రదించి వారి కొరకు సౌలును అభిషేకించాడు. సౌలు రాజు దేవుని ఆజ్ఞ ఉల్లఘించి అవిధేయతతో అభిషేకము పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత దేవుని ఆదేశానుసారము సమూయేలు ప్రవక్త దావీదును అభిషేకించాడు. దావీదు అభిషేకించబడిన తర్వాత దాదాపు ఇరువది సంవత్సరములు సౌలు రాజుచే తరుమబడి శ్రమపడ్డాడు. నిరీక్షణతో, విధేయతతో దేవునితో దేవుని సమయము కొరకు ఎదురు చూచిన దావీదు, సౌలు కుటుంబీకులందరు చంపబడిన తర్వాత సింహాసనాసీనుడాయెను.

సింహాసనమధిష్టించిన దావీదు దేవుని ఎదుట చేసిన వాగ్దానముల 101వ కీర్తనలో చూడగలము. దావీదు రాజుగా చేయబడినప్పుడు ఇశ్రాయేలు ప్రజల ఆత్మీయ పరిస్థితి చాలా హీనస్థితిలో ఉన్నది. కీర్తన 78:56-72 వరకు ఉన్న వాక్య భాగములో ఆసాపు ఆ పరిస్థితిని వివరిస్తూ ఇశ్రాయేలీయుల సమస్యలకు పరిష్కారముగా దేవుడు దావీదును ఇచ్చాడని చెప్పాడు. అప్పటి ప్రజలు మహోన్నతుడైన దేవుని విసర్జించి, తిరుగుబాటు చేసి ఆయనకు కోపము పుట్టించారు; విగ్రహారాధన చేసి ఆయన ఉగ్రతను రాజేశారు. ప్రజలను తన భూషణముగా చూచుకుంటున్న దేవుడు వారిని

విరోధులకు అప్పగించాడు. తర్వాత ఆయన వారి మొరనాలకించి దావీదును ఏర్పరచుకొని, అభిషేకించి, తన ప్రజలను పాలించుటకై ఏర్పరచుకోగా, దావీదు యథార్థవంతుడై వారిని పాలించాడని ఆసాపు వ్రాశాడు.

దావీదు రాజ్యపాలన మొదలు పెట్టగానే దేవుని మందసము తన యొద్దకు తీసికొని రావాలనే కోరిక చాలా బలంగా ఉండుట చేత "నీవు ఎప్పుడు నా యొద్దకు వచ్చెదవు?" (కీర్తన 101:2) అంటున్నాడు. దేవుని మందసము ద్వారా దేవుని సన్నిధి తనతో ఉంటే తాను రాజ్యపాలన దేవుని చిత్తానుసారంగా చేయగలననే భావన దావీదు కలిగియున్నాడు. సౌలు పాలనలో దాదాపు 20 సంవత్సరములు దేవుని మందసము అబీనాదాబు యొద్దనున్నది (1సమూయేలు 6:1; 7:2). తర్వాత దావీదు తన రాజనగరికి తీసుకొనిరావాలని ప్రయత్నించి విఫలుడై, మూడు నెలల పాటు ఓబేదెదోము ఇంటిలో ఉంచాడు (2సమూ. 6:1-11). తరువాత ధర్మశాస్త్ర ఆదేశానుసారము మందసమును జాగ్రత్తగా తన నగరుకు తీసికొని వచ్చి ప్రతిష్టించిన తరువాత ఈ కీర్తన ద్వారా తాను యథార్థవంతునిగా రాజ్యపాలన చేయుదుమని దేవునికి వాగ్దానము చేశాడు. ఇది రాజ్యపాలన మొదలు పెట్టినప్పుడు వ్రాసిన కీర్తన. దీనిని 'న్యాయకత్వ కీర్తన' అంటారు. ఎందుకంటే మంచి నాయకునికి ఉండాల్సిన లక్షణాలనన్నిటిని వివరిస్తున్నాడు. దావీదు రాజు ఈ కీర్తనలో దేవునితో మాట్లాడుతూ తనలోను, తన ఆస్థానంలోను, తన రాజధానిలోను చెడును తీసివేసి రాజ్యములో పవిత్రత నెలకొల్పుతానని నిశ్చయముగా చెప్తున్నాడు. కృప, న్యాయములు తన రాజ్యములో ఉంటే దేవుడు తమతో పాటు నివసిస్తాడని విశ్వసిస్తున్నాడు. అందుకే ఈ కీర్తనను దేవుని అధికారంలో పరిపాలించుట కొరకై దావీదు వాడుకొన్న "హక్కుల ఆమోద పత్రం" అని కూడా అంటారు.

దావీదు ఈ కీర్తనలో ఒక నాయకుడు ప్రాధాన్యత ఇవ్వవలసిన మూడు అంశములను ప్రస్తావిస్తున్నాడు. మొదటి రెండు వచనాలలో నాయకుని హృదయంలో దేవుని పట్ల ఉండాల్సిన భయభక్తులు; 3-5వచనాలలో నాయకునికి దృష్టి ఏ విషయములపై కేంద్రీకరించాలని అనే విషయము; 6-8 వచనాలలో నాయకుని నిర్ణయాలు దేవుని చిత్తప్రకారము ఉండాలను విషయములు చెప్పాడు. ఈ అంశాలన్నియు కేవలము నాయకులకే కాక రక్షణ మార్గములో నడుస్తున్న ప్రతి విశ్వాసి జీవితంలో అనుసరించవలసినవి కాబట్టి జాగ్రత్తగా ధ్యానించుకొందాము.

దావీదు రాజు దేవునికి హృదయానుసారుడిగా ఎందుకు మారాడంటే తాను ఈ లోకంలో దేవుని ప్రతినిధిగా ఉన్నానన్న వాస్తవాన్ని మనసునందు స్థిరపరచుకొని దేవుని ఆదేశానుసారంగా పాలించాలని నిర్ణయించుకున్నాడు. ద్వితీ 17:18-20 వచనములలో యెహోవా దేవుడు తన ప్రజలను పాలించురాజు ఏ విధంగా ఉండాలో వివరించి చెప్పాడు. ఆ మాట ప్రకారము ఒక రాజు యాజకుని యొద్ద నుండి ధర్మశాస్త్ర ప్రతిని తెప్పించుకొని అందులో ఇవ్వబడిన ఆజ్ఞలను పాటిస్తూ పరిపాలన సాగించవలెనని దేవుడు చెప్పిన ప్రకారము దావీదు భయభక్తులతో రాజ్యపాలన చేయుదునని దేవునికి వాగ్దానము చేస్తున్నాడు. ఈ కీర్తనలోని మొదటి రెండు వచనములలో దావీదు రాజు మాటలలో హృదయమును గురించిన ప్రాధాన్యత కనపడుతుంది. నాయకుని హృదయములో దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉంటే అతను దేవుని మహిమార్థము జీవిస్తాడని దావీదు అంటున్నాడు. ఆ విధమైన నాయకునిగా తానుండాలని దావీదు నిశ్చయించుకొన్నాడు. కాబట్టి "కృపను గూర్చియు, న్యాయమును గూర్చియు పాడెదను" అను మాటతో మొదలు పెడుతున్నాడు. కీర్తన 89:14లో దేవుడు కూడా తన రాజ్యమును నీతి న్యాయములు, కృపా సత్యములతో పాలిస్తాడని దావీదు గుర్తు చేసుకుంటున్నాడు. ఒక నాయకుని వ్యక్తిగత జీవితానికి, సంఘజీవితానికి తేడా లేకుండా యథార్థత కలిగి ఉండాలి. ప్రజలందరూ చదవగలిగేలా తన జీవితమును తెరచిన పుస్తకము వలె ఉండాలి.

యెహోవా దేవుని కీర్తిస్తూ ఈ కీర్తన ఆరంభిస్తున్నాడు. ప్రభువును స్తుతిస్తూ, భయభక్తులతో ప్రజలను పాలించుట ప్రతి నాయకుని గమ్యమై ఉండాలి. రెండవ వచనములో నిర్దోషముగా ఉంటానను వాగ్దానము చేస్తున్నాడు. నిర్దోషముగా అంటే పాపము లేకుండా అని కాదు గాని యథార్థత కలిగి ఉండుట, ద్విమనస్కులు కాకుండా యథార్థతలో స్థిరంగా ఉండుట, కీర్తనలు గ్రంథములో యథార్థత గురించి దావీదు చాలా సందర్భాలలో ప్రస్తావిస్తున్నాడు. విశ్వాసులందరు యథార్థత కలిగి ఉండాలని ప్రభువే స్వయంగా చెప్పాడు; "హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). "నా యింట యథార్థ హృదయముతో నడుచుకొందును" అంటున్నాడు. ప్రతి విశ్వాసి యొక్క పరివర్తన, మార్పు ఇంటితో మొదలు పెట్టాలి.

3-5 వరకు ఉన్న వచనములలో దావీదు హృదయము నుండి కన్నుల దగ్గరికి వెళుతున్నాడు. తన కన్నుల యెదుట ఏ దుష్కార్యమును జరుగకుండ చూచుకొంటానని వాగ్దానము చేస్తున్నాడు. భక్తి మార్గము నుండి ప్రక్కకు తొలగినవారిని, మూర్ఖులను,

దుష్టులకు, ఇతరులను గురించి వారు లేనప్పుడు తప్పు మాటలు చెప్పువారిని చూస్తే వారిని తన సహవాసము నుండి తొలగించెదను అంటున్నాడు. "సంహరించెదను" అను కఠినమైన మాట వాడుతున్నాడు. సంహరించుట అనగా శారీరకంగా చంపడము కాదుగాని అదికాండములో తన మాట వినకపోతే చచ్చెదరని దేవుడు ఆదాముతో చెప్పిన మాట. దేవునితో సహవాసము కోల్పోయినట్లే. ఇక్కడ దావీదు తన సహవాసము నుండి, సేవ నుండి వారిని తొలగించెదనని వాగ్దానము చేస్తున్నాడు. అహంకారులను, గర్వించు హృదయము గలవారిని కూడా తాను సహించనని చెప్తున్నాడు. ఒక నాయకుడు తన చుట్టూ ఉన్న అంతరంగ సహాయకులు తనలాగే దేవుని యందు భయభక్తులు గల వారిని ఎంచుకొంటేనే దేవుని చిత్తప్రకారము నాయకత్వము చేయుటకు వీలవుతుంది. కాబట్టి అటువంటి వారిని ఎన్నుకొనుటకు తనకు వివేకము దయచేయుమని దావీదు దేవుని అడుగుచున్నాడు. కీర్తన 15లో కూడా దావీదు యథార్థత గురించి చాలా విషయాలు వ్రాస్తూ "యథార్థ హృదయము గలవాడి దృష్టికి నీచుడు అసహ్యుడు" (15:4) అంటున్నాడు. వేషధారులు దేవుని దృష్టికి అసహ్యులు అని మనము గుర్తుంచుకోవాలి.

ఇక చివరి భాగమైన 6-8 వచనములలో నాయకుని చిత్తము గురించి చెప్తున్నాడు. దావీదు తన నిర్ణయాలు దేవుని చిత్త ప్రకారము ఉండాలని కోరుకుంటున్నాడు. తన చుట్టూ నమ్మకస్థులను ఉంచుకుంటాననియు, తన పరిచారకులందరూ నిర్దోషులుగా ఉండు వారిని నియమించు కుంటాననియు వాగ్దానము చేస్తున్నాడు. తాను ఒక నాయకునిగా దేవుని ఎదుట చేసిన వాగ్దానములు నెరవేర్చాలంటే తన ఆస్థానంలో పనిచేయువారందరూ మోసము లేకుండా, ఆబద్ధాలాడకుండా, పాపము చేయకుండా ఉండాలి అని దావీదు తెలుసుకున్నాడు. భక్తిహీనులందరిని నిర్మూలము చేస్తానని వాగ్దానము చేస్తున్నాడు. తూర్పు దేశపు రాజులు ప్రాత:కాలమున పట్టణ ద్వారము యొద్ద తీర్పు తీర్చేవారు. అందుకే దావీదు ప్రతి ఉదయమున ఓర్పుతో జ్ఞానముతో తీర్పు తీర్చి దేవునియందు భయభక్తులు లేని వారినందరినీ తొలగిస్తానంటున్నాడు. దావీదు చేసిన ఈ వాగ్దానములు మన మందరము దేవుని ఎదుట చేయాలనే నిర్ణయము తీసికొనుటకు దేవుడు మనకు సహాయపడును గాక. ఆమేన్!

❖ ❖ ❖

# 27. పౌలు యొక్క మాదిరి నడక

నిజదేవునిని ఎరిగిన మీరందరూ నూతన నడకతో ముందుకు సాగుతున్నారని నమ్ముతూ దేవునికి వందనాలు సమర్పించుకుంటున్నాను. నూతన నడకతో పయనిస్తున్న మనము మాదిరి విశ్వాసి అయిన పౌలు ఎటువంటి నడక కొనసాగించాడో తెలుసుకోవలసిన అవసరత ఉన్నది. ఎందుకంటే, పౌలు ధైర్యంగా "నేను క్రీస్తును పోలి నడుచుకున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" (1కొరింథీ 11:1) అన్నాడు. తనను పోలి మనము నడచుకోవాలని ఆదేశించిన పౌలు తన పరిచర్య కాలములో ఏ విధమైన నడక కొనసాగించాడో తెలుసుకొనుట వలన మనకు లాభము చేకూరుతుంది. పౌలు ఎఫెసు సంఘ పెద్దలను పిలిపించి, తాను వారి మధ్య నివసించిన కాలములో తాను ఏ విధంగా నడుచుకున్నాడో గుర్తు చేస్తూ, ఆ విధంగానే వారు కూడా నడచుకోవాలని బోధిస్తున్నాడు. "యూదుల కుట్రల వలన నాకు శోధనలు సంభవించినను, కన్నీళ్లు విడుచుచు పూర్ణమైన వినయ భావముతో నేనేలాగు ప్రభువును సేవించుచుంటినో మీకే తెలియును" (అపొ.కా. 20:19) అంటున్నాడు.

ప్రభువును ఎరుగక మునుపు క్రీస్తుమార్గములో వెళ్లు వారిని హింసిస్తూ జీవించిన పౌలు, ప్రభువు మార్గములోకి వచ్చిన తర్వాత మారిపోయాడు. ఆ మార్పు సహించలేని యూదులు అతనిని అంతము చేయాలని కుట్రలు పన్ని చాలా హింసించారు. ప్రభువును సంధించక మునుపు హింసకుడిగా ఉన్న పౌలు, ప్రభువును కనుగొన్న తర్వాత హింసించబడే వాడిగా మారాడు. 'నీతి నిమిత్తము హింసించబడువారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది' (మత్తయి 5:10) అను సత్యము తెలుసుకొని ప్రభువు మార్గములో శ్రమలను సంతోషముగా భరించాడు. ఆ సత్యాలను ఎఫెసు సంఘస్తులకు జ్ఞాపకము చేస్తున్నాడు. పౌలు వారికి చెప్పిన విషయాలు మనకు కూడా చాలా అవసరము కాబట్టి జాగ్రత్తగా ధ్యానించుకుందాము.

## 1. వినయ పూర్వకమైన నడక :

19వ వచనములో ఈ విషయము చూశాము. సౌలు పౌలుగా మారక పూర్వము అతని జీవితమును గురించి మనము ఆలోచిస్తే, ఇంతటి మార్పు సాధ్యమా అనిపిస్తుంది. సౌలు రోమా ప్రభుత్వములో ఒక ఉన్నత స్థానములో ఉన్న అధికారి. తన పితరుల పారంపర్యాచార మందు విశేష ఆసక్తికలవాడై, యూదుల మతములో ఆధిక్యత పొందిన వాడుగా ఉన్నాడు. యూదులలో బహు నిష్ఠగల అతి సనాతన తెగకు చెందిన పరిసయ్యుడుగా ఉంటూ ప్రసిద్ధి చెందిన గమలియేలు యొద్ద శిష్యరికము చేశాడు. పౌలు యూదుడై ఉండి కూడా చాలా గౌరవించదగిన రోమా పౌరసత్వము కలవాడు. ఇంతటి ప్రముఖుడు క్రైస్తవులను బంధించుట కొరకై దమస్కు మార్గములో వెళుతున్న సమయంలో దేవుని దర్శనము ద్వారా మరుమనస్సు పొంది, సంపూర్ణముగా తనను తాను యేసయ్యకు సమర్పించుకున్నాడు. యేసుప్రభువు శిష్యులుగా ఉన్న వారందరికీ ఉండాల్సిన ప్రధాన లక్షణము తగ్గింపు స్వభావము. అందుకు యేసుప్రభువే ఆదర్శము. పౌలు కూడా తగ్గింపు స్వభావము అలవరచుకొని వినయ పూర్వకమైన నడక కొనసాగించాడు. "ప్రభువును సేవించుట" అనేది తన జీవిత గమ్యంగా పెట్టుకున్నాడు. తనను తాను క్రీస్తు దాసుడనని చెప్పుకుంటూ తన సేవ స్వార్థ పూరితమైనది కాదు గాని కేవలము ఆధ్యాత్మికమైనది ప్రజలకు చూపించుటకు జాగ్రత్తపడ్డాడు.

తన పరిచర్య మాదిరికరంగా ఉండేట్లుగా చూసుకొన్నాడు. కన్నీరు విడుస్తూ పూర్ణమైన వినయ భావముతో తన సేవ చేశాడు.గానీ తమ స్వంత పేరు ప్రఖ్యాతుల కొరకు పాటుపడే నేటి సేవకుల వలే కాదు. తగ్గింపు స్వభావము అనేది చేతకాని తనము కాదు. ఎందుకంటే పౌలు ఎన్ని ప్రమాదాలు, శ్రమలు ఎదురైనా భయముతో వెనుతిరుగక ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉన్నాడు. "కన్నీరు విడిచాను" అని తన స్నేహితులతో చెప్పుకొనుటకు సిగ్గుపడలేదు.

## 2. నమ్మకత్వముతో బోధిస్తూ ముందుకు సాగుట :

అపొ.కా. 20:20,27 "ప్రయోజనకరమైనది ఏదియు దాచుకొనక.... దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొనలేదు" అని పౌలు వారితో చెప్తున్నాడు. పౌలు దమస్కు మార్గములో దేవుని దర్శనము పొందిన తర్వాత అరేబియా ప్రాంతములో మూడు సంవత్సరములు ఉండి దేవుని సన్నిధిలో, దేవునిచే స్వయంగా బోధింపబడ్డాడు. "నాకెవడును బోధింపను లేదు గాని యేసుక్రీస్తు బయలుపరచుట

వలననే అది నాకు లభించినది' (గలతీ. 1:12) అని పౌలు చెప్పాడు. తాను దేవుని యొద్ద నుండి పొందిన బోధనంతయు అందరికీ నేర్పించాడు. కొంతమంది బోధకులు తమకు దేవుడిచ్చిన జ్ఞానముతో పొందిన ప్రత్యక్షతలు ఇతరులకు తెలిపితే, తమకంటే గొప్ప బోధకులవుతారేమోననే భయంతో చెప్పక దాచుకుంటారు. అటువంటి పని తాను చేయలేదని పౌలు అంటున్నాడు. దేవుడు తనపై ఉంచిన నమ్మకమును వమ్ము చేయకుండా తనకప్పగించిన పనిని నేరవేర్చాడు. తన పరిచర్యలో ప్రభువు స్వయంగా నేర్పించిన బోధను, ఇంటింటా, బహిరంగముగా అందరికీ తెలియజేసాడు. ఆయన ప్రస్తుత బోధకుల వలె కాక ఎక్కడైనా, ఎప్పుడైనా తాను నేర్చుకొన్న సత్య సువార్తను బోధించేవాడు. వ్యక్తిగత సువార్త గాని, బహిరంగ సభలలో మాట్లాడుట గాని ఏదైనా సరే అవకాశములను వదులుకొనే వాడు కాదు. సమయమందును, అసమయమందును బోధించుటకు సిద్ధపడేవాడు.

### 3. సాక్ష్యమిస్తూ నడచుట :

ప్రభువు పౌలును అన్యుల మధ్య, రాజుల మధ్య సువార్త బోధించుటకును, సాక్ష్యమిచ్చుటకును నియమించాడు. తనకు దేవుడప్పగించిన పనిని తూ.చ. తప్పకుండా నెరవేర్చాడు. పౌలు పరిచర్యలో మనము గమనిస్తే ప్రతిచోట ప్రభువు తనను దర్శించిన విధానమును సాక్ష్యముగా చెప్తూ నడిచాడు. రోమా పట్టణమునకు బందీగా కొనిపోబడినప్పుడు అగ్రిప్పరాజు ఎదుట కూడా తన సాక్ష్యమును విశదీకరించాడు. అ.కా. 26:1-23 వరకు ఉన్న వాక్యభాగములో చాలా వివరంగా తాను ఆరంభములో ఉన్న విధానమును, యేసుప్రభువు తనలో తెచ్చిన మార్పు, తదనంతరము తానేవిధంగా ఉన్నాడో చెప్పాడు. 'నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు, నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకుని గాను, సాక్షినిగాను నియమించుటకై కనబడియున్నాను" అని ప్రభువు తనతో చెప్పిన మాటలను చెప్పాడు. ప్రతి బోధకుడు, విశ్వాసి తమ జీవితాలలో దేవుడు చేసిన అద్భుతములను సాక్ష్యముగా చెప్పాలి. తన సాక్ష్యమును ఆయుధముగా ప్రతి సువార్తికుడు ఉపయోగించుకోవాలి.

### 4. తన ప్రాణము కంటే దేవుడే మిన్న అన్నట్లుగా నడిచాడు :

అపో.కా.20:23,24, "బంధకములును, శ్రమలను నా కొరకు కాచుకొని యున్నవని, పరిశుద్ధాత్మ ప్రతి పట్టణములోను నాకు సాక్ష్యమిచ్చుచున్నాడని తెలియును. అయితే దేవుని కృపా సువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుట యందు నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను తుదముట్టింపవలెనని నా ప్రాణమును

నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుటలేదు" అని పౌలు అంటున్నాడు. కేవలము మాటలు కాకుండా చేతలతో చేసి చూపించాడు. "బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" అనే ఆలోచనతో ముందుకు నడిచాడు.

### 5. సంఘపెద్దలను ప్రోత్సహిస్తూ, హెచ్చరిస్తూ నడిచాడు :

అపొ.కా. 20:28-30 "సంఘము దేవునిది, కుమారుడైన దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించినది, పరిశుద్ధాత్మ దేవుడు సంఘపెద్దలను నడిపిస్తున్నాడు". కాబట్టి పెద్దలందరూ సంఘము యొక్క ప్రాధాన్యతను గుర్తించి జాగ్రత్తగా దానిని కాయాలని పౌలు చెప్తున్నాడు. అబద్ధ బోధకులను క్రూరమైన తోడేళ్లతో పోల్చాడు. సంఘములోనే ఉంటూ స్వంత లాభము కొరకు సంఘమును విచ్ఛిన్నము చేయుటకు ప్రయత్నించు కొందరు సంఘస్తులను బట్టి జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తున్నాడు. పౌలు తన జీవిత కాలమంతటిలో క్రీస్తు శరీరమైన సంఘమును గూర్చిన జాగ్రత్తలు బోధిస్తూనే ఉన్నాడు.

### 6. సమర్పణ నడక :

అపొ.కా. 20:31 "తాను ఎంత సమర్పణతో వారి కొరకు పాటు పడ్డాడో సంఘ పెద్దలకు జ్ఞాపకము చేస్తున్నాడు. "నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్లు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసుకొని మెలకువగా ఉండుడి". ప్రతి బోధకుడు, విశ్వాసి తనవలె సమర్పణతో సేవ చేయాలని చెప్తున్నాడు. పౌలు హెచ్చరికలు, కన్నీరు. ఆధ్యాత్మిక బాధ్యతలు భారముతో స్వీకరించవలెనని మనకు గుర్తుచేస్తున్నాయి.

### 7. ఆర్థిక నడక :

అపొ.కా. 20:33,34 – చివరిగా ఆర్థిక విషయాలలో తన గృహ నిర్వాహకత్వము ఏ విధంగా ఉండేదో గుర్తు చేస్తున్నాడు. "ఎవని వెండినైనను, బంగారమునైనను, వస్త్రములనైనను నేను ఆశింపలేదు, నా అవసరముల నిమిత్తము, నాతో ఉన్న వారి నిమిత్తమును నా చేతులు కష్టపడినవని మీకే తెలియును" అంటున్నాడు.

మనము ధ్యానించుకున్న 7 విషయాలు మనము మననము చేసుకొని, మారుమనసు పొంది, ముందుకు సాగుతున్న మన జీవితాలలో పౌలు యొక్క మాదిరి నడక ద్వారా ఏ ఏ మార్పులు రావాలో నిర్ణయము తీసుకొనుటకు అందరికీ పరిశుద్ధాత్మ దేవుడు సహాయపడును గాక!

❖ ❖ ❖

# 28. జ్ఞానవంతురాలి ఆభరణములు

దేవుని సంఘము పెళ్ళికుమార్తెగా వరుడైన యేస్యయ్య రాకకొరకు వేచి ఉండాలి. కాబట్టి వధువు ధరించాల్సిన ఆభరణాలను గురించి తెలుసుకొని వాటిని ధరించి సిద్ధపడాలనే ఉద్దేశముతో ఆ విషయాలు ధ్యానిద్దాము.

యెహోవా యందు భయభక్తులు కలిగి ఉండటమంటే, పాపము చేయుటకు భయపడి, మానివేసి దేవుని హత్తుకొని ఉండుట. జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టుకొనును (సామెతలు 14:1) అని బైబిలు బోధిస్తుంది. జ్ఞానవంతురాలు తన ఇంటిని ఇహలోక పరమైన వస్తువులతో గాక పరలోక సంబంధమైన వనరులతో కడుతుంది. హెబ్రీ 11:10లో వ్రాయబడి ఉన్నట్లు "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణము కొరకు" జ్ఞానవంతురాలు పాటు పడుతుంది. ఆ నిత్యమైన ఇంటి కొరకు ఏ వనరులతో సిద్ధపడి ఉండాలి? అను విషయములు మనము తెలుసుకుందాము.

అభరణములు రెండురకాలుగా ఉన్నాయన్న విషయము మనము గమనించాలి. 1పేతురు 3:4లో ఈ విధంగా వ్రాయబడి ఉన్నది - "సాధువైనట్టియు, మృదువైనట్టి యునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను, అది దేవుని దృష్టికి మిగుల విలువ గలది". అక్షయమైన అలంకారములు ధరించాలని పేతురు చెప్తున్నాడు. క్షయమైన మన అలంకారములకు ప్రాధాన్యత ఇవ్వక అక్షయమైన వాటి కొరకు పాటుపడాలి. బైబిల్ గ్రంథములో దేవుని గూర్చి, సాతాను గూర్చి, ఈలోకమును గూర్చి, పరలోకమును గూర్చి, శాశ్వతమైన వాటిని గురించి, అశాశ్వతమైన వాటిని గురించి స్పష్టంగా వ్రాయబడి ఉన్నది. ద్వితీయోపదేశకాండము 30:15లో "చూడుము, నేడు నేను జీవమును మేలును, మరణమును కీడును నీ యెదుట ఉంచియున్నాను" అని దేవుడు చెప్తున్నాడు. క్షయమైనవి, అక్షయమైనవి మన ఎదుట ఉంచబడినవి. ఏది స్థిరమైనదో, ఏది అస్థిరమైనదో తెలుసుకొని దాని మీద దృష్టి సారించాలి. అల్పకాల పాప భోగములను అనుభవించుట కంటే యేసు కృపలో జీవించుట ఎంతో శ్రేష్టమని తెలుసుకోవాలి.

క్రీస్తు పూర్వము యూదులు స్త్రీలను చాలా హీనంగా పరిగణించేవారు. సంఘము ఏర్పడిన తర్వాత క్రైస్తవ్యము వ్యాప్తి చెందే కొద్దీ చాలా ఆశ్చర్యకరంగా స్త్రీలను గౌరవించడము పెరిగింది. 2వ శతాబ్దములో టెర్‌టూలియన్ అను సంఘ పెద్ద తన రచనలలో ఒకటైన " "On the apparel of Women"లో అన్యులైన స్త్రీలను గురించి చెప్తూ వారి గొప్పతనము, సహజ అందము మరుగు చేసే ఉద్దేశముతో, సమాజమే స్త్రీలను ప్రోత్సహించి, వారు ఎక్కువ ఆభరణాలు వేసుకొని, ఆడంబరమైన వస్త్రాలు ధరించి, శరీరముపైన నానా రకములైన అలంకరణలు వేసుకొనేట్లు చేసింది అన్నాడు. దీనికి విరుద్ధంగా సంఘము ఎదిగే కొద్దీ సువార్త ఫలము కనిపిస్తున్నప్పుడు దాని ఫలితాలలో ఒకటిగా స్త్రీల వస్త్రధారణ, అలంకరణ నిరాడంబరముగా మారింది. అప్పటి నుండి వారు సమాజంలో గౌరవింపబడ్డారు. అన్యులైన పురుషులు "ఈమె క్రైస్తవురాలిగా మారినప్పటి నుండి చాలా నిరాడంబరముగా తయారైంది" అనేవారు. క్రైస్తవ స్త్రీలను "నిరాడంబర యాజకురాండ్రు" అని పిలిచేవారు. అయితే Tertullian ఈ విధంగా అంటున్నాడు: 'క్రీస్తును ప్రభువుగా గల విశ్వాసులైన స్త్రీలు ఆత్మీయంగా ధనికులై పరిశుద్ధంగా ఉంటారు. కాబట్టి అన్యుల సమాజంలో ఉన్న చాలా ధనవంతులకంటే మహిమగల వారై ఉంటారు. ఎందుకంటే, వారు 'నీతి' అనే సిల్క్ వస్త్రములు, 'పరిశుద్ధత' అనే సన్నని నారబట్టలు, 'నిరాడంబరము' అను ఊదా వస్త్రములు ధరిస్తారు'. స్త్రీత్వము అనే సుగుణాన్ని అంతకు మునుపెన్నడూ లేనంత ఎత్తైన స్థానానికి తీసికెళ్ళారు.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయమేమంటే, ఆత్మీయంగా మనము ఎదిగే కొద్దీ మనలో మార్పులు వస్తాయి. క్రీస్తును కలిగి ఉంటే నూతన సృష్టి గావించబడతామని పౌలు అంటున్నాడు (2కొరింథీ 5:17). మాటలు, చేతలలోనే గాక వేషధారణలో కూడా మార్పులు వస్తాయి. దీనికి కారణము మనము కేవలం దేవుని మాత్రమే 'సంతోషపరచాలనే ఆశ కలిగి యుంటాము'.

సంఘాలలో కొందరు అకస్మాత్తుగా అలంకరణలు మానుకుని, తెల్లని వస్త్రాలు ధరించడము మొదలుపెట్టారు. కారణమడిగినప్పుడు పాస్టరు గారు చెప్పారని అంటారు గానీ, దేవునితో సంబంధము పెంపొందించుకొనుటకు ఇహలోక పరమైన ఆకర్షణలు అడ్డుగా ఉన్నవని తీసేశాను అనరు. కొంత మంది "మాకు దేవుడు చెప్పాడు" అంటారు. అటువంటి వారి జీవితాలలోకి తొంగి చూస్తే దేవుడావిధంగా ఎందుకు చెప్పాడో అర్థమవుతుంది. చాలామంది విశ్వాసులకు బాహ్య అలంకరణ, ఆభరణాలు దేవునికంటే ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకొని వారి జీవితాలలో అవి విగ్రహాలు అవుతున్నాయి. అటువంటి వారు తిరిగి తన మార్గములోనికి తీసుకొని రావడానికి దేవుడు అనుసరించిన మార్గమది అని మనం అర్థం చేసుకోవాలి. ఈ సందర్భముగా రెండు ఉదాహరణలు చూద్దాము :

1. ఒక ధనవంతురాలు చాలా నగలు వేసుకుంటూ, వేసుకోని వారిని చిన్నచూపు చూసేది. తరువాత పరిశుద్ధాత్మతో నింపబడి తాను దేవుని కంటే నగలను ఎక్కువగా ప్రేమిస్తున్నానని గ్రహించి, వాటిని ప్రక్కన పడేసింది. ఎవరైనా దేవుని ద్వారా హెచ్చరించబడి నగలు వేసుకోవడము మానేస్తే అది వారి ఇష్టము. కాని వారి ఇష్టము ఇతరులపై రుద్దటం భావ్యం కాదు.

2. ఒక యౌవనస్థుడు వివాహమయ్యాక తన తల్లి నగలు పెట్టుకోదు కాబట్టి తన భార్యను కూడా పెట్టుకోద్దని చెప్పాలనుకున్నాడు. కాని ప్రార్థించినప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ఆమె క్రీస్తు రక్తముతో కడగబడి ఉన్నదనియు, దేవునితో నడుచుటకు ఆ నగలు అడ్డురావనియు చెప్పిన తర్వాత అతను భార్యకు చెప్పలేదు.

ఎవరో చెప్పారని కాక బైబిలు ఏ సందర్భంలో ఏమి చెప్తుందో అర్థం చేసుకొని ఆ ప్రకారము చేయాలి. వేషధారణ, అలంకరణలు, అభరణాలు ఇవన్నీ ఏమై ఉండాలో నేర్చుకోవాలి. నగలు, ఖరీదైన వస్త్రాలు వేసుకున్న వారు పరలోకానికి పోరు అని తలంచిన వారు యేసు రక్తము యొక్క శక్తిని అవమానపరచిన వారవుతారు. యేసు నామమున ప్రార్థిస్తే రక్షణ వస్తుందనే సిద్ధాంతాన్ని నమ్మడము లేదని రుజువవు తుంది. 'నా వేషధారణ ద్వారా నా విశ్వాసము, ప్రేమ, సమర్పణ సంఘము వెలుపట వారికి జ్ఞానయుక్తముగా ఎలా చూపగలను' అని మనలను మనము ప్రశ్నించు కోవాలి.

దేవుడు ఆదాము, హవ్వలను సృజించినపుడు వారు చాలా అందంగా ఉన్నారు. పాపము చేయకముందు వారు కేవలము 'అమాయకత్వము' అనే వస్త్రములు ధరించారు. దేవుని వెలుగు, మహిమ వారిని కప్పి ఉంది. పాపము చేయగానే దేవునితో సంబంధము కోల్పోయినందున ఆ వస్త్రము లేకుండా పోయింది. వారు దిగంబరులుగా ఉన్నారని గ్రహించారు. బైబిలులో "దిగంబరత్వము" అనే మాట 'దేవుని మహిమ ఎదుట మన దీనమైన ఆత్మీయ స్థితి'కి సాదృశ్యము. వెలుగు వస్త్రము తిరిగి పొందుట అనునది మన 'విమోచనకు' సాదృశ్యము. వెయ్యేండ్ల మెస్సయ్య పాలనలో వెలుగు దుస్తులు తిరిగి పొందుటను గురించి యెషయా 60:19లో వ్రాయబడి ఉన్నది: "యెహోవాయే నీకు నిత్యమైన వెలుగును, నీ దేవుడు నీకు భూషణముగా ఉండును". అదే విధంగా యోహాను ప్రకటన గ్రంథములో పెళ్ళి కుమారుని కొరకు ఎదురు చూస్తున్న సంఘమును వివాహానికి ఎదురు చూస్తున్న పెళ్ళి కుమార్తెతో పోల్చి ఇలా అన్నాడు : "ఆమె ధరించుకొనుటకు ప్రకాశములును, నిర్మలములునైన సన్నపునార బట్టలు ఆమెకు ఇయ్యబడెను". పాపము వలన పోగొట్టుకున్న వెలుగు వస్త్రము లభిస్తుంది.

ఎఫెసీ 4:24 ప్రకారము క్రీస్తు యొక్క మహిమ వస్త్రము పొందుకొనుటకు మన పాత పాప స్వభావము వదిలి నవీన స్వభావము ధరించుకోవాలి. పౌలు రోమా 13:14లో "ప్రభువైన క్రీస్తును ధరించుకొనిన వారై శరీరేచ్ఛలను నెరవేర్చు కొనుటకు శరీర విషయమై ఆలోచన చేసుకొనకుడి" అంటున్నాడు.

చీకటి జీవితంలోని పాపపు క్రియలనే వస్త్రములు తీసివేసి, వెలుగు వస్త్రము ధరించుకొమ్మని చెప్తున్నాడు. ఈ వెలుగు వస్త్రము లేకుంటే క్రైస్తవుడు దిగంబరుడే. ఈ వెలుగు వస్త్రమనే కవచము ధరిస్తే మన ఆత్మను అపవాది దాడి నుండి ఈ చెడు లోక దాడుల నుండి రక్షించుకొనవచ్చును.

క్రీస్తును ధరించుకొనుట ద్వారా క్రీస్తు లక్షణములన్నీ మనకు అలవడుతాయి. పాప శిక్ష నుండి విడుదల కొరకు క్రీస్తు నీతిని ధరించుకోవాలి. పాపశక్తి నుండి విడుదల కొరకు క్రీస్తు ఆత్మను, కృపను ధరించుకోవాలి. రక్షణ కొరకు యేసుక్రీస్తును మన ప్రభువుగా స్వీకరించి, ఆయన ఆధీనంలో ఉండాలి.

ఒక మనిషి బట్టలు ధరించినట్లు క్రీస్తును ధరించుకోమంటున్నాడు పౌలు. దేవుడు తన మహా కృపతో మన పాపములన్నిటిని తన కుమారునిపై మోపి, మనకు ప్రత్యామ్నాయంగా తన కుమారుని బలిగా అర్పించి, మనలను పాప రహితులుగా, అందంగా తన ముందు నిలబెట్టుకున్నాడు. ఆయన నీతి విశ్వాసం ద్వారా ప్రత్యక్షపరచబడి, విశ్వాసము ద్వారానే ఇవ్వబడుతుంది. ఆ నీతి వస్త్రము లేకుండా మనము దేవుని ముందు నిలబడలేము. ఆ నీతి వస్త్రము ధరించుకొని ఆయన లాగా ప్రవర్తించాలి. కృపతో పరచర్య చేయాలి. దేవునితో నడవాలి. ఆయన లాగా ప్రేమ, సాత్వికము, దీర్ఘశాంతము, తగ్గింపు, విధేయత, పరిశుద్ధతతో ఉండాలి. పైన చెప్పబడినవన్నీ మనకు ఆభరణాలుగా ధరించుకొని లోకాశలకు లొంగక మన శరీరమును దేవుని ఆలయంగా మార్చుకోవాలి.

క్రీస్తును ధరించుకొనినప్పుడు మనలో ఆయన వెలుగు ఉంటుంది. ఆ వెలుగుతో కప్పబడి ఉంటాము. అప్పుడు మన జీవితంలో ఆ వెలుగు ఫలము కనబడుతుంది. ఎఫెసీ 5:9 ప్రకారము ఆ వెలుగు ఫలమేమనగా "సమస్త విధములైన మంచి తనము, నీతి, సత్యము". కొలస్సీ 3:12లో "జాలిగలమనస్సు, దయాళుత్వము, సాత్వికము, దీర్ఘశాంతము, వినయము, ధరించుకొనుడి" అని పౌలు అంటున్నాడు.

పైన పేర్కొనబడిన లక్షణాలన్నింటిని ధరించుకొనిన జ్ఞానవంతులు నిశ్చయముగా మెస్సయ్యను ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉంటారు, కాబట్టి మనమంతా ఆ అక్షయ ఆభరణములు ధరించుకుందాము! ఆమేన్!

❖ ❖ ❖

# 29. గిద్యోను విజయ రహస్యము

అసమర్థుడైన ఒక సామాన్య రైతును అసమాన్య నాయకునిగా తీర్చిదిద్దిన దేవుని సన్నిధిలో ఒక నూతన పాఠాన్ని నేర్చుకుందాము. దేవుని యందు విశ్వాసముంచి విధేయత చూపితే మన ద్వారా అసాధారణ క్రియలను దేవుడు చేయించగలడని గిద్యోను జీవితము ద్వారా నేర్చుకోగలము. మిద్యానీయులు తన ధాన్యమును కొల్లగొట్టుకొని పోతారేమోనన్న భయముతో గానుగ చాటున గోధుమలను దుళ్లగొట్టుచున్న వానిని 'పరాక్రమము గల బలాఢ్యుడా' అని పిలిచి, ఆ విధంగా దేవుడు తీర్చిదిద్దిన విధానాన్ని మనము గిద్యోను జీవితములో చూడగలము.

న్యాయాధిపతులు గ్రంథము 6,7,8 అధ్యాయాలలో గిద్యోనును గురించిన విషయాలు గ్రంథస్థము చేయబడి వున్నాయి. యెహోషువ నాయకత్వములో విజయవంతమైన జీవితము జీవించిన ఇశ్రాయేలీయులు గిద్యోను కాలం నాటికి పేదరికముతో, భయంతో నిండిన జీవితాలు జీవిస్తున్నారు. దానికి కారణము కేవలము స్వయంకృతాపరాధములే. "ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి దోషులైనందున" అనే కారణము దేవుడే వ్రాయించాడు. వారు దేవునికి విరోధముగా బయలు దేవతను పూజించుట వలన రోషముగల దేవుడు తాళలేక వారిని శత్రురాజులకు అప్పగించాడు. ప్రతిసారి వారు శత్రువుల అణచివేత భరించలేక దేవునికి మొఱ్ఱపెట్టినపుడు దేవుడు దయతలచి ఒక నాయ్యాధిపతిని లేపి వారిని రక్షించేవాడు. ఆ విధంగా దేవుడు ఏర్పాటు చేసిన న్యాయాధిపతులలో గిద్యోను అయిదవవాడు. ప్రభువు అతనిలో మెచ్చిన లక్షణాలు మనము ధ్యానించుకుందాము.

### 1. గిద్యోను తన విశ్వాసాన్ని క్రియారూపకంగా చూపాడు :

తన ప్రజలను శత్రువుల బారినుండి విడిపించుట కొరకు దేవుడేర్పరచుకున్న నాయకునిలో దేవుడు చూసేది క్రియారూపకమైన విశ్వాసము. మిద్యానీయులు

ఇశ్రాయేలీయులు పండించుకున్న పంటను పాడుచేసి, వారి జీవనోపాధికి ఉపయోగపడు పశువులను పట్టుకెళ్లిపోయేవారు. గిద్యోను తన పంటను వారి చేతిలో పడకుండా కాపాడుకొంటున్నాడు. యెహోవా దేవునిచే ప్రత్యేకించబడిన జనాంగము తన స్వాస్థ్యమును శత్రువుల చేతినుండి కాపాడుకుంటే దేవుడు వారి పక్షాన ఉంటాడను విశ్వాసము అతనికి ఉంది. 2సమూయేలు23:11,12లో ఇలాంటి సందర్భము చూడగలము. షమ్మా అను వ్యక్తిని గురించి చెప్పబడి ఉంది "ఫిలిష్తీయులు అలచందల చేనిలో గుంపుకూడగా జనులు ఫిలిష్తీయుల యెదుట నిలువలేక పారిపోయిరి. అప్పుడితడు ఆ చేని మధ్యను నిలిచి ఫిలిష్తీయులు దాని మీదికి రాకుండ వారిని వెళ్లగొట్టి వారిని హతము చేయుట వలన యెహోవా ఇశ్రాయేలీయులకు గొప్ప రక్షణ కలుగజేసెను".

అతడు ధైర్యంగా నిలబడుట చేత దేవుడు అతనికి సహాయము చేశాడు. గిద్యోను విషయములో కూడా అదే జరిగింది. తన పంటను తాను కాపాడుకుంటూ ఉండగా దేవుడు ప్రత్యక్షమైనాడు. "బలము తెచ్చుకొని వెళ్ళి మిద్యానీయుల నుండి ఇశ్రాయేలీయులను రక్షింపుము. నిన్ను పంపినవాడను నేనే అని చెప్పాడు". ప్రపంచముపై విజయము సాధించాలంటే మనకు ఉండవలసినది విశ్వాసము. 1యోహాను5:4లో "దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించుదురు, లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" అని వ్రాయబడి ఉంది. ఇశ్రాయేలు చరిత్రలో జరిగిన అద్భుతాలన్నీ యెహోవా కృపవలననే జరిగినవని గిద్యోనును నమ్ముతున్నాడు. వారి తప్పిదముల వలననే వారికీ దుస్థితి కలిగిందని అర్థము చేసుకున్నాడు.

## 2. తనలోని బలహీనతలను గురించి చెప్తున్నాడు :

"చిత్తము నా యేలినవాడా, దేని సహాయముచేత నేను ఇశ్రాయేలీయులను రక్షింపగలను? నా కుటుంబము మనష్షే గోత్రములో ఎన్నికలేనిదే. నా పితరుల కుటుంబములో నేను కనిష్టుడనై యున్నానని ఆయనతో చెప్పెను" (న్యాయా 6:15). న్యాయాధిపతులు గ్రంథములో మనము చూసే నాయకులు శారీరకంగా బలహీనులుగా ఉన్నను, వారు సేవించు దేవుని యందు శక్తి గలవారై ఉన్నారు. 1కొరింథీ1:29 చెప్పబడినట్లు "బలవంతులైన వారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైన వారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు". తమ స్వశక్తిమీద ఆధారపడు వారు దేవునికి

పనికిరారు. వారి శక్తిని బట్టి అతిశయించేవారు, వారి జీవితాలలో దేవునిశక్తి కనపరచుటకు అవకాశము ఇవ్వలేరు, కాబట్టి దేవుడు వారి ద్వారా కార్యము జరిగించలేడు. మనలను మనము ఖాళీ చేసుకుంటే దేవుని శక్తితో, విశ్వాసముతో నింపుతాడు.

### 3. సరైన ప్రాధాన్యతలు కలిగియున్నాడు :

గిద్యోనుకు దేవుడు చెప్పిన మాట "నేను నీకు తోడై యుందును గనుక ఒకే మనుష్యుని హతము చేసినట్లు మిద్యానీయులను నీవు హతము చేయుదువని సెలవిచ్చెను" (న్యాయా 6:16) గిద్యోనుకు దేవుడిచ్చిన పని చాలా క్లిష్టమైనది. అయితే శత్రువును ఎదుర్కొనుటకు వెళ్లకముందు అతడు యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టి, ఆయనను ఆరాధించాడు. ఆ తర్వాత దేవుడు చెప్పిన మాటకు విధేయత చూపించాడు. తన ఇంట్లో గిద్యోను జరిపించిన కార్యములు న్యాయా 6:25-32 వచనాలలో గ్రంథస్తము చేయబడి ఉన్నాయి. గిద్యోను తన తండ్రి కట్టిన బయలు దేవత యొక్క బలిపీఠము పడగొట్టి, దేవతాస్తంభమును నరికివేసి, ఇంట్లోని కోడెలను బలి అర్పించమని దేవుడు చెప్పినప్పుడు అది ఒక సవాలుగా కనబడి ఉండొచ్చు. మా నాన్న ఏమనుకుంటాడు అనే ఆలోచన వచ్చి ఉండవచ్చు కాని దేవుని మాటకు ప్రాధాన్యత ఇచ్చాడు. దేవుడు గిద్యోను తండ్రిని అద్భుతంగా మార్చి గిద్యోను పక్షముగా మాట్లాడేటట్టు చేశాడు. "ఎవడో వాని బలిపీఠమును విరుగగొట్టెను గనుక, వాడు దేవతయైనందున తన పక్షమున తానే వాదించవచ్చును" అన్నాడు. దేవునికి ప్రాధాన్యత ఇస్తే పరిస్థితులన్నీ అనుకూలపరుస్తాడు. దేవుడు ఏమనుకుంటాడో అని ఆలోచించాలి గాని ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచించాల్సిన అవసరము లేదు.

### 4. దేవుని నడిపింపు కొరకు ఎదురుచూశాడు :

తాను మిద్యానీయులతో యుద్ధము చేయాల్సి ఉంది. ఆ పని చేయకముందు తాను దేవుని ప్రణాళికలో ఉన్నానా? లేదా? అని తెలుసుకోవలసిన అవసరముంది. కాబట్టి కొన్ని సూచనలివ్వమని దేవుని అడుగుతున్నాడు న్యాయా 6:36-40. గొఱ్ఱెబొచ్చు సూచనను రెండుసార్లు అడిగాడు. ఒకసారి చుట్టూ నేల పొడిగా ఉంచి, గొఱ్ఱెబొచ్చు మాత్రము తడిగా ఉండేటట్లు, ఇంకొకకసారి నేల తడిగా ఉండి గొఱ్ఱెబొచ్చుమాత్రము పొడిగా ఉండేటట్లు చేయమని కోరినపుడు దేవుడు అతని

కోరిక ప్రకారము చేశాడు. గిద్యోను ఈ విధంగా దేవునిని ఋజువులు అడగడానికి కారణము తనతో పాటు 30,000 మంది ఆ యుద్ధములో పాల్గొంటారు కాబట్టి, వారందరి ప్రాణాలకు తాను బాధ్యుడనని తలంచాడు. మనము కూడా ఇతరులతో కలిసి ఏ పనైనా తలపెట్టినపుడు అది దేవుని చిత్తములో ఉందా లేదా అని తెలుసుకొనుట చాలా ముఖము. గిద్యోను చేసిన ప్రతి పని దేవుని చిత్త ప్రకారమే చేశాడు. ప్రతి నాయకునిలో దేవుడు కోరుకునే లక్షణమిది.

**5. ప్రభువు ఇచ్చిన బాధ్యత నెరవేర్చాడు :**

దేవుని మీద ఆధారపడి తనకు అప్పగింపబడిన బాధ్యత నెరవేర్చుటలో నమ్మకత్వము చూపించాడు. ప్రతి నిముషము భయముతో చస్తున్న తనను దేవుడు ధైర్యపరచి, ఇశ్రాయేలీయులను మిద్యానీయుల బారినుండి రక్షించమని చెప్పినపుడు తొలుత తన బలహీనతలను గురించి ఆలోచించినా, దేవుని శక్తితో ముందుకు పోవచ్చున్న సత్యము తెలుసుకున్నాడు. దేవుడు చెప్పినట్లు యూదులనందరినీ ఒకచోట చేర్చి వారినుండి శ్రేష్ఠులను ఎన్నుకొన్నాడు. 32,000 మందిలో భయపడే 22,000 మందిని వెనక్కి పంపాడు. మిగిలిన 10,000 మందిని పరీక్షించినపుడు వారిలో 300 మందిని మాత్రమే ఎన్నుకొన్నాడు. 9700 మంది మోకాళ్ళూని క్రుంగినపుడు చుట్టూ జరుగుతున్న పరిస్థితులపైన దృష్టి పెట్టలేని వారిని తలచి వారిని ఎన్నుకోలేదు. ఎక్కువ మంది ఇశ్రాయేలీయులు యుద్ధము చేసి గెలిస్తే, వారి బలము చేత విజయము సాధించామని తలచి అతిశయిస్తారేమోనని దేవుడు ఆ విధంగా ఏర్పాటు చేశాడు. దేవుడేర్పరచుకున్న 300 మంది "యజమానుడు వాడుకొనుటకు అర్హమై, ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రలు"గా ఉన్నారు (2తిమో 2:21). సంపూర్ణంగా తమ్మును తాము అప్పగించుకొనిన వారినే దేవుడు కోరుకుంటాడు.

శత్రుసైన్యము ముందు తాము చాలా తక్కువమంది ఉన్నామని గిద్యోనుకు తెలుసుకొని "శక్తిచేతనైనను, బలముచేతనైనను కాక తన ఆత్మ చేతనే ఇది జరుగునని" జెకర్యా 4:7లో దేవుడు చెప్పిన మాటలు రుజువవుతున్నాయని గమనించాడు.

## 6. గిద్యోను దేవుడెన్నుకున్న వారిని అనుకూల పరిస్థితులలో నడిపిస్తున్నాడు :

అవసరమైన ఉపకరణాలన్నిటిని (బూర, పట్టికుండ, కుండలలో దివిటీలు) గిద్యోను స్వయంగా వారికప్పగించాడు న్యాయా 7:16. ప్రతి వాని చేతిలో ఒక బూర ఉంచి, తాను చెప్పినప్పుడు అందరూ ఒక్కసారే ఊదాలని చెప్పాడు. గిద్యోనులాగా మనము కూడా ఇతరులను దేవుని పరిచర్యను ప్రోత్సహిస్తున్నపుడు వారికి అవసరమైన ఉపకరణములన్నిటిని సమకూర్చి అందించాలి. దేవుని రాజ్య సంబంధమైన సత్యాలు తెలియపరచకపోతే వారికి ఎవరు నేర్పుతారు? ఎటువంటి ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొనవలసి వచ్చినా దేవుని బిడ్డల చేతుల్లో సరైన ఉపకరణాలు (దేవుని వాక్యము, స్తుతి, ప్రార్థన) ఉంటే పరిస్థితులు అనుకూలంగా మారతాయి.

## 7. గిద్యోను వారికి మాదిరిగా ఉంటున్నాడు :

'మాటల కంటే చేతలు బాగా మాట్లాడతాయి' అను నానుడి ననుసరించి గిద్యోను "నేను చెప్పినట్లు చేయండి" అనకుండా "నన్ను చూచి నేను చేయునట్లు చేయుడి" – (7:16). మన గమ్యం కూడా ఇదే అయి ఉండాలి. దేవుడికి ఇలాంటి వారే ఇష్టము. గిద్యోను వారందరినీ ఒక్క త్రాటిపై నడిపించాడు. అందరూ ఒకేసారి బూర ఊదాలి, అందరూ ఒక మాట అరవాలి. దానివలన శత్రువులకు సందేశము బాగా అర్థమైంది. దేవుడు వారితో యుద్ధము చేస్తున్నందు వలన వారిలో వారే పోట్లాడుకొని అందరూ హతమైపోయారు.

పైన చెప్పిన లక్షణాలున్న ప్రతి నాయకునికి యేసుక్రీస్తు నామమున విజయము కలుగుతుందని ఖండితముగా చెప్పగలను. అందుకే పౌలులాగా "మీరందరు ఏకభావముతో మాటలాడవలెనని, మీలో కక్షలులేక, ఏకమనస్సుతోను, ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మిమ్మును వేడుకొనుచున్నాను" (1కొరింథీ 1:10).

❖ ❖ ❖

# 30. నీతిమంతుడైన లోతు పోగొట్టుకొనిన దీవెనలు

2 పేతురు 2:6–8 వరకు ఉన్న వాక్యభాగమును చదువుకుందాము – "ఆయన సొదొమ గొమొఱ్ఱాలను పట్టణములను భస్మము చేసి, ముందుకు భక్తిహీనులగు వారికి వాటిని దృష్టాంతరముగా ఉంచుటకై వాటికి నాశనము విధించి, దుర్మార్గుల కామ వికారయుక్తమైన నడవడిచేత బహు బాధపడిన నీతిమంతుడగు లోతును తప్పించెను. ఆ నీతిమంతుడు వారి మధ్యను కాపురముండి, తాను చూచినవాటిని బట్టియు, వినిన వాటిని బట్టియు, వారి అక్రమమైన క్రియల విషయములతో దిన దినము నీతిగల తన మనస్సును నొప్పించుకొనుచు వచ్చెను".

లోతు నీతిమంతుడని పేతురు వ్రాయుటను బట్టి తెలుసుకుంటాము. ఆదికాండములో అతని గురించి చదివినప్పుడు అతడు నీతిమంతుడను అభిప్రాయము మనకు కలుగదు. తన పెదనాన్న అయిన అబ్రహాముతో పాటు దేవుని మాట యందు విశ్వాసముంచి తన దేశాన్ని, తల్లి, తాతలను వదలిపెట్టి రావడము అతను నీతిమంతుడనుటకు ఒక మంచి కారణము కావచ్చు. అబ్రాహాముతో పాటు లోతు రావడము అభినందనీయమే కాని అబ్రాహాము వలె జీవించలేకపోవడము శోచనీయము, దౌర్భాగ్యము.

లోతు అబ్రాహాము తమ్ముడైన హారాను కుమారుడు. హారాను చిన్నతనములోనే మృతి చెందినందున లోతు తన తాతయైన తెరహుతో కనానులో నివసించుటకు బయలుదేరి హారాను మట్టుకు వచ్చి అక్కడ నివసించిరి అని ఆదికాండము 11వ అధ్యాయములో చూడగలము. తాత మృతిచెందిన తర్వాత యెహోవా అబ్రామును పిలిచినపుడు లోతు కూడా అతనితో కలిసి కనాను దేశమునకు వెళ్లాడు. పెదనాన్నతో కలిసి బయలుదేరడము లోతు తన జీవితములో తీసుకున్న తెలివైన నిర్ణయాలలో చివరిదిగా కనబడుతుంది.

కనాను దేశములో కరువు వచ్చినపుడు అబ్రాము, లోతు ఐగుప్తుకు వెళ్లారు. అది వారి స్వంత నిర్ణయము. ఐగుప్తునుండి వారు తిరిగి కనానుకు వచ్చినపుడు ఇహలోకపరంగా ధనవంతులైనారు గాని ఆత్మీయంగా పేదవారైనారు. అబ్రహాము తన భార్యయైన శారాను తన చెల్లి అను అబద్ధము చెప్పుట వలన చెడ్డపేరు సంపాదించుకొన్నాడు, లోతు ఇహలోక సంపద మీద ప్రేమ పెంచుకున్నాడు. అందుకే అబ్రాహాముతో వేరై ఉండదలచినపుడు ఐగుప్తుదేశము లాగా నీళ్లు పారు దేశమువలె ఉన్న సొదొమవైపు వెళ్లుటకు ఇష్టపడ్డాడు. ఐగుప్తు నుండి వారు తిరిగి వచ్చాక వారిరువురు విస్తారమైన సంపదను పొందుకున్నారు. "అబ్రాహాముతో కూడ వెళ్లిన లోతుకును గొఱ్ఱెలు, గొడ్లు, గుడారములు ఉండెను గనుక, వారు కలిసి నివసించుటకు ఆ ప్రదేశము చాలకపోయెను, ఎందుకనగా వారి ఆస్తి వారు కలిసి నివసించలేనంత విస్తారమై యుండెను" (ఆది. 13:5,6). పశువుల కాపరుల మధ్య కలహము వచ్చినప్పుడు అబ్రాము లోతును వేరుగా ఉండమని బ్రతిమాలుకొని, తన ముందున్న దేశమంతయు చూపించి, తాను ఏ వైపు వెళ్లాలంటే ఆ వైపుకు వెళ్లమని చెప్పాడు. అప్పుడు "లోతు తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటిని" చూచి సొదొమ గొమొఱ్ఱా ప్రాంతము సస్యశ్యామలముగా ఉండుట చూచి ఆ వైపు వెళ్లుటకు ఇష్టపడ్డారు.

సొదొమకు వెళ్లి, వారితో కలిసిపోయాడు. "సొదొమ మనష్యులు దుష్టులును, యెహోవా దృష్టికి బహు పాపులై యుండిరి" (ఆది 13:13) అని వ్రాయబడి ఉంది. అటువంటి అనీతిమంతుల మధ్య నివసించటానికి వెళ్ళిన నీతిమంతుడైన లోతు తన జీవితంలో ఏమి కోల్పోయాడో చూద్దాము. ఆదికాండము 19లో లోతు ఏమేమి కోల్పోయాడో వ్రాయబడి ఉన్నది.

**1. మొదటిగా లోతు తన సంపదనంతా పోగొట్టుకున్నాడు :** ఇహ లోకపరంగా సర్వసంపదలతో తుల తూగుచున్న లోతు కట్టు బట్టలతో బయటకు లాక్కు రాబడ్డాడు. ఆ "ఊరి దోషశిక్షలో నశించిపోకుండ ఉండుటకై దేవుడు పంపిన దూతలు అతని చేతిని, అతని భార్య చేతిని అతని యిద్దరు కుమార్తెల చేతులను పట్టుకొని వెలుపలికి తీసికొని వచ్చి ఆ ఊరి బయట నుంచిరి" (ఆది 19:16). "ప్రాణమును దక్కించు కొనుటకు పారిపొమ్ము" అని చెప్పారు. పౌలు 1కొరింథీ 3:11-15 వచనాలలో యేసుక్రీస్తు అను పునాది మీద కట్టబడక తమంతట తాము

కట్టుకొనినది అగ్నిచేత పరీక్షింపబడినపుడు "అతడు తన మట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్లు రక్షింపబడుదురు" అని చెప్పిన మాటలు లోతు జీవితంలో నెరవేరాయి. పేతురు వ్రాసిన మాటలను బట్టి లోతు రక్షింపబడ్డాడని మనకు తెలిసింది కాని తాను ఈలోకంలో సంపాదించుకున్నదంతా బూడిదైపోయింది. అంతకు ముందొకసారి శత్రువులు అతనిని, అతని సంపదను దోచుకున్నప్పుడు, అబ్రహాము శత్రువులను సంహరించి, సమస్తము తిరిగి అప్పచెప్పాడు. కాని ఇప్పుడు దేవుని ఉగ్రతనుండి అతనినైతే కాపాడగలిగాడు కాని లోతు ఆస్తిని అబ్రాహాము కాపాడలేకపోయాడు.

లోతు తీసుకున్న నిర్ణయాల వలన జీవితంలో చాలా కోల్పోయాడు. అబ్రాహాము పునాదుల గల పట్టణము కొరకు ఎదురు చూస్తుంటే, లోతు తన కిష్టమైన పట్టణములో జీవించాలని కోరుకొని సర్వనాశనమైనాడు.

**2. రెండవదిగా లోతు తన భార్యను కోల్పోయాడు :** లోతు దేవదూతల సాయంతో తన భార్యను సొదొమ వెలుపటికి తీసుకొని రాగలిగాడు. కాని ఆమె మనసులో నుండి సొదొమను బయటికి తీసుకురాలేకపోయాడు. ఆ దూతలు వారిని సొదొమలో నుండి వెలుపలికి తీసుకొచ్చిన తర్వాత వెనుక చూడకుండా పారిపొమ్మని వారిని ఆదేశించారు. సొదొమ మీద, అక్కడ తాను వదిలి వచ్చిన సమస్తము పైన మనసు ఉంచుకొనిన "లోతు భార్య అతని వెనుక నుండి తిరిగి చూచి ఉప్పు స్థంభమాయెను" (ఆది 19:26).

**3. దేవుని ప్రత్యక్షతను పోగొట్టుకున్నాడు :** ఆదికా18వ అధ్యాయములో అబ్రాహాముకు యెహోవా కనబడెను. అతని దగ్గరకు ముగ్గురు మనుష్యులు వచ్చినట్లుగా 1,2 వచనాలలో వ్రాయబడి ఉంది. అబ్రాహాము దేవుని ప్రత్యక్షత పొందగలిగాడు కాని అబ్రాహాము నుండి సొదొమకు వెళ్ళినవారు ఇద్దరు దేవదూతలు మాత్రమే అని 19:1లో చూడగలము. అబ్రాహాముకు లోతుకు చాలా తేడాలున్నాయి. 18:27లో బూడిద కాబోయే సొదొమ గొమొఱ్ఱాల కొరకు తన్నుతాను తగ్గించుకొని ప్రభువు ఎదుట ధూళి, బూడిద అయ్యాడు. అబ్రాహాము లోతును రెండు సార్లు రక్షించాడు. మొదటిసారి కత్తితో (14:16), రెండవసారి విజ్ఞాపనలతో (18:20-32) లోతు కొరకు, సొదొమ గొమొఱ్ఱాలలో ఉన్న నీతిమంతుల కొరకు దేవునితో అబ్రాహాము

గోజాడాడు. మనము కూడా కత్తిలాటి దేవుని వాక్యముతోను, ప్రార్థన విజ్ఞాపనముల తోను ఇతరులను రక్షించాలి. దేవుని సన్నిధిలో సంతోషిస్తూ, దేవునితో సహవాసము చేస్తూ, పునాదులు గల పట్టణము కొరకు ఎదురు చూస్తూ గుడారాలలో వసించిన అబ్రాహాముకు దొరికిన ప్రత్యక్షత, ఆత్మీయంగా దిగజారిన లోతుకు దొరకలేదు.

**4. లోతు తన సాక్ష్యము పోగొట్టుకున్నాడు :** లోతు యొర్దాను తీరాన నున్న సొదొమ ప్రాంతము కోరుకున్నప్పుడే దేవునికి దూరమగుట మొదలైంది. "ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు" (1యోహాను 2:15) ఆది. 13:10-13 వరకు ఉన్న వాక్యభాగములో సొదొమ అందము గురించిన వివరణతోబాటు సొదొమ మనుష్యుల దుష్ట స్వభావము కూడా వివరింపబడింది. లోతు మొదటిగా సొదొమ వెలుపల మైదానములో గుడారము వేసుకొని కాపురమున్నట్లుగా 13:12లో చూడగలము. ఆ తర్వాత 14:12లో "లోతు సొదొమలో కాపురముండెను' అని వ్రాయబడి ఉంది. ఆ తర్వాత 19:1లో "లోతు సొదొమ గవిని యొద్ద కూర్చుండి యుండెను" అని వ్రాయబడి ఉంది. అంటే ఆ ఊరి పెద్దలలో ఒకడై ఉండెను. వారికి మంచి మాదిరిగా ఉండాలనుకున్నాడు, గాని వారితో మమేకమైపోయాడు. వారి నైతిక విలువలు ఒంట పట్టించుకున్నాడు, అందుకే తన కుమార్తెలను అత్యాచారానికి అప్పజెప్పటానికి కూడా సిద్ధపడ్డాడు. తానేదో గొప్ప పని చేస్తున్నట్లు తన కుమార్తెలను ఇవ్వటానికి సిద్ధపడ్డాడు కానీ అతనొక వ్యక్తిగా నైతికంగా ఎంతగా దిగజారిపోయాడో అర్థమవుతుంది. అవినీతిపరుల మధ్య నివసించకుండా బయటి మైదానములో ఉండుటకు అవకాశమున్నను వారి మధ్య ఉండుటకే నిర్ణయించుకున్నాడు. దుష్టులకు దూరంగా ఉండి ఉంటే తన సాక్ష్యము కాపాడుకొని ఉండేవాడు. కాబోయే అల్లుళ్ళు కూడా అతని మాటలు ఎగతాళిగా భావించారు (19:14). సాక్ష్యములేని అతని ఇంటికి వెళ్లుటకు మొదట్లో దూతలు ఇష్టపడలేదు. "నడివీధిలో రాత్రి వెళ్లబుచ్చెదమని" (19:2) చెప్పారు. లోతు వారిని బలవంతముగా తీసుకెళ్లాడు. అబ్రాహాము శారాతో అతిథులకు భోజనము సిద్ధపరచమని చెప్పినట్లుగా లోతు చెప్పే స్థితిలో లేడు. తానే వారికి భోజనము పెట్టాడు. భార్య భర్తల నడుమ కూడా సరైన సఖ్యత, ప్రేమ లేనట్లు భావించవచ్చు.

**5. లోతు పరువు పోగొట్టుకున్నాడు :** ఒకప్పుడు గవిని యొద్ద కూర్చొని గౌరవించబడినవాడు, చివరకు కుమార్తెలచేత కూడా అవమానించబడ్డాడు. దేవదూతలు వెళ్లమనిన చోటుకు పోకుండా ఒక కొండ గుహలో వసించుటకు వెళ్లారు. ఇది కీలకమైన ఘట్టము, సర్వనాశనానికి నాంది. కొండ గుహలలో జీవించే మృగాల ప్రవృత్తి వచ్చినందువలన వావి వరుసలు మరచి లోతు కూతుళ్లు అతనితో వ్యభిచారము చేశారు. సొదొమ పట్టణ అలవాట్లు వారికి కూడా వచ్చాయి. ఇహలోకంలో ఉంటూ ఇహలోక మాలిన్యము అంటకుండా చూసుకోవలసింది పోయి తిని, త్రాగి, మత్తులో జీవించుట వలన లోతు పరువు పోయింది.

**6. సంఘంలో, సమాజంలో స్థానం కోల్పోయాడు :** లోతు కుమార్తెలు చేసిన పాపానికి ఫలితంగా పుట్టిన కుమారులు మోయాబు, బెన్నమ్మి సంఘాన్ని నష్టపరచేవారిగా మారిపోయారు. మోయాబీయులు వ్యభిచారానికి మారుపేరుగాను, అమ్మోనీయులు విగ్రహారాధనకు మారుపేరుగాను తయారైనారు. ఇశ్రాయేలీయులకు వీరెప్పుడూ శత్రువులుగా ఉన్నారు.

**7. లోతు తన పేరు పోగొట్టుకున్నాడు :** అబ్రాము, లోతు కలిసి వారి దేశము నుండి బయటకు వచ్చారు. అబ్రాహాము పేరు, అతనితో దేవుడు చేసిన నిబంధన బైబిలంతటిలో కనపడుతున్నది కాని లోతు పేరు లేదు. ప్రారంభములో నీతిమంతుడైన లోతు అవినీతిపరుల మధ్య నివసించుట ద్వారా అతడు కోల్పోయిన ఆశీర్వాదాలు మనకు పాఠము కావాలి. అందుకే కీర్తనాకారుడు కీర్తనల గ్రంథము ప్రారంభములోనే దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక, అపహాసకులు కూర్చుండుచోట కూర్చొండక దివారాత్రులు వాక్యము ధ్యానించువాడు ధన్యుడు అని చెప్తున్నాడు. ఆ ధన్యత మనము పొందుదామా! ఆమేన్!

❖ ❖ ❖

# 31. గారడీ సీమోను

మారుమనసు పొందిన ప్రతి విశ్వాసి నూతన సృష్టి గావించబడాలని దేవుడు ఆశిస్తున్నాడు. సీమోను అను గారడీ చేసేవాని ద్వారా ప్రభువు మనకు నేర్పించాలనుకుంటున్న పాఠమును మనము ధ్యానించుకుందాము.

బైబిలులో కొంతమంది చెడ్డవారిని గురించి కూడా గ్రంథస్తము చేయబడి ఉండుటకు కారణము పౌలు తాను కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో ఈ విధముగా పేర్కొన్నాడు – "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1కొరింథీ. 10:11). ఈ గారడీ సీమోనును గురించిన దృష్టాంతము అపొ.కా 8:9–24 వరకు వాక్య భాగములో ఉన్నది. బైబిలులో మనకు కనపడు సిద్ధాంతమేమంటే దేవుడు నమ్మకస్తులైన విశ్వాసులను ఎక్కడ ఉంచుతాడో, అక్కడ అపవాది చెడ్డవారైన తన అనుచరులను తప్పక ఉంచుతాడు. మత్తయి 13వ అధ్యాయములో పరలోక రాజ్యము గురించి బోధిస్తూ 24–30 వరకు ఉన్న వాక్య భాగములో ఈ సత్యమును వివరిస్తున్నాడు. తనను తాను ఒక రైతుతో పోల్చుకుంటూ, తాను గోధుమలు విత్తిన స్థలములోనే అపవాది గురుగులను విత్తుతాడని చెప్తున్నాడు. దేవుని అనుచరులు, అపవాది అనుచరులు చివరి వరకు కలిసే జీవించాలి, తీర్పు సమయంలో గురుగులు కాల్చివేయబడుటకు కొనిపోబడుతారని చెప్పాడు.

సమరయ పట్టణములో సీమోను గారడీ చేస్తూ జనులను విభ్రాంతి పరుస్తూ, తాను చాలా గొప్ప వాడిననియు, దేవుని మహాశక్తి అనబడిన వాడనని ప్రజలకు భ్రాంతి కలిగిస్తూ జీవించేవాడు. ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త బోధిస్తున్నప్పుడు విని, నమ్మి బాప్తీస్మము పొందాడు. అంతేగాక ఫిలిప్పును వెంబడించి అతనిని ఎడబాయకుండా ఉండి, అతను చేస్తున్న అద్భుతములు, సూచక క్రియలు చూసి ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత యెరూషలేము

నుండి పంపబడిన పేతురు, యోహానులు ఎవనిపై చేతులుంచి ప్రార్థన చేస్తే, వారు పరిశుద్ధాత్మ నింపుదల పొందుట చూచి ఇంకా ఎక్కువగా విభ్రాంతి నొంది, ఆ శక్తిని తన డబ్బుతో కొనుటకు ప్రయత్నించాడు. అప్పుడు పేతురు అతని ఘోర దుష్టత్వము, దుర్నీతిని గ్రహించి తమ కార్యములలో పాల్గొనవద్దని చెప్పాడు. ఆ తర్వాత తన తప్పు గ్రహించి, పశ్చాత్తాప హృదయముతో ప్రభువు పాదాల దగ్గరకు చేరుటకు బదులు, మీరు నా కొరకు ప్రార్థించండని శిష్యులతో చెప్పి వెళ్లిపోయాడు. ఆనాటి చరిత్ర గ్రంథాలలో గ్రంథస్తము చేయబడిన సమాచారము ప్రకారము అతను తన స్వంత బోధలు మొదలుపెట్టి, తర్వాత కొద్ది కాలములోనే మేడపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనాడు కూడా ఇలాంటి వారున్నారు. 2తిమోతి 4:3లో పౌలు చెప్పిన ప్రకారము “జనులు హిత బోధను సహింపక, దురద చెవులు గలవారై, తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగు చేసుకుంటున్నారు”.

సీమోనును గురించి 7 సంగతులు మనము ధ్యానించుకుందాము.

**1. అతని పేరు సీమోను :** ఈ పేరు పితరుడైన యాకోబు సంతానములోని లేయా రెండవ కుమారుడైన ‘షిమ్యోను’ పేరు నుండి వచ్చింది. ‘షిమ్యోను’ అను పదానికి ‘వినుట’ అను అర్థమున్నది. దేవుడు తన ప్రార్థన విన్నాడని లేయా ఆ పేరు పెట్టింది (ఆది 29:33). సీమోను కేవలము వినువాడు మాత్రమే అయి ఉండి తన జీవితములో ఆచరించేవాడిగా లేడు. “మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి” (యాకోబు 1:22) అని లేఖనము చెప్తున్నది. సీమోను ఫిలిప్పు చెప్తున్న సంగతులన్నీ విన్నాడు గానీ, అవి ఏవీ అతని జీవితములో కనబడుట లేదు. దేవుని రాజ్యమును గూర్చి, యేసుప్రభువు మనకు ఇచ్చిన విమోచన గురించి విని, నమ్మినట్లుగా నటించాడు గాని అవి ఏవీ అతని హృదయాన్ని కదిలించలేదు.

**2. సీమోను గారడీవాడు :** గారడీలు చేయుట అంటే ఇతరులను మోసగించి, వారిని భ్రమలో పెట్టుట. ఇప్పటి ఆధునిక కంప్యూటర్ల యుగములో ఈ గారడీ చేసే మనుష్యులు కొంచెము తగ్గిపోయారు కానీ నేటికీ ఇంకా కొన్ని గ్రామాలలో ఇవి జరుగుతూనే ఉన్నాయి. కనికట్టు చేసి మనుషులను బోల్తా కొట్టిస్తుంటారు, చిత్తు కాగితాలను డబ్బుగా మార్చి జనులను విభ్రాంతి పరుస్తుంటే, ఆ అమాయక జనులు ఆ గారడీ వాడు డబ్బు తయారు చేయగలిగితే, దారిద్ర్యములో ఎందుకు మగ్గుతున్నాడను

ఆలోచనే చేయరు. పైగా వాడు దేవుని మహాశక్తి అనుకుంటారు. ఈ సీమోను గారడీని అపవాది ఇంకా బలపరచాడు. ఇప్పటి ప్రపంచమంతా మోసము (గారడీ)తో నిండి ఉన్నది. గృహాలలో, సంఘములలో, సమాజములో ఎక్కడ చూసినా ఒకరినొకరు మోసం చేసుకుంటున్నారు. చివరకు బోధకులు కూడా గారడీ వాళ్లలాగా తయారయ్యారు. దేవుని మహిమార్థము జీవించాల్సిన వారు, దేవునిని అవమాన పరుస్తున్నారు.

**3. సీమోను నమ్మి బాప్తిస్మము పొందాడు :** గారడీ సీమోను దేవుని దగ్గర నుండి వచ్చినవాడుగా జనులు లక్ష్యపెట్టిన సమయములో ఫిలిప్పు దేవుని సువార్తను వారి మధ్యకు తీసుకొని వచ్చాడు. ఫిలిప్పు చేయు బోధలు దేవుని రాజ్యము గురించి, క్రీస్తును గురించినవియు అయి ఉండుట వలన ప్రజలు సీమోను మాయాజాలం నుండి విడుదల పొందారు. “సీమోను కూడా నమ్మి” బాప్తిస్మము పొందాడని వ్రాయబడి ఉంది. అతని నమ్మిక వాక్యముపై గాక అద్భుతములు మీద ఆధారపడి ఉన్నది. ఫిలిప్పుతో పాటు ఉంటూ, ఫిలిప్పు చేయు సూచక క్రియలను, అద్భుతములను గమనిస్తూ ఉన్నాడు. తాను కూడా అలాంటివి చేయాలను ఉద్దేశము కలిగి ఉండవచ్చు. మనలో చాలామంది క్రైస్తవులు రెండు, మూడు ఉజ్జీవ కూటములలో భావోద్రేకాలకు లోనై, తాము మారిపోయామని నమ్మి బాప్తిస్మము తీసుకుంటారు. కాని నిజమైన మారుమనస్సు లేకుంటే సీమోను లాంటి పరిస్థితి వస్తుంది కాబట్టి జాగ్రత్త!

**4. సీమోను హృదయము చెడిపోయింది :** ఈ విషయము పేతురు గమనించాడు. పేతురు, యోహాను దేవుని వాక్యము అంగీకరించిన వారిపై చేతులుంచి ప్రార్థించినపుడు వారు పరిశుద్ధాత్మను పొందుట చూచి గారడీవాడు, తనకు కూడా అలాంటి శక్తి కావాలని ఆశించి పేతురు, యోహానుల ఎదుట డబ్బులుంచి ఆ శక్తి తనకిమ్మని అడిగాడు. దేవుని వరమును డబ్బుతో కొనదలచిన వాడిని పేతురు “నీతోపాటు నీ ధనము కూడా నశించును గాక” అని శపించాడు. సీమోను సువార్తను సంపూర్ణముగా నమ్మక సూచక క్రియలనే చూస్తున్నాడు. సీమోను ఈ అద్భుతములు చేయడమే గాక పరిశుద్ధాత్మ శక్తిని ఇతరులకు ఇచ్చే అధికారము కూడా పొందాలనుకొని, అందుకొరకు ప్రయత్నము చేశాడు. ఈ వాక్యభాగము నుండి “సైమొనీ” అనే పదము ఉద్భవించింది. దాని అర్థమేమంటే “సంఘ పదవులు, ఆధికత్యలు అమ్ముట మరియు కొనుట”. యిర్మీయా 17:9లో “హృదయము అన్నింటి కంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది, దాని గ్రహింపగల వాడెవడు”

అని వ్రాయబడి ఉంది. సీమోను హృదయము కూడా అటువంటి పరిస్థితిలోనే ఉన్నది. ప్రస్తుతము సంఘాలలో సైమొనీ జరగడము లేదంటారా? ఆలోచించండి.

**5. సీమోనుకు మారుమనసు లేదు :** "నీ చెడుతనము మానుకొని మారుమనసు నొంది ప్రభువును వేడుకొనుము ఒకవేళ నీ హృదయాలోచన క్షమించబడవచ్చును" అని పేతురు చెప్పినను అతనిలో ఏ మార్పు లేదు. వారి హెచ్చరిక విన్నాక కూడా మార్పురాలేదు. దానికి కారణము అపవాది అతని ఆత్మీయ చెవులు మూసివేశాడు. దేవుని ఉగ్రత తప్పించుకోవాలనే ఆలోచన వచ్చింది గాని, నిర్లక్ష్యంగా వారినే తన కొరకు ప్రార్థించమంటున్నాడు. తనంతట తాను పశ్చాత్తాప హృదయంతో ప్రార్థన చేయకుంటే పరలోక రాజ్యములో స్థానము ఉండదని గ్రహించలేకపోయాడు. మనలో చాలామంది ఇలాంటి తప్పు చేస్తుంటాము. ఇతరులు మన కొరకు ప్రార్థించుట చాలా మంచిదే కాని మన ప్రయత్నము ప్రథమంగా ఉండాలి. పశ్చాత్తాపము, పాప క్షమాపణ లేనిచోట మారుమనసు లేదని గమనించండి.

**6. సీమోను ఘోర దుష్టత్వములోను, దుర్నీతిలోను ఉన్నాడు :** ఇది పేతురు గ్రహించాడు. దేవుని వరమునే కొనగలననుకొనడము అపవాది ఆలోచన, సీమోను సంపూర్ణముగా సైతాను ఆధీనంలో ఉన్నట్లు కనుగొన్న పేతురు అతనిని వైదొలగమని, తమ పనులలో పాలు పంపులుండవని ఖచ్చితంగా చెప్పాడు. సీమోనుకు తలనుండి కాళ్ళవరకు పాపము నిండి ఉన్నది.

**7. ఆత్మహత్య చేసుకున్నాడు :** ఎంత పాపినైనను యేసు చేర్చుకొనును అను విశ్వాసము ఉండి ఉంటే అతనికి ఆత్మహత్య చేసుకునే అగత్యము ఏర్పడి ఉండేది కాదు. ఫిలిప్పు ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు బోధించిన సువార్తపై ఆధారపడకుండా ఫిలిప్పు చేసిన అద్భుతాలపైననే తన దృష్టి నుంచినందున అతని ముగింపు బాధాకరంగా ఉంది.

సంఘము, సమాజము ఇలాంటి గారడీ సీమోనులతో నిండి ఉన్న ఈ యుగములో దయచేసి యేసుక్రీస్తను బండపై మీ జీవితాలను కట్టుకొని స్థిరంగా ఉండమని కోరుతూ, అద్భుతాలపై ఆధారపడక సువార్తపైపు మరలాలని కోరుతున్నాను. ప్రభువు తోడై ఉండును గాక ఆమేన్!

❖ ❖ ❖

# 32. తప్పిపోని తండ్రి

ప్రియ పాఠకులారా "తప్పిపోయిన కుమారుడు" అనే ఉపమానము గురించి ఎన్నో ఏళ్లుగా వింటున్న మనము ఈ ఉపమానములోని "తప్పిపోని తండ్రి" గురించి ధ్యానించుకుందాము.

లూకా 15:11-32 వరకు ఉన్న పాఠ్య భాగములో ఉన్న ఈ ఉపమానము పరిసయ్యులను, శాస్త్రులను ఉద్దేశించి యేసుప్రభువే స్వయంగా చెప్తున్నాడు. తాను ఈ లోకానికి ఎందు నిమిత్తమై వచ్చాడో వారికి బోధించుటకు ఈ ఉపమానముతో పాటు ఇంకా కొన్ని ఉపమానములు చెప్తున్నాడు. "నశించిన దానిని వెదకి రక్షించుటకై" తాను వచ్చాననే సత్యము వారికి అర్థవంతంగా బోధించుటకు ప్రయత్నిస్తున్నాడు. ఈ ఉపమానము ఒకసారి గుర్తు చేసుకొందామా ....

ఒక ఊరిలో ఒక తండ్రి, ఆయనకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఆస్థిలో తన భాగం పంచి ఇవ్వమని అడిగి తీసుకొని, దూర ప్రాంతాలకు వెళ్లి, తన డబ్బంతా చెడు సహవాసాలు, చెడు అలవాట్లుకు ఖర్చుచేసి అంతా పోగొట్టుకొంటాడు. ఆ సమయంలో ఆ ప్రాంతానికి పెద్ద కరువు వచ్చిన కారణంగా, పొట్టకూటి కొరకు ఆ చిన్నవాడు ఒక పందుల దొడ్డిలో పందులను మేపు ఉద్యోగము సంపాదించు కొంటాడు. అక్కడ అతడు ఆకలి బాధ భరించలేక పందుల మేత తినాలని ప్రయత్నించినా వీలు పడదు. అప్పుడు తన తండ్రిని గుర్తుచేసుకొంటాడు. ఈ యింటిలోని పనివారు తనకంటే మంచి జీవితము గడుపుతున్నారనే వాస్తవాన్ని గుర్తించి తన తండ్రి దగ్గర పనివాడిగా ఉండాలన్న ఆలోచనతో తిరిగి వెళతాడు. చిన్న కుమారుడు తిరిగి రావడము చూసిన తండ్రి పరిగెత్తుకొని వెళ్లి కొడుకును ముద్దుపెట్టకొని, పనివారిని పిలిచి, అతనికి స్నానము చేయించి, మంచి బట్టలు ధరింపజేసి తన కుమారుడు తిరిగి వచ్చిన సందర్భంగా కొవ్విన దూడను వధించి, ఆర్భాటముగా గొప్ప విందు చేసాడు.

పొలమునుండి తిరిగివచ్చిన పెద్దకొడుకు, ఈ ఆర్భాటమంతా చూసి, పనివారి ద్వారా విషయము తెలుసుకొని, కోపము తెచ్చుకుంటాడు. లోపలకు పోకుండా వెలుపలనే ఉన్నప్పుడు తండ్రి బయటకు వచ్చి ఇంటిలోనికి రమ్మని బ్రతిమాలినప్పుడు తండ్రితో "నేను ఇన్ని సంవత్సరాలుగా నీతో ఉన్నాను, నీకు సేవ చేస్తున్నానే, నీ ఆజ్ఞ ఎప్పుడూ మీరలేదు కదా. నాకెప్పుడైనా నా స్నేహితులతో కలిసి సంతోషించమని చెప్పి ఒక కొవ్విన దూడనైనా ఇచ్చావా?" అని అడిగినప్పుడు తండ్రి అతనితో "నీవెప్పుడూ నాతో కూడా ఉన్నావు. నావన్నీ నీవి కావా. ఈ నీ తమ్ముడు తప్పిపోయి దొరికాడు. చనిపోయి తిరిగి బ్రతికాడు కదా" అని చెపుతాడు.

ఈ ఉపమానములో అవిధేయుడైన చిన్న కుమారుడు, విధేయుడుగా ఉన్నట్లు అగుపడుతున్న పెద్దకుమారుడు, ప్రేమగల తండ్రి మనకు కనపడుతున్నారు. ఈ ఉపమానంలో సువార్త అంతా క్రోడీకరింపబడి ఉంది. ఆదాము, హవ్వల పాపము వలన మనము జన్మత: పాపులముగా ఉండి, ఆజ్ఞల నతిక్రమిస్తూ జీవిస్తున్నాము. కాబట్టి మనమంతా తప్పిపోయిన కుమారులమే. దేవుని రాజ్యములోకి ప్రవేశించుటకు మార్గము పశ్చాత్తాప హృదయమని చిన్న కుమారుని జీవితము ద్వారా తెలిసికోవచ్చును. కొడుకు తప్పిపోయినా స్థిరంగా నిరీక్షణతో ఉన్న తప్పిపోని తండ్రిని గురించి ఆలోచిద్దాము.

**1. పిల్లలను ప్రేమించుటలో తప్పిపోని తండ్రి :** చిన్న కుమారుడు ఆస్థిలో తన భాగము ఇవ్వమని అడగగానే పంచి ఇచ్చాడు. సాధారణంగా తండ్రి జీవించి ఉన్నప్పుడే ఆస్థి పంపకాల కొరకు అడగడము తండ్రిని మరణించమని చెప్పినట్లుగాను, తండ్రిపై తనకు ప్రేమలేదని వెల్లడించడము గాను భావిస్తారు. అయినా ఆ తండ్రి బాధపడకుండా తన అపార ప్రేమచేత కుమారుని క్షమించి ఆస్థిని పంచి ఇస్తున్నాడు. 1 కొరింథీ13:4 ప్రకారము "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును" తన వాటా ఆస్థిని తీసికొని చాలా దూరప్రాంతాలకు, తన తండ్రి పేరు వినిపించనంత దూరమునకు వెళ్ళిపోయాడు. తండ్రికి పరిచయ మున్నవారు తనను గుర్తించి తిరిగి తండ్రి దగ్గరకు తీసికెళతారేమోనన్న భయంతో దూరప్రాంతాలకు వెళ్లాడు. కాని తండ్రి తన పట్ల చూపించిన ప్రేమ కష్ట సమయంలో తండ్రి యొద్దకు తిరిగి వెళ్లాలనే ఆలోచనను కలుగజేసింది.

**2. పిల్లలను సరియైన మార్గమున పెంచుటలో తప్పిపోని తండ్రి :** "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" అనే ఆదేశము ప్రకారము తన పిల్లలను పెంచాచన్న విషయము చిన్న కుమారుని మాటల్లో బోధపడుతుంది. "నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లి తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని" అని చెప్పుటలో తండ్రి తన కుమారులకు పరలోకమును గురించి, పాపమును గురించి బోధించినట్లుగా తెలిసికొనగలము. తన తండ్రి గుణగణాలు తెలిసిన చిన్న కుమారుడు పనివారిని సైతము ప్రేమగా చూసుకొనే తండ్రి తనను తిరిగి తన దగ్గరకు చేర్చుకొంటాడన్న ధైర్యము కలిగి ఉన్నాడు. ఈ విషయము ఆలోచించినప్పుడు పిల్లలను మంచి మార్గములో పెండచడములో తండ్రి తప్పిపోలేదన్న సంగతి గమనించగలము.

**3. నిరీక్షణలో తప్పిపోని తండ్రి :** చిన్నతనము నుండి జీవిత విలువలు నేర్పించిన తండ్రి, తాను మంచి మార్గములోనే తన పిల్లలను పెంచాను కాబట్టి వారు దారి తొలగినను, మరలి వస్తారనే విశ్వాసముతో ఉన్నాడు. "వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి" అనే వాక్యంలో తండ్రి తన మేడపైన కూర్చుని నిరీక్షణతో ఎదురుచూస్తూ ఉండి ఉండవచ్చు అనే ఆలోచన మనలో కలుగుతుంది. దూరంగా వచ్చేవారు కనపడాలంటే తప్పనిసరిగా ఎత్తైన స్థలములో ఉండి ఉంటాడు.

**4. కనికరము చూపుటలో తప్పిపోని తండ్రి :** "కనికరపడి, పరుగెత్తి వాడి మెడమీద పడి ముద్దు పెట్టుకొనెను" అనే వాక్యములో తండ్రి చూపిన కనికరము కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది. పందుల దగ్గర పనిచేసే వాడు ఎంతో దుర్గంధముతో ఉండి ఉంటాడు. మాసి, చిరిగిన దుస్తులతో, ఆకలిగొని ఉన్న ప్రాణంతో, నిస్సత్తువతో, అనారోగ్యంతో ఉన్న కొడుకు కనపడగానే పరుగెత్తి వాని మెడమీద పడి ముద్దు పెట్టుకొంటున్నాడు. "మనము పాపులుగా ఉన్నప్పుడే దేవుడు మనలను ప్రేమించి, మన కొరకు తన కుమారుని పంపాడు" అనే విషయము గుర్తుకు వస్తుంది. పాపమనే మురికి కూపంలో ఉన్న మనలను లేవదీయుటకు, ప్రేమతో హత్తుకొనుటకు మన తండ్రి వచ్చి ఉన్నాడు.

**5. మంచి తండ్రిగా ఉండుటలో తప్పిపోని తండ్రి :** మన తండ్రియైన దేవుడు పక్షపాతి కాడు. "యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు. దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు"

అనే విషయము మనకు తెలుసు. ఈ తండ్రి కూడా ఇద్దరు కుమారులను సమానంగా ప్రేమగా చూసుకొంటున్నాడు. చిన్న కుమారుని కోసం విందు చేస్తున్న తండ్రిని బట్టి పెద్ద కుమారుడు కోపగించుకొని, ఇంట్లోకి రావడానికి నిరాకరించినప్పుడు, ఆ తండ్రి నిర్లక్ష్యము చేయక తానే స్వయంగా వెలుపలికి వెళ్ళి సముదాయించినట్లుగా చూస్తున్నాము. "కుమారుడా, నావన్నియు నీవి, నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రతికెను. తప్పిపోయి దొరికెనని అతనితో చెప్పెను". పెద్దకుమారుని మనస్తత్వము అర్థము చేసుకొని, అతనికి అనుకూలమైన మాటలు చెప్తున్నాడు.

చాలామంది క్రైస్తవులు పెద్దకుమారుని అనుభవములో ఉన్నారు. తామే నీతిపరులమని పరిసయ్యులు, శాస్త్రులు, సద్దూకయ్యులు అనుకునేవారు. తమ కంట్లో దూలాలు ఉంచుకొని, ఎదుటివారి కళ్లలో ధూళికోసం చూస్తూ ఉంటారు. ఎల్లవేళలా దేవుని సన్నిధిలో ఉంటూ కూడా దేవుని సన్నిధిని అనుభవించలేక ఉన్నారు. అలాంటి వారికి ఈ తండ్రి మాటలు అర్థము చేసుకొనవలసిన అవసరము ఎంతైనా ఉంది.

ఈ దినాలలో మన పరలోకపు తండ్రికి సాదృశ్యంగా ఈ తప్పిపోని తండ్రి గురించి మనము అనుదినము ధ్యానించుకొని, ఆయన అపార ప్రేమ వలననే మనకు రక్షణ వచ్చిందనే సంగతి గుర్తుకు తెచ్చుకొని, ఈ గొప్ప రక్షణ సువార్తను అందరికీ ప్రచురించుదాం.

❖ ❖ ❖

# 33. ఆనందము వెనుక ఉన్న రహస్యము

మనమందరము ఎల్లప్పుడు ఆనందంగా ఉండాలని కోరుకుంటాము. ఆ ఆనందము యేసుప్రభువులోనే ఉంది అనే విషయాలు గమనించాలి. పౌలు ఫిలిప్పీ 4:4లో “ఎల్లప్పుడును ప్రభువు నందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి” అని ఆదేశిస్తున్నాడు.

“ఆనందము”, “సంతోషము” అనే రెండు పదాలకు భావము ఒకటే అయినా అందులోని అంశాలు వేరుగా ఉన్నాయి. “సంతోషము” అనునది సందర్భాన్ని బట్టి వస్తుంది. అనుకోకుండా మనకు లభించే మేలు వలన కాని, బాధల నుండి, అనారోగ్యాల నుండి విడుదల కలిగినపుడు కాని, ఇంట్లో పిల్లలు పుట్టినప్పుడు, వివాహాలు జరిగినపుడు కాని వచ్చేది సంతోషము – ఇది ఇహలోక సంబంధమైనది. అయితే “ఆనందము” అనునది పరిస్థితులకు అతీతంగా ఉండే సంతోషము – పరిశుద్ధాత్మ ద్వారా వచ్చే మానసిక, పరలోక సంతోషము గురించే ధ్యానిద్దాము. హబక్కూకు ప్రవక్త ఇటువంటి ఆనందము గురించి వ్రాసాడు – హబక్కూకు 3:17.

“అంజూరపు చెట్లు పూయకుండినను
ద్రాక్షచెట్లు ఫలింపక పోయినను
ఒలీవ చెట్లు కాపు లేకయుండినను
చేనిలోని పైరు పంటకు రాకపోయినను
గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను
సాలలో పశువులు లేకపోయినను
నేను యెహోవా యందు ఆనందించెదను”

ఇదే నిజమైన ఆనందము – ప్రభువు నందలి ఆనందము. ప్రతి క్రైస్తవుడు ఈ ఆనందము ఎందుకు కలిగియుండాలో దానికి కొన్ని కారణాలు చూద్దాము.

1. ఇది ఒక సూచన మాత్రమే కాదు, ఇది ఒక ఆజ్ఞ. ఆజ్ఞాతిక్రమము పాపము కాబట్టి మనము ఆనందంగా లేకుంటే పాపము చేసినట్లే. మనమెప్పుడూ విచారంగా ఉంటే దేవుని మాటకు అవిధేయులమైనట్లే. అయినప్పటికీ దు:ఖపడే సమయాలు కూడా కొన్ని ఉన్నాయి. అలాంటప్పుడు విచారించడము పాపము కాదు. మనము మన పాపాల కొరకు, ఇతరుల పాపాల కొరకు దు:ఖించాలి. యేసుప్రభువు స్వయంగా "దు:ఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు" అంటున్నాడు. మీ పాపస్థితిని బట్టి దు:ఖపడుడి అంటున్నాడు. యేసుప్రభువు సిలువను మోసుకొని వెళుతున్న సమయములో రోదించు స్త్రీలతో "నా కొరకు ఏడవవద్దు, మీ కొరకు, మీ పిల్లల కొరకు ఏడవండి" అంటున్నాడు. నశించిపోయే వారిని గురించి దు:ఖించాలి.

2. ఆత్మఫలాల్లో "సంతోషము" ఒకటి (గలతీ. 5:22), కాబట్టి పరిశుద్ధాత్మ మనలో ఉన్నాడనడానికి మనలోని ఆనందము ఒక గుర్తు. "చెట్లు దాని పండు వలన తెలియును" అని ప్రభువు అంటున్నాడు. మనలోని ఆనందము బయటికి కనపడినపుడు మనలో పరిశుద్ధాత్మ దేవుడున్నాడని అందరికీ తెలుస్తుంది.

3. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు "సణుగులు, సంశయాలు" అనే పాపము చేయకుండా ఉండాలంటే అనునిత్యము ఆనందంగా ఉండాలి. మనము ఇశ్రాయేలీయులను గుర్తుకు తెచ్చుకుంటే వారు సణగడము మూలంగా దేవుడిచ్చిన వాగ్దాన దేశాన్ని స్వతంత్రించుకోలేకపోయారు. పాలు తేనెలు ప్రవహించే కానాను దేశములోనికి ప్రవేశించకముందే నాశనమైపోయారు. మనము ఆనందముగా లేకపోతే పరలోకమనే మన కానానుకు చేరలేము.

4. మన ఆనందాన్ని చూచి యితరులు కూడా క్రీస్తును కనుగొనాలని ఆశిస్తారు. మనము ఎప్పుడూ చింతిస్తూ దు:ఖపడుతూ ఉంటే క్రైస్తవులుగా మారాలని, క్రీస్తు బాటలోకి రావాలని ఎవరూ కోరుకోరు. అందుకే మనము ఆనందముగా ఉంటూ, ఇతరులను ఈ ఆనందపు బాటలోకి నడిపించాలి.

5. చివరిగా మనము దేవుని రాజ్య సంబంధులము కాబట్టి ఆనందంగా ఉండాలి. పరలోక రాజ్య రాయబారులుగా ఉన్నప్పుడు, మన దేశంలో ఉన్న ఆనందము మన జీవితాలలో ప్రతిబింబించాలి.

ప్రపంచంలోని చాలా దేశాల్లో సంఘము త్వరగా వ్యాపిస్తోంది. దానికి ముఖ్యకారణము హింస పొందుతున్నా సరే క్రైస్తవులు సంతోషంగా ఉండడము.

ఈ ఆనందము మనలో ఉండాలంటే మనము ప్రభువు చెప్పిన మాటలు వినాలి. కొండమీద ప్రసంగంలో యేసుప్రభువు "చింతించకుడి" అనే మాట పదే పదే చెప్తున్నాడు. మత్తయి 6:25-34 వరకు ఉన్న వాక్యభాగములో 3 సార్లు "చింతించకుడి" అనే పదము వాడుతున్నాడు. అన్నిసార్లు చెప్పాడంటే అది చాలా ప్రాముఖ్యమైన విషయమని గుర్తించాలి. చింతించుట అనవసరము, అర్థరహితము అని చెప్తున్నాడు. చింతించుట వల్ల లాభము లేకపోగా అవిశ్వాసము, ఆజ్ఞాతిక్రమము అనే పాపాలు చేస్తున్నాము. 60 శాతము రోగాలు చింతవల్లనే ప్రాప్తిస్తున్నాయి అని పరిశోధనల వలన తెలిసింది. కాబట్టి చింతించుట వల్ల హృద్రోగాలు, మానసిక జబ్బులు వస్తాయి తప్ప ఏమీ ప్రయోజనము ఉండదు.

పౌలు ఫిలిప్పీ 4:6 లో "దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయము లోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" అంటున్నాడు. యేసుప్రభువుతో మూడున్నర సంవత్సరములు కలిసి జీవించి, ఆయనను, ఆయన శక్తిని బాగా అర్థము చేసుకొన్న పేతురు మనకిచ్చే సలహాను గమనిద్దాము :

1పేతురు 5:7లో "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తును ఆయన మీద వేయుడి" అని పేతురు చెప్తున్నాడు. దేవుని చిత్తానికి వెలుపట ఎవరూ ఏమీ చేయలేరు. పేతురు జీవితములో జరిగిన కొన్ని అద్భుతాలు చూస్తే చింత యావత్తు ఆయన మీద మోపినపుడు వచ్చు ఫలితాలు తెలుస్తాయి.

1. లూకా 4:38,39 వచనాల్లో జ్వరముతో పడియున్న పేతురు అత్త దగ్గర యేసు నిలబడి జ్వరమును గద్దింపగానే, అది ఆమెను విడిచిపెట్టడము, తద్వారా పేతురుకు చింత నివృత్తి కలగడము చూస్తున్నాము.
2. మత్తయి 17:24-27 లో అరషెకులు అను పన్ను కట్టుటకు ధనము కొరకు పేతురు అడుగగానే సముద్రమునకు పోయి, గాలము వేసి, చేపను పట్టుకొని, దాని నోటిలో నుండి ఒక షెకులు తీసికొని పన్ను కట్టుమని యేసు చెప్పడము చూడగలము.
3. మత్తయి 14:25-31లో పేతురు నీటిమీద నడుచుటకు ప్రయత్నము చేసినప్పుడు గాలిని చూసి భయపడి మునిగిపోసాగి - "ప్రభువా రక్షించుమని" కేకలు వేయగానే యేసు చెయ్యిచాపి అతని పట్టుకొని రక్షించడము గమనించగలము.

4. లూకా 22:50,51 వచనాలలో యేసును బంధించుటకు వచ్చిన వారిలో ప్రధానయాజకుని దాసుని చెవి పేతురు నరికినప్పుడు, యేసు వాని చెవి ముట్టి బాగు చేయడము వలన పేతురుకు శిక్షపడకుండా కాపాడాడు.

పై సంఘటనల ద్వారానూ, ఇంకా అనేకుల జీవితాలలో యేసుప్రభువు చేసిన అద్భుతాలు చూసినందుననూ పేతురు ధైర్యముగా ఆయన మీద మీ చింత యావత్తు వేయండని చెప్పగలుగుతున్నాడు.

యేసుప్రభువు మీద మన చింత యావత్తు వేసినప్పుడు నాలుగు విషయాలు జరుగుతాయి. అందుకే మనము ఆనందంగా ఉండగలము. ఆ విషయాలేమంటే :

1. సమస్యను ఎదుర్కొనుటకు కావలసిన ధైర్యము దేవుడిస్తాడు. యెషయా 41:10లో "నీకు తోడైయున్నాను, భయపడకుము, నేను నీ దేవుడనై యున్నాను, దిగులు పడకుము, నేను నిన్ను బలపరతును, నీకు సహాయము చేయువాడను నేను, నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును" అనే వాగ్దానముంది. దేవుడిచ్చిన ధైర్యముతో సంతోషంగా ముందుకు పోగలము.

2. సమస్యను అర్థము చేసికొనుటకు కావలసిన జ్ఞానము దేవుడిస్తాడు. సామెతలు 4:6 లో "జ్ఞానమును విడువక యుండినయెడల అది నిన్ను కాపాడును. దాని ప్రేమించిన యెడల అది నిన్ను రక్షించును" అని వ్రాయబడి ఉంది. జ్ఞానము కొదువగా ఉన్నయెడల దేవుని అడగాలి అని యాకోబు పత్రికలో చెప్పబడి ఉంది.

3. సమస్య కొరకు స్పందిచుటకు కృప, బలము దేవుడిస్తాడు. పౌలు ఫిలిప్పీ. 4:13లో "నన్ను బలపరచు వానియందే నేను సమస్తము చేయగలను" అంటున్నాడు.

4. దేవుని మీద ఆధారపడుటకు కావలసిన విశ్వాసమిస్తాడు. కీర్తన 37:5లో "నీ మార్గమును యెహోవాకు అప్పగించుము. నీవు ఆయనను నమ్ముకొనుము. ఆయన నీ కార్యము నెరవేర్చును" అని వ్రాయబడి ఉంది.

పై కారణాల వలన మనము దేవుని ఆనుకొని జీవిస్తూ, ఆయన మీద ఆధారపడితే ఆనందంగా ఉండగలమని గ్రహించి ఆ విధంగా ఉండుటకు ప్రయత్నించమని యేసుప్రభువు నామములో కోరుతున్నాను. ఆమేన్.

❖ ❖ ❖

# 34. వాక్యములోని మూడు కోణాలు

దేవుని వాక్యము మన పాదములకు దీపమును మన త్రోవకు వెలుగునై యుండాలి. దావీదు మహారాజు "నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును, అవి తెలివిలేని వారికి తెలివి కలిగించును" అని చెప్తున్నాడు. దేవుని వాక్యమే మనకు చట్టము. ఈ చట్ట ప్రకారము మనము నడవాలని దేవుడు మనకు ఆజ్ఞాపించి యున్నాడు. యోహాను 1:1 ప్రకారము "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను". దేవుడు వాక్యమై ఉన్నాడు కాబట్టి ఆ వాక్యాన్ని మనము ధ్యానించి మన హృదయంలో నింపుకొన్నప్పుడు మనము నోరు తెరిస్తే వాక్యమే మన నోటి నుండి వస్తుంది. దేవుని వాక్యము ఎందుకు నేర్చుకోవాలి? ఎందుకు ధ్యానించాలి? అనే అంశాలు బాగా అర్థము కావాలి.

వాక్యములోని మూడు కోణాలు ఈ రోజు చూద్దాము. వాక్యాన్ని ఎవరూ అపహరింపలేరు; నిరర్థకము చేయలేరు; బంధింపలేరు; దేవుని వాక్యము మనలో ఉన్నప్పుడు మనలను ఎవరూ కదిలింపలేరు; అప్రయోజకులనుగా చేయలేరు బంధింపలేరు. ఈ మూడు అంశాలు ధ్యానిద్దాము.

**1. వాక్యమును అపహరింపలేరు :** యోహాను 10:28 వచనములో "నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను; గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు". ఇక్కడ నేను అన్న చోట యేసుప్రభువు వాక్యమై ఉన్నాడు కాబట్టి వాక్యము అని పెట్టుకోవచ్చును. "అవి" అన్నచోట వాక్యము కలిగిన మనము. ఇప్పుడు మనము ఈ వాక్యాన్ని ఈ విధంగా అర్థం చేసుకోవచ్చును. వాక్యము కలిగి ఉన్న మనలను ఎవరు దొంగిలరు అనియు, సాతాను ఎంత ప్రయత్నించినా మనలను తనవైపు లాక్కోలేరనియు తెలిసికొనవలెను. దేవుని వాక్యము కలిగి ఉన్నవాడు స్థిరముగా ఉండును. దేవుని వాక్యమే ఆయన స్వరము. ఆయన

స్వరము విన్నవాళ్లంతా ఆయన వెంటే వెళతారు. మనము దేవుని వాక్యములో ఉంటూ, ఆయన స్వరము వింటూ ఉన్నప్పుడు మనలను దేవుని దగ్గర నుండి ఎవరూ అపహరింపలేరు. యోహాను 10:10 ప్రకారము సాతాను దొంగతనమును, హత్యను నాశనమును చేయుటకు వచ్చును కాని మనయందు వాక్యమున్నపుడు మన దగ్గరకు రాలేడు. మనము అస్వస్థతతో, సమృద్ధి పొందవచ్చును. మనము అత్యధిక శక్తిగల దేవుని బాహువుల్లో ఉంటాము కాబట్టి ఎవరూ మనలను లాక్కోలేరు. ఈ భావన మనకు నిశ్చింత నిస్తుంది.

**2. వాక్యమును నిరర్థకము చేయలేరు :** యోహాను 10:34-37 వ వచనములలో ఈ విధంగా వ్రాయబడి ఉంది. “అందుకు యేసు మీరు దైవములనియు నేనంటినని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడి యుండలేదా? లేఖనము నిరర్థకము కానేరదు కదా, దేవుని వాక్యమెవరికి వచ్చెనో వారే దైవములని చెప్పిన యెడల. నేను దేవుని కుమారుడనని చెప్పినందుకు, తండ్రి ప్రతిష్ఠ చేసి ఈ లోకములోనికి పంపిన వానితో – నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదురా? నేను నా తండ్రి క్రియలు చేయని యెడల నన్ను నమ్ముకుడి” ఎంత శక్తివంతమైన మాటలో గమనించండి. దేవుని వాక్యము కలిగియున్నవారు దైవములు అని యేసుప్రభువే చెప్పుచున్నాడు. దేవుని వాక్యము నిరర్థకము కానేరదు కదా అని కూడా ఆయన అంటున్నాడు. దేవుని వాక్యము మనలోకి ఇంకిపోయే కొద్దీ మనము దేవుని స్వరూపములోనికి మారిపోయి భయము లేని వారముగా, శక్తివంతులుగా తయారవుతాము. అది దేవుని స్వభావము. దేవుని వాక్యము = దేవుడు. మనము నెమ్మదిగా దేవుని స్వభావములోనికి వచ్చినప్పుడు ఎవరైనా శపించినా మనకు తగలదు. మనకు విషమిచ్చినా దాని ప్రభావం మనకుండదు. మనకేదైనా ప్రమాదము జరిగితే మరి ఆ వాక్యము నిరర్థకమైనట్లే కదా. లేఖనములోని వాక్యము నిరర్థకము కానేరదు. కాబట్టే దావీదు మహారాజులాంటి వారు అంత ధైర్యంగా జీవించగలిగారు.

**3. వాక్యము బంధింపబడదు :** 2తిమోతి 2:9లో “దేవుని వాక్యము బంధింపబడి యుండలేదు” అని వ్రాయబడి ఉంది. పౌలు తిమోతికి తాను బంధింపబడినా, తనలోని వాక్యము బంధింపబడి యుండలేదు. కాబట్టి తాను విడుదల చేయబడ్డానని చెప్తున్నాడు. దేవుని ప్రజలను ఎవరూ బంధించి యుంచలేరు. వారు రోగముతోనూ, దరిద్రతతోనూ కూడా బంధింపడి యుండలేరు. అపవాది మనలను

ఎన్నో విధాలుగా శోధింప ప్రయత్నిస్తాడు. కాని ఈ మూడు లక్షణాలు కలిగిన వాక్యం మనలో ఉన్నప్పుడు, వాడు మనలను ఏమీ చేయలేదు. మనలో ఉన్న దేవునితో సన్నిహిత్యము పెరిగి, విశ్వాస పరిధిలోకి వెళ్తాము. మనలో దేవుని వాక్యము ఉన్నప్పుడు భయము అనే పరిధి నుండి విశ్వాసము అనే పరిధిలోకి వెళ్తాము. అపవాది దొంగతనము, హత్య, నాశనము చేయుటకు వచ్చినా, విశ్వాస పరిధిలోకి రాలేడు. ప్రపంచమంతా భయం అనే పరిధిలో ఉన్నా మనము మాత్రం దేవుని వాక్యం మనలో ఉంచుకొని విశ్వాస పరిధిలోకి వచ్చాము కాబట్టి ఏ విపత్తు వచ్చినా ఎదుర్కొనగలము. వాక్యము మనలో ఉన్నప్పుడు దేవుని ఆత్మ మనలోకి వస్తుంది.

ఎఫెసీయులకు 1:3 ప్రకారము దేవుడు "క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమునకు మన కనుగ్రహించెను". మనము భయము పరిధిలో నుండి విశ్వాసమనే పరిధిలోకి వచ్చినపుడు పరలోకంతో సంబంధ మేర్పడుతుంది, పరలోకపు కాపుదల, సమృద్ధి మనకు వస్తుంది. మనలో దేవుని వాక్యం లేనప్పుడు మనకు అపవాదితో సంబంధమేర్పడుతుంది. కాబట్టి నాశనమునకు దారి తీస్తుంది, పరిస్థితులంతా ఎదురు తిరుగుతాయి.

మనము వాక్యము ధ్యానించినప్పుడు మన అంతరంగ పురుషుని బలపరచు కోవచ్చును. మన అంతర్మనిషి బలము పుంజుకుంటుంటే మనకు దేవునితో సాన్నిహిత్యము పెరుగుతుంది. అప్పుడు ఓటమి, అనారోగ్యము, లేమి అనేవేమీ మనలను బాధించవు. మరి మన అంతర్మనిషిని బలపరచుకోవడానికి వాక్య ధ్యానమొకటే మార్గము. ఈ వాక్యమును ఎవరూ దొంగిలించలేరు, నిరర్థకము చేయలేరు, బంధించలేరు అని ఇంకొకసారి మీకు గుర్తుచేస్తున్నాను. మన గొప్ప దేవుడు వాక్యమై ఉన్నాడు కాబట్టి వాక్యాన్ని మనలో నింపుకొని దేవుని మహిమపరుస్తూ ఇతరులను దేవుని దగ్గరకు నడిపించమని యేసుప్రభువు నామమున మిమ్మును బ్రతిమలాడుకొనుచున్నాను. ఆమేన్!

❖ ❖ ❖

# 35. అభిషేకము కంటే గొప్పదైన ప్రార్థనా శక్తి

అభిషేకించబడిన వారికి కూడా అత్యంత ప్రాముఖ్యంగా అవసరమైనది ప్రార్థన. కాబట్టి అందరూ తెలిసికొనవలెనను ఆశతో ఈ అంశమును ప్రస్తావిస్తున్నాను. ఆదికాండము 4:26లో "షేతునకు (ఆదాము కుమారుడు) కూడా కుమారుడు పుట్టెను, అతనికి ఎనోషను పేరుపెట్టెను. అప్పుడు యెహోవా నామమున ప్రార్థన చేయుట ఆరంభమైనది" అని వ్రాయబడినది. ఈ వాక్యము ద్వారా ప్రార్థన ఈనాటిది కాదు. ఆది నుండే ఉన్నదను సంగతి మనకు తెలుపబడినది. ఆనాటి నుండే ఆదాము నుండి నేర్చుకొని దేవుని మీద ఆధారపడుట, సంప్రదించుట మొదలుపెట్టారు. ప్రార్థన అంటే యేసుప్రభువు నామము ద్వారా తండ్రియైన దేవునిని పిలుచుట, తండ్రితో సంభాషించుట, ఆయన చిత్తము తెలుసుకొనుట.

అభిషిక్తులు ఎల్లవేళలా దేవుని కార్యములు చేస్తూ, దేవుని సన్నిధిలో ఉంటారు. కావున వారికి ప్రార్థన అవసరము లేదని అనుకుంటారేమోననే సందేహము కలుగుట వలన ఈ అంశము ప్రస్తావనలోకి వచ్చిందని తలంచుచున్నాను. అపొస్తలుడైన యాకోబు యేసుప్రభువు శిష్యులలో ఒకడై ఉండి, యేసయ్య ఆరోహణమైన తర్వాత పరిశుద్ధాత్మ నింపుదల పొందిన వారిలో ఒకడు. మార్కు 3:15లో యేసుప్రభువు పన్నెండుమందిని "తనతో కూడ ఉండునట్లును, దయ్యములను వెళ్లగొట్టు అధికారము గలవారై సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని" ఏర్పాటు చేసుకొన్నాడని వ్రాయబడి ఉన్నది. యాకోబు యేసయ్యతో అతి సన్నితంగా ఉన్న ముగ్గురు శిష్యులలో ఒకడు. మత్తయి 17:1-3లో ఉన్న వాక్యభాగములో ప్రభువు రూపాంతరము పొందినప్పుడు కూడా అక్కడ ఉండే ధన్యత పొందినవాడు. "ఆయన (యేసయ్య) ముఖము సూర్యునివలె ప్రకాశించెను ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను". అంత గొప్ప అద్భుతములు చూచుటకు అతనికి అవకాశము దొరికింది. పైపెచ్చు

యేసుప్రభువు పరిచర్య కాలమంతటిలో ప్రభువుతో కలిసి నడిచినవాడు. అయినా హేరోదు "యాకోబును ఖడ్గముతో చంపించెను" అని అపొ.కారములు 12:2లో గ్రంథస్థము చేయబడి ఉన్నది. అతనిలోని అభిషేకము హేరోదు అతనిని చంపినప్పుడు కాపాడలేకపోయింది. అపవాది క్రియలను అభిషేకము లయపరచలేకపోయింది. వారి వైపు నుండి ఏ విధమైన ప్రతిఘటను రాలేదు. పైపెచ్చు అది యూదులకు ఇష్టమైన కార్యమని గమనించిన హేరోదు పేతురును కూడా చంపదలచి జైలులో వేశాడు. అప్పుడు సంఘము పేతురు కొరకు అత్యాసక్తితో ప్రార్థన చేసినప్పుడు దేవుడు దేవదూతలను పంపి పేతురును విడిపించినట్లుగా అపొ.కార్యములు 12:3-12 లో చూడగలము. సంఘము యొక్క ప్రార్థన దేవదూతను పరలోకము నుండి దింపింది. ఆ దూత పేతురును జైలునుండి బయటకు తీసుకొని వచ్చిందని మనము గమనించాలి. అభిషిక్తుడైన పేతురునకు ఉన్న శక్తికంటే ప్రార్థనా శక్తి గొప్పదను సత్యము తెలుస్తున్నది. అపవాది ప్రణాళికలు ఓడించాలంటే కేవలము ప్రార్థన ద్వారానే సాధ్యమని సంఘము నేర్చుకున్నది.

యేసుప్రభువు ప్రత్యక్షత ద్వారా తన జీవితమును మార్చుకున్న పౌలు అన్యుల మధ్యను, అధికారుల మధ్యను సువార్త ప్రకటించుటకు ఏర్పరచబడిన వాడైనను, అతనిపైనున్న అభిషేకము అతనిని జైలు నుండి బయటకు తీసుకొని రాలేదు. అతను ప్రమాదాలలో ఉన్నప్పుడు అతని అభిషేకము ఆపలేక పోయింది. అపొస్తలులందరి అభిషేకము అపవాదిని ఆపలేకపోయింది. అననీయ, సప్పీరాను అబద్ధము ఆడకుండా అడ్డుకోలేకపోయింది. ఆదిమ సంఘములో ఈ సంఘటనలు చూసిన అపొస్తలులు ఒక పాఠము నేర్చుకొన్నారు, ప్రార్థన యొక్క ఆవశ్యకత తెలుసుకున్నారు.

ప్రార్థన అంటే దేవునిపై ఆధారపడుట - "నేను అశక్తుడను, నీ శక్తి నాకు కావాలి" అని మనలను మనము రిక్తులుగా చేసుకొని ఆయన దగ్గరకు చేరుట. "అడుగుడి మీకియ్యబడును" (మత్తయి 7:7) అని యేసయ్య స్వయంగా చెప్పాడు. "దేవుని అడుగనందున మీకేమియు దొరకదు" (యాకోబు 4:2) అని యేసయ్య తమ్ముడైన యాకోబు చెప్పిన మాట. ప్రార్థన హృదయాంతరంగములో నుండి రావాలి. ప్రార్థన ద్వారా అడగాలి, వెదకాలి, తట్టాలి. అత్యాసక్తితో సంఘము ప్రార్థించినప్పుడు పేతురుకు చెరసాల ద్వారము తెరవబడింది. మనము మోకాళ్లూనినప్పుడు సాతాను

పరుగెత్తిపోతాడు. దేవుడంటే వాడికి భయము, దయ్యములు ఆయన ముందర వణుకుచున్నవని యాకోబు 2:19లో చెప్పబడిఉంది. ప్రార్థన ద్వారానే మనము అపవాదిని ఓడించగలము. ప్రార్థన యొక్క ప్రాముఖ్యత తెలుసుకున్న మనము ప్రార్థన చేయు విధానము కూడా ధ్యానించుకుందాము.

1పేతురు 4:7లో పేతురు – 'స్వస్థబుద్ధి గలవారై, ప్రార్థనలు చేయుటకు మెలకువగా ఉండుడి" అంటున్నాడు. స్వస్థబుద్ధి కలిగి యుండుట అంటే భావోద్రేకాలకు లోను గాకుండా, సరైన ఆలోచన కలిగి యుండుట, మొదటి శతాబ్దములో రెండవ రాకడ త్వరగా వస్తుందని ఆలోచనతో పనులు మానేసి ఎదురుచూచిన వారిలాగా ఉండక ప్రార్థన చేయుటకు మెలకువగా ఉండుడి అంటున్నాడు. పేతురుకు తన స్వంత అనుభవము జ్ఞాపకము వచ్చి ఉండవచ్చును. గెత్సెమనె తోటలో యేసయ్య "మెలకువగా వుండి ప్రార్థించుడి" అని చెప్పినప్పుడు మాట వినకపోవుట వలన యేసయ్యను విడిచి పారిపోయాడు. యేసయ్యను ఎరుగనని బొంకాడు. ఇటువంటివి మన జీవితాలలో జరుగకూడదని చెప్తున్నాడు.

ప్రార్థన చేయాలంటే, స్వస్థబుద్ధి గలవారై యుండి ప్రశాంతంగా ప్రార్థించాలి. భక్తి, నీతి, హృదయశుద్ధి కలిగినవారే సరిగా ప్రార్థించగలరు. సిద్ధాంతపరంగా దేవుని గురించిన విషయాలు ఎక్కువగా తెలిసిన వారు దేవునితో ఎక్కువగా సహవాసం చేయగలరు. స్వస్థబుద్ధి కలిగి యుండుట అంటే హృదయమును భద్రముగా కాపాడు కొనుట. యిర్మీయా ప్రవక్త చెప్పినట్లు హృదయము అన్నింటికంటే మోసకరమైనదే. కానీ సామెతలు 4:23లో చెప్పబడినట్లు మన హృదయములలో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటి కంటే ముఖ్యంగా మన హృదయమును భద్రముగా కాపాడుకోవాలి. దేవుని హృదయానుసారుడైన దావీదు చెప్పిన మాటలు, చేసిన ప్రార్థనలు కొన్ని జ్ఞాపకము చేసుకుంటే దావీదు దేవుని హృదయానుసారుడెందుకైనాడో మనకు అర్థమవుతుంది. "యెహోవా, నేను యథార్థ హృదయుడనై ప్రవర్తించు చున్నాను... నన్ను పరిశీలించుము, నన్ను పరీక్షించుము, నా అంతరంద్రియ ములను, నా హృదయమును పరిశోధించుము" (కీర్తన 26:1,2), "నేను రహస్యముగా చేసిన తప్పులు క్షమించి నన్ను నిర్దోషిగా తీర్చుము" (కీర్తన 19:12) అని మోషే అంటున్నాడు. ఆయన వెలుగు మనకు వచ్చినప్పుడు, ఆ వెలుగులో మన పాపములు తెలుస్తాయి.

కనుక మనలను మనము సరిదిద్దుకోవాలి. దావీదు తాను యథార్థ వంతునిగా ఇహలోక ప్రజలకు కనబడుచున్నాడు. కానీ, తన రహస్య పాపములను తీసివేయమని కోరుతున్నాడు. తన హృదయమును పరిశోధించి అందులో ఉన్న పాపములను తీసివేయమని అడుగుతున్నాడు. హృదయాంతరంగాలు పరిశోధించే దేవునికి మన రహస్య పాపములన్నీ తెలుసు కాబట్టి మనము కూడా ఇలాంటి ప్రార్థన చేయాలి. హృదయశుద్ధి లేకుండా చేసిన ప్రార్థన దేవుని సన్నిధికి పోదు. మన పాపము మనకు దేవునికి మధ్య అడ్డుగోడగా నిలుస్తుంది.

ఆది సంఘములోని విశ్వాసులు ప్రార్థన యొక్క ప్రాధాన్యత తెలుసుకున్నందున "ప్రార్థన చేయుట యందు ఎడతెగక ఉండిరి" (అపొ.కా. 2:42). మన పక్షమున మనలో ఉన్న పరిశుద్ధాత్ముడు ప్రార్థిస్తాడని పౌలు రోమా పత్రిక 8:26లో అంటున్నాడు. ప్రార్థన చేసినప్పుడు పాపం మన మనసులో ఉంటే ప్రార్థన ఆగిపోతుంది. 2దిన. 26:5లో రాజైన ఉజ్జీయాను గురించి చెప్తూ "అతడు యెహోవాను ఆశ్రయించినంత కాలము దేవుడు అతని వర్ధిల్లచేసెను" అని వ్రాయబడి యున్నది. దేవుని ఆశ్రయించుట అంటే ప్రార్థించుట. యిర్మీయా 33:3లో మొరపెడితే చాలు, ఉత్తరమిచ్చెదను అని దేవుడు వాగ్దానమిస్తున్నాడు.

కీర్తన 145:18లో "తనకు నిజముగా మొరపెట్టు వారికందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు" అని చెప్పబడి ఉంది. ఇది నమ్మాలి అప్పుడే మనము ప్రార్థనా శక్తిని పొందగలము. అపవాది గర్జించు సింహమువలె ఎవనిని మ్రింగుదునా అని మన చుట్టూ తిరుగుచున్నప్పుడు ప్రార్థన అనే కంచె మన చుట్టూ వేసుకోవాలి. ప్రతి విశ్వాసికి, ప్రతి దేవుని బిడ్డకు, ప్రతి ప్రవక్తకు, ప్రతి అభిషిక్తునికి ఈ లోకములో ఉన్న శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములు అధిగమించాలంటే ప్రార్థన చాలా అవసరము. ప్రతి విశ్వాసి వెన్నెముకలాంటి ప్రార్థనను మరచిపోకుండా, ఊపిరి పీల్చకపోతే చనిపోవునట్లు, ప్రార్థన లేకుంటే ఆత్మీయంగా చనిపోతామనే సత్యములో ముందుకు సాగుటకు దేవుడు మనకు సహాయపడును గాక. ఆమేన్.

❖ ❖ ❖

# 36. దేవుని అద్వితీయ ప్రణాళిక మానవుని పోరాటము

దేవుని అద్వితీయ ప్రణాళికలో ఉన్నామని తెలిసి, ఆ ప్రణాళిక దేవుని చిత్త ప్రకారము, దేవుని సహాయంతోనే జరుగుతుందని తెలిసికూడా కొందరు తమ స్వంత ఆలోచనలతో దేవునికి సహాయపడుతున్నామను భ్రమతో జీవిత పోరాటము సాగిస్తూ మోసపోతున్నారు.

మనమాయన ప్రణాళికలో ఉన్నప్పుడు యిర్మీయా ప్రవక్త ద్వారా దేవుడు చెప్పిన మాటలు గుర్తు చేసుకోవాలి. యిర్మీయా 6:16 చదువుకొని ధ్యానించుకుందాము. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు – మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలు కలుగుమార్గమేది అని అడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును. అయితే వారు – మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు". ఇందులోని నాలుగు అంశాలు చూద్దాము.

**1.** ఆయన మార్గములలో నిలవాలి, ఆయన మార్గంలోనే వెళుతున్నాము కదా అనుకుంటూ ముందుకు పోతున్నప్పుడు కాస్త నిలవండి అని దేవుడంటున్నాడు.

**2.** నిలిచి ఏమి చేయాలి? చూడాలి. మనము సరైన మార్గములోనే వెళుతున్నామా లేక ఎక్కడైనా పొరపాటుగా తప్పు మార్గములో పోతున్నామా అని మనలను మనము పరీక్షించుకోవాలి. ఈ పని చాలా ప్రాముఖ్యమైనది.

**3.** పురాతన మార్గములను గురించి విచారించాలి – దేవుడు మనకు నేర్పించిన పునాది సత్యాలను గుర్తు చేసుకొని అది పాటిస్తున్నామా లేదా అని తెలుసుకోవాలి. ఉదాహరణకు "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అనునది పునాది సత్యము. మనము ఆ విధంగా జీవిస్తున్నామా లేదా అని చూచుకోవాలి. మన పితరులకు, మనము దేవుడు చేసిన మేళ్ళను గుర్తు చేసుకొని కృతజ్ఞతా పూర్వకంగా జీవిస్తున్నామా లేదా అని పరీక్షించుకోవాలి.

**4.** మేలు కలుగు మార్గమేదని అడిగి తెసుకోవాలి. అందులో నడుచుకోవాలి. చాలామందికి ఈ పని చాలా కష్టమైనదిగా ఉంటుంది. ఎందుకంటే ఇతరులను అడగాలంటే మనలను మనము తగ్గించుకోవలసి వస్తుంది. మనకు అంతా తెలుసు అనుకునేవారు అహమును ప్రక్కనపెట్టి అడగాలి. ఈ విధముగా చేస్తే నెమ్మది కలుగుతుందని కూడా దేవుడు చెప్పాడు. అయితే అవిధేయత వలన తన జనులు ఈ విధంగా చేయడములేదని దేవుడు బాధపడుతున్నాడు.

బైబిలులో ఈ వాక్యము అర్థము చేసుకొనుటకు సరైన ఉదాహరణ – యాకోబు జీవితంలో చూడవచ్చు. యాకోబు జీవితంలో తన ప్రణాళిక ఏమై ఉన్నదో దేవుడు అతని తల్లి అయిన రిబ్కాకు చెప్పి ఉన్నాడు. "రెండు జనములు నీ గర్భములో కలవు. రెండు జనపదములు నీ కడుపులో నుండి ప్రత్యేకముగా వచ్చును. ఒక జనపదము కంటే ఒక జనపదము బలిష్ఠమై యుండును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అనెను" (ఆది 25:23). దేవుని ప్రణాళిక, ఆయన చేసిన వాగ్దానము రిబ్కాకు తెలుసు కాబట్టి ఆమె చింతించాల్సిన అవసరమే లేదు. కాని రిబ్కా తన ప్రయత్నము తాను చేసింది. అందుకే కుమారుని అబద్ధీకునిగా, మోసకారిగా తయారు చేసింది. "యాకోబు" అను పేరుకు అర్థము "మోసకారి". ఈ పేరుకు తగ్గట్టుగా అతను చేసేటట్లు ప్రోత్సహించింది. తండ్రిని మోసం చేసి అన్న ఏశావుకు రావలసిన దీవెనలు సంగ్రహించి, అన్న చంపుతాడేమోనను భయంతో ఇంటి నుండి పారిపోయే సమయంలో దేవుని ప్రత్యక్షత లభిస్తుంది.

ఆది. 28:10-12లో మనకు కనబడు బేతేలు అనుభవము యాకోబు జీవితంలో చాలా ప్రాముఖ్యమైనది. 13 నుండి 15 వరకు ఉన్న వచనాలలో దేవుడు ఈ విధంగా యాకోబుకు చెప్తున్నాడు. "నేను నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడైన యెహోవాను,.....భూమి యొక్క వంశములన్నియు నీ మూలము గాను, నీ సంతానము మూలముగా ఆశీర్వదింపబడును. ఇదిగో, నేను నీకు తోడై యుండి, నీవు వెళ్లు ప్రతి స్థలమందును నిన్ను కాపాడుచు ఈ దేశమునకు నిన్ను మరల రప్పించెదను". ఇంత ఖచ్చితంగా దేవుడు చెప్పినను యాకోబు తన ప్రయత్నము తాను చేస్తూ నెమ్మది లేక జీవించాడు.

అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులను ముఖ్యమైన మూల పితరులు అంటారు. ఇశ్రాయేలీయులు మొర్రపెట్టిన ప్రతిసారి "దేవుడు వారి మూలుగును విని, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను"

(నిర్గమ. 2:24) అని వ్రాయబడి ఉంది. ఆదికాండము. 12వ అధ్యాయములో దేవుడు అబ్రాహామును మూల పురుషునిగా ఎన్నుకొని అతనిని ఆశీర్వదించి, ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండుటకు ప్రణాళిక ఏర్పరచి, అతనితో నిత్యనిబంధన చేసుకున్నాడు. ఆ తర్వాత అతని కుమారుడైన ఇస్సాకుతో, ఇస్సాకు కుమారుడైన యాకోబుతోను ఆ నిబంధన స్థిరపరచుకున్నాడు. ప్రణాళికలో భాగంగా దేవుడు యాకోబును తన చిత్తప్రకారము తీర్చిదిద్ది 'ఇశ్రాయేలు'గా మార్చి, అతని ద్వారా ఒక జనాంగము వచ్చేట్లుగా ఏర్పరచాడు. ఈ క్రమములో జరిగిన ఒక అనుభవము – యాకోబు పొందిన దేవుని ప్రత్యక్షత.

రిబ్కాకు దేవుడు తెలిపిన ప్రణాళికను తప్పక ఆమె యాకోబుకు చెప్పి ఉంటుంది. అయినా తల్లి కుమారులిరువురూ నిలబడి దేవుని చిత్తము నెరవేరుటకు ఎదురు చూడలేదు. అందుకే వారి జీవితాలలో నెమ్మది లేదు. రిబ్కాకే కాక యాకోబుకు కూడా దేవుడు తన ప్రణాళిక తెలిపాడు. అయినను మామ ఇంటిలో 21 సంవత్సరములు భయముతో జీవించాడు. మామ కన్ను కప్పి భార్యలను, పిల్లలను, పశువుల మందను తీసికొని పారిపోయాడు. తన దేశానికి తిరిగి వెళ్లాలంటే అన్న ఏమంటాడో అను భయము అతనికి ఉంది, ఈ భయాలన్నిటి నుండి విడుదల ఆదికాండము 32వ అధ్యాయములోని పెనూయేలు అనుభవములో కలిగింది. ఎప్పుడైతే యబ్బోకు రేవు దగ్గర తన వారినందరినీ దాటించి తానొక్కడే దేవుని సన్నిధిలో నిలబడి దేవునితో సంధించి, దీవెనల కొరకు పెనుగులాడాడో అప్పుడే అతనికి నెమ్మది వచ్చింది.

ఈ పెనుగులాటలో యాకోబు దెబ్బతిన్నాడు, తొడగూడు సడలి కుంటుతూ నడిచాడు. "అతడు పెనూయేలునుండి సాగిపోయినపుడు సూర్యోదయమాయెను" అని వ్రాయబడి ఉంది. ఇన్నాళ్ళుగా భయము, దిగులు అను నీడలో ఉన్న యాకోబు నెమ్మదిలేక జీవించాడు గాని ఇప్పుడు తన జీవితంలో నెమ్మది, వెలుగు వచ్చింది.

యాకోబు దేవుని ప్రణాళికలో ఉన్నందున "నేను యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని" (రోమా 9:13) అని దేవుడు స్వయంగా చెప్పాడు. ఈ మాట విన్నప్పుడు 'ఇదేం న్యాయం' అనిపిస్తుంది. కాని వేయి సంవత్సరముల తర్వాత దేవుడు దానికి సమాధానమిచ్చాడు. ఆమోసు 1:11,12లోను, ఓబద్యా 1:10లోను, మలాకీ 1:14లోను వ్రాయబడిన మాటలు చదివితే భవిష్యత్తులో ఏశావు సంతానము (ఎదోమీయులు), యాకోబు సంతానాన్ని (ఇశ్రాయేలీయులు) శ్రమపెట్టి దేవునికి

విరోధముగా ప్రవర్తిస్తారు. కాబట్టి దేవుడు ఆ విధంగా చెప్పినట్లు గమనించగలము. తన ప్రణాళికలో ఉన్న వారికి వ్యతిరేకంగా చేస్తే, తనకు విరోధంగా చేసినట్లే అని దేవుడు పరిగణిస్తాడు. సార్వభౌముడైన దేవుడు మనము తల్లి గర్భములో రూపించబడక ముందే మన భవిష్యత్తు నిర్ణయించాడు. తాను ఎన్నుకున్న వారిని ఎన్నడును వదలడు.

యాకోబు జీవితములో అడుగడుగునా దేవుడు జోక్యము చేసుకున్నాడు. మనము దేవుని ప్రణాళికలో ఉంటే ఆయన అడుగడుగునా మనలను నియంత్రిస్తూ ఉంటాడు. యాకోబు తన తల్లి గర్భములో ఉన్నప్పుడే ఆమెకు చేసిన వాగ్దాన నెరవేర్పు కొరకు దేవుడు యాకోబును అడుగడుగునా తన చిత్త ప్రకారము మలచుకున్నాడు. వాగ్దానము చేసిన దేవుడు నమ్మదగినవాడని గుర్తుంచుకోవాలి.

ఎన్నో ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చాడు. మేనమామ అయిన లాబాను యొద్ద భార్యల కొరకు, పశువుల కొరకు 21 సంవత్సరములు సేవ చేసి అతనికి తెలియకుండా వారందరినీ తీసుకొని పారిపోతున్నప్పుడు లాబాను కోపంతో యాకోబును చంపాలని వెంబడించినపుడు దేవుడు యాకోబుకు ఆపద కలుగకుండా ఆపాడు. తరువాత తాను మోసం చేసిన అన్నను ఎదుర్కొనబోక ముందు దేవుని సాయం కోరుచున్నప్పుడు దేవుడతనిని బహుగా దీవించి, జనములకు తండ్రిగా, 'ఇశ్రాయేలు'గా చేశాడు.

అబద్ధికుడు ఆరాధకునిగా మారి చివరి వరకూ ఆరాధించువానిగా ఉన్నాడు. హెబ్రీ 11:21లో "విశ్వాసమును బట్టి యాకోబు అవసానకాలమందు యోసేపు కుమారులతో ఒక్కొక్కనిని ఆశీర్వదించి తన చేతి కర్ర మొదలు మీద ఆనుకొని దేవునికి నమస్కారము చేసెను" అని వ్రాయబడి ఉంది. 21 సంవత్సరాల తర్వాత ఏశావును కలుసుకోబోతున్నందున, అన్న ఏ విధంగా స్పందిస్తాడో తెలియక భయపడుతున్నాడు. దేవుడు చెప్పినట్లు చేయనందున ఈ పరిస్థితి ఏర్పడింది. కాని ఇప్పుడు దేవునితో ఒంటరిగా ఉండుటకు నిర్ణయించుకొని తన కుటుంబీకులనందరినీ యబ్బోకు రేవు దాటించి తానొక్కడే నిలిచిపోయాడు. ఈ సందర్భములో తన మార్గము తెలుసుకొని దేవుడతని మార్గములో నడవతలచాడు. అందుకే దేవుడు నెమ్మదినిచ్చాడు.

యాకోబు జీవితము ద్వారా మనము సరైన మార్గము నేర్చుకొని, దీవెనలు పొందుదాము. ఆమేన్!!

❖ ❖ ❖

# 37. క్రిస్మస్ నక్షత్రము

దేవుడు మనకు వరముగా అనుగ్రహించిన తన కుమారుని గుణలక్షణములు కొన్నింటిని ధ్యానించుకుందాము.

యెషయా ప్రవక్త ప్రవచించిన రక్షకుని లక్షణములు కొన్ని యెషయా 9:6లో కనబడుతాయి : "ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును".

క్రిస్మస్ అలంకరణలన్నింటిలో ప్రధానంగా కనపడు క్రిస్మస్ నక్షత్రాలను మనము చూస్తే, దానికి అయిదు మూలలున్నట్లు గమనించగలము. నక్షత్రములోని అయిదు మూలలు, యెషయా ప్రవక్త చెప్పిన అయిదు లక్షణాలను సూచిస్తాయని కొందరు విశ్లేషకులు అంటారు. ఎందుకంటే సంఖ్యాకాండము 24:17లో బిలాము ప్రవక్తకు వచ్చిన దేవోక్తి – "నక్షత్రము యాకోబులో ఉదయించును" – క్రీ.పూ. 1300 సం॥రాల ముందే బిలాము ద్వారా ఇవ్వబడిన ప్రవచనమది. యాకోబు సంతానము నుండి నక్షత్రము వస్తుందనే ప్రవచనము యొక్క నెరవేర్పే యేసుక్రీస్తు జననము. జ్ఞానులను నడిపించిన ఆకాశ నక్షత్రము కాక దేవుడు బిలాము ద్వారా చెప్పిన ఈ నక్షత్రమును జ్ఞాపకము చేసుకొని, దాని ఐదు కోణముల లాగా యెషయా ప్రవక్త వివరించిన శిశువుకు ఉన్న 5 లక్షణాలను గురించి తెలుసుకుందాము.

## 1. ఆశ్చర్యకరుడు :

మన రక్షకునిగా రాబోయే ఈ శిశువు ఈ లోకములో ఆశ్చర్యక్రియలు చేస్తాడని చెప్పబడి ఉంది, ఇక్కడ వాడబడిన పదమే ఆది18:14లో దేవుడే వాడాడు. అబ్రాహాముతో తరువాత సంవత్సరం అదే సమయానికి కుమారుడు కలుగుతాడని దేవుడు చెప్పినప్పుడు 90 సం॥ల శారా తనలో తాను నవ్వుకుంది. అప్పుడు దేవుడు: "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనాఉన్నదా?" అన్నాడు. యెషయా 28:29లో "ఆశ్చర్యమైన ఆలోచన శక్తియు, అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే".

ఈ పాఠ్య భాగాలన్నీ అర్థము చేసుకుంటే ఈ బాలుడు ఆశ్చర్యకరుడు అను సంగతి అర్థమవుతుంది. ఆ ఆశ్చర్యకరునిలోని కొన్ని ఆశ్చర్యాలు చూద్దాము.

**ఎ.** తండ్రియైన దేవునితో ఉన్న నిత్య సంబంధము ఆశ్చర్యకరము. తండ్రితోను, పరిశుద్ధాత్మ దేవునితోను కలిసి ఆది, అంతము లేనివాడు కాబట్టి ఆశ్చర్యకరుడు.

**బి.** బాప్తిస్మమిచ్చు యోహాను యోహాను 1:32లో "ఆత్మ పావురము వలె ఆకాశము నుండి దిగివచ్చుట చూచితిని, ఆ ఆత్మ ఆయన మీద నిలిచెను" అని చెప్పిన సాక్ష్యము ఆయన ఆశ్చర్యకరుడని నిరూపిస్తుంది.

**సి.** మానవులతో ఆయన ప్రవర్తించిన తీరు, ఏ యోగ్యత లేని పాపులపై ఆయన చూపిన ప్రేమ ఆశ్చర్యకరము.

**డి.** ఆయన ఈ లోకంలో జీవించిన విధానము – అవిశ్వాసులు కూడా మెచ్చుకొనే రీతిలో ఉండుట; మరణము, సమాధిపై విజయము సాధించుట; జనులు చూస్తుండగా పరలోకమునకు ఆరోహణమగుట; పౌలుకు, స్తెఫనుకు కనపరచు కొనుట – ఇవన్నీ ఆశ్చర్యకరము.

**ఇ.** యేసుప్రభువు తన జన్మను బట్టి ఆశ్చర్యకరుడు : ఆయన జన్మ, స్వభావము, జీవితము ఆశ్చర్యకరము. ఆయన జన్మలాంటిది ఇంకెక్కడా, ఎప్పుడూ జరగలేదు. జరగబోదు కూడా. సంపూర్ణ మానవత్వము, సంపూర్ణ దైవత్వము కలిగినవాడు. పరలోకపు మహిమతో, ప్రభావముతో రాజభవనాలలో పుట్టాల్సినవాడు పశువుల పాకలో పుట్టాడు. నక్షత్రమును గూర్చిన కాలమును జ్ఞానుల ద్వారా తెలుసుకొని హేరోదు రక్షకుడైన యేసును బాల్యములోనే చంపచూశాడు. అతడు చంపిన పసిపిల్లలు మొదటి హతసాక్షులు.

ఆయనలో మోషేకంటే గొప్ప యాజకుణ్ణి, దావీదు కంటే గొప్ప రాజును, యెహోషువ కంటే గొప్ప సైన్యాధిపతిని, సొలొమోను కంటే గొప్ప జ్ఞానిని, ఏలీయా కంటే గొప్ప ప్రవక్తను చూడగలము. అలెగ్జాండరు ది గ్రేట్ అనియు, సీజర్ ది గ్రేట్ అనియు గొప్ప చక్రవర్తులను పిలుస్తుంటారు. కాని ఒకే ఒక్క గొప్పవాడున్నాడు. ఆయనే ది గ్రేట్ జీసస్.

**ఎఫ్.** ఆశ్చర్యమైన స్వభావము : ఆయన స్వభావము యొక్క పరిపూర్ణతకు ఎవరూ చేరుకోలేరు. మారుమూల ప్రాంతము నుండి వచ్చిన ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి

నొందడము ఆశ్చర్యకరము. పాలస్తీనా దేశమును చూచిన ఒక వ్యక్తిని "అక్కడ నీకు నచ్చిందేమిటి" అని అడిగితే "నజరేతు, ఎందుకంటే యేసయ్య దైవత్వాన్ని సిలువ ద్వారా ఆయనను లోకానికి అందించిన వాళ్లు వారే" అన్నాడు. పాపరహితమైన, ప్రయోజనకరమైన, నిస్వార్థమైన ఆయన జీవితం ఆశ్చర్యం. శత్రువులకు కూడా ఆయనలో ఏ పాపము కనబడలేదు. రాళ్లను రొట్టెలుగా మార్చే శక్తి ఉన్నను, 40 రోజులు ఉపవాసమున్నాడు.

**జి.** క్రీస్తు ఆశ్చర్యకరమైన మరణ పునరుత్థానములు : ఆయన చంపబడిన సమయం

- ❖ పస్కా పండుగ సందర్భంగా వేలాది మంది వచ్చి ఉండగా, వారి మధ్య సిలువ వేయబడ్డాడు. ఆయన మరణించినప్పుడు జరిగిన సంఘటనలు ఆశ్చర్యకరము.
- ❖ దేశమంతా పగలే కటిక చీకటి, భూకంపము, సమాధులు తెరవబడుట, నిద్రించిన పరిశుద్ధులు లేచుట, వారు కొందరికి కనపడుట, దేవాలయపు తెర చిరుగుట – ఇవన్నీ ఆశ్చర్యకరమైనవి.

ఆయన పునరుత్థానము ఆశ్చర్యమైనది. ఆ దృశ్యాన్ని ఏ మానవుడూ ఊహించలేదు – భూకంపం, ఉరుములు, గందరగోళ పరిస్థితి ఉండి ఉండవచ్చు అనుకుంటారు. కాని అక్కడ ఒక పువ్వు తన రేకలను విప్పినంత త్వరగా, ఒక దేవదూత ఆ సమాధిపై రాయి తొలగించాడు. లోపల సమాధి బట్టలు చుట్టు పెట్టి ఉన్నాయి. ఆయన లేడు. తర్వాత 40 రోజులు ఆయన అందరికీ కనపడి ఆరోహణమగుట ఆశ్చర్యకరము.

## 2. ఆలోచనకర్త :

క్రీస్తును సామెతల గ్రంథములోని 'జ్ఞానము'గా పరిగణించవచ్చును. ఆదికాలము నాటి సంఘ పెద్దలు జ్ఞాన గ్రంథములోని 'జ్ఞానము' అనే పదము దగ్గర 'యేసు' అను పదము సరిపోతుందనే వారు. ఆయన జ్ఞానమునకు కర్త. సామెతలు 8:14 "ఆలోచన చెప్పుటయు, లెస్సయైన జ్ఞానము నిచ్చుటకు నా వశము, జ్ఞానాధారము నేనే".

యోహాను 1:9లో "నిజమైన వెలుగు ఉండెను, అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది". ఆయన ఆలోచన చెప్పువాడు, వాక్యము ద్వారా వెలిగించువాడు. "సామాన్య ప్రజలు ఆయన మాటలు సంతోషముగా వినిరి". అందరికీ అర్థమయ్యే పదజాలాన్ని, ఉపమానములను చెప్పాడు. ఆయన బోధలు, బోధించిన విధానము ఆశ్చర్యకరము. తాను మోషే కంటే గొప్పవాడినని చెప్పి పరిసయ్యులను సవాలు చేశాడు.

ఆయన తన బోధలు వ్రాయలేదు, పుస్తకాలు ముద్రించలేదు. కొంతమంది సామాన్యులకు (శిష్యులకు) అప్పగించారు. అయినా 2000 సం॥ల తర్వాత కూడా నిలిచియున్నాయి. భూదింగతములకు వ్యాపించాయి. కృంగిపోయిన వ్యక్తులను, దేశాలను లేవనెత్తాయి. పాపమనే అరణ్యాన్ని వికసించే పరదైసులా మార్చాయి.

యేసు బోధించనారంభించినప్పుడు రోమీయులు ప్రపంచాన్ని పరిపాలించారు. రోమా ప్రభుత్వ శక్తి, దాని సైన్యం, దాని మతాలు గతించాయి. కాని క్రీస్తు బోధలు నిలిచి ఉన్నాయి. ఆయనను గూర్చి "ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవరును ఎన్నడును మాట్లాడలేదు" అని చెప్పబడింది. ఆయన బోధనలను గూర్చిన పుస్తకాలతో గ్రంథాలయాలు నిండిపోయాయి. చిన్న పిల్లలు ఆయన పాదాల దగ్గర మోకరించారు, యౌవనులు వెంబడించారు. స్త్రీలు ఆయనను అభిషేకించారు.

### 3. బలవంతుడగు దేవుడు :

ఎలోహీము = 'సర్వసృష్టికర్త', ఆయన నామములలో ఒకటి. సృష్టినంతా తన ఆధీనంలో ఉంచుకొనే సర్వాధికారి. సార్వభౌముడు. ఈ మాట యెషయా 10:21లో దేవునికి వాడబడిన నామము ఇశ్రాయేలీయుల శేషము బలవంతుడగు దేవుని వైపు తిరుగును అనుమాట వ్రాయబడి ఉంది. దేవుని శక్తి, దైవత్వము ఈ నామములో ఇమిడి ఉన్నది. ఆ మాట శక్తిగల యుద్ధశూరునికి వాడబడింది. దేవుని కుమారుడైన యేసయ్య తానే దేవుడై యున్నాడు. మరి దేవుడైతే ఖచ్చితంగా బలవంతుడే, సార్వభౌముడే. మెస్సయ్య చేయగలిగిన పనులు దేవుడు మాత్రమే చేయగలడు. మానవాళిని విమోచించుట మరణాన్ని పాపాన్ని అణగద్రొక్కుట, సాతానుపై విజయం సాధించుట ఒక గొప్ప బలిగా తనను తాను అప్పగించు కొనుట లాంటివి చేయగలగాలి. "ఇమ్మానుయేలు" (దేవుడు మనతో ఉన్నాడు) అను పేరు ఆయనకు ఇవ్వబడింది. ఇప్పుడు ఆయన "బలవంతుడగు దేవుడు" యెషయా అంతటి గొప్ప ప్రవక్త ఒక సాధారణమైన మనిషికి అంత గొప్ప నామములు ఇవ్వడు. ఆయన కూడా దావీదులాగా దేవుని గొప్పతనము కనుగొన్నాడు. కీర్తన. 14:6 : "యెహోవా ఆశ్రయమై ఉన్నాడు" అని దావీదు అన్నాడు. యిర్మీయా ప్రవక్త కూడా దేవుని గొప్పతనము కనుగొన్నాడు.

ఈ ప్రవక్తలకు త్రిత్వ సిద్ధాంతము అర్థము కాకపోయి ఉండవచ్చు కాని దేవుడు నరరూప ధారియై వస్తున్నాడని తెలుసు. ఆయన దైవత్వాన్ని చూపెట్టుటకు యెషయా ఈ నామాలు వాడి ఆయనలో ఉన్న దైవ లక్షణాలు తెలుపుతున్నాడు.

**4. నిత్యుడగు తండ్రి :**

కుమారుడైన మెస్సయ్యను 'తండ్రి' అని ఎందుకు పిలుస్తున్నాడంటే హెబ్రీ భాషలో ఆ పదానికి అర్థము 'రక్షించువాడు'. యోబు 29:16లో యోబు పేదలకు 'తండ్రి' అని చెప్పబడి ఉంది. ఇంకా ఈ పదానికి 'సృష్టికర్త' అని కూడా అర్థముంది. ఆయనను మనము ప్రేమించి, గౌరవించి, విధేయత చూపబద్ధులమై ఉన్నాము.

త్రిత్వములో రెండవవాడైన మెస్సయ్య మనలను సృష్టించువాడు, భద్రపరచు వాడు. 'నిత్యుడగు తండ్రి' అని చెప్పుటలో ఆయన నిత్యత్వాన్ని చూపెడుతున్నాడు. ఆయన మనలనెన్నడు విడువడు, ఎడబాయడు (ద్వితీ 31:6). యెష 63:16 'మాకు తండ్రివి నీవే... యెహోవా, నీవే మా తండ్రివి'. "అల్ఫాయు ఓమేగయు నేనే" (ప్రక.1:8) అని ఆయనే స్వయంగా చెప్పాడు. "నిరంతరము జీవించుచున్నాడు" (హెబ్రీ 7:25).

**5. సమాధాన అధిపతి :**

ప్రపంచానికి సమాధానము తెచ్చే సమాధానపు రాజు ఆయన. పాపము లోకంలో ఉన్నంత కాలము మంచి, చెడుల మధ్య పోరాటముంటుంది. "మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము" అని రోమా 5:1లో చెప్పబడిఉంది. దానియేలు 9:24లో 'నీతి నిచ్చువాడు ఆయనే' అని వ్రాయబడి ఉంది. సార్వత్రిక నీతి ఉన్నప్పుడు సర్వత్రా సమాధానముంటుంది. అయితే అది 1000 సం॥రాల పాలనలో వస్తుంది. కాని ఇప్పుడు ఆయన ఇచ్చే సమాధానము ఆయనను ప్రేమించే హృదయాలలో, సంఘ సహవాసంలో, సమాధానము కావాలని కోరుకునే క్రైస్తవ దేశాలలో ఉంటుంది.

దేవుడు యెషయా ప్రవక్త ద్వారా తెలియపరచిన ఈ నామాల ద్వారా మనము ఆయన గొప్ప తనము, జ్ఞానము, భద్రత, సమాధానము అర్థము చేసుకొని, ఈ నామాలలో భూత, వర్తమాన, భవిష్యత్తులను చూడగలము. యేసయ్య గొప్పతనము తెలుసుకొనుట ద్వారా ఆయన పట్ల మన గౌరవము, ప్రేమ విశ్వాసము బలపడతాయి.

ఇంత గొప్ప దేవుని ఒక శిశువుగా, రక్షకునిగా, వరముగా ఏ యోగ్యత లేని మనకు ఇచ్చినందుకు ఆ దేవదేవునికి వందనాలు చెప్పి క్రిస్మస్ సందర్భముగా ఈ శుభవార్తను ప్రకటిద్దామా! దేవుడు మనకు తోడై ఉండును గాక! ఆమేన్!

❖ ❖ ❖

# 38. దేవుడు మానవుడైన రోజు

దేవుడు మానవుడై ఈ లోకానికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగ ఆచరించుకుంటున్నాము. యేసుప్రభువు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చుటకు కొన్ని కారణములు ధ్యానించుకుందాము.

బైబిలులోని హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 2:9-18 వరకు ఉన్న వాక్య భాగములో దేవుడు 8 కారణాలు చూపించాడు. ఒక్కొక్కటిగా వాటిని పరిశీలిద్దాము:

**1. ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించుటకు ఆయన వచ్చాడు (హెబ్రీ 2:9) :** "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23), కాబట్టి ప్రతి మనుష్యుడు మరణము పొందవలసినదే. ఇక్కడ చెప్పబడిన మరణము శారీరకమైనది కాదు గాని ఆత్మీయ మరణము. ఈ రెండవ మరణము ప్రతివానిని దేవునికి దూరపరచి నరకానికి తీసికొని వెళ్తుంది. దేవునితో సమాధానపడి, ఆయనకు దగ్గరవ్వాలంటే శిక్ష అనుభవించాల్సిందే. ఈ విధముగా శిక్ష అనుభవిస్తే పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వెళ్ళుటకు ఎవరూ మిగలరు కాబట్టి యేసయ్య సమస్త మానవాళి పాపము తాను మోసి, ఏ పాపము ఎరుగని ఆయన పాపముగా చేయబడి మనకు బదులుగా సిలువలో మరణము పొందాడు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు దేవదూతలందరికి కంటే ఉన్నతుడైనను, కొద్ది కాలము ఆయనను "దేవదూతల కంటే కొంచెము తక్కువ వానిగ" దేవుడు చేశాడు. క్రీస్తు శ్రమ పొంది మరణించడము వలన మహిమ, ఘనత పొందుకున్నాడు. ఫిలిప్పీ 2:8,9 వచనములలో "ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను". అందుకొరకు ఆయన నామము అన్ని నామములకంటే పై నామముగా చేయబడెను.

యేసుప్రభువు ఈ లోకములోనికి మానవ రూపంలో రావడము అనునది సృష్టి ఆరంభములోనే దేవుని ప్రణాళికలో ఉన్నది. ఆయన తనంతట తానే,

స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకముగా తన్నుతాను మరణానికి అప్పగించుకున్నాడు. మానవాళి కొరకు ఒక బలి పశువుగా వచ్చాడు.

**2. శ్రమల ద్వారా రక్షణ కర్తను దేవుడు సంపూర్ణునిగా చేశాడు (హెబ్రీ 2-10) :** రక్షణ కర్త అయిన యేసు తన శ్రమల ద్వారా మనకు రక్షణ తెచ్చాడు. అనేకమంది విశ్వాసులకు రక్షణ తెచ్చి దేవుని కుమారులనుగా చేశాడు, రక్షణ మార్గం చూపించాడు. ఈ విషయము అర్థము చేసికొనుటకు ఒక దృష్టాంతము చూద్దాము. ఒక నావ తుఫానులో చిక్కుకొని కొండల మధ్య ఇరుక్కొని ఉన్న దృశ్యం చిత్రీకరించుకొండి. స్వచ్ఛందంగా ఒక మనిషి ఆ నావనుండి నీటిలోకి దిగి, ఒక తాడు నావకు కట్టి ఇంకొక కొనను గట్టుకు తీసికెళ్లి అక్కడ గట్టిగా కడితే, మిగిలిన వారు ఆ తాడు పట్టుకొని సురక్షితంగా ఒడ్డు చేరుకుంటారు. యేసుప్రభువే ఆ స్వచ్ఛందంగా సేవ చేసిన మనిషి. ఆత్మీయంగా మరణావస్థలో నున్న మనలను పరలోకం చేర్చుటకు భయంకరమైన మరణమనే నీటిద్వారా ఈదుకొని వెళ్లాడు.

ఈ కార్యము ఆయనను సంపూర్ణునిగా ఎలా చేయగలదు? ఆయన అంతకు ముందు అన్ని విధములుగా సంపూర్ణుడు - మానసికంగా, ఆత్మీయంగా. యేసును రక్షణకార్యము కొరకు దేవుడు సిద్ధపరచవలసి వచ్చింది. ఒక యంత్రము బాగు చేయాలంటే దానికి అవసరమైన పరికరాలన్నీ ఉండాలి. శ్రమపడకుండా ఆయన మానవులను రక్షించలేడు కాబట్టి ఆయన శ్రమలగుండా పోవలసి వచ్చింది.

**3. దేవుని, మానవుని ఒక కుటుంబముగా చేయుటకు ఆయన వచ్చాడు (హెబ్రీ 2:11-13) :** తన మరణ, శ్రమల ద్వారా దేవునితో మనలను కలిపాడు. యోహాను 1:12లో విశ్వసించిన వారికి "దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" అని వ్రాయబడి ఉన్నది. దేవుడు మనలను పరిశుద్ధ పరచుట ద్వారా క్రీస్తుకు సహోదరులమై ఒకే కుటుంబ సభ్యులమవుతాము. అందుకే యేసు మనలను సోదరులని పిలవడానికి సిగ్గుపడడు. విశ్వాసులమైన మనమందరము దేవుని పిల్లలము. లూకా 8:21లో యేసయ్య స్వయంగా చెప్పిన మాటలు : "దేవుని వాక్యము విని, దాని ప్రకారము జరిగించు వీరే నా తల్లి, నా సహోదరులు" ఈ మాట ధృఢపరచుటకు హెబ్రీ పత్రికా రచయిత కొన్ని పాత నిబంధన వాక్యభాగములు వాడుకున్నాడు. యేసుప్రభువు జననము గురించి పాతనిబంధనలో ప్రవక్తలు ప్రవచించారు. అయినా యూదులు నమ్మలేదు.

**4. మరణ బలము గల అపవాదిని నశింజేయుటకు (హెబ్రీ 2:14) :** ఏదేను వనములో ఈ విషయము మొదటిగా ప్రస్తావించబడినది (ఆది 3:15). దేవుడు

ఆదాము, హవ్వలను సృష్టించి ఏదెను వనములో ఉంచినప్పుడు వారిలో ఏ పాపమూ లేదు కాబట్టి ఆ సమయములో అక్కడ మరణమునకు తావు లేదు. కాని అపవాది వలలో పడి దేవునికి వ్యతిరేకముగా వారు పాపము చేసినప్పుడు మరణము ఈ లోకంలోకి వచ్చింది కాబట్టి మరణము మానవాళికి ప్రధానమైన శత్రువు. సైతాను ఆయుధమది. నిత్యజీవము దానికంటే శక్తిగలది కాని సార్వభౌమాధిపత్యము గల మన దేవుడు దానిని సర్వనాశనము చేస్తాడు. "కడపట నశింపజేయబడు శత్రువు మరణము" (1 కొరింథీ. 15:26). మనము రక్తమాంసాలతో చేయబడ్డాము. కాబట్టి మనలను రక్షించడానికై ఆయన మనలాగా కావలసి వచ్చింది. "రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ 9:22), కాబట్టి ఆయనకు రక్తమాంసాలు అవసరము. దేవుడు ఆత్మ గనుక ఆయనకు శరీరము ఉండదు. కాబట్టి పాపక్షమాపణ నిమిత్తము అవసరమైన రక్తము కొరకు ఆయన మానవ రూపంలో ఈ లోకానికి వచ్చాడు. మానవరూపములో చనిపోయి, తిరిగి లేవడం ద్వారానే క్రీస్తు సాతానును జయించ గలిగాడు. సాతాను చేతిలో మరణ బలముంది – మనుషులను పాపంలోకి ఈడ్వడము వలన పాపానికి శిక్ష అయిన మరణము మనకు సంభవిస్తుంది.

**5. మరణ దాస్యము నుండి విడిపించుటకు ఆయన వచ్చాడు (హెబ్రీ 2:15):** యేసు మానవుల లాగా మరణించి పూడ్చిపెట్టబడి,మూడవ దినమున తిరిగి లేచుట చూసినప్పుడు విశ్వాసం ద్వారా మనం కూడా అదే విధంగా ఆయన తిరిగి ప్రత్యక్షమైనపుడు లేస్తామని గ్రహించగలము (1కొరింథీ 14,15 అధ్యాయాలు). ఇకపై మరణానికి మనపై అధికారము లేదు, దాని గురించిన భయము లేదు. క్రీస్తు నందలి విశ్వాసులకు మరణం స్వేచ్ఛనిస్తుంది. క్రీస్తుతో కూడా మహిమలోకి, నిత్యజీవానికి నడిపిస్తుందనే సత్యము తెలుసుకున్న విశ్వాసులు మరణము కొరకు ఆశతో ఎదురుచూస్తారు.

మరణభయము వలన మానవులు అబద్ధ బోధల వైపు ఆకర్షితులవుతున్నారు. విగ్రహారాధన, ఇంద్రజాలము, మంత్రతంత్రాలవైపు మరలుతున్నారు. యవ్వనంలోనే ఉండాలనే తపన పెరుగుతుంది. యేసుప్రభువు మరణము ద్వారా మనకు విమోచన కలిగిందనే సత్యము తెలుసుకోలేకపోతున్నారు. ఒక ఖైదీకి జైలు నుండి విడుదల వచ్చిందను సత్యము తెలియక జైలులోనే మగ్గిపోవుట లాంటిది. ఈ విషయము 2పేతురు 2:11లో "మనమాయనతో కూడ చనిపోయిన వారమైతే ఆయనతో కూడా బ్రతుకుదుము".

**6. అబ్రాహాము వారసులకు సహాయము చేయుటకు ఆయన వచ్చాడు : (హెబ్రీ 2:16) :** గలతీ 3:29 ప్రకారము విశ్వాసులందరూ అబ్రహాము సంతానము కాబట్టి దేవుడు అబ్రాహాముకిచ్చిన వాగ్దాన నెరవేర్పు కొరకు ఆయన వచ్చాడు.

విశ్వాసము ద్వారా అబ్రాహాము నీతిమంతునిగా ఎంచబడ్డాడు. విశ్వాసులకు తండ్రి అను బిరుదు పొందుకున్నాడు. అదే విశ్వాసము ద్వారా మనము ఆయన సంతానము. వాగ్దానము చేసిన దేవుడు నమ్మదగినవాడు.

**7. ప్రధానయాజకుడగుటకు ఆయన వచ్చాడు (హెబ్రీ 2:17) :** మన పాపాలకు పరిహారం చేయడానికై, పాపం విషయంలో తప్ప అన్ని విషయాలలో మనలాగే ఉండాల్సి వచ్చింది. ప్రజల పాప పరిహారం కొరకు ప్రధానయాజకుడు ఏటేట బలులు అర్పించడానికి దేవుని ముందు నిలిచేవాడు. అలా ఉండటానికి మానవుడై ఉండాలి. మన ప్రధానయాజకునిగా, రక్షకునిగా ఉండుటకు యేసు కూడా ఒక మానవుడు కావాలి. పాపం లేనివాడు కాబట్టి పరిపూర్ణుడైన ప్రధానయాజకుడు. అందుకే పవిత్రుడైన దేవుని సన్నిధికి వెళ్లగలిగాడు. ఆయన మానవుడు కాబట్టి మనుష్యులను గురించి అర్థము చేసుకొని వారి కొరకు పాపముల విషయములో విజ్ఞాపన చేయుటకు అర్హత కలిగినవాడు. ధర్మశాస్త్రము ప్రకారము ప్రధానయాజకుడు లేవీ వంశస్థుడై యుండాలి. కాని మత్తయి 26:25లో ప్రధాన యాజకుడు బట్టలు చింపుకొని యాజకత్వము పోగొట్టుకున్నాడు. లేవీ 21:10 ప్రకారము ప్రధానయాజకుడైన వాడు బట్టలు చింపుకోగూడదు.

**8. శోధింపబడువారికి సహాయము చేయుటకు వచ్చాడు (హెబ్రీ 2:18) :** ఆయన మనవంటి మానవుడై ఉండి ఈ లోకములో అపవాదిచే శోధింపబడినాడు. కాబట్టి ఆయన మనలను బాగా అర్థము చేసుకోగలడు. అపవాది ఆయనను శోధించాడు (లూకా 4:1-3); ఇంటివారి నుండి శోధన-మతి భ్రమించినది పట్టుకొన బోయారు (మార్కు 3:21); పేతురు ఆయనను సిలువకు పోకుండా అడ్డగించుట (మత్తయి 16:22) లాంటి శోధనలు అనుభవించాడు. వాక్యము ద్వారా శోధనలను ఎదుర్కొన్నాడు.

యేసయ్య మనకు బదులుగా మరణించుటకును, మనకు రక్షణ కర్తగా ఉండుటకు, మనలను పవిత్రపరచుటకు, అపవాదిని నశింపచేయుటకును ఈ లోకానికి మానవ రూపంలో వచ్చాడను సత్యము జ్ఞాపకము చేసుకున్న మనము ఆయనను స్తుతించి, ఆయన మహిమార్థము, జీవిస్తామను నిర్ణయము తీసుకొనుట ద్వారా ఆయనను సంతోషపెట్టగలము. క్రిస్మస్ సందర్భముగా మన కొరకు ఒక కానుకగా వచ్చిన క్రీస్తుకు మనమేమీ తిరిగి ఇవ్వలేము. కాబట్టి ఇటువంటి నిర్ణయము ద్వారా ఆయనను సంతోషపెడదామా! ఆమేన్.

❖ ❖ ❖

# 39. క్రిస్మస్‌లోని విధేయత

క్రిస్మస్ శాశ్వతకాల పండుగ, కాల పరిమితిలేనిది. మీకా ప్రవక్త తన గ్రంథములో "పురాతనకాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2) అని వ్రాశాడు.

క్రిస్మస్ మహా సంతోషకరమైన పండుగ – జాతి పరిమితి లేని పండుగ. "ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను" (లూకా 2:10) అని ప్రభువు దూత గొల్లలతో బాటు మనకందరికి ప్రకటిస్తున్నాడు.

క్రిస్మస్ మరణఛాయను ముగించిన పండుగ – యెషయా 60:1లో "నీకు వెలుగు వచ్చియున్నది. లెమ్ము, తేజరిల్లుము, యెహోవా మహిమ నీ మీద ఉదయించెను" అంటూ యెషయా ప్రవక్త ప్రవచనాత్మకంగా మనకు చెప్పాడు. పాపమునకు శిక్ష మరణము. ఆ మరణ ఛాయను లేకుండా చేసిన పండుగ ఇది. నరకమనే రెండవ మరణము నుండి విడుదల కలిగించిన పండుగిది.

క్రిస్మస్ చరిత్ర ఆరంభించిన పండుగ – యేసుప్రభువు ఈ లోకానికి వచ్చిన సందర్భముగా ఆచరిస్తున్న ఈ పండుగ ఎవరూ వ్యతిరేకించలేరు. ఆయన జన్మ చరిత్రను క్రీస్తు పూర్వము, క్రీస్తు శకముగా విభజించింది.

క్రిస్మస్ అందరికీ పండుగ – కేవలము క్రైస్తవులకే కాదు, ఈ సత్యము అర్థము చేసుకొనుటకు రెండు వాక్య భాగములు చూద్దాము :

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). "యేసుక్రీస్తు అందరికి ప్రభువు" (అపొ.కా. 10:36).

క్రిస్మస్‌లోని కొందరు వ్యక్తుల విధేయతను గురించి ధ్యానించుకుందాము :-

## 1. యేసుక్రీస్తు

క్రిస్మస్‌కు కారణమయిన ఆయన విధేయత చూపకపోతే మనకు విమోచన ఉండేది కాదు. తండ్రియైన దేవుడు మన విమోచన కొరకు ఆయనను పంపాడు. పౌలు గలతీ 4:4,5 వచనములో ఈ విధంగా వ్రాశాడు – "కాలము పరిపూర్ణ మైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను, ఆయన స్త్రీ యందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను". "కాలము సంపూర్ణమైనప్పుడు" – దేవుడు తన ప్రణాళిక ప్రకారము చేస్తాడు."మానవాళి విమోచన' అను గొప్ప రక్షణ కార్యమునకు ఒక సమయం నిర్ణయించి ఆ ప్రకారమే నెరవేర్చాడు.

ధర్మశాస్త్రము ద్వారా మానవుల పాపపు జీవితాలకు విమోచన లేదనియు, దేవుని నీతి కొలబద్దకు దరిదాపులకు కూడా వారు రాలేరని తెలుసుకున్న దేవుడు ఒక క్రొత్త రక్షణ మార్గము తన కుమారుని ద్వారా చూపించాడు. యేసుప్రభువు పుట్టినప్పుడు ఆయన రాక కొరకు పరిస్థితులన్నీ అనుకూల పరచాడు. బబులోను చెరనుండి విడుదలై వచ్చిన యూదులు విగ్రహారాధన పూర్తిగా మానివేసారు. బబులోను నుండి వచ్చిన తర్వాత ఎజ్రా అనే యాజకుడు ధర్మశాస్త్ర ప్రకారము జీవించుట తిరిగి ప్రారంభింపచేశాడు కాబట్టి వారు విమోచకుని కొరకు ఎదురు చూస్తున్నారు. అయినా వచ్చినప్పుడు గుర్తించలేకపోయారు.

దేవుడు సామాజికంగా కూడా పరిస్థితులు అనుకూల పరచాడు. అలెగ్జాండరు చక్రవర్తి ఆధ్వర్యంలో అందరికీ గ్రీకు సంస్కృతి, గ్రీకు భాష అలవడింది. రాజకీయంగా రోమా సామ్రాజ్యము స్థిరపడి రోడ్డు, రవాణా, నౌకాయాన వసతులు సమకూరి సువార్త త్వరితగతిన ప్రబలుటకు దోహదపడింది. అటువంటి అనుకూల పరిస్థితులలో దేవుడు తన కుమారుని పంపాడు. యేసుప్రభువు దైవ త్రిత్వములో ఒకడు. అంతటి గొప్ప దేవాది దేవుడు మరియ కుమారునిగా ఈ లోకములో ప్రత్యక్షమయ్యాడు. ఆకాశము సింహాసనము గాను, భూమి తన పాదపీఠముగాను కలిగిఉన్న గొప్ప సృష్టికర్త పాపులమైన మన కొరకు నరావతారంలో ఈ లోకానికి వచ్చాడు. "ఆయన ఎంతమాత్రమును దేవదూతల స్వభావమును ధరించుకొనక, అబ్రాహాము సంతాన

స్వభావమును ధరించుకొని యున్నాడు" (హెబ్రీ 2:16). దేవుడు మానవులకిచ్చిన వాగ్దానము ప్రకారము ఆయన స్త్రీ సంతానముగా రక్తమాంసములతో ఈ లోకానికి వచ్చాడు. దేవుడు, దేవదూతలు ఆత్మ స్వరూపులు కాబట్టి వారిలో రక్తమాంసము లుండవు. "రక్తము చిందించకుండ పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ 9:22). కాబట్టి ఆయన సంపూర్ణ మానవునిగా వచ్చాడు. ఆయన జన్మ అంతా లేఖన నెరవేర్పే.

"మనము దత్తపుత్రులము కావాలని" దేవుడు తన కుమారుని మనకు బహుమతిగా పంపాడు. మానవులు దేవుని సంతానము కావాలంటే ఆయన మనలను దత్తు తీసుకోవాలి. యూదులలో దత్తత తీసుకోవడమనేది చాలా గౌరవప్రదమైన ప్రక్రియ. దత్తపుత్రులను స్వంత బిడ్డలకంటే ప్రేమగా చూసుకుంటారు. మనలను తన వారసులనుగా, హక్కుదారులనుగా చేసుకొనుటకు దేవుడు తన ఏకైక కుమారుని త్యాగం చేస్తున్నాడు. ఇదే క్రిస్మస్ యొక్క గొప్ప సత్యసువార్త!

"ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకు ఆయన ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను" – ధర్మశాస్త్రము అంటే పాత నిబంధనలో మానవాళికి మోషే ద్వారా దేవుడిచ్చిన ఆజ్ఞలు. ఈ ఆజ్ఞలు పరిపూర్ణంగా పాటించుట చాలా కష్టము. కాబట్టి ఎవరూ వాటి ద్వారా నీతిమంతులుగా తీర్చబడలేదు. అందుకే మనకు బదులుగా ఆయన లోబడి మనలను విమోచించుటకు ఈ లోకానికి వచ్చాడు. యేసుప్రభువు యూదులందరి వలెనే ధర్మశాస్త్రములోనే పుట్టి, దానికి బద్ధుడై యున్నాడు. దేవుని ప్రణాళిక నెరవేర్చుటకై సిలువ మరణము పొందునంతగా విధేయత చూపాడు. ఆయన చూపిన విధేయత ద్వారా మనకు విమోచన వచ్చింది. కాబట్టి ఆయన ఆజ్ఞలను పాటిస్తూ, ఆయనకు విధేయులమై ఉండుటే మనము ఆయనకు ఇవ్వగలిగిన పుట్టినరోజు కానుక.

## 2. మరియ

చిన్నవయసులో ఉన్న మరియ తన పవిత్రమైన గర్భమును అర్పించుట ద్వారా విధేయత చూపింది. దేవుడు తన విమోచన ప్రణాళికలో భాగస్వామిగా ఉండుటకు మరియను పిలిచాడు. ఆమె ఆ పిలుపుకు లోబడి, "ఇదిగో ప్రభువు దాసురాలను, నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను" (లూకా 1:38). ఇందులో మరియ ప్రమేయము ఏమి లేదు గాని కేవలము విధేయత చూపింది. బైబిలులో ఉన్న అతి

ప్రాముఖ్యమైన అద్భుతము కన్యక గర్భము ద్వారా యేసయ్య జన్మించుట. దేవాది దేవుడు తనను తాను తగ్గించుకొని ఒక శరీరములో వసించుట అద్భుతము కదా! దేవదూత మరియతో మాట్లాడినప్పుడు తన్నుతాను సమర్పించుకొంది. కాబట్టి ఆమె జీవితములో అద్భుతము జరిగింది. కన్యకగా ఉన్నప్పుడు గర్భము దాల్చడము వలన చాలా భయంకరమైన పరిస్థితులు ఎదురౌతాయేమోనన్న ఆలోచన, భయము ఆమెలో ఎంతమాత్రము లేవు. తనను సమాజము నుండి వెలివేస్తారేమో, తనకు కాబోయే భర్త తను వదిలిపెట్టాడేమో, అందరూ తనను హేళన చేసి బాధపెడతారేమో అను ఆలోచనలు ఆ పసి మనసులోకి రాలేదు. యేసయ్యను గర్భము దాల్చిన నాటినుండి తాను ధన్యురాలైనానను సంగతి తెలుసుకొని శ్రమలు ఎదుర్కొనడానికి సిద్ధంగా, విధేయతతో ఉన్నది. లోకానుసారంగా ఆమెలో ఏ యోగ్యతలూ లేవు. చిన్న బాలిక, పేదరాలు, ఆడపిల్ల. కాని ఆమెలో దేవుడు చూసిన యోగ్యతలు ఆమె విశ్వాసము, విధేయత. మనలో కూడా దేవునికి అవే కావాలి. మనము దేవునికిచ్చే క్రిస్మస్ కానుకగా ఆ లక్షణాలు అలవరించుకుందామా!

### 3. యోసేపు

ఆలోచించి చూస్తే యోసేపు పాత్ర మరియ పాత్ర కంటే చాల ఉన్నతమైనది. ఆయన నీతిమంతుడు, భక్తిపరుడని వ్రాయబడింది. అతనిపై దేవునికున్న నమ్మకం వలన తన ప్రశస్తమైన కుమారుని అతని ఆధీనంలో ఉంచాడు. మరియ గర్భవతి అని తెలిసినప్పుడు యోసేపు రహస్యంగా ఆమెను విడనాడాలని తలంచాడు. కానీ దేవుడు దూత ద్వారా ఆమెను వివాహమాడమని చెప్పినప్పుడు విధేయత చూపించాడు. యోసేపు విధేయత మూడు విషయాలలో చూపాడు. 1. ఆమెను వివాహమాడాడు. 2. ఇంట చేర్చుకున్నాడు, కానీ 3. బిడ్డ పుట్టేవరకు ఆమెను కూడ లేదు. తర్వాత కూడా దేవుడు ఎక్కడకెళ్లమన్నా వెళ్ళాడు. యోసేపు మాట్లాడుట మనం ఎక్కడా చూడలేదు, కాని క్రియారూపకంగా విధేయత చూపాడు.

### 4. గొర్రెల కాపరులు

వీరు దేవదూత మాట వినగానే బయలుదేరి వెళ్లిపోయారు. తమ గొర్రెలు ఏమవుతాయో అన్న ఆలోచన రాలేదు. వీరికి విధేయత వలన కలిగిన గొప్ప బహుమతి - యేసును మొదటిగా చూసే భాగ్యము. వీరు దేవుని సన్నిధికి ఏ బహుమతులు

తీసుకెళ్ళలేదు. 1సమూయేలు 15:22లో “బలులు అర్పించుట కంటే ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్ఠము” అను వాక్యప్రకారము విధేయత చూపించారు. వారు వెళ్లి ఆరాధించి, చూచినదానిని అందరికీ ప్రకటించారు. మనము కూడా విధేయతతో క్రీస్తును ప్రకటించాలి.

**5. జ్ఞానులు**

జ్ఞానులు నక్షత్రాన్ని చూచుకుంటూ ఒంటెలమీద చాలాకాలం ప్రయాణము చేసి రక్షకుని కనుగొన్నారు. ఆయనకు తగిన కానుకలు సమర్పించారు. రాజుగా గుర్తించుట చేత బంగారు, యాజకునిగా గుర్తించుట చేత సాంబ్రాణి, ప్రవక్తగా గుర్తించుట చేత బోళమును సమర్పించారు. వారు చేసిన ఆరాధన ద్వారా విధేయత చూపించారు.

పైన చెప్పబడిన విషయాలన్నీ చదివిన తర్వాత మనము కూడా మన హృదయమనే పెట్టెలు తెరచి ప్రేమ, ఆరాధన, విధేయత ఆయనకు సమర్పించాలని మీకు అనిపించడము లేదా! మన కొరకు బలిగావించబడుటకు దేవుడిచ్చిన వరముగా ఈ లోకానికి వచ్చిన రక్షకునికి మనము విధేయత చూపుట ద్వారా మన ఆరాధన వ్యక్తపరచవచ్చును.

❖ ❖ ❖

# 40. వాగ్దానము నెరవేర్చిన దేవుడు

యేసుప్రభువు నరరూపధారియై వధకు తేబడిన గొఱ్ఱెపిల్లగా కన్య మరియ గర్భము ద్వారా ఈ లోకమునకు రావడమనునది తండ్రియైన దేవుడు మానవాళి కిచ్చిన వాగ్దాన నెరవేర్పు అను సత్యము మనమందరము జ్ఞప్తికి తెచ్చుకుందాము.

సర్వసృష్టికర్తయైన దేవుడు ఆదాము, హవ్వలను సృజించినప్పుడు అంతటా సమాధానము, సంపూర్ణత నెలకొనియున్నది. అప్పుడు పాపము లేదు కాబట్టి రక్షకుని అవసరత లేకుండెను. కాని ఆదికాండము 3వ అధ్యాయములో ఎప్పుడైతే "ఇది నిజమా" అంటూ అబద్ధాల జనకుడైన అపవాది ఏదెను తోటలో ప్రవేశించాడో, అతనితో పాటు పాపము ప్రవేశించి దేవునితో ఉన్న అనుబంధము, సమాధానము కోల్పోయేటట్లు చేశాడు. అప్పటి నుండి పాపమనునది మానవాళికి ప్రధాన సమస్య అయింది. ప్రతి సమస్యకు పరిష్కారము దేవుడే చూపించాలి గాబట్టి దేవుడు వెంటనే ఒక మార్గము చూపుతూ ఆదాముతో మాట్లాడుతూ ఒక వాగ్దానము ఇస్తున్నాడు. ఈ మొదటి వాగ్దానము ఆదికాండము 3:15లో చూడగలము. "నీకును, స్త్రీకిని, నీ సంతానమునకు ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును. నీవు దానిని మడిమె మీద కొట్టుదువని చెప్పెను". ఆ వాగ్దానపు నెరవేర్పే స్త్రీ సంతానముగా యేసుప్రభువు ఈ లోకానికి వచ్చుట. వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు (హెబ్రీ 10:23). గనుక రక్షకుని మన కొరకు ఈ లోకానికి పంపాడు. ఆయన ద్వారా మాత్రమే మనకు పాప విమోచన కలిగి, మనము కోల్పోయిన సమాధానము తిరిగి పొందగలుగుతున్నాము. వాగ్దానము చేసిన దేవుడు దానిని నెరవేర్చుట కొరకు ఒక ప్రణాళిక ఏర్పాటు చేసి, ఆ ప్రణాళిక ప్రకారమే అన్ని జరిగించాడు. అదికాండము నుండి మలాకీ గ్రంథము వరకు ఉన్న లేఖనాలలో దేవుడు చేసిన సకల కార్యములు ఆ ప్రణాళిక నెరవేర్పు దిశగానే సాగాయి.

మొదటిగా దేవుడు అబ్రాము అను ఒక వ్యక్తిని ఎన్నుకొని, అతనితో షరతులు లేని నిబంధన ఒకటి చేసికొని, అతనిని ఒక గొప్ప జనాంగముగాను, ఒక గొప్ప దేశముగాను చేసి, అతని ద్వారానే సకల రాజ్యాలు ఆశీర్వదించబడేట్లుగా ఏర్పరచాడు. ఆ వ్యక్తి నుండే దేవుడే వాగ్దానము చేసిన రక్షకుడు వచ్చి మానవాళి కంతటికీ విమోచన కార్యము జరిగించేటట్లుగా ఏర్పాటు చేశాడు. సకల రాజ్యాలు ఆశీర్వదించ బడడము అంటే "యేసుక్రీస్తు అందరికీ ప్రభువు" (అపొ.కా. 10:36) అనే సత్యము చెప్తూ "ప్రభువు నామమున ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును" (రోమా 10:13) అను సంగతి తెలియపరచి, మానవాళినంతటినీ ఆయన ఇచ్చు ఉచిత రక్షణలోకి నడిపించుటయే.

మన కొరకు ఈ లోకానికి వచ్చిన యేసుప్రభువు త్రిత్వములో ఒకడై ఉండుట చేత ఆయన పవిత్రుడు, పరిశుద్ధుడని పరలోక వారసులంతా కొనియాడే దేవుడు కాబట్టి ఆయన వంశావళిని కూడా పరిశుద్ధముగా ఉంచాలని దేవుడు కోరుకొన్నాడు. తాను ఎన్నుకొన్న అబ్రాము సంతానహీనుడై ఉండి కూడా, ముసలితనంలోనైనను, వాగ్దానము చేసిన దేవుడు తనకు తప్పక సంతానము నిస్తాడనే నమ్మాడు. ఆ విశ్వాసమే అతనిని నీతిమంతునిగా తీర్చిదిద్దింది. 25 ఏళ్ల నిరీక్షణ అనంతరము తనకు కలిగిన ఏకైక సంతానాన్ని దేవునికి బలిగా అర్పించుటకు వెనుదీయని అతని విశ్వాసాన్ని బట్టి అతడు 'విశ్వాసులకు తండ్రి' గాను, దేవుని స్నేహితునిగాను పిలువబడ్డాడు. ఆ అబ్రామును అబ్రాహాముగా మార్చి తన ప్రణాళికనంతా అబ్రాహాము సంతానము ద్వారా నెరవేర్చుతాడు. అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు ద్వారా యాకోబు, అతనికిచ్చిన పన్నెండుమంది సంతానాన్ని పన్నెండు గోత్రములుగా చేసి, గొప్ప జనాంగముగా చేసి వారిని ఇశ్రాయేలు జాతిగా ఏర్పరచి, వాగ్దానము ప్రకారము ఒక దేశమును ఏర్పరచి, ఆ దేశమును ప్రపంచము మధ్యలో ఉంచాడు. అబ్రాహాముకు చేసిన షరతులు లేని వాగ్దానము వలన వారెంత అవిధేయులై, తిరుగుబాటు చేసినను, వారిని శత్రువుల చేతికి అప్పగించి, వారు పశ్చాత్తాపంతో మొఱ్ఱపెట్టగానే తిరిగి ఆయన కృప చొప్పున అనేకమారులు వారిని విడిపించాడు.

దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానములోని మూడవ అంశము : "భూమి యొక్క సమస్త వంశములు నీ యందు ఆశీర్వదింపబడును" అనునది నెరవేర్చుటకై

యేసుప్రభువు వంశావళిలోనికి అన్యురాలైన రూతును, అనాటి సమాజములో తృణీకరించబడి వారు, నీచముగా ఎంచబడిన స్త్రీలైన తామారు, రాహాబు, బత్షెబలను చేర్చుకొన్నాడు. యేసుప్రభువు ద్వారా సకల మానవాళి రక్షింపబడాలను దేవుని ప్రణాళిక నెరవేర్పులో ఇది ఒక భాగము.

దేవుడు ఎప్పటికప్పుడు తాను తన ప్రజలతో చేసిన నిబంధనను ధృవీకరిస్తున్నాడు. నిత్యమైన ఈ నిబంధన ఎందుకు చేస్తున్నాడో యిర్మీయా 32:40లో వివరిస్తున్నాడు "నేను వారికి మేలు చేయుట మానకుండునట్లు నిత్యమైన నిబంధనను వారితో చేయుచున్నాను" హెబ్రీ 6:13, 14 ప్రకారము "దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసినప్పుడు తనకంటే ఏ గొప్ప వాని తోడు అని ప్రమాణము చేయలేక పోయెను గనుక, తనతోడు అని ప్రమాణము" చేశాడు. అందుకే ఆ వాగ్దానము నెరవేర్చాడు. ఒక ప్రణాళిక ప్రకారము జరిగించుకొంటూ వచ్చిన దేవుడు తన వాగ్దానము ప్రకారము తన ఏకైక కుమారుని స్త్రీ సంతానముగా ఈ లోకమునకు పంపించి, అపవాది సంతానము యొక్క తలను చితక్కొట్టేట్లుగా చేశాడు. ఈ వాగ్దానము చివరి భాగము సిలువలో పూర్తియింది. పాతనిబంధన కాలంలో చేసే నిబంధనలు జంతువులను బలిఇచ్చి, ఆ రక్తముతో స్థిరపచేవారు. కాని దేవుడు మనతో చేసిన కొత్త నిబంధన తన కుమారుని రక్తముతో స్థిరపరచాడు.

దేవుడు తన వాగ్దాన నెరవేర్పంతా తన చిత్తప్రకారము తన కాలక్రమములో పూర్తి చేశాడు. గలతీ 4:4 ప్రకారము "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను". పాతనిబంధనకు, కొత్త నిబంధనకు మధ్యనున్న 420 సంవత్సరాల నిశ్శబ్ద కాలములో దేవుడు తాను చేసిన వాగ్దానమును మరచిపోలేదు. తన ప్రణాళిక నెరవేర్పుకు మార్గము సరాళము చేశాడు. క్రీ.పూ. 334లో గ్రీకు దేశస్తులు ప్రపంచ వ్యాప్తంగా తమ రాజ్యాన్ని విస్తరించి గ్రీకు భాషను అధికారిక భాషగా స్థిరపరచారు. గ్రీకు భాష క్రీ.పూ. 63లో వచ్చిన రోమీయులకు కూడా వాడుక భాషగా అవడమును బట్టి యేసు ప్రభువు కాలంలోనూ, ఆయన ఆరోహణుడైన తర్వాత సువార్త ప్రకటించబడుటకు దేవుడు ద్వారము తెరచాడు. రోమీయుల పరిపాలన కాలంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచబడ్డాయి. రోడ్లు వేశారు. నౌకాయానము సులభతరము చేయబడింది. వాణిజ్యము పెరిగి, ఒక ప్రాంతపు

ప్రజలు ఇంకొక ప్రాంతానికి ప్రయాణించుటకు అనువుగా చేయబడింది. దీనివలన "మీరు సకల లోకమునకు వెళ్లి సువార్త ప్రకటించుడి" అని ప్రభువు తన శిష్యులతో చెప్పిన ఆజ్ఞ నెరవేర్పుకు మార్గము సుగమమైనది.

ఇవే కాకుండా దేవుని యొద్ద నుండి బాప్తీస్మమిచ్చు యోహాను ఒక ప్రవక్త, యేసు ప్రభువు మార్గము సరాళము చేయుటకు పంపబడెను (యోహాను 1:6-8). యెషయా ప్రవక్త ప్రవచించిన ప్రవచనము ప్రకారము ఇది జరిగెను.

వాగ్దానము చేసిన దేవుడు తన ఏకైక కుమారుని కన్య మరియ గర్భము ద్వారా ఈ లోకానికి పంపడము, క్రొత్త నిబంధనలోని మత్తయి, లూకా సువార్తీకులు గ్రంథస్తము చేశారు. సువార్తలన్నింటిలో యేసుక్రీస్తు ఈ లోకములో జీవించిన 33 1/2 సంవత్సరాలలో, చివరి 3 1/2 సంవత్సరాలలో ఆయన చేసిన కార్యములను వ్రాశారు. మత్తయి సువార్తీకుడు, యేసే ప్రవక్తల ప్రవచన నెరవేర్పుగా వచ్చిన రారాజని యూదులకు చెప్పాడు. మార్కు యేసే వధకు తేబడిన గొఱ్ఱెపిల్లగా ఈ లోకానికి సేవకునిగా వచ్చాడని రోమీయులకు చెప్పాడు. లూకా ఆయన సంపూర్ణ మానవునిగా వచ్చాడని గ్రీకులకు వివరించాడు. వీరు నలుగురు చిత్రీకరించిన చిత్రాన్ని సంపూర్ణముగా చూస్తే మనకు యేసు ప్రభువు యొక్క సంపూర్ణత, ప్రణాళిక అర్థమవుతుంది.

అపొ.కా. 13:23లో పౌలు తన తోటి యూదులకు బోధిస్తూ దేవుడు తన వాగ్దానాన్ని బట్టి రక్షకుడైన యేసును పుట్టించాడనియు, యేసుక్రీస్తు పాతనిబంధన గ్రంథములోని ప్రవచనముల నెరవేర్పనియు వివరించాడు. యేసుప్రభువు చనిపోయి, పాతిపెట్టబడి, మృతులలో నుండి ఆరోహణము అవడము గురించి కూడా చెప్పి అపొ.కా. 13:32,33లో "దేవుడు యేసును లేపి, పితరులకు చేసిన వాగ్దానమును మన పిల్లలకు నెరవేర్చియున్నాడని మేమును మీకు సువార్త ప్రకటించుచున్నాము" అంటున్నాడు.

ప్రస్తుత దినాలలో పౌలు లాగా ఈ శుభవార్తను అందరికీ మనము కూడా ప్రకటించబద్ధులమై ఉన్నామని ప్రభువు పేర మీకు జ్ఞాపకము చేస్తూ ప్రార్థిస్తున్నాను. ఆమేన్!

❖ ❖ ❖



ప్రస్తుత దినాలలో సార్వత్రికంగా క్రీస్తు సంఘాన్ని ఒక విధమైన స్తబ్ధత, జడత్వం పట్టిపీడిస్తున్నాయి. ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు ఎక్కుదామన్న ఆశలేదు. పరిపూర్ణుల మవుదా మన్న తపనా లేదు. తెలియని సంగతులు తెలుసుకుందా మని, ఆచరించాలని తృష్ణ ఏ కోశానా లేదు. సంఘం ఇలా తయారు కావటానికి కొంతవరకూ బోధకులే కారణం. ఈ పరిస్థితిని మార్చటానికి, సంస్కరించటానికి శ్రీమతి డా॥ బి. విమలారెడ్డి గారు దైవ ప్రేరేపణతో దేవుని ప్రజలను కొంచెం లోతైన అనుభవాలలోనికి, ఉన్నతమైన ప్రత్యక్షతలలోనికి తీసుకు వెళ్ళటానికి పరిశుద్ధాత్మ ద్వారా ప్రేరేపించబడ్డారు. మన ఆధ్యాత్మిక జీవితాలను సుసంపన్నం చేయగల పాఠాలు నేర్పే అత్యంత శక్తివంతమైన అంశాలు ఈ పుస్తకంలో ప్రస్తావించారు.

ఈ సంక్షోభయుగంలో వ్యక్తిగత ఆధ్యాత్మిక సంపూర్ణతకు దోహదం చేసే పుస్తక మిది. అపురూపమైన అంశాలతో నిండి ఉంది. భక్తి సంపూర్ణతలోనికి నడిపించే వివిధ అంశాలకు చెందిన సందేశాలను ఒకే చోటికి చేర్చటం అంటే – తేనేటీగల శ్రమలాంటిది. వారి దీక్షకు పట్టుదలకు కృతజ్ఞతలు. ఇంత మహత్తర పుస్తక రూపకల్పనా కార్యంలో నన్నుంచినందుకు సర్వదా కృతజ్ఞుడను.

ఆంధ్రరాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మక కుటుంబంలో జన్మించి, కేవలం దేవుని రాజ్య విస్తరణ కొరకై అహర్నిశలు శ్రమిస్తున్న మాతృ సమానులు, సన్మాన పాత్రులైన శ్రీమతి డా॥ బి.విమలారెడ్డి గారి పరిచర్య ఎంతో ఆదర్శప్రాయమైనది. వీరు ప్రభువు యొక్క మహా కృపను బట్టి ప్రభువు చేత పిలువబడి, ప్రత్యేకించబడి అనతికాలంలోనే B.D., M.Th. (O.T), M.Th. (N.T), M.A. (Christian Studies), మొదలగు థియోలజికల్ కోర్సులు విజయవంతంగా పూర్తిచేసారు. పలు జాతీయ, అంతర్జాతీయ సెమినరీలలో పాల్గొని, వాక్య కేంద్రిత క్రీస్తును, క్రీస్తు కేంద్రిత భక్తిని బోధిస్తూ అహర్నిశలు దేవుని సేవలో కొనసాగుతున్నారు.

“మరియ” వలె ప్రభువు పాదాల చెంత ఉత్తమమైనవి నేర్చుకొనుచు, “సమరయ స్త్రీ” వలె పట్టణాలలో, పల్లెల్లో ప్రభువును గూర్చి సాక్ష్యమిస్తూ, “దోర్కా” వలె సత్క్రియలచేత అలంకరించు కుంటూ, “ఘనురాలైన షునేమీయురాలు” వలె దైవజనులకు ఆతిథ్యమిస్తూ, “దెబోరా” వలె మంచి నాయకురాలుగా కొనసాగుతూ, “అన్న” వలె దేవుని సేవిస్తూ, “ఎలిజబెత్” వలె భయభక్తులు కలిగి జీవిస్తూ విశ్వాసంతో ముందుకు కొనసాగుతున్న ఈ భక్తురాలి కలమునుండి సంఘ క్షేమాభివృద్ధికై మరిన్ని రచనలు, విలువైన సందేశములు వెలువడును గాక! ప్రార్థనా పూర్వకంగా *ఈ పుస్తక పఠన ప్రారంభించండి!*

**రెవ. టి.శివరామ ప్రసాదరెడ్డి**
**ఫిలదెల్ఫియ బైబిల్ ఇన్‌స్టిట్యూట్, కవిటం**

For Details & Copies : **Bro. K. Vijaya Kumar**
Cell : 92473 65330, 98668 45060 * email : bvrhome@gmail.com